# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక సెప్టెంబర్, 2012 ₹ 20



వసంతాగమనం

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*


**సంపుటి 23** **సెప్టెంబరు 2012** **సంచిక 9**

*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.


## ఈ నెల...


కమ్మతెమ్మెరలు

గ్రామాయణం ............................................. 5

*– తూములూరి పార్థసారథి*

నామవిజ్ఞానము ........................................... 8

*– ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు*

లే మిజరబుల్స్ ........................................... 16

*– గొల్లపూడి మారుతీరావు*

సింహావలోకనము ........................................ 24

*– చిలకమర్తి లక్ష్మీనరసింహం*

శరీర భాష ................................................ 29

*– ఆచార్య వల్లూరు లీలావతి*

సాహిత్యము–శిల్పప్రస్థానము ............................ 34

*– ప్రాచార్య శలాక రఘునాథశర్మ*

కూచిపూడి నాట్యసంప్రదాయం:నేను చేసిన ప్రయోగాలు. 40

*– డాక్టరు వెంపటి చిన్న సత్యం*

జాషువా – జాతీయత .................................... 45

*– దువ్వాల రాజేశ్*

సమాజానికో వీలునామా.................................. 48

*– సి. ధర్మారావు*

భారతీయ సంగీతం:మౌలిక లక్షణాలు .................. 54

*– నండూరి పార్థసారథి*

స్వామినీన ముద్దు నరసింహనాయుడు ................. 58

– ***మిసిమి*** *పరిశోధన*

తిరగబడ్డ తెలుగు గెడ్డ (నాటిక) ........................ 61

*– సి.యస్. రావు*

చరిత్ర అంటే లాభనష్టాలా? ............................ 72

*– వై. హెచ్.కె. మోహన్‌రావు*

చదవండి (పుస్తక పరిచయం)........................... 76

నవ్వులు ................................................... 78


*ముఖచిత్రం* : శక్తి గణపతి : రాజస్థానీ చిత్రం

*రెండవ అట్ట* : వసంతాగమనం : *చిత్రకారుడు* : జాన్ కోలియర్

*మూడవ అట్ట* : ప్రశాంత గమనం : " : ఎడ్వర్డు మానే (Manet)

*నాల్గవ అట్ట* : పాలవెల్లి : " : మహేష్ కుమార్

(వివరాలు : 75వ పుటలో)

'మేనితోడన పుట్టు మృత్యువు జనులకు...' అని పోతన భాగవత పద్యం; ఇది 'జాతస్య హి ధృవోమృత్యుః' అన్న గీతాచార్యుని ఉవాచ కన్నా మరింత తేటతెల్లంగా తెలిపే బ్రతుకు సత్యం కదా.

తెలుగు వెలుగులుగా వెలిగిన వారు కనుమరుగయిపోతున్నారనే బాధ ఒక వైపు, జాతికి వైతాళికులు కరువయిపోతున్నారనే దిగులు మరోవైపు మనందర్ని ఇబ్బంది పెడుతూనేవుంది.

వెంపటి చిన్న సత్యం తన ప్రయోగాలతో కూచిపూడి నాట్యాన్ని నేల నాలుగు చెరగులా దేదీప్యమానంగా దర్శింపచేశారు.

తెలుగు భాషకు భాష్యం చెప్పి ప్రపంచ భాషలతో పాటు నిలబెట్టిన ఘనత భద్రిరాజు కృష్ణమూర్తిది.

ప్రబంధ సన్నివేశాలను, ప్రకృతి చిత్రాలను తన కుంచెను, రంగులలో ముంచి చిత్రించి మురిపించిన కొండపల్లి శేషగిరిరావు.

కేవలం ఉపాధ్యాయవృత్తిలో వుండి పండితులకు, సామాన్యులకు సంగీత సాహిత్యాలను అనువుగా అందించి పురస్కారాలందుకున్న సామల సదాశివ...

ఇలా ఇంతమంది ఒక నెలలోనే మనల్ని వీడి వెళ్ళిపోవటం మన దురదృష్టం. **మిసిమి** వీరి కుటుంబాలకు సానుభూతి, సంతాపాలను అందజేస్తూ వీరి స్ఫూర్తిని జాతి అందిపుచ్చుకోవాలని కోరుకుంటున్నది.

ఈ నెల విలక్షణంగా ఒక నాటికను అందిస్తున్నాం - తెలుగునాడులో తొలి స్వాతంత్ర్య యుద్ధంలో ఎందరో ప్రాణాలు వదిలారు-వీరిని తలుచుకోవటానికే.

ధర్మారావు సమాజానికి వీలునామా వ్రాశారు!

శరీరభాష చాలా విలక్షణమైన పరిశోధనావ్యాసం.

ఆగష్టు సంచిక గురించి సహృదయులెందరో స్పందించి, అభినందించారు.
మమ్ములను నిద్రలేకుండా చేసేవి అచ్చుతప్పులు. ఈ తప్పు ఎవరిదైనా, బాధ్యతమాదే.



**- సంపాదకులు.**

# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'సిద్ధార్థ'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

✶ "... ఆగష్టు ***మిసిమి*** చేతికి వచ్చింది ఒకటవ తేదీనే! చూడముచ్చటగా వున్న ముఖచిత్రంతో మొదలు–నిజం చెప్పుకోవాలి–ప్రతి అంశం చదవాలనిపించింది. ఎన్నో రంగాలలో మరెన్నో విషయాలు చదవటానికి వీలుగా అందిస్తున్నారు. ఇలాంటి పత్రికను నిలుపుకోవటం తెలుగువారు బాధ్యతగా తీసుకోవాలి. ఇంతవరకూ చదవని *వైనాకవిత్వం* రుచి చూపించారు. పల్లవరాణి ఎన్నో శతాబ్దాల క్రితమే ఏడుకొండల రాయనికి ఇచ్చిన దానాలు–తొలి బ్రహ్మోత్సవం ఇన్ని వివరాలు ఎవ్వరూ ఇవ్వలేదు. ఇది చదువుతుంటే ఆనందంగానూ, బాధగానూ వుంది. మా తిరుపతి–చిత్తూరు మాండలికంలో *సంకటి* పులికంటి కృష్ణారెడ్డి జీవితానికి, రచనకు ప్రతీక! చివరికి ఒక పేజీ *సామాన్యుని చరిత్ర* కూడా వదలిపెట్టలేము.

...*శకముల వాడుక* లోని కాలజ్ఞానం ఎంతో సమాచారాన్ని పరీక్షలకు సరిపడా ఇచ్చారు. అరవయి ఏండ్ల నుంచీ నడుస్తున్న అగతాక్రిస్టి *మౌస్‌ట్రాప్* గురించి మీ పత్రికలోనే చదివాను. ***మిసిమి*** పబ్లిషర్లు ధన్యులు–సంపాదకులు దార్శనికులు. అందులో పనిచేసేవారు అదృష్టవంతులు. అందరికంటే ఈ పత్రికను నెలానెలా అందుకుంటున్న పాఠకులు ఋణగ్రస్తులు!..."

**డా॥ కె. రవీంద్ర** – అంబుడ్స్‌మన్, రంగారెడ్డి జిల్లా.

**పి.యస్ :** 73,74 పేజీలలో అచ్చుతప్పులు ఎక్కువగా వున్నాయి.

* *ఈ విషయంలో మేము ఎంతో చింతిస్తున్నాము. ఇది ఒక సాంకేతిక ఇబ్బంది మూలంగా దిద్దిన తప్పులు సరికాలేదు– అని నిజమైన సాకు కూడా చెప్పలేని స్థితి. అలాగే నండూరి సుబ్బారావు బొమ్మ. వీరు నండూరి వారే కాని– రేడియో సుబ్బారావుకాదు.* ॥సం॥

✶ "...***మిసిమి*** మిస మిస లాడుతూనే ఉన్నది. ఎప్పటి లాగే ఈ నెల కూడా వాసనోదయ వాసన అ'మో'ఘుమ్. భాషాపరంగా నాలాటి వారికి అందని స్థాయి అయినా సాహిత్య విలువలతో ఘుమ ఘుమ లాడింది...

... పులికంటి వారి *సంకటి* తినటం, జీర్ణించు కోవటం కష్టమైంది. కీ.శే. కొండూరు వీర రాఘవాచార్యులు శిష్య కోటిలో నేనొకడ్ని. ఆయన పాండిత్యం గురించి అప్పుడంతగా తెలియదు. చిన్న సూచన (అన్యథా భావించకండి) అచ్చుతప్పులు కొన్ని ప్రూఫ్ రీడర్స్ దృష్టిలో పడలేదు. మరింత జాగ్రత్త అవసరం అని మనవి...

ఉదా: "జనక్యాః కమలాంజలి పుటే / యాః పద్మరాగాయితాః" ఎలా ముద్రింప బడిందో చూడండి! జమ్మలమడక మాధవరామ శర్మగారు కూడా మా గురువుగారే. *బావగారి వాణిలో* ప్రస్తావించ బడిన పెద్దల నామధేయాలను పునఃశ్చరణ చేసే భాగ్యం కలిగింది. అంతా లబ్ధ ప్రతిష్టులే. అన్ని వ్యాసాలు యోగ్యమైనవే. దేనికదే సాటి..."

**– వి.ఆంజనేయులు,** హైదరాబాదు.

✶ "...నాకు చాలా పుస్తకాలు వస్తుంటాయి. మొన్న స్నేహితుని ఇంట్లో పుస్తకాల మధ్య మెరుస్తున్న ***మిసిమి*** చూశాను. ఆ తర్వాత మీకు ఫోన్ చేసి మార్చి నెల నుంచి పత్రిక తెప్పించుకున్నాను. ఇవ్వాళే అందులో *డాక్టరు గారు* చదివి చలించిపోయాను. వెంటనే దుకాణం మూసి మా ప్రక్కనే ప్రవహించే కిన్నెరసాని ఒడ్డుకు వెళ్లి కూర్చొని... ఏడ్చాను. ఎందుకు? జీవితం ఇలా వృధా అయిపోతున్నందుకు, పెళ్లాం, పిల్లలు, వ్యాపారం, ఇదేనా బ్రతుకంటే – ఇలా కాలం వృధా చేసుకునే కంటే వేరే అన్యాయం ఏముంటుంది... *డాక్టరు గారు* నాకళ్ళు తెరిపించారు. నా పరిధిలో నేనేవిధంగా సమాజానికి ఉపయోగపడగలనో ఆలోచిస్తున్నాను..."

**– లక్ష్మణ పటేల్,** పాల్వంచ.



భద్రిరాజు కృష్ణమూర్తి

**భద్రిరాజు కృష్ణమూర్తి :** భాషా శాస్త్రంలో, ద్రావిడ భాషా రంగంలో విశ్వవిఖ్యాతి గడించిన భద్రిరాజు కృష్ణమూర్తి 1928 జూన్ 19న ఒంగోలులో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పట్టభద్రులై, అమెరికాలోని పెన్సిల్‌వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఎ, పి.హెచ్‌డిలు పొందారు. దాదాపు 16 విదేశీ విశ్వవిద్యాలయాలలో తెలుగు ద్రావిడ భాషల బోధన, పరిశోధనలు గావించారు. 34 సం॥ వయస్సు లోపునే భాషాశాస్త్ర ఆచార్యులు కావటం ఒక రికార్డు. నాయని సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణారావు గార్లను ఆయనెప్పుడూ గురుతుల్యులుగా భావించి, గౌరవించేవారు. 1957వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ స్థాపించబడిన తరువాత ఆయన శిక్షణ వలన అనేక వృత్తి పదకోశాలు, పదప్రయోగ కోశాలు వెలుగు చూశాయి. ఇది దక్షిణ ఆసియా భాషలలో ఒక్క తెలుగులోనే ఉండటం తెలుగు భాషకు గర్వకారణం. తిక్కన వంటి మహాకవుల రచనలకు పదప్రయోగ సూచికలు తయారు చేయటం ఒక విశేషం. అంతేగాక ఆ తరహా పుస్తకాలకాయనొక ప్రాతిపదిక నేర్పరిచారు. వెంకటేశ్వర, ద్రవిడ విశ్వవిద్యాలయాలు, కృష్ణమూర్తిని గౌరవ డాక్టరేట్‌తో గౌరవించాయి. 27 పుస్తకాలు, 80కి పైగా పరిశోధనా పత్రాలు వారి కృషికి గీటురాయిగా నిలుస్తాయి. భద్రిరాజు సంపాదకత్వం వహించిన *తెలుగు భాషా చరిత్ర* మూడు కూర్పులతో, ఎనిమిది ముద్రణలతో వెలువడింది.

సామాన్య కుటుంబంలో జన్మించి, అసామాన్య వ్యవస్థగా ఎదిగిన భద్రిరాజు కృష్ణమూర్తి, భావితరాలకు స్ఫూర్తిప్రదాత అని చెప్పాలి. తెలుగు భాషాకీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్ళిన ఆయన లేని లోటు పూడ్చలేనిది.

* * *



శేషగిరిరావు

**కొండపల్లి శేషగిరిరావు :** శేషగిరిరావు గారు ఎన్నో ప్రసిద్ధస్థలాలు, గోపురాలు, బౌద్ధఆరామాలు దర్శించారు. విశ్లేషణాత్మకంగా, వివరణాత్మకంగా ఎన్నో కళాత్మక విషయాలపై ఆయన చక్కని వ్యాసాలు వ్రాశారు. అవన్నీ *చిత్ర, శిల్పకళారమణీయక*మనే పేరుతో వారి కోడలు కొండపల్లి నీహారిణి పుస్తక రూపంలో ప్రచురించారు. శేషగిరిరావు గారిది మధురమైన కంఠం. వారు చక్కని గాత్రంతో ఎన్నో పద్యాలు చదివేవారు. ఆయన తెలుగులోనే కాదు ఉర్దూలో కూడా మంచి వ్యాసాలు వ్రాశారు. ఎన్నో సంప్రదాయ చిత్రాలు వేసిన శేషగిరిరావు గారు ఆధునిక చిత్రశైలిలో కొన్ని, కంప్యూటర్‌పైన కూడా కొన్ని చిత్రాలు వేశారు. "చిత్రాలు వేయటం ఒకెత్తు, వాటికి ప్రాణం పోయటం మరొకెత్తు" అంటారు కొండపల్లి. అందుకే వారు వేసిన చిత్రాలు సజీవమూర్తులు. పాశ్చాత్య ఝంఝామారుతానికి కొట్టుకు పోకుండా భారతీయులు నిలవాలని ఆయన భావించారు. అంతమాత్రం చేత ఆయన పాశ్చాత్య చిత్రకళకు వ్యతిరేకులు కారు. పాశ్చాత్య కళలోని ఎవల్యూషన్‌ను క్రమంగా పరిశీలిస్తే మనం వాళ్ళ వద్ద నుండి నేర్చుకోదగ్గ ఉత్తమ విషయాలు అనేకం కనిపిస్తాయి అని అంటారు. మనదేశంలో మోడ్రన్ ఆర్ట్ ఎంతవరకూ నిలిచేదో నేడు చెప్పడం వీలుపడదు. కానీ సంప్రదాయ చిత్రకళకు స్థానం ఎప్పటికీ చెరగనిదని భావించిన ఆశాజీవి. "ఎట్టి ఆర్టిస్టుకైనా చిత్రాలు అమ్ముడుబోకుంటే పొయ్యిలోని పిల్లి లేవదు. కనుకనే అమ్ముకునేందుకు సిద్ధపడతారు. తీరా అమ్మిన తరువాత ఆడుబిడ్డ కాపురానికి పోతున్నట్లు కంటనీరు బెట్టుకుంటారు. ఆడుబిడ్డను అత్తవారింటికి పంపకా తప్పదు, కంటనీరు పెట్టకా తప్పదు. ఇది చిత్రకారులకే వర్తిస్తుంది గాని కవులకూ, గాయకులకూ వర్తించదు. ఎందుకంటే స్థూలంగా వాళ్ళను విడచిపెట్టే వస్తువు లేకపోవటమే దీనికి కారణం." అంటారు. కొండపల్లి వారు ప్రకృతి కళాకృతిలో లీనమయ్యారు. వారికి ***మిసిమి*** శ్రద్ధాంజలి.

* * *



సాహిత్య అకాడమీ అధ్యక్షులైన సునీల్ గంగోపాధ్యాయ నుంచి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం (2011 సం॥) అందుకుంటున్న సదాశివ

**సామల సదాశివ :** సామల సదాశివతో పరిచయం కలగటం, వారు నాకు తెలుసని చెప్పటం, సంగీత, సాహిత్యాలలో ఒక గౌరవ సూచకం, ఒక హోదా. ఆయన తెలుగు, మరాఠీ, ఉర్దూ, పార్సీ భాషలలో విస్తృతమైన పండితుడే కాదు మంచి చిత్రకారుడు కూడా. కాపు రాజయ్య ఆయన సహాధ్యాయి. నిజానికి సదాశివే లేకపోతే ఆంధ్రదేశంలో ఎంతోమందికి *హిందూస్థానీ సంగీతం, ఉర్దూ గజల్స్* గురించి ఇంత విపులంగా తెలియక పోయేది అని చెప్పడం అతిశయోక్తి కాదు. ***మిసిమి*** పత్రికతో ఆయనకు సుదీర్ఘ పరిచయం ఉంది. ఆయన ఎన్నో వ్యాసాలు వ్రాశారు. ***మిసిమి*** సాంస్కృతిక పునాదులకు చేయూత నిచ్చిన తొలితరం రచయితలలో ప్రముఖులుగా ఆయనను ప్రస్తుతించాలి. తన సాహిత్య, సంగీత రసజగత్తులోకి ఆయన నిష్క్రమించారు. వారికి ***మిసిమి*** జోహార్లు అర్పిస్తున్నది.



# గ్రామాయణం

- తూములూరి పార్థసారథి

కైఫియత్తులు గ్రామీణ వాతావరణాన్ని వివరించే గద్య ప్రక్రియలో ఉన్న రచనలు. మెకంజీ ప్రోత్సాహంతో నాడు కైఫియత్తుల రచన విస్తారంగా సాగింది. తెలుగులో వీటిపై జరిగిన పరిశోధన చాల తక్కువనే చెప్పాలి. వీటిల్లో యీ వ్యాసకర్త సిద్ధాంత వ్యాసమూ ఒకటి! కైఫియత్తుల్లో రచయితలు కొన్నిచోట్ల ఛందోబద్ధరచనలు కావించారు. ఈ పరిస్థితుల్లో కొన్ని దోషాలూ యేర్పడ్డాయి. వీటిలో పూర్వశాసనాలను ఉదహరించటం కొన్ని సమయాల్లో జరిగింది. గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, ప్రకాశం లాంటి కొన్ని జిల్లాల కైఫియత్తులు ముద్రింపబడ్డాయి. ఆ పిదప కడప జిల్లావి కూడ నాలుగైదు సంపుటాలుగా వచ్చాయి. ఛందస్సు మాట ఎలా ఉన్నా గుంటూరు కైఫియత్తు ఏబది పుటలతో విస్తరించి ఉంది. బ్రాహ్మణుల్లోని గృహనామాలతో పాటు వారి గోత్రాలను వివరించింది. నాటి తెలుగు పౌరుషం ఒక యుకుడి పాటలో ఇలా ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది.

**"కొండ వీడు మనదేరా,**
**కొండ పల్లి మనదేరా,**
**కాదని యవ్వడు వాదుకువచ్చిన**
**కటకం దాకా మనదేరా."**

*(గుం.2, పు.54.)*

కెఫియత్తు అనగా ఒక సంగతి లేదా విషయాన్ని తెలిపే వివరాలు. అనగా ఆయా గ్రామాల వివరాలను వ్రాయస గాండ్రు వీటిలో పొందు పరుస్తారు. ఉదాహరించిన ఛందస్సులో, వృత్తాల్లో, ఉత్పలమాల, మత్తేభం లాంటివి, జాతుల్లో కందపద్యం, ఉపజాతుల్లో సీసపద్యాలూ ఉంటాయి. కొన్ని పద్యాల్లో ఖిలమైన భాగాలూ కనిపిస్తాయి.

శ్రీకాకుళం జిల్లా కళింగ పట్నం కైఫియత్తులో కొన్ని సీసపద్యాలతో పాటు ఉత్పలమాల యిలా ఉంది.

**ఉ॥ లేశము శంకలేక నవలీల మహోదధి వంశధారలో**
**బాశిత తీర్థ మంది, శివభక్తికి నిశ్చల చిత్త ముక్తిపైం**
**దేశుని గంన్ను మానవుడభస్తిత మోక్షవిభూతి జెంది । గౌ**
**రీశుని గూడు నిశ్చయము నిట్టిదశాస్త్ర నిరూఢి నెంచన్**

*(శ్రీ. పు.3)*

ఈ పద్యంలోని నాల్గవ పాదం చివరన గణభంగం జరిగింది. చివరలో వగణం (IU) ఉండాలి. కేవలం గురువు మాత్రమే ఉంది. 'నెంచగన్'తో సరిచేయవచ్చు. ముద్రణాదోషము కావచ్చు. 'తీర్థ' నేటి లేఖనంలో 'తీర్థ' అవుతుంది. 'గంన' గన్నగా రాస్తాం. పద్యంలో వంశధార నది ప్రస్తావన, అక్కడి దేవుడు 'పైడేశు'ని ప్రస్తావించారు.

దోషరహితమైన ఒక గీత పద్యం శ్రీకాకుళం కైఫియత్తులో ఉంటుంది. ఇది ఉపజాతుల్లోనిది.

**మొక్కుచును మాటిమాటికి ముదముతోడ**
**నఖిల పరివారయుతముగా నచట నిలిచి**
**యాంధ్రనాయక దాసుడు నను మనుదుప**
**నామ హంహ్వాయ మలరె నా స్వామి యిచట.**

*(శ్రీ. పు. 35)*

దీనిలోని ఒక కందపద్యం 'య' కారంతో మొదలవుతుంది. ఇదొక విశేషం. కైఫియత్తుల్లో యిటువంటి విశేషాలు సర్వసామాన్యమే అయినా "య కారంబును, వు, వూ, వొ, వోలును తెలుఁగు మాటలకు మొదట లేవు" అని సూరి అంటారు.

**క॥ యిచ్చెద రమ్మని పలికిరి**
**యచ్చర గతి గగన వీధి సరణి నగరికి**
**చచ్చెర నయ్య మరావగ**
**సొచ్చియు నార్వేల భూమిసురు లవలీలన్.**

*(శ్రీ. పు. 39)*

ఆర్వేల భూమిసురులు అనగా బ్రాహ్మణ నియోగుల్లోని ఒక ఉపశాఖ. ఇదే కైఫియత్తు యందలి మత్తేభం.

**మ॥ తలి తంండ్రుల్ దిగనాడి ప్రోవ నచటన్ దైవానుకూలంబుచే**
**నలఘు వ్యాళ విభాగ శీతల కృతాంతర్గత సచ్ఛాయచే**
**దళ సంకీర్ణల సద్ద్రుమా శ్రమ విస్ఫార స్రవ స్వీకృతం**
**బలరంజీ వితు డౌను నచ్చుట నపాయంబేమియున్ ఁజెందకన్**

*(శ్రీ. పు.40)*

ఇందు రెండవ పాదంలోని 'మ' గణానికి బదులు 'త' గణం ఉంది. శిరిపురం, గుంటూరు జిల్లాలోని గ్రామం. దీని కైఫియత్తు వ్రాయసగాండ్రు కొండరాజు, అయ్యపురాజు, మల్లం

రాజు. ముద్రిత ప్రతిలో రెండు కంద పద్యాలున్నాయి. ఒక దానిలో కొంత భాగం ఖిలమైంది. ముద్రణ ప్రతిలోని కంద పద్య స్వరూపం ఒకటి.

కII జన దత్తము దత్తము
రక్షణ మొనరింపని యతండు
సమనిస పిదపన్!
జనన మమేధ్య కటంబున
జనియించును వేల యేండ్లు
సతత శ్రీమతోన్II - *(గుం.5, పు. 155)*

పాదాల క్రమం ఇలా ఉండాలి.

కII జన దత్తము దత్తము ర
క్షణ మొనరిపంని యతండు సమనిస పిదపన్!
జనన మమేధ్య కటంబున
జనియించును వేల యేండ్లు సతత శ్రీమతోన్ II

పద్యం చివర్లో గణాల్లో తేడా కన్పిస్తుంది. మరొక వృత్త పద్యం శార్దూలం, శ్రీకాకుళం కైఫియత్తులో ఉంది.

శాII యిదేముండు మదీయ సత్కులధనం భీ యిందిరా ధాముడై
దేదీప్యంబున నాంధ్ర నాథుడగుచున్ దివ్యస్వరూప జ్ఞలా
భూదేవోత్తము లాలకించి వినసంమ్మోదంబుతో భూవరుం
దాది బ్రహ్మేహము కాకుళాధిపు పదధ్యాన ప్రసంగంబులన్.

*(శ్రీ. పు. 35)*

గుంటూరు జిల్లా ముట్నూరు కైఫియత్తు గ్రామ అష్టభోగాల్ని వివరిస్తూ శ్లోకం యిలా చెప్తుంది.

శ్లోII పౌరోహిత్యం పాచకత్వం ప్రభుత్వం
జ్యోతిస్సారం హెమ ముద్రా పరిక్షా
సాము ద్రాఖ్యం లేఖకం యాజమాన్యం
ప్రొక్తం సద్భిః గ్రామభోగాష్టకంహిII

*(గుం.1, పు. 45)*

అదేన్యాయం చేత అష్టభోగ సహితంగా గ్రామాన్ని అగ్రహారంగా యిస్తారు. *రేపల్లె* కైఫియత్తు కృష్ణానదిని ఎలా స్తుతిస్తుందో చూద్దాం.

శ్లోII కృష్ణే ! కృష్ణాంగ సంభూతే !
జంతూనాం పాపహారిణి !
స్నా స్యామితా వకే తీర్థే
మహాపాపం వ్య పొహయ !

*(గుం.5, పు.219)*

కడప జిల్లా కొప్పోలు గ్రామం కైఫియత్తులో "చింన్న తింమ్మంన్న అనే కరణం కవీశ్వరుదు చెప్పిన పద్యం యిచ్చారు. కాని రెండున్నాయి అవి:

*శత సంఖ్య లొక్మటైనను*
సతతము శ్రీ కృష్ణరాయ జగతీపతితో
చదరంగ మాడి గెలిచెను
దృతి మంత్తుదు బొద్దు చల ౕ తింమ్మన భళిరేII

*(క్ర.1, పు.210)*

ధీరుదు బొద్దు చల్ల౯ చిన తింమ్మన మంత్రి కుమారుదంబితా
కారుదు సత్కళావిధుదు కౌశిక గోతృదు పద్మనేత్త్రసే
వారత బుద్ధినం దవర వంశ్శజు సత్కవి లోకనాథుడా
చార సమగ్రవర్తీ౯ నుదు దార వచోన్నతి వొప్పె వాడొగిన్ –

*(క్ర.1, పు.210)*

పై రెండింటి లోను మొదటిది కందపద్యము రెండవ పద్యం భ–ర–న–భ–భ–ర–వ గణాలుగల ఉత్పల మాలా వృత్తం. కడప జిల్లా వెల్లాల కైఫియత్తులో కరణీలు రాజకొమారుని దగ్గరికి తీసుకు వచ్చిన పద్యం– సీస పద్యం.

సీII బ్రహ్మ వక్త్రమున నుద్భవమైన బ్రాహ్మణుల్
కొందరాచార్యులై యుందురెపుడు
వరుసతో కొందరు వైదిక మార్గంబు
చెన్నొందు చుందురు సిద్ధము గను
నియ్యోగులై కొందరె య్యెద నుందురు
నీతి కార్యము లెల్ల నెగడు కొరకు
వాసిగా లెక్కలు వ్రాసిన మాత్రాన
................................
తేII విప్రసమ్మతి / ............ రాజ చంద్ర!

*(క్ర.1, పు.285)*

కొప్పోలు కైఫీయత్తుల్లో ఉన్న, ఒక సీసపద్యంలో ఒక పాదం లోపించింది. ఆ తర్వాత ఒక తేటగీతి ఉంది. తేటగీతిలోని చివరిపాదం.

నగ్గళ ప్రతాప కుమారనంత్తభూప *(క్ర.1, పు.215)*

ఇందులో 'కుమార' జగణం అవుతుంది. ఇది ఇంద్రగణం కాదు. 'కుమారుద నంత్త భూప' అని ఉంటే సరిపోతుంది. ఈ సీసపద్యంలో మొదటి పాదంలో కొంత ఖిలమైంది. కొప్పోలు గ్రామ కైఫియత్తులో ''భువి విక్రమార్కు౯ ని... అనే, మరో ఆరంభపద్యం సీసపద్యం లాగా కన్పిస్తోంది. కొన్ని సందర్భాల్లో కవులు ఛందస్సు పేరు యివ్వలేదు. దీనిలోని చివరి నాలుగు పాదాలు యిలా ఉన్నాయి.

హొయ గజా ధీశముఖ్య శిం హ్వాసనాది
రాజ రాజ కిరీటాది రత్న నూత్న
కేసరీ సరాగ అంఘ్రి పంక్కేరు హుందు
సరస విభు కృష్ణరాయాంక నరవరుందు.

*(క్ర.1, పు.210)*

ఈ తేటగీతి పాదాల్లో మూడవ దానిలో గణ విభజన లోపం కనిపిస్తుంది. మూడవది యిలా ఉన్నప్పుడు సరిపోతుంది.

"కేసరీ సర గాంధ్రి పంక్కేరు హుందు".

పై తేటగీతి భాగంగా సీసపద్య పాదాలు యిలా ఉంటాయి. సమన్వయం చేసుకోవాలి

"భువి విక్రమాకుఁని .... అగ్రహారంమ్ము నొసగె".

ఇక కొండవీడు, గుంటూరు కైఫియత్తుల్లోని ఈ క్రింది రెండు సీసపద్యాలు చూద్దాం.

కొండవీడు

సీ॥ పర రాచ్యున్ వరదుగ వర వైభవ శ్రీల
గొనకొని విడనాడు కొండవీడు
పరపండీ రాజన్య జలముల బంధించ్చు
కొమరు మించిన బోదు కొండవీడు
ముగ్గురు రాజులకు మోహంబ్బు బుట్టించు
గురుతైన వురుతాడు కొండవీడు
చటుల విక్రమకళా సాహసం బ్బొనరించు
కుటిలాత్ములకు జోదు కొండ్డవీడు.

తే.గీ॥ జవనఘోటక సామంత్త సరస వీర
భటా నేక హటక ప్రకట గండ్డ !
సింధూరారవ మోహన శ్రీల దనరు!
కూర్మినమరావతికి జోదు కొండ్డవీడు॥

(గుం.4, పు.22)

గుంటూరు

సీ॥ పరరాజు పరదుర్గ పరవైభవ వజ్రల కొస కొని నితనాడు
కొండవీడు పరిసంధి రాజన్యబలము
బంధించుఁ గురుతెన వురు ద్రాడు చటుల విక్రమ
కళా సాహసం బొనరించు కుటివారు
నకు జోదు ముగురు రాజులకును మోహంబు బుట్టించు
కొమరు మించిన యట్టి కొండవీడు
చజుల మత్తేభ సామంత సరవిరభటన నెకహటి! ప్రకట
గంధ శింధరా భట మొహన్రాల దనరు
కూర్మిన మదావతికి జూడు కొండూరు !

(గుం.2, పు.35)

ఈ రెండింట్లోను ఒక రకమైన పద బంధాలు వేర్వేరు పాదాల్లో ఉండటం, పదాల మార్పు, సీసపద్య నియమాలకు తగ్గినట్లు లేవు. గుంటూరు కైఫియత్తులో తేటగీతి లేదు. కొండవీడులోని తేటగీతి రెండవ పాదంలో ఆరంభంలోని సూర్య, ఇంద్ర గణాలు సరిగా కుదురుట లేదు. చివరి రెండు సూర్య గణాలు ఏకీభవిస్తున్నాయి. పద్యాల చివర్లో ఒక దానిలో గ్రామనామం కొండవీడు కాగా రెండవ దానిలో 'కొండూరు' అని ఉంది, వీడు, 'ఊరు' పదాల అర్థాల్లో స్వల్ప భేదం ఉంటుంది – పట్టణం, గ్రామం. ఇదే జిల్లాలోని గోవింద పురం కైఫియత్తులోను ఒక సీసపద్యం ఉంది.

సీ॥ వనది కన్నిక ప్రేమ దనియ జూచిన చోటు
అఖిల విద్యల కెల్ల అందుబాటు
సకల తపో నిధుల్ సంచరించిన తావు
వెలయు భూప్రజల్కు వేల్పు తావు
మునినేవ్యుడగు జనార్ధను దెలు నగరంబ్బు
ప్రథిత భీమేశ్వర ప్రాంగ్గణంబు
పేరైన అసహాయ సూరుల కిది టెంకి
వికటా హితుల కెల్ల వెలయు కొంక్కి.

తే.గీ॥ మునులు ముక్కోటి దేవేశు కొనర తూపున్
దివి జగ్గంబులు జలకేళి తీరు మెప్పు
యురుగెలంకుల వాహినీ యుగంబ్బు గలుగు
పుణ్య సారంబ్బు గోవిందపుర వరంబ్బా.

(గుం.4, పు.40)

ఈ పద్యం తేటగీతి భాగంలో నాలుగవ పాదంలోని 'వీరంబ్బా' కు బదులు 'వరంబు' అని ఉన్నప్పుడు రెండు సూర్యగణాలు ఏర్పడతాయి. మూడవ పాదంలోని 'యుగంబ్బు' కు 'యుగము' అని ఉంటేనే చివరలో రెండు సూర్య గణాలవుతాయి.

సీసపద్య భాగంలో రెండవ పాదం లోని 'ప్రజల్కు' బదులు 'ప్రజలకుం' అంటే గణం 'నగము' అవుతుంది. అప్పుడు ఇంద్ర గణం అవుతుంది. ఇదే విధంగా గుంటూరు జిల్లాలోని యనమదల కైఫియత్తులో ఒక శ్లోక భావాన్ని సీస పద్యంలో వివరించటం గమనింప వచ్చు.

వ్యాసంలో కైఫియత్తుల ఛందస్సు స్థూలంగా పరిశీలింప బడింది. ముద్రణా యంత్రాలు లేని సమయంలో మౌఖికంగానే జనం నోట ఆయాపద్యాల వ్యాప్తి జరిగింది. పాఠాంతరాలు వుండటం, లేఖనంలో అప్పటికి యిప్పటికి గల మార్పులు, వ్యాకరణ దోషాలు, పాదాల్లో క్రమ పద్ధతి లేకపోవటం, ఆయా పద్యాలు ఛందో నియమాలు పాటించక పోవడం లాంటివి పై పద్యాల్లో ఉన్నట్లు గ్రహింపగలం. అయితే ఈ నాడు అసలు ఛందో నియమంతో కవితనల్లటమే తగ్గిపోయింది. నిస్సందేహంగా ఆనాడు గ్రామీణులైన కైఫియత్తుల వ్రాయసగాండ్రు పద్య ప్రక్రియపై కొంతమందైనా ఉత్సాహం చూపించడం అభివందనీయం. వారి కవితా స్ఫూర్తిని దిఙ్మాత్రంగా తెలుపడమే వ్యాసోద్దేశం.

మి

# నామ విజ్ఞానము

– యార్లగడ్డ బాలగంగాధర రావు

నామవిజ్ఞానం (Onomastics) అంటే భాషాశాస్త్రమే. అయితే భాషాశాస్త్రం (Linguistics) అనేది ఒక శాస్త్రంగా వుంది. అయితే రెండూ ఒకటేనా అంటే కావు. ఎలాగంటే నామవిజ్ఞానం, భాషలోని సమస్త పదాల పుట్టుక, అవి ఏ భావాలకు సంకేతాలు, ఆ భావాలకు అవి సంకేతాలుగా ఎలా రూపుదిద్దుకున్నాయి, మరో భావాన్ని తెలుపడానికి కూడా అవి ఎలా ఉపయోగపడుతున్నాయి. వాని అంతర్గత తత్త్వం ఏమిటి అనే అంశాలను బోధిస్తుంది. అయితే ఒక సందేహం కలుగుతుంది. భాషాశాస్త్రంలో (Linguistics) లో వ్యుత్పత్తిశాస్త్రం (Etymology) భాగమే కదా! దానికంటే, ఈ శాస్త్రం అధికంగా నిర్వర్తిస్తున్నదేమున్నది! దీనిని ప్రత్యేకంగా నామవిజ్ఞానశాస్త్రం అనడం ఎందుకు? భాషాశాస్త్రంలోని భాగంగా ఎందుకు పరిగణింపరాదు! అనే సందేహాలు వస్తాయి. ఈ సందేహాలు సమంజసంగానే కనిపిస్తాయి.

వ్యుత్పత్తి (Etymology) భాషాశాస్త్రంలో భాగమే. కాని అది పదం యొక్క వ్యుత్పత్తిని మాత్రమే నిర్ధారిస్తుంది. నామవిజ్ఞానం అంతటితో ఆగదు. వ్యుత్పత్తి, పదరూపం, ఇతర భాషలలోని దాని సరూపపదం వానిలోని అర్థసామ్యం, వీలైతే ఆ పదం యొక్క మూలం 'ఇలా' వుండి, ఆయా భాషల్లో 'ఈ' విధంగా రూపాంతరం పొందింది, దాని అర్థమిది అని చెప్పే వరకు వెళుతుంది.

ఉదాహరణకు పిల్లి అనే పదం తీసుకుంటే తమిళం, కన్నడం, కొలామి, నాయకి భాషల్లో కూడా దాని రూపం 'పిల్లి' అని, పర్జీ భాషలో బిల్సె అని చెప్పి దాని అర్థం మాత్రం చెపుతుంది. అదే నామవిజ్ఞాన శాస్త్రం పిల్లికి అర్థం చెపుతూ (నిజానికి, ఆ జంతువును సూచించడానికి తెలుగులో మరో పేరు లేదు. భాషలో ఒక భావాన్ని చెప్పడానికి ఒకే పదం వుంటుంది. మరోపదం ఉండదు. అంటే పదాలకు అర్థాలుండవు. భావం ఉంటుంది. ఆ భావం, భాషారూపంగా అంటే ధ్వని రూపంగా – పదంగా వెలువడుతుంది. దానిని తిరిగి విశదపరచడానికి చేసే ప్రయత్నముంటుంది. అంతే తప్ప – ఒక పదానికి అర్థంగా అదే భాషలో మరో పదం ఉండదు. దీనిని గూర్చి ముందు తెలుసు కోవచ్చు) దీని భావం అల్పమనే దానిని సూచిస్తుందని, జంతువైతే పిల్లి అని, మనిషి అయితే పిల్ల (వయసులో అల్పం) అని, వస్త్రభాగమైతే పీలిక అని, అలా అన్నింటిలో ఉన్న భావం ఒకటేనని (అల్పము), సాధారణంగా మనం చూసే ఆ జంతువులకంటే భిన్నంగా వుండి, సరూపంగా వుండే జంతువులను, గండుపిల్లి, మానుపిల్లి అని సూచింపబడతాయని వివరిస్తుంది. అలాగే కూన శబ్దం తీసుకుంటే, తెలుగులో కొన్ని జంతువుల పిల్లలను ముఖ్యంగా పిల్లి పిల్లలను కూనలు అంటామని, తమిళంలో అదే పదం కుంచు అని, అలాగే ఇతర భాషా పదాలు ఇవ్వడం జరుగుతుంది.

నామవిజ్ఞానం, పై అర్థాన్నే చెపుతూ ఇంకా ఇలా చెపుతుంది. కూన శబ్దమే 'కున్న' గా పరిణమించిందని, 15వ శతాబ్దం వరకూ అలాగే వ్రాశారని (అయితే ఉచ్ఛారణ మాత్రం గున్న), ఏనుగు పిల్లలను గున్న అని సంభావించారని, బాలురను కూడ, మురిపెంగా గున్న అని సంభావిస్తారని, తక్కువ, అల్పము, చిన్న అనే భావం ఈ కున్ అనే శబ్దంలో వుందని, సంకోచించు అనే భావాన్ని చెప్పే, కుంచించు, అలాగే కొంచెము అనే అల్పార్థ సూచక భావాలు గల పదాలు – కుంటు, గూని అనే పదాలకు కూడా ఇదే ఆకరమని (కుంటడంలో అసలు ఆకృతి కొంత తగ్గుతుంది, గూని వలన కూడ శరీరం కుంచింపబడుతోంది) బోధిస్తుంది. ఇలా చాలా చెప్పవచ్చు. కనుక వ్యుత్పత్తి శాస్త్రానికి, నామవిజ్ఞానానికి భేదం వున్నదనేది స్పష్టం.

ఇక భాషాశాస్త్రం (Linguistics) లో ఇది భాగమే కావచ్చు గదా అనవచ్చును. నామవిజ్ఞానం కూడా భాషను గూర్చే కదా చర్చిస్తోంది. కనుక దానిలో భాగమేనని పించడంలో అసహజమేమీ లేదు. కాని కాదు. భాషాశాస్త్రం

ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు, ఫోన్ : 9849499169

ముఖ్యంగా, ధ్వనులు, వాటి పుట్టుక, పదాలు, పదాంశాలు, వాక్యంలో ఆయా భాషాభాగాలు నిర్వర్తించే పాత్ర, మాండలికాలు, వ్యుత్పత్తి – వీటిని గూర్చి చర్చిస్తుంది. అంటే భాషలోని పదాలు, ప్రముఖంగా వాటి వ్యాపారాన్ని చర్చిస్తుంది. అంటే వ్యాకరణాన్ని మరో రూపంలో, మరో కోణంలో ఆవిష్కరిస్తుంది. నామవిజ్ఞానశాస్త్రం చర్చించే విషయాలను గూర్చి ముందు తెలుసుకున్నాం. దానిని బట్టి పై రెండు శాస్త్రాలకు గల భేదం అవగతమవుతుంది. ఇక దీనిని భాషాశాస్త్రంలో భాగంగా ఏల చెప్పరాదు అనే ప్రశ్న ఉంది. నిజానికి అలా చెప్పడం జరిగింది కూడా.

దీనిపై కొన్నేండ్లకు పూర్వం న్యూయార్క్ (అమెరికా సంయుక్త రాష్ట్రాలు) నుండి, అమెరికన్ నేమ్స్ సొసైటీ వెలువరించే 'నేమ్సు' అనే త్రైమాసిక పత్రికలో వాదోపవాదాలు కూడా జరిగాయి. భాషాశాస్త్రజ్ఞులు (Linguists), నామవిజ్ఞాన శాస్త్రం, భాషాశాస్త్రంలో (Linguistics) భాగం కాదన్నారు. దానికి ఆ అర్హత లేదన్నారు. దానికి సమాధానంగా నామశాస్త్రజ్ఞులు, నామవిజ్ఞానం భాషాశాస్త్రంలో భాగంకాదని, భాషాశాస్త్రమే నామవిజ్ఞానంలో భాగమని వాదించారు. నామశాస్త్ర అధ్యాపకునిగా మాత్రమేగాక, సాధారణునిగా ఆలోచించినా, ఈ భావవమే సమంజసమనిపిస్తుంది. ఎలాగంటే, భాషాశాస్త్రం కేవలం, భాషాతత్త్వాన్ని గూర్చి పరిశీలించే వేత్తలకు మాత్రమే పరిమితం. కాని నామవిజ్ఞానం అలా కాదు.

సామాన్యుడు కూడా, తన అనుభవంలోనికి వస్తున్న దేనిని గూర్చి అయినా ఒక క్షణం ఆలోచిస్తే అతడు నామవిజ్ఞాని అవుతాడు. మొదలు తన పేరుకు అర్థం ఏమిటి? తన ఊరి పేరుకు అర్థం ఏమిటి? తన ఇంటిపేరుకు అర్థం ఏమిటి? తనకు ఎదురైన చెట్టుకు, జంతువుకు ఆ పేరు ఎందుకు వచ్చింది – అనే ఆలోచన వచ్చిన మరు క్షణం అతడు నామవిజ్ఞాని అవుతాడు. దానికతడు విద్యాభ్యాసం చేయవలసిన అవసరంలేదు. భాషా భాగాలను గూర్చి అధ్యయనం చేయవలసిన పనిలేదు.

యాదృచ్ఛికంగా దృష్టి అటు మరలితే చాలు! స్థలపురాణాలు, భాషాశాస్త్రజ్ఞుల వలన వచ్చినవి కాదు గదా! మే, మేఁ అంటున్నది గనుక అది 'మేక', కావు కావుమంటున్నది గనుక అది 'కాకి'. శరీరం మధ్యభాగం (నడుమ) గనుక నడుము, చేసేది చేయి, కనునది కన్ను, కాసేది (నీళ్ళు) కాగు (పాత్ర), పెసలకంటే చిన్నవి గనుక పిల్లి (పిల్ల) పెసలు, ఆవులలో (ఆ జాతిలో) అది పోతు గనుక ఆంబోతు అనే విషయాలు తెలియడానికి చదువుతో పనేముంది గనుక! ఇవి తెలియడానికి అతడు భాషాశాస్త్రజ్ఞుడు కానక్కరలేదు గదా! దృష్టి అటు మరలిన క్షణం, అతడికి అందివచ్చేవి ఆ భావాలు. కనుక అతడు నిరక్షర కుక్షి అయినా నామవిజ్ఞానాన్ని గూర్చి కొంతలో కొంత తెలిసిన వాడవుతున్నాడు. దానికి విద్య, పరిశీలన తోడైతే నామవిజ్ఞాన శాస్త్రవేత్త అవుతాడు.

అదెలాగంటే – చెమ్మ, చెమట, చీమిడి, చీము, చిమ్మిలి అనే పదాలు, వాటివలన బోధపడే అంశాలు అందరికి తెలిసినవే. అయినా మరింత తక్షణ అవగాహన కొరకు వాటిని భావిద్దాము.

చెమ్మ : తడి (నేల చెమ్మగావుంది)

చీమిడి : జలుబు చేసినపుడు ముక్కు నుండి కారే జిగట లాంటి పదార్థం.

చెమట : వాతావరణం ఉక్కగా వున్నప్పుడు, శరీరం శ్రమకు గురైనపుడు శరీరం నుండి వెలువడే నీరు.

చీము : శరీరంపై ఏదైనా గాయం కలిగినపుడు, ఆ గాయం నుండి లేదా కురుపుల నుండి కారే రసి.

చిమ్మిలి : (లేక చిమ్మిరి) నువ్వులు దంచి, దానికి బెల్లము కలిపితే ఏర్పడిన పదార్థం. ముఖ్యంగా దీనిని ఆడపిల్లలు పుష్పవతులైనపుడు వారిచే తినిపిస్తారు. సాధారణంగా ఆ పదార్థాన్నే చిమ్మిలి లేక చిమ్మిరి అంటాము. కాని నిజం అది కాదు. చిమ్మిలిని తినిపించడం ఎందుకో తెలిస్తేగాని ఇది తెలియదు. రజస్వల అయిన సమయంలో ఆ పిల్లదేహంలో ఇంకా మిగిలిపోయిన రజోద్రవం వేగంగా వెలువడడానికి, పై పదార్థం తినిపిస్తారు. అంటే ఇక్కడ ఆ రజోద్రవం చిమ్మిలి అన్నమాట. దానిని వెలువరించడానికి దోహదం చేస్తుంది గనుక, ఆ పదార్థాన్ని చిమ్మిలి అంటున్నారు.

ఇక్కడ రజోద్రవానికి చిమ్మిలి అనేది పేరుగా కనుపిస్తోంది. కాని నిజానికి ద్రవతత్త్వానికి – అంటే తేమ లేక చెమ్మయే చిమ్మిరి అన్నమాట. ఈ శబ్దాన్ని ఈ అర్థంలో అంటే చెమ్మ, తడి అనే భావంలో అన్నమయ్య ఉపయోగించిన తీరు గమనించండి.

**అంగనకు నీవె అఖిల సామ్రాజ్యము**
**శింగరరాయ నీకు శ్రీసతి నిధానము.** - **పల్లవి**
**నెమ్మి అలమేల్మంగ నీ కాగిలి పెండ్లిపీట**
**చిమ్ముల చందన చర్చ సేసపాలు**
**ఉమ్మడి మెడనూళ్ళు ఉయ్యాల సరిపెణలు**
**పమ్మి శ్రీ వేంకటేశ నీ భావమె భాగము.**

మరోచోట ఆయనే యోనిద్రవం అనే అర్థంలో కూడ ఉపయోగించాడు.

**విచ్చేయవమ్మా వెన్నెల బొమ్మా**
**మచ్చిక మరుని థాక మగువ నీ రాక.** - **పల్లవి**
**ముద్దుల నీ నగవు చిమ్ముల రతి బిగువు**
**అద్దజంపు కసరు మోహంపు కొసరు**
**గద్దరి నీ యలపు వేంకటపతి తలపు**
**అద్దపు నీ మోము మోహన రతి సాము**

పై రెండు చోట్లా అన్నమయ్య చిమ్ముల శబ్దాన్ని ఉపయోగించాడు. అచ్చులో ఆ పదం ఉపయోగించిన అన్ని కీర్తనలలోను అలాగే కనుపిస్తుంది. అయితే అది చిమ్ము శబ్దంపై బహువచన ప్రత్యయం 'లు' చేరి ఉపయోగంలో చిమ్ముల కాలేదు. చిమ్మిలి శబ్దమే అలా రూపుదిద్దుకుంది. అలా కాకుంటే చిమ్ముల శబ్దానికి అక్కడ సంగతి కనుపింపదు. చిమ్మిలి అంటే తేమ, చెమ్మ అనే అర్థాల్లో అయితేనే సంగతి కుదురుతుంది. ఈ క్రింది ప్రయోగాలు చూచినా అతడు చిమ్ము అనే క్రియాపద అర్థంలోగాక, చెమ్మ, తేమ అనే భావాలోలనే ఉపయోగించాడని అర్థమవుతుంది.

1. **అమ్మితి నా మేను నీకు నప్పుడే వోరి చూపుఁ**
   **జిమ్ముల నేచకేమైనాఁ జిత్తగించరా**
2. **చిమ్ముల నీ చెమటలఁ జేయవే మజ్జనము**
   **దిమ్మరి నీ మురిపెపు తీగె మేనికి.**

పై వానిలో క్రీగీత గల దానికి పరిష్కర్తలు 'చెమ్ముల' అని పాఠాంతరం చూపుతున్నారు. అంటే చిమ్ముశబ్దం (క్రియారూపం) పరిష్కర్తల ఉద్దేశ్యంలో అక్కడ సమమైన అర్థంలో సరిపడడం లేదన్నమాట. నిజానికి అన్నమయ్య చక్కగానే, సమంగానే ప్రయోగించాడు.

అది అలా వుంచితే, అన్నమయ్య చిమ్మిలి అని వ్రాయగా, రాగి రేకులపై చెక్కిన చెక్కడపు వారి కైవాడంలో, లేక వ్రాయసగాండ్ర వ్రాతలో అది చిమ్ములగా మార్పు పొందిందో తెలియరాదు. దీనిని వదలివేసినా మిగిలిన మూడు పదాల్లోనూ సమానంగా గోచరిస్తున్న భావం చేమ, తేమ అనేవే గదా! కనుక ఈ పదాలన్నింటికి ధాతువు ఒకటేనని బోధపడుతుంది. ఇలా ఆలోచించడానికి, భాషాపరమైన శిక్షణ దోహద పడుతుంది. నామవిజ్ఞానశాస్త్ర పరిచయం, అభ్యాసం, ఆ విధమైన ఆలోచనను మరింత విస్తరిస్తుంది.

ఇక్కడ మరో మాట మనవి చేయాలి. భాషా పండితుల్లో దీర్ఘకాలంగా ఒక అభిప్రాయం దృఢంగా నాటుకొని వుంది. అదేమంటే, సంస్కృత భాషలో పదాలకు మూలధాతువు కలదని, ఆ ధాతువు నుండి అనేక రూపాలు నిష్పన్నమవు తాయని, దేశభాషల్లో అలా వుండదని, అవి అవ్యుత్పన్న భాషలనే అభిప్రాయం కుదురుకుంది. పైన చెమ్మ, చీము, చీమిడి, చిమ్మిలి అన్నీ ఒకే ధాతువు నుండి నిష్పన్నమైనాయని గ్రహించాము గదా! ఇవి చూడండి. కాపు (రక్షణ) కమ్ము (ఆవరించు, ఆదరించు, అక్కరకు అందివచ్చు అనే అర్థాల్లో కమ్ముకొను), కప్పు (ధరించు, కప్పిపుచ్చు), అనే పదాల్లో, ఆశ్రయము, ఆశ్రయమిచ్చు అనే అర్థాలు, అలాగే మాపు, (బట్టలుమాయు) మప్పు (అలవాటుమప్పు), మచ్చ (పుండుమానితే శరీరంపై ఏర్పడే గురుతు), మబ్బు (మేఘము, అడ్డంకి), అనే పదాలు అన్నింటిలోను, అసలైన దానిని మరుగుపరచు అనే అర్థాలు ద్యోతకమవుతున్నాయి గదా!

కాబట్టి దేశ్యపదాలకు కూడా ధాతువులున్నాయని, దేశ్యభాషలు అవ్యుత్పన్నములు కావని, వ్యుత్పన్నములేనని, కారణమేమంటే వ్యుత్పన్నులైన వారి ఉపయోగంలోనిది వ్యుత్పన్నమవడంలో సందేహం లేదని, అలా అవ్యుత్పన్నం అనడం, అలా అనే వారి అలసత్వం, సత్యాన్వేషణలో ఆసక్తి లేమి, అనేవి తప్ప మరోవిధంగాదని తెలుస్తుంది.

కనుక నామవిజ్ఞానశాస్త్రం లోనే భాషాశాస్త్రం భాగమవుతుంది. అయితే ఈ చర్చతో ఒరిగేదేమీ లేదు. ఎవరికి వారు మేము గొప్ప, మా శాస్త్రం గొప్పది అనే వాదులాట తప్ప ప్రయోజనం శూన్యం. కనుక అది విడిచి, నామవిజ్ఞాన శాస్త్రాన్ని గూర్చి మరింతగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

నామ విజ్ఞానశాస్త్రమనే పేరు, తెలుగునాట పరిచయం గావింపబడింది ఇటీవలనేనని ముందు చెప్పుకున్నాం. మున్ముందుగా గ్రామనామాల పరిశీలన కొనసాగిందని ముందుమాటలో చెప్పడం జరిగింది. అప్పట్లో ఒక భాషాశాస్త్రజ్ఞుడు, గ్రామనామాలు కూడా పరిశోధింపవలసిన అంశమేనా అని అవహేళనగా అనడం కూడా జరిగింది. వారిని మీ ఇంటిపేరేమిటి అంటే వారి ఇంటిపేరు చెప్పారు.

అంటే ఏమిటంటే – అదొక ఊరిపేరన్నారు. అదే – ఆ ఊరి పేరుకు అర్థం ఏమిటి, ఆ గ్రామాన్ని ఆ పేరుతోనే పిలవడానికి కారణాలేమిటి అంటే – దానికి అర్థం ఏముంటుంది, అందరికి తెలిసినవే గదా అన్నారు. ఏమి తెలుసు, తెలిస్తే చెప్పడానికేమి అని ప్రశ్నించి, ఆ ఊరిపేరుకు ఇది అర్థం, ఇందువలన, ఆ జనావాసానికి, పూర్వులు ఆ పేరు పెట్టారని చెపితే – అప్పుడుగాని ఈ పరిశోధన ప్రాముఖ్యం వారికి అంది రాలేదు. ఇవి కూడ పరిశోధనాంశాలేనని అప్పుడు అంగీకరించారు.

ఇంత చెపితే తప్ప మీరు అంగీకరించలేదే! సాధారణులు వాటిని గూర్చి, మీ వలె మాట్లాడితే, అది వారి అజ్ఞానంగా భావించవచ్చు. భాషాశాస్త్రజ్ఞులైన వారు అలా అనవచ్చునా! వివరణ ఇస్తే తప్ప అంగీకరింప లేక పోయారే! కాని మీరు భాషాశాస్త్రజ్ఞులే. అవి గ్రామనామాలు కానివ్వండి, ఇంటిపేర్లు గానివ్వండి, వ్యక్తి నామాలు గానివ్వండి, చెట్లపేర్లు, నదులపేర్లు – ఏవైనా గానివ్వండి – అవి పేర్లు. భాషాపదాలు. భాషను గూర్చి చర్చించేటపుడు, భాషా సమష్టిలోని అన్నీ చర్చింపదగినవే కదా! వాటిని చర్చింపకుండా, భాషాశాస్త్ర చర్చ సంపూర్ణమెలా అవుతుంది అని ప్రశ్నించినపుడు గాని, తమ అభిప్రాయంలోని మౌలిక బలహీనతను వారు గుర్తింపలేకపోయారు. ఇదంతా వ్రాయడం, వారిని విమర్శించడానికి కాదు.

ఈ పరిశీలనపై, భాషాశాస్త్రజ్ఞుల దృష్టే ఇలా వుంటే ఇక సాధారణుల దృష్టిని గూర్చి చెప్పవలసిందేముంటుందనే సంగతిని విశదరచడానికి మాత్రమేనని మనవి. అలా తేలిక భావం ఏర్పడడానికి మూలం, అవి బాగా పరిచయంలో వుండడం. వాటి అర్థం తెలియవలసిన అవసరం లేకుండానే ఉద్దిష్ట వ్యవహారం కొనసాగడం, దానివలన, ఉద్దిష్టమైన దానికి ఎటువంటి బాధ కలుగక పోవడం అనేవి మూల కారణాలు. అంటే ఏమన్న మాట! నిత్య వ్యవహారోప యుక్తములైన పదాలను గూర్చిన అవగాహన, వాటి ఉపయోగానికే పరిమితం గావడం. వాటి అర్థాలను, భావాలను గూర్చి ఆలోచింప వలసిన అవసరం లేకపోవడం.

ఉదాహరణకు చలిమిడి అన్నామనుకోండి. అదేమిటో, దాని రుచి ఏమిటో అందరికి తెలుసు. అదెలా తయారవుతుందో, ఆ మిశ్రమంలోని ఇతర పదార్థాలేమిటో అందరికి తెలుసు. కాని దానిని చలిమిడే అని ఎందుకంటారో, అనాలో తెలియదు. తెలియవలసిన అవసరం లేదు కూడా! ఎవరికి – సామాన్యులకు, మరి భాషాపండితులకు! – తెలుసు కోవలసిన అవసరం వుందా – లేదా! కాని, ఇలా అందరికి తెలిసిన వాటిని గూర్చి పండితులు చర్చించలేదు. అలాంటి అవసరం ఏర్పడలేదనుకుందామా! అలాగే అనుకుందాము. మంచిదే. గంగాధరుడు, జలజము, మీనాక్షి శబ్దాలకు – కోరి అర్థాలు, వ్యుత్పత్తులు చెప్తున్నాము గదా! అయినపుడు ఐతమ్మ, జాలయ్య, అంటే కూడా చెప్పాలి గదా! చెపుతున్నామా? నిజంగా వాటి అర్థాలు ఎంతమందికి తెలుసు. గావుకేకలు వేయడం, ఆ మాట అనడం అందరికి తెలుసు. ఇంతకు గావుకేకలంటే నిజార్థం ఏమిటి? మూసివాయ నాలంటే ఏమిటి? 'మూసిక తోడ తాళి నఱుత గట్టక' అంటుంది కూచిమంచి వారి నీల. ఈ మూసికకు అర్థం ఏమిటి? మరి ఇవి వ్యవహారంలోను, కొన్ని కావ్యాల్లోనూ వున్నవే. వ్యవహారానికి – అంటే ఉపయోగానికి హాని కలుగలేదు. కాని అర్థాల మాట? 'పేరామని' అని శాసనాల్లో, కావ్యాల్లో, కన్పిస్తుంది. అంటే ఏమిటి, నిఘంటువుల్లో చోటు చేసుకున్నాయా! లేదు గదా! అయినపుడు నిఘంటువులు సమగ్రం కాదన్నమాటేగదా! సాధారణుల మాట అలా వుంచుదాము. భాషను ప్రత్యేకంగా అభ్యసించే వారికి ఇవి అవసరం కాదా! అదిగో ఆ అవసరాన్ని తీరుస్తుంది ఈ నామవిజ్ఞాన శాస్త్ర అధ్యయనం. భాషను మరింత పుష్కలంగా, సమర్థవంతంగా, అర్థవంతంగా, భావింపడానికి ఆకళింపు చేసుకోవడానికి, ఈ శాస్త్ర అభ్యాసం సహకరిస్తుంది.

అయితే ఈ శాస్త్రం ఇప్పుడే పుట్ట లేదు. పదాలవ్యుత్పత్తిని గూర్చిన చర్చ చాలా పూర్వకాలం నుండి జరుగుతోంది. అందులో మొట్టమొదట చెప్పుకోవలసింది యాస్కుని *నిరుక్తము*. వేద శబ్దాలకు అర్థాన్ని వ్యుత్పత్తిని అది నిరూపించింది. అలాగే *పాణినీయం* కూడా. నిజానికది సంస్కృత భాషకు వ్యాకరణం. కాని అది కూడ కొన్ని వ్యుత్పత్తులను చూపింది.

'కన్యాయాః కనీన చ' (4-1-116) కన్యాయా అపత్యమ్ కానీనః, కానీనుడు అంటే కన్యకు పుట్టినవాడు. పతంజలి మహాభాష్యము *పాణినీయము*నకు వాఖ్య. భర్తృహరి *వాక్యపదీయము* నందలి బ్రహ్మకాండము శబ్దము, దాని వ్యావృతిని గూర్చి వివరిస్తుంది. బైబిలు ఆదికాండమునందు, క్రొత్త నిబంధనలోను వ్యుత్పత్తులు కన్పిస్తాయి. కనుక అనాది నుండి, పదం యొక్క వ్యుత్పత్తిని గూర్చి ఆసక్తి వుందని

తెలుస్తోంది. మొదలు వీటి అవసరం ఎప్పుడు కలుగుతుంది. భాష సమాజ సంబంధి. ఇంకా చెప్పాలంటే స్వభాషా సమాజ సంబంధి. అంటే మాతృభాషా సమాజ సంబంధి. ఒకడు తన మాతృభాషీయులతోనే మాట్లాడగలడు. మరోభాష ప్రయత్నపూర్వకంగా నేర్చుకుంటే తప్ప అలవడేది కాదు.

మాతృభాషలో, మాతృభాషకు సంబంధించిన వారితో మాట్లాడుతున్నంత సేపు, అర్థం అనే దానికి ఉనికి లేదు. అన్నం తిన్నావా అనేదానికి వివరణ అవసరం అవుతుందా! ఇది అర్థం కాక పోవడమనేది లేదు. అంటే అందులోని పదాలు అందరికి తెలిసినవే. అలాగే ఎక్కడ నుండి వస్తున్నావు? అంతా బాగున్నారా? అనేవి కూడా వివరణను కోరవు. కాని వక్తకు మాత్రమే పరిచయమై, శ్రోతకు పరిచయం కాని మాటలు సంభాషణలో దొర్లితే, శ్రోతకు, వక్త ఉద్దేశించినదేదో తెలియక తికమక పడతాడు.

ఈ ఏడు ఎంత రాబడి వచ్చింది అనడానికి బదులు, మారుమూల గ్రామంలో వున్న, ఆంగ్లభాషతో ఎంత మాత్రం పరిచయం లేని రైతును, ఈ ఏడు ఎంత 'ఇన్‌కమ్' వచ్చింది అంటే అతడు సమాధానం చెప్పలేడు. కారణం 'ఇన్‌కమ్' పదం అతనికి క్రొత్త గనుక. ఇలాంటిది పరాయి భాషా పదాల వ్యవహారం వల్లనే అనుకుంటే పొరపాటు. మాతృభాషా పదాల వలన కూడా ఈ స్థితి ఏర్పడుతుంది. కారణమేమంటే, భాషలోని పదజాలం చాల ఎక్కువ.

నిత్య వ్యవహారం లోని పదజాలమే చాలా మందికి పరిచయం, దానికి మించిన పదజాలం తెలియదు. కావ్యభాష అందరకు తెలిసేది కాదు. అంతే గాక వ్యవహారంలో కూడా ప్రాంతానికి ప్రాంతానికి భేదాలుంటాయి. సొమ్ములు పోయాయి అంటే కృష్ణాజిల్లాలో నగలు పోయాయి అని చెప్పడం. అదే శ్రీకాకుళం జిల్లాలో అయితే పశువులు పోయాయి అని అర్థం. (అయితే కావ్యప్రయోగాల్లో ఈ అర్థంలో వుంది. ఉదా: *పల్నాటి వీర చరిత్ర*) కనుక అనేక కారణాల వలన ఈ వ్యుత్పత్తులు, అర్థాలు అవసరమవుతాయి.

అయితే నిజానికి పదాలకు అర్థాలుండవు. అంటే సమానమైన మరో పదం వుండదు. పిల్లి అనే పదానికి తెలుగులో మరో పదం ఏమిటి? ఉండదు. మరి- పైన 'సొమ్ములు' ఒక చోట నగలు, మరో చోట పశువులు అనే భావాల్లో ఎలా ఉపయోగపడింది. ఆ పదానికి రెండు భావాలున్నాయనుకోవాలా? లేదు సొమ్ములు అనే పదం స్వమ్ అనే సంస్కృత పదం నుండి వచ్చింది. ఆ పద భావం ఆస్తి అని. ఒక చోట నగలు ఆస్తి అయితే, మరో చోట పశువులు ఆస్తి. కనుక ప్రాంతాలను బట్టి ఆ పదం వేరు వేరు వస్తువులను నిర్దేశిస్తోంది తప్ప, మూల భావం ఒకటే. అది ఆస్తి. అయితే స్వమ్ శబ్ద నిజభావం తనది, తనదైన అని మాత్రమే. తనదైనది తన ఆస్తి అవుతుంది గనుక ఆస్తి అనే భావం చెప్పు కుంటున్నాము, అంతే, కనుక శబ్దానికి లేక పదానికి అదే భావాన్ని బోధించే మరో పదం, అదే భాషలో ఉండదు. వ్యక్తి లోని భావం, వాగ్రూపంలో అంటే ధ్వని రూపంలో భాష అవుతుంది. వ్రాతలో దృశ్య రూపాన్ని పొందుతుంది. ఈ వాగ్రూపమైన భాషకు నాలుగు అవస్థా భేదాలున్నాయి. అవి పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి అనేవి.

**చత్వారి వాక్పరిమితా పదాని**

వాక్పరితములగు పదములు నాలుగు విధములు. అవి నామ, ఉపఖ్యాత, ఉపసర్గ, నిపాతములు లేక పరా, పశ్యంతీ మధ్యమా వైఖరులు.

**తాని విదుర్బ్రాహ్మణాయే మనీషణః**

వానిని (ఆ నాలుగు భేదములను) వ్యాకరణమును తెలిసిన విద్వాంసులు మాత్రమే తెలియగలరు.

అట్టి వ్యాకరణ జ్ఞానము లేని వారు, మొదటి మూడు భేదములను తెలియలేరు. వారికి నాల్గవదియైన వైఖరి మాత్రమే తెలియును.

**గుహాత్రీణి నిహితా నేంగయంతి**

తురీయం వా చో మనుష్యా వదంతి. ఋగ్వేదము 1-164-45.

(ఈ నాలుగు పాదాలు ఒకే ఋక్కు లోనివి. వివరణ కొరకు విడివిడిగా వ్రాయబడ్డాయి.)

దీని వివరణ కొంత తెలుసుకోవడం అవసరం. భాష అవసరం ఎప్పుడు కలుగుతుంది? ప్రధానంగా ఒకడు తన భావాన్ని మరొకనికి చెపుతున్నపుడు గదా! అంటే వాగ్వ్యాపారానికి తప్పనిసరిగా ఇద్దరు వుండాలన్న మాట. ఒకడు వక్త. మరొకడు శ్రోత. సంభాషణా క్రమంలో వక్త శ్రోత గావచ్చును. శ్రోత వక్త గావచ్చును. ఏమైనా సందర్భాన్ని బట్టి ఒకడు వక్త మరొకడు శ్రోత అవడం తప్పదు. (ప్రధానంగా అని ఎందుకు అనవలసి వచ్చిందంటే కారణముంది. ఒక్కొక్కపుడు శ్రోత లేక పోయినా, అంటే వక్త ఒక్కడే వున్నా భాష వుంటుంది. తనలో తను మాట్లాడుకోవడం

(గొణుక్కోవడం) ఇలాంటిదే గదా? ఇలాంటి సందర్భంలో ఒకప్పుడు మాట పైకి బహిర్గతమవుతుంది. మరొకప్పుడు కాకపోవచ్చును. కాబట్టి ఒక్కరున్నా భాష ఉందన్నమాటే. అంటే భావం మాట రూపం లోనికి మారుతున్నట్లే). ఒకడు మాట్లాడుతున్నట్లు ఇతరులకు ఎలా తెలుస్తుంది. అంటే వక్త తన మాటలను ఎలా వెలువరిస్తాడు. నాలుక, పెదాలు, దవుడల వలన. మాట్లాడుతున్నపుడు ఇవి కదులుతాయి. వాటిని కదల్పక మాట్లాడలేడు. ఇది నిజమే. అయితే వాటిని కదల్చినంత మాత్రం చేత, అంటే ఆయా అవయవాల కదలికలున్నంత మాత్రం చేత మాట్లాడుచున్నట్లా – అంటే కాదు. ఏదైనా తింటున్నప్పుడు కూడ అవి కదులుతాయి. కాని అప్పుడు మాట లేదు కదా! ఇంకొకటి కూడ గమనించాలి. ఒక్కొక్కపుడు వాటి కదలికల వలన అప్రయత్నంగా అతడి నోటి వెంట కొన్ని ధ్వనులు వెలువడవచ్చును. అవి అర్థరహితములు. వాటికిక్కడ ప్రమేయం లేదు.

వక్త, దేనినైనా అంటే ఏదైనా తనకు కలిగిన భావాన్ని వ్యక్తీకరించడానికి సన్నద్ధమై దానిని క్రమమైన ధ్వనులలో వెలువరించినదే భాష. ఈ వివరణ దాని నుద్దేశించి నది. అలా వెలువరింపబడినది, శ్రోత శ్రవణేంద్రియానికి అంది, (వక్త ఉద్దిష్ట భావము) శ్రోతకు అవగతమవుతోంది. ఈ వెలువడిన స్థితి అంటే శ్రోతకు అందిన స్థితి వైఖరి. అంటే వక్త వెలువరించిన వాక్కు వైఖరి. దీనికి పూర్వము, అనగా వైఖరీ దశకు ముందు, అనగా నాలుక, పెదవులు దవుడలు మొదలైనవి కదిల్చి తన వాక్కును వెలువరించడానికి పూర్వము, వక్త యందు అంటే అతని మనసు నందు, తాను వెలువరింప దగిన శబ్దము ఉండాలి కదా! లేకున్న, పై అవయవములను తాను ఉచ్చరింప దలిచిన దానికి అనుగుణముగ సమాయత్త పరుపలేడు గదా! కనుక అతని యందు వైఖరికి పూర్వము శబ్దము ఆకృతి నందినదన్నమాట.

అది మధ్యమ రూపంలో శబ్దము. ఉద్దిష్ట భావనతో స్పష్టముగా ఉంటుంది. ఉండి తీరుతుంది. కారణమేమంటే, ఉత్తరక్షణం అది వైఖరీ రూపాన్ని పొందుతోంది. వైఖరిలో ఉద్దిష్ట భావన చోటు చేసుకోకపోతే, వక్త శ్రోతల మధ్య అవగాహనాక్షమత్వం ఏర్పడదు. ఇలాంటి స్థితి లోనే వక్తను పిచ్చివాడి క్రింద జమ కడతాము. ఒకటడిగితే మరోటి చెప్పడం అనే దానికి కూడ స్థితి ఇలాంటప్పుడే కలుగుతుంది. కనుక మధ్యమా రూపంలో భావన కనుగుణమైన శబ్దం రూపు దిద్దుకుంటుంది. దాని కవసరమైన ఆంగిక చలనము సిద్ధమవుతూ ఉంటుంది.

ఇక పశ్యంతీ అంటే ఏమిటో చూద్దాము. పశ్యంతీ అనే పదానికి అర్థం చూచుట అని. దేనిని చూడడం? పదాన్ని అని సమాధానం. దీనిని కొంత వివరంగా చూద్దాము. బయటకు ఉచ్చరింపకపోయినా, మనిషిలో భాష వుందా లేదా! ఉంది కదా! మొదలు భాష లేకుండా మనిషి ఉన్నాడా! మూగవానిలో కూడ భాష వుంది. లేకుంటే తన భావాన్ని సంజ్ఞల రూపంలో ఎలా వెలువరిస్తున్నాడు! (భాషింపబడేది భాష అనే అర్థంలో కాక, భావస్థితి అనే అర్థంలో భాష అనే శబ్దం ఇచ్చట ఉపయోగించడం జరిగిందని గమనించాలి. మూగవానిలో ఆ స్థితి ఎలాంటిదో మనకు అవ్యక్తము గదా! దాని నుద్దేశించి, భాష అనే పదం ఉపయోగించడం జరిగింది).

భాష లేక మనిషి లేడు. అది సదా వుంటుంది. ఎవరి తోనూ మాట్లాడకున్నా, మనం చేసే ఆలోచన అంతా భాష లోనే గదా! కనుక మాట్లాడకున్నా అంటే ఉచ్చారణ లేకున్నా భాష వుంది. కారణం భావం వుంది. ఆ భావం భాషా రూపాన్ని ఎల్లప్పుడు పొందుతుంటుంది. మనం అర్థం అని చెప్పుకుంటున్నది భావమేనని ముందు చెప్పుకున్నాము. ఇవి రెండూ కలిసే ఉంటాయి. ఈ భావాన్నే కాళిదాసు 'వాగర్థావివసంపృక్తౌ' అని చెప్పింది. దానికి ఉపమానంగా పార్వతీపరమేశ్వరులనే ఎందుకు చెప్పినట్లు. వారికి ఎడబాటు లేదు. ఏక శరీరులు. సగం సగం కలిపి పూర్ణం. వాక్కు, అర్థం అలాంటివన్నమాట. వాక్కు వెలువడినంతనే ఆ క్షణ మాత్రాన అర్థం అవుతుంది. కాబట్టి, ఉచ్చారణలేకున్నా, అంటే వైఖరి లేకున్నా, మధ్యమ రూపాని కంటె ముందు (మధ్యమరూపు దిద్దుకుంటున్న క్షణానికే, శబ్దం, భావం కలిసిపోయాయి) మరో రూపం వాక్కునకు ఉండి ఉండాలి. అది పశ్యంతి.

దీనిని ఒక ఉదాహరణతో గమనిద్దాము. మనం ఒక జంతువును చూశాము. అది కోతి. దానిని కోతి అని గుర్తించడం ఎలా జరిగింది. కోతి అనే పదం మనకు తెలిసి ఉండడం చేతనే కదా! అయితే ఆ జంతువును చూశాము. దాని పేరైన కోతి అనే పదం అంతకు పూర్వం మనకు పరిచయం కాలేదు. ఈ స్థితిలో ఆ జంతువును ఎలా భావిస్తాము? ఎలా అవగాహన చేసుకుంటాము? అంటే

వస్తువు అనుభవము లోనికి వచ్చింది. కాని అది ఏదో తెలియము, తెలుపలేము. కాని ఆ పేరు తెలిసిన వెంటనే అంటే కోతి అనే శబ్దము తెలిసిన వెంటనే, ఆ జంతువుకు దాని నుద్దేశిస్తున్న శబ్దానికి తాదాత్మ్యస్థితి ఏర్పడింది. అంటే ఆ శబ్దంతో ఆ జంతువును – గుర్తించే స్థితి ఏర్పడింది. అంటే ఏమన్నమాట! కోతి అనే శబ్దం. కోతియైన ఆ జంతువుకు (ఇక్కడ ఆ జంతుభావన అర్థంలోనికి సమసిస్తోంది) సంజ్ఞ అయింది. అది మొదలు దానిని ఆ సంజ్ఞ చేతనే అవగాహన చేసుకుంటాము. ఆ సంజ్ఞ వాక్కు అదే పశ్యంతి. పశ్యంతికి, వైఖరికి మధ్య గల అవస్థ మధ్యమారూపము. అయితే ఒక సందేహం. మధ్యమకు, పశ్యంతికి గల భేదమేమిటి అనేది ఆ సందేహం. రెంటియందును వాక్కు అర్థములు ఉన్నవి గదా! ఉన్నవి. అయితే మధ్యమ యందున్నది వాక్కు, భావములకు వేర్పాటు. పశ్యంతియందు ఆ రెండింటి తాదాత్మ్యము. ఈ ఉదాహరణాన్ని గ్రహిద్దాము.

ఇది వాస్తవంగా జరిగిన సంఘటన. మా మనుమడు ఎల్.కె.జి. లో చేరాడు. ఇంగ్లీషు అక్షరాలు నేర్పుతున్నారు. తెలుగు ఇంకా నేర్పడం లేదు. దానితో పాటు బొమ్మలు గీయడం నేర్పుతున్నారు. వాడు ఒక రోజు ఒక బొమ్మ వేశాడు. అది ఏమిటన్నాను (కొంతకు కొంత తెలుస్తూనే వుంది). రేడియో అన్నాడు. ఆ మాట వ్రాయమన్నాను. తనకు రాదన్నాడు. సరే 'బస్' వ్రాయగలవా అన్నాను. అవునని 'బస్సు' బొమ్మ వేసి చూపాడు.

నా ఉద్దేశం 'బస్' అనే పదం వ్రాయమని! కాని ఆ పదం వ్రాయడం తనకు తెలియదన్నాడు. మరి బొమ్మలు ఎలా వేయగలిగావంటే, బస్సు, రేడియోలు చూస్తున్నాను గదా! అని అతని సమాధానం. అంటే ఆ పదాలు వ్రాయడం తెలియక పోయినా, అతనికి ఆ పదాలు తెలుసు. ఆ పదాలు దేనిని ఉద్దేశిస్తున్నాయో ఆ వస్తువులు తెలుసు. ఇక్కడ నేను వక్తను. అతడు శ్రోత. నాకు బస్ అనే పదానికి, అది ఉద్దేశించే లిఖిత రూపమైన పదం. కాని అతడికి తెలిసింది బస్ అనే వాగ్రూప పదం. దానికి ఆకరమైన వస్తువు. అంతే తప్ప లిఖిత రూపం తెలియదు. అతడి ఉద్దేశంలో బస్ అంటే ఏమిటో మాత్రమే తెలుసు. పదంగా తెలియదు. అంటే అతని భావనలో పదం వస్తువు రెండూ ఒకటే. అంటే పదాన్ని వస్తువుగానే గ్రహించాడు. దీనినే 'రూఢి' అంటున్నాము. కాబట్టి మధ్యమా రూపంలో వక్త భావనలో పదానికి, పదం ఉద్దేశిస్తున్న వస్తువుకు స్పష్టమైన భేదం ఉంటుంది. అదే పశ్యంతిలో – ఆ భేదం లేక కలిసి పోయి వుంటాయి. నేను ఉచ్చరించిన బస్ అనేపదం వైఖరిద్వారా నా మనుమనికి అందింది. కాని అతడు ఆ పదం ముందు విని వుండడం, ఆ పదం ఉద్దేశించే వస్తువు తెలిసి వుండడం కారణంగా, పదం, వస్తువు ఒకటేనన్న భావంతో బొమ్మ గీయడం జరిగింది. బస్ అనే పదం వ్రాసి చూపమంటే అతడికి అర్థం కాలేదు. కారణం ఆ పదానికి లిపి రూపం ఉంటుందని తెలియకపోవడం. కనుక పశ్యంతిలో పదం, వస్తువు, కలిసి ఉంటాయి. మధ్యమలో ఆ రెండూ వేరు వేరని తెలుస్తుంది.

ఇక నాలుగవ అవస్థ పరా అవస్థ. ప్రాజ్ఞులు శబ్దమును బ్రహ్మముగా భావించారు. శబ్దబ్రహ్మ మనుటయు కలదు. అయితే బ్రహ్మమేది తెలియదు. తెలిసినది జ్ఞానము. తెలియనిది బ్రహ్మము. అనగా, లౌకిక హేతువునకు అంది రానిది బ్రహ్మము. తనకు, అనగా మానవుని బుద్ధి ప్రసరణమునకు ఆవల గలది బ్రహ్మము. 'ఇది' ఇది అని చెప్పుటకు అంది రానిది బ్రహ్మముగా భావింపనగును. దానిని బుద్ధితో గ్రహింప నగును గాని, వ్యక్తపరచుటకు సాధ్యము కాదు. శబ్దమును నిర్వచించుట కూడా సాధ్యము కాదు. శబ్దము పుట్టుటకు సహకరించుచున్న, వాగుత్పత్త్యవయవములు, వాని పాత్రను గుర్తింపగలము. మరికొంత దూరము సాగిన ముందు చెప్పుకున్న మూడు అవస్థలను – పశ్యంతి, మధ్యమా, వైఖరులను ప్రయత్నము పై గ్రహింపగలము. పశ్యంతికి పూర్వమేమున్నది? తెలియదు. కాని దానిని 'పరా' శబ్దముతో సంభావించడం జరిగింది. దానిని నిరూపించుటకు ఏవో ఉపపత్తులు చెప్పబడ్డాయి. కాని అనుభవం లోనికి కొని వచ్చుట సాధ్యమగునది కాదు. అయినా పూర్వులు చెప్పిన దానిని మననం చేసుకోవడం అవసరం. భర్తృహరి తన *వాక్యపదీయ* ప్రారంభం ఇలా గావించాడు.

**అనాది నిధనం బ్రహ్మశబ్ద తత్త్వం యదక్షరమ్**
**వివర్తతే ఽ ర్థభావేన ప్రక్రియా జగతోయతః**

*1. బ్రహ్మకాండము, వాక్యపదీయము.*

అనాది నుండి కలది (ఎట్టి వ్యవచ్ఛిన్నము లేనిది, ఉత్పత్తి, వినాశము లేనట్టిది) అక్షరమైనది (నిత్యమగునట్టిది) యగు శబ్ద స్వరూపమగు బ్రహ్మము, అర్థముల రూపమున భాసించుచున్నదో, జగత్తు యొక్క సృష్టి దేనితో జరుగుచున్నదో, అట్టి బ్రహ్మమును పొందుటకు గల ఉపాయము వేదము

మాత్రమే. భర్తృహరి దీనిని ఆమ్రేడించుచు మరి నాలుగైదు సూత్రములను రచించి యున్నాడు. అట్టి బ్రహ్మము ఒక్కటేయని, భేదరహితమని, అయితే భిన్నశక్తులకు ఆశ్రయమగుట వలన భేద సహితముగా కన్పించునని ఉపనిషత్తులు ప్రమాణీకరించి యున్నవని. అనగా అద్వితీయము, ఏకము నైన బ్రహ్మమును, అనాది నుండి మాయ (అవిద్య) ఆవరించి యుండుట వలన, అందు నానాత్వము గోచరించుచున్నదని ఉపనిషత్తులు వ్యక్తపరచినవి.

**ఏకమేవ యాదామ్నాతం భిన్నం శక్తి వ్యపాశ్రయాత్**
**అపృథక్త్వే ఽపి శక్తిభ్యః పృథక్త్వేవ వర్తతే॥**

*2. బ్రహ్మకాండము, వాక్యపదీయము.*

అంతే గాక, అట్లు భేద మారోపింప బడిన బ్రహ్మము నందు కాలమనెడి శక్తి గలదని, దాని వలన జన్మము (జన్మ, స్థితి, పరిణామ, ప్రవర్ధ, క్షీణ, నాశనములు) ఆరు విధములుగా వివర్తమగుచున్నది. (ఇచ్చట కాలశక్తి పరమాత్మ యందు అనగా బ్రహ్మమునందు ఆరోపింపబడినది.) అనగా మాయ వలన బ్రహ్మము నానా విధములుగా భాసించుచున్నది.

**అధ్యా హితకలాం యస్య కాలశక్తి ముపాశ్రితాః**
**జన్మాదయో వికారాః షడ్ భావ భేదస్య యో నయః**

*3. బ్రహ్మకాండము, వాక్యపదీయము.*

బ్రహ్మము అద్వితీయమే అయినా, సర్వమునకు బీజమైన ఆ బ్రహ్మము, భోక్తృ భోక్తవ్య రూపమున, భోగ రూపమున అనగా జీవము, జీవనానుభవము అను రూపములలో దానికి స్థితి కలుగుచున్నది.

**ఏకస్య సర్వబీజస్య యస్య చేయ మనేక ధా**
**భోక్తృ భోక్తవ్య రూపేణ భోగ రూపేణ చ స్థితిః**

*4. బ్రహ్మకాండము, వాక్యపదీయము.*

అనగా లోకము నందలి ప్రతి వస్తువు ఉత్పత్తికి మూలమైనది ఒకటి ఉంటుంది. కాగితానికి వెదురు మూలం. బట్టకు మూలం ప్రత్తి. వెదురు వలన బట్ట, ప్రత్తి వలన కాగితం లభింపదు. అంటే ఇక్కడ ఒక నియతి వుంది. అయితే స్వరానికి మూలం బ్రహ్మమవుతుంది. కనుక జగత్తు బ్రహ్మము కంటె వేరుగా లేదు. ఇది బ్రహ్మ స్వరూపము. దానిని సాక్షాత్కరింప చేసుకొనుట ఎట్లు?

**ప్రాప్త్యుపాయో ఽ ను కారశ్చ తస్య వేదో మహర్షిభిః**
**ఏకో ఽ ప్యనేక వర్త్మేవ సమామ్నాతః పృథక్పృథక్**

*5. బ్రహ్మకాండము, వాక్యపదీయము.*

పైన చెప్పబడిన బ్రహ్మమును (శబ్ద బ్రహ్మము) పొందుటకు గల ఉపాయమొక్కటే. అది వేదము. కారణమేమంటే బ్రహ్మము యొక్క ప్రతిబింబము వేదము గనుక, ఆ వేదము నిజానికి ఒక్కటే. అయినా మహర్షులచే అనేక విధములుగా (*ఋక్, యజుస్, సామ అథర్వణములను*, రీతి, సంహిత, పద, క్రమ, శిఖ, మాల, జట, ఘన అను పద్ధతులలో) అభ్యసింపబడుచున్నది. కనుక బ్రహ్మ ప్రాప్తికి ఉపాయము వేదాభ్యసనము.

*ముగింపు వచ్చే సంచికలో...*

## వీనుల విందు

ఏబది రెండు సంవత్సరములనాటి మాట–నేనపుడు గుడివాడలో ఎనిమిదవ తరగతి చదువుకొనుచుంటిని. ఆ దినములలో నానా *రాజసందర్శన* మెట్లో నా చేత జిక్కినది. అదియె పనిగా పెట్టుకొని నేనా పుస్తకము చదివితిని. అందు మూడు వందల పద్యములు నోటికి వచ్చి వేసినవి. అప్పటికింకను జమీందారులనినను, వారి యాస్థానములనినను గౌరవము తగ్గలేదు. అటు గద్వాల నుండి ఇటు చెన్నపట్టణము వరకును గల రాజాస్థానములన్నియు మెట్టి తిరుపతి వేంకటేశ్వరులు ఆ రాజులను గూర్చి చెప్పిన పద్యములన్నియు చదువుచుండిన ఉత్సాహము జనించెడిది. వీరెటులుందురో చూడవలెనను కోరిక పట్టజాలక పనిగట్టుకొని బందరు వెళ్ళినాను. వీరిరువురిలో వేంకటేశ్వర్లు అనువారు అచ్చట హైస్కూలునందు ఉండిరని విని, అక్కడ విచారింపగ, బచ్చుపేటయందు భైరవ ముద్రణాలయమువద్ద ఉందురనినారు. ఆ మధ్యాహ్నమువేళ వెదకికొనుచు వెళ్ళినాను. నాకు ప్రథమ దర్శనమిట్లు లభించినది. భయము భయముగ నమస్కరించితిని. "ఎవరు నాయనా నీవు? ఎందుకొచ్చినా"వనినారు. ఎందుకు వచ్చితినని చెప్పుదును. ఏమియుతోచక ఏవియో పుస్తకములు కావలసి వచ్చితినంటిని. రెండుమూడు పుస్తకములు తీసికొని డబ్బిచ్చి వచ్చితిని. ఇంత బులపాటపడి వచ్చిన పని అయిపోయింది. మరుసటి సంవత్సరము బందరు హైస్కూలులో ప్రవేశించితిని. ఆ సంవత్సరమే హైస్కూలు నందు శతావధాన సభ. కాకినాడ నుంచి తిరుపతిశాస్త్రి గారు కూడ వచ్చిరి. అద్భుతమైన ధారణాభారంతో కూడుకొనిన అవధానము నిర్వహింపుచునే వేంకటశాస్త్రి గారు ఛలోక్తులు విసరి, ప్రాస్తావికపు పద్యములు చదివి, సభను రంజింపచేయుచు మధ్య మధ్య ఆవలికివెళ్ళి వచ్చి, యీ లోపల తిరుపతి శాస్త్రిగారు చెప్పిన పద్యపాదమేమియో తెలిసికొనుచుండుట చూడ వారేదియో అవలీలగా గోలీలాట ఆడుచుండిరా యనిపించెను. ఒక్క పొడుము పట్టు పట్టి, వారు పద్యమందుకొనుసరికి సభయంతయు నిస్తరంగ సాగరమైపోయెడిది.

తిరుపతి వేంకటకవులలో ఒకరు చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రి (1879–1950).

**– కాటూరి వేంకటేశ్వరరావు**
(మా గురుదేవులు నుండి)




# లే మిజరబుల్స్

- గొల్లపూడి మారుతీరావు

ముందు రోజంతా బిబిసిలో రాత్రి మంచు పడుతుందని చెపుతూనే ఉన్నారు. నేనేమో మన ఛానల్స్ వాతావరణ సూచనలాగ "చెదురు మదురు జల్లుల" కథ అనే సరిపెట్టుకున్నాను. తీరా ఉదయమే కళ్ళిప్పి బయటికి చూస్తూనే కొయ్యబారిపోయాను. ధారాపాతంగా మంచు వర్షిస్తోంది. కనుచూపుమేర ఇల్లూ-వాకిళ్ళూ, చెట్లూ, కార్లూ అన్నీ మంచులో మునిగి ఉన్నాయి. సన్నటి దూది పొరల్లాగ మంచు చెట్ల ఆకులన్నీ మంచు ముద్దలతో బరువెక్కిపోయాయి. ఇంటి ముందు కారు ఓ చిన్న మంచు కొండలాగ ఉంది. నా జీవితంలో మంచు కురవడాన్ని చూడటం అదే మొదటిసారి. బయట 5 డిగ్రీల చలి. అంతటా అయిదారు అంగుళాల మంచు పేరుకుని ఉంది. నిన్నటి ఆకుపచ్చని పచ్చిక అంతా మెత్తటి ముఖమల్ దూది పరుపు పరిచినట్టుంది. పక్షులు ఎగరడం లేదు. రెక్కల మీదకి జారే మంచుని తదేకంగా దులుపుకుంటున్నాయి. ప్రకృతి మంచు బరువుకి నిండు చూలాలిలాగ ఒగరుస్తున్నట్లుంది. మధ్యాహ్నం వరకు అలాగే మంచు కురుస్తోంది. నేనున్నది డాక్టర్ పాల్ గారిల్లు. ఆయన పారతో కారు మీద మంచుని దులుపుకుని - రోడ్డుమీద మంచుని పక్కకి తోసుకుని క్లినిక్కి వెళ్ళిపోయారు. అడపా దడపా తప్పనిసరయిన కార్లు నడుస్తున్నాయి. తప్పని సరయితేనే తప్ప ఇళ్ళు కదలవద్దని టీవీల్లో చెపుతున్నారు.

మంచు వర్షాన్ని చూస్తుంటే రెండు చిన్న గేయాలు మనస్సులో మెదిలాయి.

**ఆకాశం మంచు కురుస్తున్నపుడు**
**ప్రతి చెట్టూ మల్లెపువ్వల్లే పూస్తుంది**
**మంచు కుంచెతో మట్టి బెడ్డ అలంకరించుకుని**
**పత్తి పింజెలాగ ఒళ్ళు విరుచుకుని పలకరిస్తుంది.**
**నిన్న ఇంటి ముందు అసహ్యంగా నిలిచిన ముళ్ళ దొంక**

**రాత్రి మంచు అంగీ తొడుక్కుని వెన్నెల నక్షత్రంలాగా మెరుస్తోంది**
**పనికిరాని వస్తువుని కూడా పవిత్రంగా**
**అలంకరించే సమదర్శి ప్రకృతి -**
**ప్రకృతి చూపుని సంస్కరించి**
**అభిప్రాయానికి కొత్త అభిరుచిని సంతరిస్తుంది -**
**ఈ ముళ్ళదొంక ఫోటో తీశాను.**

తీరా ప్రతిరోజూ ఓ నాటకం చూడాలన్న నా కోరిక ఈ రోజు తీరదేమోనని బెంగట్టుకుంది. మంచు వర్షం తగ్గాక రోడ్డు పక్క పేవ్‌మెంట్ల మీద మంచు మీద గడ్డ కట్టి దాని మీద జారిపడటం మామూలట. అలాగే వాహనాలూ జారి ఆక్సిడెంట్లు అవుతాయట.

సాయంకాలం 5 గంటలకి లేచేసరికి మంచు మాయమైంది. అలసిపోయినట్లు ప్రకృతి అంతా బరువుగా, మౌనంగా ఉంది. ఆరోజు చూడాలనుకున్న నాటకం *లే మిజరబుల్స్* సంగీత నాటకం. పికడిల్లీ పక్క రోడ్డు స్ట్రాట్‌బరీ అవెన్యూలో 50 గజాల దూరం క్వీన్స్ థియేటర్. "వెళ్ళనా" అని డాక్టరుగారికి ఫోన్ చేశాను. "ఏం ఫరవాలేదు వెళ్ళిరండి" అన్నారాయన. అంతే, వెంటనే టాక్సీలో దూకేశాను.

రోజూ ఉదయం కొనుక్కునే టిక్కెట్టు కొనుక్కోలేదు. అయినా ఈ 0 డిగ్రీల చలిలో నాటకం చూడాలనే నాలాంటి వీరాభిమాని ఎవరుంటారనుకుంటూ పిన్నెర్ స్టేషన్ నుంచి మూడు రైళ్ళు మారి పికడిల్లీలో దిగాను. క్వీన్స్ థియేటర్‌లో బాక్సాఫీసు తెరిచి ఉంది. 20 పౌన్ల టిక్కెట్టు దొరికింది. "నువ్వు సీనియర్ సిటిజనా?" అని అడిగి మరీ ఇచ్చింది బాక్సాఫీసు అమ్మాయి. కారణం? నా వెనక కొనుక్కున్న ఓ జపాన్ యువకుడు - పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆఫీసరు. నా పక్కనే కూర్చున్నాడు. అతని టిక్కెట్టు ఖరీదు 50 పౌన్లు. రోజులో పనిపూర్తయ్యాక - ఏ నాటకం బాగుంటుందని హోటల్ సిబ్బందిని అడిగాడట. వారు *లే మిజరబుల్స్* సూచించారని వచ్చాడు.

సాహిత్య, నాటక, సినిమా రంగంల్లో *లే మిజరబుల్స్*కి

దక్కినంత గౌరవము, సాధించినన్ని విజయాలు ప్రపంచంలో మరే రచనా సాధించలేదు. ఈ సంగీత నాటకం కేవలం 21 సంవత్సరాలుగా లండన్‌లో ప్రదర్శింపబడుతూ రికార్డుని సృష్టించింది. గిన్నిస్ బుక్‌లోకి ఎక్కింది. ఈ రచనకి సంబంధించిన ఏ విషయమయినా చరిత్రే. అపురూపమయిన, అనితరసాధ్యమమైన చరిత్ర.

అసలు ఈ *లే మిజరబుల్స్* సృష్టికర్త ఎవరు? అతని కథ ఏమిటి? నిజానికి అది మరొక చరిత్ర. రచయిత విక్టర్ హ్యూగో పేరు చెప్పగానే *హంచ్ బాక్ ఆఫ్ నోటర్ డామ్* నవల గుర్తుకొస్తుంది నాకు. నేను ఫ్రాన్సులో నోటర్ డామ్ కెధీడ్రల్‌కి వెళ్ళాను. అంతకు మించిన దీ నవల – *లే మిజరబుల్స్* ఒదొక ఇతిహాసం.

హ్యూగో నెపోలియన్ యుద్ధకాలంలో పుట్టాడు. తండ్రి సైన్యంలో జనరల్. ఆయన పదహారో ఏట తల్లిదండ్రులు విడిపోయారు. 18వ ఏట 28వ లూయీ మేనల్లుడి హత్యమీద కొన్ని పద్యాలు రాశాడు. రాజుగారు సంతోషించి సాలీనా 3 వేల ఫ్రాంకుల ఆదాయాన్ని మంజూరు చేశారు. ఇటీవల శివాజీ గణేశన్‌కీ, మంగళంపల్లి బాలమురళీ కృష్ణగారికి ఫ్రెంచి ప్రభుత్వం ఇచ్చిన షావిలియర్ గౌరవాన్ని అలనాటి ఫ్రెంచి ప్రభుత్వం (10వ చార్లెస్ రాజు) ఆయనకి 23వ ఏటనే ఇచ్చింది. 1828–30 మధ్యకాలంలో హ్యూగోని నాటక రంగం ఆకర్షించింది. హెర్నానీ అనే నాటకం రాశాడు. అయితే ఆ రోజుల్లోనే ఆదర్శ వాదులు స్వాప్నికులు (రోమాంటిక్) మధ్య తగాదాలు జరుగుతుండగానే వంద ప్రదర్శనలు జరిగాయి. ఈ సమయంలో జూలియట్ డ్రోన అనే నటితో స్నేహం కలిసింది. అయితే వారిద్దరూ ఒకచోటే




కలిసి జీవించలేదు. ఆయనింటికి నడక దూరంలో ఉండేదావిడ. చచ్చిపోయే వరకూ రోజుకో ఉత్తరం వ్రాసేది. ఈ స్నేహం 50 సంవత్సరాలు సాగింది!

ఎడతెగక రచనలు చేసే అలవాటు హ్యూగోకి. *నోటర్ డామ్* రచన ఆ రోజులనాటిదే! 30వ ఏటకే ఫ్రాన్స్‌లో అతి ముఖ్యమయిన రచయితగా పేరొచ్చింది. లూయీ ఫిలిప్పీ ఇతనికి 'పీర్'గా గుర్తింపు నిచ్చారు. 1845లో *లే మిజరబుల్స్* రచనని ప్రారంభించాడు హ్యూగో.

లూయీ తదనంతరం జాతీయ అసెంబ్లీకి ఎన్నికయి – అప్పటి లూయీ నెపోలియన్‌ని వ్యతిరేకించాడు. 1851 లో నెపోలియన్ (II) పదవిలోకి రాగానే హ్యూగో దేశం వదిలి బ్రస్సెల్స్ పారిపోవల్సి వచ్చింది. తరువాత గురెన్సీ చేరాడు. 1861 నాటికి *లే మిజరబుల్స్* రచన పూర్తయింది. మొదటి ప్రచురణ కాగానే హ్యూగో ప్రచురణకర్తకి ఓ టెలిగ్రాం పంపాడట. విషయం "?" అని. ప్రచురణ సంస్థ నుంచీ సమాధానం "!" అని. మొదటి ఆరేళ్ళలో 5 లక్షల ఫ్రాంకులు ప్రచురణకర్తకు సంపాదించి పెట్టిందీ రచన.

1870లో ఫ్రాంక్ పర్షియన్ యుద్ధంలో నెపోలియన్ (III) ఓడి దేశాన్ని వీడిపోయినపుడు హ్యూగో గర్వంగా పారిస్ నగర ప్రవేశం చేశాడు. మరికొన్ని రాజకీయ పరిణామాల అనంతరం – 1878లో స్వల్పంగా పక్షవాతం వచ్చేవరకూ పుంఖానుపుంఖలుగా రచనలు చేస్తూనే ఉన్నాడు. మూడేళ్ళ తర్వాత – ఆయన 80వ జన్మదినాన అభిమానులు ఆయన ఇంటి ముందు ఆయన గౌరవార్థం పెద్ద ఊరేగింపు జరిపారు. అప్పటికి హ్యూగో ప్రపంచ ప్రఖ్యాత రచయిత. 1885లో తన 83వ ఏట హ్యూగో కన్నుమూశాడు. అతి సామాన్యమయిన అంత్యక్రియల్ని హ్యూగో కోరుకున్నాడు. అయితే మహానుభావులు కిచ్చే వీడ్కోలు ఫ్రెంచి ప్రజలు ఆయనకిచ్చారు. ఆర్క్ డి ట్రొంఫీ దగ్గర ఆయన మృతదేహాన్ని ఉంచారు. ఊరేగింపు అక్కడి నుంచి కదలడానికి ఆరుగంటలు పట్టిందట. అదీ ఆనాటి ప్రజాసందోహం తమ అభిమాన రచయితకి ఇచ్చిన వీడ్కోలు! విక్టర్ హ్యూగో ఫ్రెంచి దేశపు ముద్దుబిడ్డ. జాతి చైతన్యానికి చిహ్నం.

**నవల చరిత్ర**

పతితులు, భ్రష్టులు, బాధా సర్పదష్టుల కథ *లే మిజరబుల్స్* వారి జీవన సరళి, దయనీయ స్థితిగతులు – అంతకు మించి ఆ దశకీ వారి గుండెలు నిండిన ఆర్ద్రత, ప్రేమ, సాహసం, త్యాగం, వీరత్వం– ఒకటేమిటి? ఆ వర్గం యొక్క సమగ్రమయిన ఇతిహాసం *లే మిజరబుల్స్* ఇంత సమగ్రంగా, ఇంత అద్భుతంగా ఆ వర్గపు జీవితాన్ని ప్రతిఫలించిన రచన ప్రపంచ సాహిత్యం లోనే లేదంటే అతిశయోక్తి కాదు. 1865 లో ఈ పుస్తకం అచ్చుయినప్పుడు

– కేవలం 30 లక్షల కాపీలు అమ్ముడుపోయాయట! హారీ పోటర్‌లకూ, షిడ్నీషెల్టన్ లకూ అలవాటు పడిన ఈ తరానికి ఈ అంకె విచిత్రంగాకనిపించక పోవచ్చు. కానీ 142 సంవత్సరాల కింద ఇది ఒక దేశంలో ఒక నవల ప్రాచుర్యం అని గుర్తుంచుకుంటే దిగ్భ్రమ చెందక తప్పదు.

ఇక సినిమాల సంగతి. ఒక్క తెలుగుదేశంలోనే ఈ కథని సినిమాగా రెండు సార్లు యథాతథంగా నిర్మించారు. కాపీలూ, అనుసరణలూ సరేసరి. మొదటి చిత్రం *బీదలపాట్లు* లో హీరో నాగయ్యగారు. రెండో సినిమా తన బాణీని పక్కకి పెట్టి ఒకే ఒక్కసారి విఠలాచార్య ఈ కథని తెరకెక్కించారు. ఒకే ఒక్కసారి విఠలాచార్య సినిమాలో అక్కినేని హీరోగా నటించారు. అదీ ఈ కథ మీద కళాకారుల వ్యామోహం. దాదాపు 40 సంవత్సరాల క్రితం మేజర్ సుందరరాజన్ నటించిన తమిళ నాటకాన్ని చూశాను నేను. నాటకంగా రూపుదిద్దుకోవడం అప్పటికది – ఆ భాషలో రెండవసారో, మూడోసారో, ఇక ప్రపంచంలో ఏ దేశమూ ఈ కథని చిత్రంగా తీయకుండా విడిచిపెట్టలేదు. దాదాపు 51 చిత్రాలు ప్రపంచమంతటా ఈ ఇతివృత్తంతో నిర్మితమయ్యాయట!

విచిత్రమేమంటే – చాలామంది నిర్మాతలూ, దర్శకులూ – ప్రయత్నించి కూడా ఈ నవల పేరు మార్చలేకపోయారు. హ్యూగో తన నవలకి మొదట *మిజరీ* (దైన్యత) అని పేరు పెట్టారు. భయంకరమయిన పేదరికం, అనాథల దైన్యతకు సంబంధించిన కథ ఇది. ఈ నవలలో పాత్రలు కేవలం పేదలు, పీడితులే కాదు. సమాజం చేత వెలివేయబడిన వారు, తిరస్కృతులు, తిరుగుబాటుదారులు – అంతా ఉన్నారు. తీరా నవల పూర్తయేసరికి రచయితే *లే మిజరబుల్స్* (పీడితులు) అని పేరు పెట్టారు. 'లే' అనేది ఫ్రెంచి భాషలో (నామవాచకం) ప్రపంచంలోకల్లా అతి పాపులర్ రచనలకి – ఏ దేశంలోనయినా, ఏ భాషలోనయినా – అదే శీర్షిక ఈ నాడు నిలిచిపోయింది. 1909లో అమెరికాలో ఒక మూకీగా తయారయింది. 1982 లో టీవీ సీరియల్ అయింది. 1913లో ఫ్రాన్స్‌లో 12 రీళ్ళ సినిమా అయింది. ప్రతీ ప్రయోక్త కథ *లే మిజరబుల్స్* ని తెరకెక్కించడం. 1925లో హెన్రీ ఫెస్కో అనే ఫ్రెంచి నిర్మాత 32 రీళ్ళ సినిమాని రెండు భాగాలుగా తీశాడు.

1926లో ఇద్దరు మహానటులు – ఫ్రెడ్రిక్ మార్చ్, చార్లెస్ లాటన్‌లతో ట్వంటీయెత్ సెంచరీ ఫాక్స్ సంస్థ చిత్రాన్ని నిర్మించింది. అయితే 1946 లో ఇటలీలో మరొక అనూహ్య మయిన చిత్ర నిర్మాణం జరిగింది. ఆ చిత్రంలో మహానటులు లేరు కాని– వారు లేని లోటు కనిపించని స్థాయిలో చిత్రాన్ని నిర్మించారు.



నాలుగు నెలల పాటు 400 గుర్రాలతో, 4 వేలమంది మనుషులతో, 500 కాస్ట్యూములతో, 200 విగ్గు లతో అతి విస్తృతంగా ఈ షూటింగు సాగింది.

కేవలం చిత్ర నిర్మాణానికి గాను ఈ చిత్రం రికార్డు పుస్తకాల్లో చోటు చేసుకుంది. బ్రిటన్ టీవీలో రిచర్డ్ జోర్డన్, ఆంథోని పెర్కిన్స్ నటించారు. అయితే చిన్న చిన్న పాత్రలకి పెద్ద పెద్ద నటుల్ని – జాన్ గిల్‌గుడ్, ఫ్లోరా రోబ్సన్, సిరిల్ కుశాఖ్ లాంటి వారిని వాడారు. వారు తెర మీద కనిపించినపుడు మరే పాత్రా ప్రేక్షకులకి గుర్తుకు రాలేదు. అదీ ఆ నటుల – అంతకు మించి ఆ పాత్రల ఔన్నత్యం.

ఇంత ప్రాచుర్యం సంపాదించడానికి ఆ నవలలో ప్రాచుర్యం ఏమిటి పారిస్‌లో ప్రచురితమయినప్పుడు 24 గంటల్లో 7 వేల కాపీలు అమ్ముడు పోయాయట. ప్రపంచ చరిత్రలోనే ఎక్కువ కాపీలు అమ్ముడు పోయిన నవలలో ఇది ఒకటి. పారిస్, బ్రస్సెల్స్, లండన్, మాడ్రిడ్ – ఇలా అన్ని దేశాల ముఖ్యపట్టణాల పేర్లూ చెప్పుకుంటూ పోవాలి. దీని ప్రాచుర్యం చెప్పాలంటే ఒక్క ఉదాహరణ చాలు. ఇప్పటికీ దాదాపు 150 సంవత్సరాల తర్వాత ఒక్క బ్రిటన్‌లో సాలీనా 50 వేల కాపీలు అమ్ముడుపోతాయట!

మామూలు మట్టిని బంగారం చెయ్యగల అపురూప శిల్పి, 50 సంవత్సరాలు నిరాఘాటంగా హిట్ చిత్రాలు నిర్మించిన దర్శకుడు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ – ఆ రోజుల్లోనే *లే మిజరబుల్స్* చదివి "ఇది అద్భుతమయిన సంగీత నాటకం అవుతుంది" అని అన్నాడట ఎంత దూరదృష్టి! ఎంత ఆలోచన!

సరిగ్గా ఆయన ఊహించినట్టే – మరో పాతికేళ్ళ తర్వాత మరో పాతికేళ్ళు నడిచే అద్భుతమయిన సంగీత నాటకంగా *లే మిజరబుల్స్* రూపు దిద్దుకుంది.

ఇప్పటికీ ఈ నాటకం 38 దేశాలలో ప్రదర్శింప బడుతోంది. ఇంగ్లండు, అమెరికా, జపాన్, ఇజ్రేల్, హంగేరీ– ఇలా ప్రపంచ పటాన్ని ఇక్కడ ఉటంకించాలి. అచిరకాలంలో – 2008 నాటికి చైనాలో ఈ నాటకాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నాలు జరగుతున్నాయి. ఆ భాషలోకి అనువదించి. షాంగాయి, బైజింగ్‌లలో సంగీత నాటక పరిశ్రమ స్థాపనకి కృషి జరుగుతోంది. ఇప్పుడు సామాజికులకీ, జిజ్ఞాసులకీ ఒక ప్రశ్న మనసుల్లో కదలాలి. ఈ దేశాల జాబితాలో భారతదేశం పేరు లేదేం? మన దేశంలో, మన భాషలో ఈ అద్భుతమయిన నాటకాన్ని చూసే అదృష్టం లేదా? దీనికెవరు సమాధానం చెపుతారు? ఈ ప్రశ్నకి సమాధానం దొరకకే ఆ ప్రయత్నం నిలిచిపోయిందేమో? మనది ప్రజాస్వామిక దేశం. ఎవరికీ ఏదీ పట్టదు. తమ స్వార్థం తప్ప. కళా, దాని పరాకాష్ఠా ఎవడిక్కావాలి?

ఇంత చెప్పాక ఇప్పటికైనా ఈ నవలలో ఇతివృత్తం ఏమిటి? అన్న ఆసక్తి కలుగుతుంది. ఇతివృత్తాన్ని నాటకం నడిచిన పద్ధతిలోనే వివరిస్తాను. ఇది రెండంకాల నాటకం. కానీ ఇందులో ఎన్ని సన్నివేశాలు? ఎన్ని యుద్ధాలు? సొరంగాలలో పాత్రల పరుగులూ, పాలెస్ తోటలలో ప్రేమికుల కలయిక, తుపాకులతో తిరుగుబాటుదారులకీ ప్రభుత్వ సైన్యాలకీ పోరాటం, విలన్ నీటిలో దూకి మరణించే సన్నివేశం– ఊపిరి తిరగని వేగంతో – సంగీత ప్రధానంగా మూడు గంటల సేపు ఉక్కిరి బిక్కిరి చేసే ప్రదర్శన ఇది. ఇక అర్థమయ్యేటట్టు స్థూలంగా చెప్పడం మంచిది.



కోసెట్

**మొదటి అంకం**

ఒక ముఠాలో 19 సంవత్సరాలుండి బయటపడతాడు జీన్ వాల్ జీన్ (పేరు ఉచ్చారణ నిజానికి ఈ పేరు ఉచ్చారణ నిజానికి తప్పు. అయినా అలవాటయిన పొరపాటు మన ఆలోచనల్ని చెదరగొట్టదు కనుక అలాగే భావిద్దాం) సంఘం, చట్టం అతన్ని నేరస్థుడిగా పరిగణిస్తుంది. ఒక బిషప్ అతనికి ఆశ్రయమిచ్చాడు. అయినా పాత అలవాట్లు పోవు. రెండు వెండి ప్లేటు, శిలువా దొంగతనం చేస్తాడు. పోలీసులు అతన్ని పట్టుకుని బిషప్ దగ్గరకి తీసుకొచ్చాడు. "ఆ వస్తువులు నేనే ఇచ్చాను" అంటూ. "ఈ రెండు వెండి కొవ్వొత్తి స్టాండులూ మరచిపోయావేం బాబూ" అని సంచిలో వేస్తాడు బిషప్. అదీ జీన్ వాల్ జీన్‌లో మానసిక పరిణామానికి కారణమయిన మొదటి ఘట్టం. ఎనిమిదేళ్ళు గడిచాయి. చట్టం ఇచ్చిన గడువును దాటి పరారి అయి – ఒక పట్టణంలో (కావాలనే పేర్లు రాయడంలేదు. ఫ్రెంచి పేర్లు మన ఆలోచనల్ని గజిబిజి చేయకుండా ఉండాలని) పెద్ద ఫ్యాక్టరీ అధిపతి, ఆ నగర మేయరు అయ్యాడు.

అక్కడ పని చేస్తున్న ఓ కూలీ – ఫాంటిన్ అక్రమ సంతానాన్ని కన్నది రహస్యంగా. ఇది తెలిసిన మిగతా వర్కర్లు ఆమెని బర్తరఫ్ చెయ్యాలన్నారు. బిడ్డని పోషించుకోడానికి, మందులకి డబ్బులేని ఫాంటిన్ తన మెడలో గొలుసునీ, తన జుత్తునీ, తనని తాను అమ్ముకునే వేశ్య అయింది. ఒక విటుడితో తగాదా పడుతున్నపుడు – పోలీసు అధికారి జావర్ట్ వచ్చి ఆమెని జైలుకి తీసుకుపోతాడు. జీన్ వాల్ జీన్ అడ్డుపడి ఆమెను ఆసుపత్రికి చేర్చాలంటాడు. ఒక బండి కింద పడిన మనిషిని జావర్ట్ కళ్ళముందే రక్షిస్తాడు జీన్ వాల్ జీన్. అతని బలాన్ని కళ్ళారా చూసిన జావర్ట్ ఒకనాటి ఖైదీ జీన్ వాల్ జీన్ (అతని ఖైదీ నంబరు 24601) గుర్తుచేసుకుంటాడు. ఇటీవలే ఆ ఖైదీ దొరికాడంటాడు. తన స్థానంలో ఓ నిరపరాధి అరెస్టుకావడం భరించలేక – తనే ఆ జీన్ వాల్ జీన్‌నని చెపుతాడు.

ఆసుపత్రిలో ఫాంటిన్‌కి తన బిడ్డ కోసెట్ ఆలనా తను చూసుకుంటానని జీన్ వాల్ జీన్ హామీ ఇస్తాడు. ఫాంటిన్ తృప్తిగా కన్నుమూస్తుంది. జావర్ట్ అతన్ని అరెస్టు చెయ్యడానికి వచ్చేసరికి తప్పించుకుంటాడు.

ఇప్పుడు కోసెట్‌ని చూసుకునే బాధ్యతని థెనార్డియర్స్ అనే దంపతులకు అప్పగిస్తాడు. వాళ్ళు డబ్బు మనుషులు. వీధి చివర కల్లుపాకలాంటి దాన్ని నడుపుకునే మనుషులు వారు. పేదరికంగా వచ్చిన అన్ని కుత్సితాలూ ఉన్నవారు. వారికో కూతురు – ఎపొనైన్. తమ కూతురిని బాగా చూసుకుంటూ కోసెట్‌ని నానా అగచాట్లూ పెడుతూంటారు. (*లే మిజరబుల్స్* ప్రతీ ప్రకటనలో ప్రస్ఫుటంగా కనిపించే అందమయిన పేదపిల్ల ఫోటో అప్పటికి కోసెట్‌ది) జీన్ వాల్ జీన్ వాళ్ళకి కావలసినంత డబ్బిచ్చి కోసెట్‌ని తీసుకు పోతాడు. కోసెట్ పట్ల అతని మమకారాన్ని ఎరిగిన థెనార్డియర్స్

దంపతులు అతని దగ్గర డబ్బునొల్లుకుంటారు. మరో తొమ్మిది సంవత్సరాలు గడిచాయి. ప్రజాహితాన్ని కోరే పేదల పెన్నిధి అయిన నాయకుడు జనరల్ లామార్క్ చచ్చిపోయాడు. నగరంలో అలజడి లేచింది. దీన్ని అవకాశం చేసుకుని థెనార్డియర్స్ దంపతులు - జీన్ వాల్ జీన్ దగ్గర డబ్బురాబట్టవచ్చుననే యావతో ఓ రౌడీ మూకతో జీన్ వాల్ జీన్ మీదా, కోసెట్ మీదా దాడి చేశారు. అతన్ని జీన్ వాల్ జీన్ అని గుర్తుపట్టని పోలీసాఫీసర్ జావర్ట్ వాళ్ళిద్దరినీ రౌడీ మూక నుంచి కాపాడాడు.

ఇప్పుడు మరో పిట్టకథ. వయస్సు కొచ్చిన థెనార్డియర్ కూతురు ఎపొనైన్ - ఓ విద్యార్థి మారియస్‌ని ప్రేమించింది. కానీ మారియస్ కోసెట్ ప్రేమలో పడ్డాడు. ఆమెను వెదికే ప్రయత్నంలో తన ప్రేమని బయట పెట్టకుండా ఎపొనైన్ మారియస్‌కి సహకరించింది. పేదల వర్గంలో మరో ఉదాత్తమయిన పాత్ర ఎపొనైన్. జనరల్ లామార్క్ మరణ వార్త దావానలంలాగ వ్యాపించింది. రాజకీయ స్పృహ కలిగిన యువతరం విప్లవాన్ని రెచ్చగొట్టి రోడ్ల మీదకు వచ్చారు.

కోసెట్ మారియస్ కోసం పరితపిస్తోంది. ఎపొనైన్ తన తండ్రి ముఠా జీన్ వాల్ జీన్ మీద దండెత్తకుండా అడ్డు పడింది. జావర్ట్ తనని అరెస్టు చెయ్యాలని చూస్తున్నాడని అనుమానించి జీన్ వాల్ జీన్ కోసెట్‌తో దేశం వదిలి పోవడానికి సిద్ధపడతాడు.

**రెండో అంకం**

రోడ్డు మీద పెద్ద అడ్డుకట్ట కట్టారు విద్యార్థి బృందం. ఎపొనైన్ కూడా ఈ బృందంలో కలియడం చూసి మారియస్ ఆమె చేతికి ఓ ఉత్తరం ఇచ్చి కోసెట్ దగ్గరికి పంపాడు. ఆ ఉత్తరం జీన్ వాల్ జీన్ చేతుల్లో పడింది. ఎపొనైన్ విద్యార్థి తిరుగుబాటు దళంలో ఉన్న మారియస్ దగ్గరకి బయలుదేరింది. సైన్యం విద్యార్థి దళాన్ని ఎదిరించింది. దారి తొలగక పోతే చావు తప్పదని హెచ్చరించింది. జావర్ట్‌ని ఈ యువ బృందం పోలీసు వేగుగా పట్టుకున్నారు. యువ బృందాన్ని చేరాలని బయలు దేరిన ఎపొనైన్ సైనికుల కాల్పుల్లో మరణించింది.


మారియస్

మారియస్‌ని వెదుక్కుంటూ జీన్ వాల్ జీన్ ఈ అడ్డుకట్ట దగ్గరకి వచ్చాడు. యువబృందం జావర్ట్‌ని చంపే పనిని జీన్ వాల్ జీన్‌కి అప్పగించారు. కానీ జీన్ వాల్ జీన్ అతన్ని చంపకుండానే విడిచిపెట్టాడు. ఆ రాత్రికి విశ్రమించారు యువత. మారియస్ ప్రాణాలు కాపాడమని భగవంతుడిని ప్రార్థించాడు జీన్. కానీ మరునాడే తిరుగుబాటుదారులందరినీ సైన్యం కాల్చివేసింది.

తీవ్రంగా గాయపడిన మారియస్‌ని తీసుకుని భూగర్భంలోని మురికినీటి సొరంగం గుండా తప్పించు కున్నాడు జీన్ వాల్ జీన్. ఇప్పుడు మళ్ళీ జావర్ట్ చేతుల్లో చిక్కాడు. చేతిలో స్పృహ తప్పివున్న కుర్రాడిని ఆస్పత్రికి చేర్చి వస్తానని బ్రతిమాలాడు జీన్ వాల్ జీన్. అతని చేతుల్లో ప్రాణదానం పొందిన జావర్ట్ కనికరించి వదిలాడు. కాని జీన్ వాల్ జీన్ నీతి, మొక్కవోని నిజాయితీ, కరుణ వీటి ముందు తనెంత! తన బ్రతుకెంత! పశ్చాత్తాపంతో కృంగిపోయాడు. ఆ దైన్యతలోనే నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

మారియస్ తేరుకున్నాడు. జీన్ వాల్ జీన్ తన అసలు కథ అతనికి చెప్పాడు. మారియస్ కోసెట్‌ల పెళ్ళి జరిగింది. ఇద్దరూ జీన్ వాల్ జీన్ దగ్గరకి వచ్చారు. ఇప్పుడు దెబ్బయ్యో పడిలో ఉన్నాడు జీన్ వాల్ జీన్. ఆమె కథని మొదటి సారిగా వివరించి చెప్పి, ఇద్దరినీ ఆశీర్వదించి కన్నుమూశాడు.

పేదల బ్రతుకుల్నీ వారి జీవితాల్లో ఆర్ద్రతనీ, ప్రేమనీ, త్యాగాన్నీ, దయ నీయతనీ ఎంతో హృద్యంగా ఆద్యంతమూ హృదయం ద్రవించేలాగ చిత్రించిన కళాఖండం *లే మిజరబుల్స్*, ఆఖరికి చట్టానికి ప్రాతినిధ్యం వహించే జావర్ట్ పాత్రని కూడా మానవతా దృక్పథంతో ముగించాడు రచయిత. 60-70 సంవత్సరాల సుదీర్ఘమైన చరిత్ర - ఓ గొప్ప ఇతిహాసం. నవల చదివి కిందపెట్టాక కూడా ఆయా పాత్రలు ఆలోచనల్లో వెంటాడుతాయి. ఎపొనైన్ మరణం, కోసెట్ పసితనం ఆమె తల్లి దైన్యత, చివరలో జీన్ వాల్ జీన్ వృద్ధాప్యం - ఇవన్నీ హృదయాన్ని ద్రవింపజేసే కరుణాత్మక మయిన ఘట్టాలు.

ఇంత విస్తృతమయిన కథని – ఇన్ని దశాబ్దాలు నడిచే కథని – ఇన్ని రకాలయిన సన్నివేశాలతో – కొన్ని పాత్రల వయస్సులో మార్పులన్నీ స్ఫురింపజేస్తూ ఎక్కడా వ్యవధి ఇవ్వకుండా ప్రదర్శించడం అనూహ్యమయిన విషయం. చాలా వాటికి పెద్ద సమాధానం రివాల్వింగ్ స్టేజి. తిరిగే స్టేజిమీద పదడుగులు వెనక్కి పరుగుతీస్తే మాయమయే లైటింగు. ఆ కాలపు దుస్తులూ, మేకప్పులూ – ఇది అద్భుతమయిన పనివాడితనం.

ముఖ్యంగా జీన్ వాల్ జీన్, జావర్ట్, థెనార్డియర్స్ దంపతుల మేకప్‌లలో దశాబ్దాల మార్పులు రావాలి. అదిన్నీ




క్వీన్స్ థియేటర్

క్షణాల మీద జరగాలి. పాతికేళ్ళ వయస్సులో కనిపించిన జీన్ వాల్ జీన్ నాటకం పూర్తయ్యేసరికి 75 ఏళ్ళ వయస్కుడు. ఈ మార్పుల్ని అద్భుతంగా ఆహార్యంతో పాటు మార్పులను ఆశ్చర్య చకితుల్ని చేసే విధంగా చూపారు.

స్టేజీ మీద దాదాపు 70 మంది నటీనటులుంటారు. స్టేజి వెనకా అంతమంది (అండర్ స్టడీస్ లెక్కపెట్టకుండా) ప్రతీ రోజూ పనిచెయ్యాలి. సంగీత వాద్యాలు ప్రతి ప్రదర్శనకీ మ్రోగాల్సిందే. ఈ హంగులతో మొదలెట్టినప్పటి నుంచీ 3 గంటలు సాగే నాటకం – 21 సంవత్సరాలుగా ఇంగ్లండులో – ఇలాగే మరో 38 దేశాలలో ప్రతిరోజూ సాగుతోంది! ఇదో గొప్ప ఉద్యమం.

ఇంతకంటే ప్రదర్శన గురించి ఏం చెప్పినా చెప్పడమే అవుతుంది. చూసిన అనుభూతిని ఏ కాస్తా పంచడం అవదు.

దీని సృష్టికర్తలు – అరెన్ బౌబ్లిల్ అనే గీత రచయిత, క్లాడ్ మైకేల్ షోన్ బర్గ్ అనే సంగీత కర్త. ఇద్దరూ ఫ్రెంచి దేశస్తులు. 1972లో అమెరికాలో బ్రాడ్వేలో *జీసస్ క్రైస్ట్ సూపర్ స్టార్* సంగీత రూపకాన్ని చూస్తుంటే – ఇలాంటి రచన ఎందుకు చెయ్యకూడదనే ఆలోచన వచ్చింది ఇద్దరికీ 1980లో ఆ ఆలోచన కార్యరూపం దాల్చింది. అయితే 1983 లో కామెరాన్ మెకింతోష్ అనే ఇంగ్లీషు నాటక నిర్మాత దీనిని అధిగమించి – పాలస్ థియేటర్‌లో నిరాఘాటంగా 18 సంవత్సరాలుగా నడిచి ప్రస్తుతం క్వీన్స్ థియేటర్‌లో రాజ్యం ఏలుతోంది ఈ నాటకం.

అసలు ఈ కామెరాన్ మెకింతోష్ ఎవరు? 35 సంవత్సరాల క్రితం అభిరుచి, దక్షత ఆత్మస్థైర్యం అన్నీ కలబోసి మొదటి సంగీత నాటకాన్ని నిర్మించాడు. ఇప్పటికీ రికార్డులు బద్దలు చేసిన *దికాట్స్, లే మిజరబుల్స్, ది ఫాంటమ్ ఆఫ్ ది ఆపెరా* సంగీత నాటకాల్ని నిర్మించాడు. ఆయన నిర్మించిన *మిస్ సైగాన్* ని నేను లండన్‌లో చూసి పులకించిపోయాను. అదొక అద్భుతమయిన కళాఖండం. లండన్ వెస్టెండ్‌లో ఈయనకి ఏడు థియేటర్లున్నాయి. 1996 లో బ్రిటన్ రాణి ఈయన నాటక రంగానికి చేసిన సేవలకు "సర్" బిరుదునిచ్చి సత్కరించింది. ఇంకా రకరకాల గౌరవాలు ఈయనకు దక్కాయి. తీరా ఈయన వయస్సు 55 దాటదు. వ్యాపారాన్నీ కళనీ మేళవించి ఓ 30 సంవత్సరాలపాటు ప్రేక్షకులకు ప్రతి దినం ఆనందాన్ని పంచిన గారడీవాడు మెకింతోష్.

ఈయన మాటల్లోనే 21 సంవత్సరాల కిందట ఈ నాటకం తొలి ప్రదర్శన అనుభవాలను విందాం. *1985 అక్టోబరు 8న బార్బికన్ థియేటర్‌లో లే మిజరబుల్స్ తొలి ప్రదర్శన జరిగింది. అంతకు ముందు విమర్శకులూ, ముందు ప్రీవ్యూలు చూసిన వారూ ఈ నాటకాన్ని ఆకాశానికి ఎత్తేశారు. ఆ ఉత్సాహంతో తొలి రోజున పేపర్లు ఏం రాశాయో చూద్దామని ఫ్లీట్ స్ట్రీట్‌కి పరిగెత్తాను. వాళ్ళు చేసిన విమర్శలు చదవగానే గుండె జారిపోయింది. కొందరు సమర్థించడానికి ప్రయత్నించారు. మధ్యాహ్నానికి – దుర్వార్తకి సిద్ధమవుతూనే బాక్సాఫీసు వివరాలు కనుక్కోవాలని, ఈ విమర్శలు కారణంగా ప్రేక్షకులు ఎంత దూరమయ్యారో, టిక్కెట్లు ఎలా అమ్ముడు పోయాయో తెలుసుకుందామని బయలుదేరాను.*

*నన్ను చూస్తూనే బాక్సాఫీసు మేనేజరు పరిగెత్తుకు వచ్చాడు. "అసలు ఇక్కడికి మనుషుల్ని తప్పించుకు ఎలా రాగలిగారు"ని ఆశ్చర్యపోయాడు. ఆ ఉదయం కేవలం 500 టిక్కెట్లు అమ్ముడుపోయాయట! నేను కొయ్యబారిపోయాను. ప్రజలు మేధావుల విమర్శలకి తమ మనస్సులతో సమాధానం చెప్పారు. పత్రికలు సహకరించకపోయినా, ప్రచారం కలిసిరాకపోయినా మామూలు ప్రేక్షకుడు థియేటరుకి వచ్చాడు. ప్రేక్షకుల నోటి ప్రచారానికి, ఏ ఆంక్షలూ లేని వారి అభిమానానికి ఎల్లలు లేవని ఆ రోజే గ్రహించాను.*

*అప్పటి నుంచీ వేలాది ప్రొడక్షన్స్ ప్రపంచమంతా సాగాయి. పాలస్ థియేటర్‌కి ఈ ప్రదర్శన బదిలీ అయినప్పుడు 18 సంవత్సరాలు నడుస్తుందని ఊహించలేదు. జూలై 2005 బిబిసి రేడియో 2 జరిపిన పోలింగులో 50 శాతం శ్రోతలు లే మిజరబుల్స్ ఈ దేశపు అభిమాన సంగీత రూపకంగా పేర్కొన్నారు.*

*2002 విక్టర్ హ్యూగో 200 జయంతి సందర్భంగా – 19 సంవత్సరాలలోపు పిల్లల చేత ఈ నాటకం చేయించారు. మొదటి నాలుగు సంవత్సరాలలో 76 వేల మంది పిల్లలు 1500 ప్రదర్శనలు జరిపారు. ఒక్కసారి జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే – లే మిజరబుల్స్ ని వేదిక ఎక్కించడం నా జీవితంలో గర్వించతగ్గ విజయంగా భావిస్తాను.*

*ఒక్కసారి విజయలక్ష్మి వరిస్తే – ఇక దానికి హద్దూ పద్దూ ఉండదు. ఈ సంగీత నాటకం డివీడి రికార్డింగు 20 పౌన్లకి మార్కెట్లో దొరుకుంది (అడ్రసు: ది కాస్ట్ కలెక్షన్, 3 వారెన్ మ్యూస్, లండన్ W1 T 6AN) ఇక వేలం వెర్రికి అంతం లేదు. లే మిజరబుల్స్ తాళం గుత్తి, పోస్టర్లు, పైట పిన్నులు, మగ్గులూ, బేస్ బాల్ టోపీలూ, పియానోలూ, పెన్నులూ, టీ షర్టులూ – మీ ఇష్టం ఏదయినా ఖరీదుకి దొరుకుతాయి. వెర్రినీ, విజయాన్నీ డబ్బు చేసుకోవడం బ్రిటిష్ వారికీ – అంతకంటే అమెరికన్లకీ తెలిసినట్లు మరెవరికీ తెలియదు. అయితే ఒక నాటకానికి ఇలాంటి ప్రాచుర్యం – 2007 లో ఎక్కడయినా దక్కుతోందంటే – నాటకాభిమానిగా నా మనస్సు ఉప్పొంగిపోతుంది.*

ఏనాడయినా మనదేశంలో మృచ్ఛకటికంనీ, వాసవదత్తనీ, అభిజ్ఞాన శాకుంతలాన్నీ, రాగరాగిణీనీ, కీర్తిశేషులునీ – ఇలా చూడగలమా?

***

**కం**టికి కన్ను, పంటికి పన్ను. నేరానికి శిక్షగా భావిస్తే కన్నులున్నవాడు, పన్నులున్న వాడంటూ ప్రపంచంలో ఎవరూ ఉండరన్నది గాంధీ భావన. పూర్వకాలంలో (రెండువందల సంవత్సరాల క్రితం వరకూ) నేరస్థునిపై శిక్షలు చాలా అమానవీయంగా ఉండేవి. చిన్న తప్పకు కూడా పెద్ద శిక్షలుండేవి. తెలిసో తెలియకో ఒకసారి నేరం చేస్తే జీవితాంతం నేరస్థునిగా నరకయాతన పడేవాడు. పోలీసు, జైలు వ్యవస్థలు ప్రజలలో విపరీతమైన భయాందోళనలను కలిగించేవి. పోలీసులలో, జైలర్‌లలో మానవత్వం ఏ మాత్రం ఉండేది కాదు. ఇటువంటి శిక్షలకు పాల్పడేవారిలో ఎక్కువ శాతం ప్రజలు ఆనాడు లంపెన్‌లుగా పిలువబడే అలగా జనమే. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండే వ్యక్తులు ధనికులు, కులీనులు నేరానికి అందకుండా తప్పించు కునేవారు.

నేరస్థులపైన వేసే శిక్షలలోని అమానవీయతను తన నవల ద్వారా మొదటిసారిగా ప్రశ్నించిన వాడు విక్టర్ హ్యూగో (తన లే *మిజరబుల్* నవల ద్వారా). అతని వలననే నేరస్థుల విషయంలో జైళ్ళ పనితీరులో మార్పులకు ఆనాడే శ్రీకారం చుట్టబడింది. ఈ నవలలోని ప్రధాన పాత్రధారి జీన్ వాల్ జీన్. కొన్ని విపత్కర పరిస్థితుల్లో దొంగతనం చేస్తాడు. అందుకు గాను క్రూరమైన విధానంలో శిక్షననుభవిస్తాడు. అది అతనిలో కరడుగట్టిన కాఠిన్యంగా రూపొందుతుంది. శిక్షాకాలం పూర్తయిన తరువాత పెరోల్‌పై బయటకు వచ్చిన తరువాత నెలకొకసారి అతను పోలీసుస్టేషన్‌కు వచ్చి సంతకం చేయాలి.

విడుదలై బయటకు వచ్చి ఆకలితో అలమటిస్తూ, చలికి వణుకుతున్న అతన్ని ఆదుకుంటాడు చర్చి ఫాదర్. అయితే అప్పటికే జైలర్‌ల అహంకారం క్రింద నలిగి పోయిన జీన్ వాల్ జీన్ తనలోని మానవత్వాన్ని పక్కకు నెట్టి తనకు తిండి పెట్టి ఆశ్రయమిచ్చిన చర్చి ఫాదర్‌ను గాయపరచి అక్కడున్న వెండి దీపపు సెమ్మెలను అపహరించి పారిపోతాడు. పోలీసులకు పట్టుబడి చర్చిఫాదర్



**జీన్ వాల్ జీన్**

ముందుకు తీసుకు రాబడినపుడు చర్చి ఫాదర్ ఔన్నత్యంతో అతని తప్పను కప్పిపుచ్చడంతో అతను పశ్చాత్తాపంతో రగిలిపోతాడు. ఒక ఉన్నత వ్యక్తిగా రూపొందబడతాడు. సంఘంలో గౌరవస్థానాన్ని పొందుతాడు. కానీ పోలీసు ఠాణాకు వెళ్ళి తన అసలు విషయం చెప్పడు.

ఈ కథలో రెండవ ముఖ్య పాత్రధారి జావర్ట్: వృత్తిపరంగా పూర్తిగా అంకితమై, విచక్షణారహితంగా చట్టాన్ని క్రమశిక్షణతో అమలు పరచే పోలీసు అధికారి. జీన్ వాల్ జీన్ లో అతను నేరస్థుడ్ని చూడగలుగుతాడు. కానీ అతనిలో పునర్జీవించ బడిన మానవత్వాన్ని చూడలేడు. వీరిద్దరి మధ్య జరిగే సంఘర్షణ తోనే ఈ చిత్ర కథ కొనసాగుతుంది. చివరకు జీన్ వాల్ జీన్ మానవతా వాదం ముందు కఠోర క్రమశిక్షణా వాదం ఓడిపోతుంది. జీన్ వాల్ జీన్‌ను అంతవరకూ హేయమైన రీతిలో తాను వెంటాడిన విధానానికి కుమిలిపోతూ తనని తాను సమాధాన పరచుకోలేక ఆత్మహత్య గావించు కుంటాడు జావర్ట్.

జావర్ట్ వల్ల తనకెంతో నష్టం కలిగింది నిజమే కానీ నీతికి, నిజాయితీకి, చట్టబద్ధతకు మారుపేరైన జావర్ట్ మరణం అతన్ని కలచి వేస్తుంది. ఒక గొప్ప మిత్రుణ్ణి కోల్పోయినట్లుగా దుఃఖిస్తాడు. నిజానికి ఈ నవలలో వీరిద్దరి మధ్యనున్న శతృత్వ, మిత్రుత్వ భావాలే పాఠకుణ్ణి అప్పటినుంచి ఇప్పటివరకూ కట్టిపడేస్తుంది. ఈ నవలలో ఈ రెండు ప్రధాన పాత్రలు మనకు హీరోలుగానే కనపడతారు.

1. సినిమాగా *లే మిజర్బా* - 1935లో వచ్చిన మొదటి టాకీ వెర్షన్‌లో జీన్ వాల్ జీన్ గా ఫ్రెడరిక్ మార్చ్-జావర్ట్‌గా చార్లెస్ లాటన్ నటించారు.

2. 1957 ఫ్రెంచ్ వెర్షన్‌లో జీన్ వాల్ జీన్‌గా జీన్ గ్లాబిన్ - జావర్ట్‌గా డార్సిల్ డోలోరిన్ నటించారు.

3. 1978 ఇంగ్లీషు వెర్షన్‌లో జీన్ వాల్ జీన్‌గా రిచర్డ్ జోర్డన్ - జావర్ట్‌గా ఆంథోని పెర్కిన్స్ ఇందులో జాన్ గీల్ గుడ్ కూడా నటించారు.

4. 1995 ఫ్రెంచ్ వెర్షన్‌లో జీన్ వాల్ జీన్‌గా జీన్‌పాల్ - జావర్ట్‌గా బిల్ మాండో నటించారు.

5. 1998 ఇంగ్లీషు వెర్షన్‌లో జీన్ వాల్ జీన్‌గా లిమ్‌నీసన్ - జావర్ట్‌గా జాఫ్రీరష్ నటించారు.

6. 2012 సంవత్సరము క్రిస్మ్‌కు విడుదల కాబోతున్న *లే మిజరబుల్* లో జీన్ వాల్ జీన్ పాత్రకు హగ్ జాక్‌మన్. జావర్ట్ పాత్రకు రసెల్ క్రో నటిస్తున్నారు. ఈ చిత్ర దర్శకుడు టామ్ హోపర్. ఇది మొదటిసారిగా వస్తున్న మ్యూజికల్.

కథలో లానే సినిమాలో కూడా నటీనటులకు పోటీ సాగుతుంది. రెండు పాత్రలు ప్రేక్షకుల ఆదరణకు నోచుకున్నవే.

Dignity of Man Kind గురించి టాల్‌స్టాయ్ కంటే ఎంతో ముందే విక్టర్ హ్యూగో గళమెత్తారు. 1995లో వచ్చిన ఫ్రెంచి వెర్షన్ మినహాయిస్తే మిగతావన్నీ దేనికదే ఒక క్లాసిక్. అన్ని చిత్రాలకు కథ ఒకటే అయినప్పటికీ ఏ రెండు సినిమాలూ స్క్రీన్‌ప్లేలో, ముఖ్యంగా ఆర్ట్ డైరెక్షన్‌లో, నటనలో, బ్యాక్ గ్రౌండ్ సంగీతంలో ఒక దానికొకటి దీటయినది. ఒక చిత్రాన్ని చూస్తున్నపుడు మరొకటి గుర్తుకు రాకపోవటం వీటి ప్రత్యేకత. పాత చిత్రపు ఛాయలేమీ కొత్త చిత్రంలో కానరావు. మి



**విక్టర్ హ్యూగో**

# సింహావలోకనము

- చిలకమర్తి లక్ష్మీనరసింహం

**అరసం ద్వితీయ మహాసభ చిలకమర్తి వారికి అఖండ సన్మానం**



**1944** డిసెంబరు 29-31వ తేదీల్లో ఆంధ్ర అభ్యుదయ రచయితల ద్వితీయ మహాసభ బెజవాడలో జరిగింది. సభ రెండవ రోజున ఆంధ్ర జాతీయకవి చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి స్వీయచరిత్ర బహూకరణ మహోత్సవం జరిగింది. రామమోహన్ గ్రంథాలయం హాలులో జరిగిన ఈ సభకు అభ్యుదయ రచయితల ద్వితీయ మహాసభాధ్యక్షులైన తెలికిచర్ల వెంకటరత్నంగారే అధ్యక్షత వహించారు. వేదికపై చిలకమర్తివారిని పడకకుర్చీలో ఆశీనులను చేశారు. అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి సజ్జాద్ జహీర్, నవ్యసాహిత్య పరిషత్ అధ్యక్షులు శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారు, నవ్యాంధ్ర సాహిత్యవీధుల కర్త ఆచార్య కూరుగంటి సీతారామయ్యగారు, ప్రజాసాహిత్యకోవిదుడు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు, వైతాళికుల సంకలనం సంపాదకుడు ముద్దుకృష్ణ, ఆంధ్ర యూనివర్శిటీ సిండికేట్ సభ్యులు, దామెర్ల ఆర్ట్‌గ్యాలరీ ట్రస్టు కార్యదర్శి శ్రీ విస్సా అప్పారావుగారు వేదికపై ఆశీనులయ్యారు. సభాధ్యక్షులు శ్రీ తెలికచర్లవారు మాట్లాడుతూ "సంఘ సంస్కరణలోను, సారస్వత క్షేత్రంలోను అభ్యుదయ మార్గాలను తీర్చిదిద్దిన చిలకమర్తివారి *స్వీయచరిత్ర*ను ప్రకటించడం ద్వారా ఆంధ్రదేశానికి మహోపకారం చేశారు ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం వారు" అని అభినందించారు.

శ్రీ విస్సా అప్పారావుగారు ఈ *స్వీయచరిత్ర* ప్రచురణ పూర్వచరిత్రను తెలియజేశారు. నేను, రాయసం వెంకట శివుడుగారు చిలకమర్తి వారిని *స్వీయచరిత్ర* వ్రాయవలసిందిగా కోరాము. 75 యేండ్లు దాటిన వృద్ధాప్యంలో వారు శ్రమకోర్చి తమ *స్వీయచరిత్ర* వ్రాశారు. వీరేశలింగంగారి వర్ధంతి సభ జరిపే సందర్భంలో ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘంవారు నా దగ్గరకు వచ్చినప్పుడు ప్రసంగవశాన శ్రీ చిలకమర్తివారి "*స్వీయచరిత్ర* వ్రాయించామనీ, కాయితాల కరువువల్ల దాని ప్రకటన ఆలస్యమైపోతున్నదనీ వారితో అన్నాను. దాదాపు నాలుగువందల పేజీలు గల యీ గ్రంథాన్ని ఒక్క నెలరోజులలోగానే అచ్చువేయించిన ప్రజాశక్తి సంపాదకులనూ, అభ్యుదయ రచయితల సంఘంవారిని అభినందిస్తున్నాను" అన్నారు.

**నా** జీవితకాలములో నాంధ్రదేశమునందు నెన్నో మార్పులు జరిగినవి. నా చిన్నతనమునందు కందుకూరి వీరేశలింగముగారు సంఘ సంస్కరణ మారంభించిరి. ఆయన మొట్టమొదట నుద్యోగస్తులు లంచములు పుచ్చుకొనకుండ జేయవలయుననియు, వివాహాది శుభకార్యములలో భోగము మేళములు పెట్టకుండ జేయవలయుననియు, మగపెండ్లివారు దురాశచే నాడు పెండ్లి వారిని గొప్పకట్నములు తెమ్మని బాధించకుండ జేయవలయుననియు, నుద్యోగస్తులు, ప్లీడరులు భోగమువాండ్ర నుంచుకొనకుండ జేయవలయుననియు, సంకల్పించి, పిమ్మట వితంతు వివాహములు నారంభించిరి. ఈ సంకల్పములలో వీరేశలింగముగారు చాలవరకు కృతార్థులైరి. ఒక గవర్నమెంటు ప్లీడరు యొక్కయు, నొక డిస్ట్రిక్టుమునసబు యొక్కయు నాత్మహత్యలతో లంచగొండుల సంఖ్య కొంతకాలము చాలవరకు తగ్గినది.

పూర్వకాల మాంగ్లేయ విద్యరాని యుద్యోగస్తులే లంచగొండులుగ నుండెడివారు. ఆంగ్లేయ విద్యనేర్చినవారికి గొప్ప యుద్యోగములిచ్చిన పక్షమున లంచగొండితనము చాలవరకు తగ్గిపోవునని జిల్లాకలెక్టరులు, జిల్లాజడ్జీలు

మొదలగువా రాంగ్లేయవిద్య నేర్చినవారికే నుద్యోగమునీయ నారంభించిరి. కాని వారుకూడ వెనుకటివారి దారినేత్రొక్కి, రెండుచేతుల లంచముల నందుకొని నారంభించిరి. ధనమెంత వారినైన భ్రమపెట్టును గదా! శాస్త్రమెంత జదివినప్పటికి దుర్జనుడు సజ్జనుడుకాడు. మైనాక పర్వతము లక్షలకొలది యేండ్లు సముద్రములోనున్నను లేశమైన మెత్తపడలేదు. అట్లే దుర్జనుడు బహుశాస్త్ర పారంగతుడైనను మంచివాడు కానేరడు. ఆ విషయమై దేశస్థితి యించుమించుగ మునుపటివలెనే యున్నది. కోర్టులలో బనియుండి మనము వెళ్ళిన పక్షమున, యెక్కడనో ముగ్గురు నలుగురు తప్ప తక్కినవారందరు చేయి జాపువారే. వీరందరు పరీక్షలయందు గృతార్థులైనవారే! దీని ముఖ్యకారణము దారిద్ర్యమేయని నా యభిప్రాయము. గుమస్తాలకు కుటుంబము పెరిగి ఖర్చు లెక్కువైనవి. దానికి దోడుగ జీతములు తక్కువ. రాజబంధువు లగుటచేకాబోలు నాంగ్లేయులకు ప్రతిశాఖలోను జీతములెక్కువ.

మనవారికిగూడ నధికారులు తగిన జీతము లిచ్చినపక్షమున లంచగొండితనములు మనదేశములో నిర్మూలనమగును. అంతవరకు నిది ప్రతిశాఖలోను నుండెడిదే. గృహమందు తండులములు లేనపుడు గుమస్తా లంచములుపట్టక, తప్పుడువ్రాతలు వ్రాయక, దారాపుత్రులను మాడ్చి చంపునా? కష్టస్థితిలో నీతిమంతులై యుండుట దుర్లభము. ఇక భోగముమేళములమాట జూతము.

వివాహాది శుభకార్యములలో నాంగ్లేయ విద్యాభ్యాసము జేసిన యుద్యోగస్తులు, న్యాయవాదులు భోగము మేళము పెట్టుటమానిరి. ఇప్పటికిని మిక్కిలి పల్లెటూళ్ళయందును, వైశ్యులు మొదలైనవారి యిండ్లయందును భోగము మేళము లేనిపక్షమున శోభస్కరముగాదనియు, నలుగురు జేరరనియు వేశ్యలకాదరణము జరుగుచున్నది. ఈ వేశ్యా నిరసనమును గురించి వీరేశలింగముగారేగాక, రఘుపతి వెంకటరత్నము గారును కృషిజేసిరి. వారితో నేనును మహోపన్యాసములు చేసియు, పత్రికలలో వ్రాసియు, పనిచేసితిని. మేము చేసినపనికి ఫలితములు కనపడినందుకు సంతసించు చున్నాను.

వివాహముల యందలి కట్నములు లేకుండ చేయవలెనని వీరేశలింగము పంతులుగారు చాల శ్రమ పడిరి. వారితోబాటు నేనును మొదటి నుండియు యేకీభవించుచున్నాను. కాని యీ విషయమై యెంద రెంత ప్రయత్నము జేసినను మంచి ఫలితములు కనబడలేదు. విద్యావంతులీ విషయమున ముందంజవేసి, మార్గదర్శకు లౌదురని మే మాశించితిమి. గాని మా యాశ నిరాశయైనది. విద్యావంతులైనకొలది పెండ్లికొడుకులకును, వారి తలిదండ్రులకును, ధనాశారోగము క్రమక్రమముగ హెచ్చినది. అది చికిత్సకు సాధ్యమగునట్లు తోచదు. గొడ్లను కటికవాని కమ్ముకొన్నట్లు తండ్రి కన్నకూతురును ముసలివానికో, మూర్ఖునకో, దరిద్రునకో కొన్ని వందల రూపాయల కమ్ముకొనుట యెంత పాడుపనియో పిల్లవానికి కట్నము పుచ్చుకొనుట గూడ నంత పాడుపనియే. ఈ విషయమై చాలకాలము బహువిధములుగ పత్రికలలో వ్రాసియు, వేదికలపైనుండి యుపన్యాసము లిచ్చియు, ప్రబోధము జేసితిమి. కాని యది బూడిదలోబోసిన పన్నీరైనది.

వివాహముల విషయమై యాడుపిల్లల తలిదండ్రులు తమ పుత్రికలకు మంచి వరులను దేవలెనని ఋణములను జేసి, యవి దీర్చలేక, గృహారామక్షేత్రములను విక్రయించుకొని, దరిద్ర్యావస్థల పాలగుచున్నారు. ఆడ పెండ్లివారు తమకు గులాములని మనసులో మగ పెండ్లివారు భావించి, యాడు పెండ్లివారి కొంపలు బందిపోటు దొంగలవలె దోచుకొను చున్నారు. ఈ దురభ్యాస మడుగంటినగాని దేశము బాగుపడదు. విద్యావంతులైన యువకులు గొందరు బయలుదేరి, యాడుపెండ్లివారు కట్నము లిచ్చెదమని చెప్పినను తలిదండ్రులు తీసికొనుటకు బలవంతపెట్టినను, ధైర్యమునూని వారి మాట నిరాకరించి, నీతిమంతులై కట్నములు, కానుకలు, లాంఛనములు దీసికొనకుండ వివాహము చేసికొన్న పక్షమున నీ దురాచారము తుదముట్టును.

దేశాభిమానము గలవారట్టి యువకులను దగినట్లు ప్రోత్సాహపరచి, యట్టి వివాహములనే ప్రశంసింపవలెను. పిల్ల నమ్ముకొన్న వాని నెంతనీచముగ మనము జూచుచున్నామో, కట్నము బుచ్చుకొన్న తండ్రిని గూడ నంత నీచముగ జూచి నిరసింపవలెను. కట్నము దీసిగొనుట గౌరవమని భావించుట దేశములో నశింపవలెను. అది నీచమనియు, నవినీతి యనియు, జనులలో భావమేర్పడ వలెను. ఇది పూర్వ మగ్రజాతులలోనే యుండెడిది. గాని క్రమముగ నంటువ్యాధివలె నన్ని జాతులలోనికి వ్యాపించినది. ఇది ముఖ్యముగ వైశ్యులలోను, కమ్మవారిలోను, హెచ్చుగనున్నది. దీనికి కారణము, వారు మిక్కిలి ధనవంతులగుట. ధనమున్న పక్షమున, ధర్మ కార్యములుజేసి సంస్థల నేర్పరచి జేయవలసిన పనులెన్నియేని

గలవు. అంతియేగాని యదివరకే భాగ్యవంతుడై ధనముతో తులదూగుచున్న పెండ్లి కొడుకులకు వివాహకాలమున మంగళస్నానములతోబాటు కనకాభిషేకము చేయుట శ్రేయస్కరముగాదు. గుణవంతుడైన మరియొక బీదపెండ్లి కొడుకునుదెచ్చి యాధనమతనికి కట్నముగనిచ్చి, పిల్లనిచ్చిన పక్షమున నట్టిదంపతులు చిరసౌఖ్యమునందుదురు.

సంఘసంస్కరణములో వితంతువివాహము మిక్కిలి ముఖ్యమైనది. ఈ యుత్కృష్టకార్యమునిమిత్తమై వీరేశలింగముగారు తమ యావజ్జీవము ధారపోసిరి. ఈ సంస్కరణములో వీరేశలింగముగారిభార్య రాజ్యలక్ష్మమ్మగారు సర్వవిధముల భర్తకు తోడుపడి, సహధర్మచారిణియనుమాట సార్ధకముజేసినది. ఆమె తోడ్పాటులేనిపక్షమున వీరేశలింగముగారాకార్యమున కృతకృత్యులు గాక పోయి యుందురు. పండితులు, పామరులు, బంధువులు, మిత్రులు, వేయేల-దేశస్థులందరు వ్యతిరేకభావము జూపినను జంఝామారుతముల కించుకేనియు గదలని హిమాలయ పర్వతమువలె ధైర్యమూనినిలిచి స్వాములవారి యాంక్షలకు, కులమువారి నిరాదరణమునకు, వెరువక పంతులుగారు నిరాటంకముగ తాముపూనినపని కొనసాగించిరి. వివాహముకంటె ముఖ్యమైనది వితంతుశరణాలయస్థాపనము. వితంతువుల దుర్దశ దొలగించుటకీ శరణాలయమును వారుస్థాపించిరి. ఈ శరణాలయ నిర్వహణమునందు నేనును వారికించుక తోడ్పడితిని. నాయెడవారికి మిక్కిలి గౌరవమును, దయయునుండెడివి.

**వితంతువివాహములు పంతులుగారు జీవించినకాలమున జరిగినట్లు నేడంత విజృంభణముగ జరుగుటలేదు. వివాహములు విశేషముగ జరుగవలెనన్న వితంతుబాలికల తలిదండ్రులు సామాన్యవివాహములవలెనే తమయిండ్లలో వివాహములు చేయవలెను. మనయువకులుగూడ కట్నములకు, కానుకలకు నాశపడక, స్వార్థత్యాగముజేసి గుణవతులు, విద్యావతులు, సద్వంశజాతలునైన బాల వితంతువులను వివాహమాడవలెను.**

వితంతువివాహములు పంతులుగారు జీవించినకాలమున జరిగినట్లు నేడంత విజృంభణముగ జరుగుటలేదు. వివాహములు విశేషముగ జరుగవలెనన్న వితంతుబాలికల తలిదండ్రులు సామాన్యవివాహములవలెనే తమయిండ్లలో వివాహములు చేయవలెను. మనయువకులుగూడ కట్నములకు, కానుకలకు నాశపడక, స్వార్థత్యాగముజేసి గుణవతులు, విద్యావతులు, సద్వంశజాతలునైన బాల వితంతువులను వివాహమాడవలెను. వీరేశలింగమువారివంటి ధైర్యవంతులు దేశమున బయలుదేరి యీ సంస్కరణమును జేపట్టిన నది దేశమంతటను వ్యాపించును. వీరేశలింగముగారు వారి యనుచరులు కష్టపడి యెంతప్రబోధముజేసినను సంఘమింకను గాఢనిద్రనుండి మేలుకొనలేదు. ఈ కుంభకర్ణనిద్ర నుండి సంఘమును మేలుకొలుపుట కష్టసాధ్యముగ దోచుచున్నది. ప్రౌఢవివాహములు జేసినపక్షమున బాలవితంతువులసంఖ్య కొంతవరకు క్షీణమగునేమోయని తోచుచున్నది. కాని యీ విషయమున గూడా సంఘము ముందంజవేయుటలేదు.

తలిదండ్రులు రజస్వలలైనపిల్లలకు రజస్వలలుగాలేదని బొంకులు బొంకి, వివాహములు చేయుచున్నారుగాని, ధైర్యముబూని సత్యము పలుకుట లేదు. ఈవిషయమున బ్రాహ్మణ, వైశ్యులకంటె క్షత్రియులు, శూద్రులు ప్రశంసనీయులు, వారి కులాచారము చిన్నబిడ్డలకే వివాహములు చేయమని వారిని నిర్బంధించుట లేదు. పూర్వకాలమున బ్రాహ్మణులలో గూడ రజస్వలలైన కన్యలకే వివాహములు జరిగినట్లు పురాణములలోను, కావ్య, నాటకములలోను స్పష్టముగ వ్రాయబడి యున్నది.

ప్రాచీనకాలమునుండియు హిందూసంఘమునయెన్నో సంస్కరణములు జరిగినట్లు మన మతగ్రంథములలో నుండినను, వాటిని లెక్కసేయక, పండితులు సయితము పామరులట్లె మూఢ విశ్వాసములకులోనై, "గతానుగతికో లోకోనలోకః పారమార్థికః" యను లోకోక్తినిబట్టి వారు జేయుచున్నారనివీరు, వీరుజేయుచున్నారనివారు జనులు వెనుకటి పుంతనేబోవు చున్నారు. సంఘసంస్కరణ విషయమున మునుపటివలె ప్రబోధముగూడలేదు. పూర్వము రాజకీయవిషయమున నేటేట జిల్లాసభలు జరుగుచుండెడివి. ఆసభలతోపాటు సంఘసంస్కరణ సభలుగూడ జరుగుచుండెడివి. కొంతకాలమునుండి రాజకీయసభలంతరించినవి. వానితోపాటు సంస్కరణ సభలుగూడ మటుమాయమైనవి. రాజకీయసభల మాటటుండగ

సంఘసంస్కరణసభలు ప్రతి మండలములోనున్న నాయకులు ప్రతి సంవత్సరముజరిపి ప్రబోధముజేసిన బాగుండును. రాజకీయవిషయములు దొరతనమువారి యధీనములోనివి. సాంఘికవిషయములు మనచేతిలో నున్నవేగనుక, మనమే వాటిని చక్కపరుచుకోవలెను.

**మతస్థితి**

1828వ సంవత్సరమున రాజారామమోహనరాయలు బంగాళాదేశమున బ్రహ్మసమాజమతము స్థాపించెను. ఆ గాలి దక్షిణముగ వీచినందున నేకేశ్వరారాధనముజేయింపదలచి వీరేశలింగముగారు 1878లో నొక ప్రార్థన సమాజమును రాజమహేంద్రవరమున స్థాపించిరి. కొందరు యువకు లాయనచుట్టునుచేరి ప్రతివారము పరబ్రహ్మమును గూర్చి నిర్గుణముగ ప్రార్థనములు చేయ జొచ్చిరి. బ్రహ్మమతవ్యాప్తికై బంగాళాదేశము నుండి బిపిన్ చంద్రపాల్, శివనాథశాస్త్రి మొదలగు వారాంధ్రదేశమునకు వచ్చి బ్రహ్మ మతమును గూర్చి ప్రబోధముజేసిరి.

క్రమముగ వీరేశలింగముగారికా సిద్ధాంతములు రుచించినందున వారు 1906వ సంవత్సరమున ననుష్ఠానిక బ్రహ్మమతస్థులైరి. అనగ యజ్ఞోపవీతమునుత్యజించుట, కర్మలువానుట, జాతిభేదము పాటింపకుండుట. కొందరు యువకులు వారి మార్గము ననుస రించిరి. నాటినుండి బ్రహ్మ సమాజము వెలసినది. వీరికిదోడుగ శ్రీరఘుపతి వేంకటరత్నము నాయుడుగారుకూడ బ్రహ్మమతా వలంబికులై కాకినాడలోని కళాశాల కధ్యక్షులుగవచ్చి యచ్చుటగూడ బ్రహ్మసమాజ బీజములు నాటిరి. అది కొంతకాలమచట వృద్ధి పొందెను. ఆంధ్రదేశము లో పెక్కు ప్రార్థనసమాజములు స్థాపింపబడెను. వీరేశలింగము, నాయుడుగార్లు గతించిన తరువాత బ్రహ్మమతము క్షీణించుచున్నది. మనదేశములోనున్న బ్రహ్మమతస్థులను వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చును. ఎందుచేతనో మనదేశమున బ్రహ్మమతవృక్షమేపుగబెరుగలేదు.

అది మనదేశ విరుద్ధమైన మతము గాకపోయినను, మహర్షిసమ్మతమై యుపనిషన్మతమైనను పూర్వము బౌద్ధమత, జైనమతములకు స్థానమిచ్చిన యాంధ్రదేశము నేడీపరిశు ద్ధాస్తికమతమునకు నాశ్రయమియ్యకపోవుట మిక్కిలి శోచనీయము. నాకీ మతమునందత్యంతాభిమానము గలదు. ఈ మత మవలంబించినవారికి మూఢవిశ్వాసములుండవు. బంగాళాదేశమునందిది బాగుగవ్యాపించినది.

రాధాస్వామి మతము మనదేశమున నెక్కువగ వ్యాపించుచున్నది. దాని యందు నా కెంతమాత్రము విశ్వాసములేదు. కాని వారు చేయుచున్న పరిశ్రమలు మాత్రము మిక్కిలి శ్లాఘాపాత్రములు.

ఆర్యసమాజ మతము మన యాంధ్రదేశమున నించుమించుగ లేనే లేదని చెప్పవచ్చును.

దివ్యజ్ఞాన సమాజములుమట్టుకు మన యాంధ్రదేశమున నెల్లయడల నున్నవి. దివ్యజ్ఞాన సమాజమొక మతముగాదు. దానిసిద్ధాంతములుదారభావములు గలిగియున్నవి. నాకు దానియందును విశ్వాసములేదు. చిన్ననాడు నేనొక సారి కొందరు మిత్రుల ప్రోత్సాహము చేత దివ్యజ్ఞాన సమాజికుడనైతినిగాని తరువాత మానుకొంటిని.

**నిమ్నజాత్యుద్ధరణము**

గొప్ప సమస్యలలో నిదియొకటి. మన హిందూదేశములో నిమ్న జాతులవారు రమారమి యారు కోట్లమంది యున్నారు. వీరి యవస్థ పశువుల యవస్థకన్న దీనముగ నున్నది. వీరి సంఖ్య క్రమక్రమముగ తగ్గుచున్నది. ఏమన నొకవంక క్రైస్తవులు, మరి యొకవంక మహమ్మదీయులు, వారిని జేరదీసి తమతమ మతములలో గలుపు కొనుచున్నారు.

దీనికుత్తరవాదులెవరన్న నగ్రజాతులమని విఱ్ఱవీగుచున్న బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులే. ఈ వర్ణములవారు పంచములు మొదలైన నిమ్నజాతులచేత తమకు గావలసిన సేవలన్నియు జేయించుకొని, వారిని యిండ్లకు రానీయక దరికి చేరనీయక యంటరానివారనియు, చెప్పరానివారనియు, వారికసహ్యము లైనపేర్లు పెట్టి హీనముగ జూచుచున్నారు. పశువులు మన యింట నుండవచ్చును. కుక్కలుండవచ్చును. కాని పంచములుమట్టుకు మన గృహావరణములోనికి

**బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులే. ఈ వర్ణములవారు పంచములు మొదలైన నిమ్నజాతులచేత తమకు గావలసిన సేవలన్నియు జేయించుకొని, వారిని యిండ్లకు రానీయక దరికి చేరనీయక యంటరాని వారనియు, హీనముగ జూచుచున్నారు. పశవులు మన యింట నుండవచ్చును. కుక్కలుండవచ్చును. కాని పంచములుమట్టుకు మన గృహావరణములోనికి రాగూడదు. వారు మన పశువులను మేపవచ్చును. కాని మనము నోరువిచ్చి వారితో మాటలనైన నాడజాలము.**

రాగూడదు. వారు మన పశువులను మేపవచ్చును. కాని మనము నోరువిచ్చి వారితో మాటలనైన నాడజాలము.

వారు భగవంతునిచే సృష్టింపబడిన మనుష్యులే యనియు, నగ్రవర్ణములవారి కున్నట్లే వారికి గూడ క్షుత్పిపాసలు, సుఖదు:ఖములు గలవనియు మన వారు తలంపరు. తలంచిన పక్షమను వారి నారీతిగ నుంచుదురా?

మనదేశములో ధనవంతులు లేకపోలేదు. విజ్ఞానవంతులు లేకపోలేదు. వేలకొలది ధనము వెచ్చించి పేరు, ప్రతిష్ఠలకై సత్రములు, సావడులుగట్టించి, సంతర్పణములు సమారాధనలు చేయింతురుగాని, మాలపల్లి యవస్థనుజూచి దానిని బాగుచేయుటకై ప్రయత్నించువారు లేరుగదా!

వారుండుపల్లెలు గ్రామమునకు వెలుపలనుండి దుర్గంధ భూయిష్టములై, హేయములై, మానవులు వసించుటకు వీలుగనుండవని యెవ్వరెరుంగరు? మనదేశమున ననేక పండితులుగలరు. వారిలో ననేకులు భగవద్గీత జదివియుందురు. అందు శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన యీక్రింది శ్లోకమును వారు పలుమారు పఠించియే యుందురు.

శ్లో॥ విద్యా వినయ సంపన్నే
బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవశ్వపాకేచ
పండితా స్సమదర్శినః ॥

దీనికి తిక్కన సోమయాజి మహాభారతమునందు పద్యమిట్లు వ్రాసినాడు.

**చ॥ వినయము విద్యయుం గలుగు విప్రునియందును గోవునందు నొ**
**ప్పు నెరయు హస్తియందు నొక పోకకుబోవని కుక్కయందు దా**
**ని నడచితెచ్చి వండి తిను నీచపు మాలనియందు తుల్యద**
**ర్శనులు తదంతరాత్ముని నిరంజనునిం గను పండితోత్తముల్॥**

భగవద్గీతా పారాయణము జేయునట్టియు, పంచమ వేదమైన *భారతము* చదువునట్టియు, వినునట్టియు నగ్రజాతుల వారందరు పై శ్లోకమును నోటితో పఠించుటయేగాని మనసుకు పట్టించుకొనరు.

హిందువులందరి చేత భగవంతుడని సేవింపబడుచున్న శ్రీకృష్ణ భగవానుని మాటలయందే మనవారికి లక్ష్యము లేనప్పుడు నిమ్నజాతుల నుద్ధరింపుడోయని మొరవెట్టు నీనాటి నవనాగరికుల మాటయందు లక్ష్యముండునా?

హిందూదేశమందలి యితరభాగములందువలెనే మన యాంధ్రదేశమునగూడ నీ సమస్య జనుల నాకర్షించినది. శ్రీ పిఠాపురము మహారాజుగారు పంచమ బాలబాలికలకై రెండు వసతిగృహములేర్పరచి, యన్నవస్త్రములిచ్చి, విద్యాబుద్ధులు గరపి, చాలాకాలము పోషించిరి. వారి కళాశాలలోను, పాఠశాలలోను జీతములేకుండ పంచములకు జదువు చెప్పించుచున్నారు.

శ్రీ వీరేశలింగముగారు కూడ పంచమ బాలురకు తమ పాఠశాలలో నుచితముగ విద్యచెప్పించిరి. రఘుపతి వేంకటరత్నము నాయుడుగారు కూడ నీ సమస్యయందు మిక్కిలి యభిమానము గలవారు.

ఈ సమస్య నాకు మిక్కిలి యిష్టమైనది. ఉడుతాభక్తిగ నేను గూడ పంచమోద్ధరణము గూర్చి పనిజేసితిని. 1909వ సంవత్సరము "రామమోహన" పాఠశాలయను పేర నొక పాఠశాల స్థాపించితిని. మొదట పదిమంది విద్యార్థులే చేరినను, క్రమముగ నది నూటయేబదిమంది విద్యార్థులతో నిండియుండెను.

ఏడుగురుపాధ్యాయులు బనిజేసిరి. విద్యార్థుల కుచితముగ పుస్తకములిచ్చి, నుచితముగ జదువుచెప్పించితిని. ఆ దినములలో నా పుస్తకములవల్ల నాకు మంచిరాబడి వచ్చుచుండినందున, నా స్వంత ధనముతోనే పాఠశాలను నిర్వహించుచుంటిని.

శ్రీ పిఠాపురము మహారాజావారు గూడ దీనికి కొన్నివందల రూపాయలు సహాయముజేసిరి. ఈ విధముగ నే నా పాఠశాలను వ్యయప్రయాసలకోర్చి పదమూడు సంవత్సరములు నడిపి, నా స్వంతసొమ్ము మూడు వేలరూపాయలు ఖర్చుపెట్టి, చిట్టచివరకు దానిని యాంధ్రదేశమున మరియెవరును నిమ్నజాతుల నిమిత్తమై ప్రత్యేకముగ పాఠశాలను పెట్టలేదు. ఇటీవల బోర్డువారు వారి నిమిత్తమై పాఠశాలల నచ్చటచ్చట బెట్టుచున్నారు.

భాగ్యవంతులు తమ ధనమును దేవాలయములక్రింద సత్రములక్రింద ఖర్చుపెట్టక, ఈ సమస్యను తీసుకొని నిమ్నజాత్యుద్ధరణము కొరకై వినియోగించిన మన దేశమునకు, మన జాతికి నెంతో మేలుకలుగును.



# శరీర భాష

**- ఆచార్య వల్లూరు లీలావతి**

"శరీరమాద్యమ్ ఖలు ధర్మసాధనమ్'' అన్నారు పెద్దలు. మన పెద్దలు తిని పించిన చద్దన్నం ముద్దలతో మనం శారీరకంగా పెరగడమే కాదు, ఆ చద్దన్నపు మూటలోని మాటలను కూడా ఎంచక్కా మన భావప్రకటనకు అతి సులువైన ఉపకరణాలుగా వాడుకుంటున్నాము. ఈ మాటల పదును ఎలాంటిదంటే ఒక్కోసారి ఎదుటి వారిని నొప్పించకుండా నొప్పించి, అవసరమైన మేరకు కసి తీర్చుకొని, మాటల్లో చెప్పలేని మహాసముద్రమంత భావాన్ని కూడా ముచ్చటగా ఒకటి రెండు మాటల్లో ప్రకటించగలుగుతున్నాం. మానవ శరీరంలోని అనేక భాగాలను మనం ఎలా జాతీయాలుగా మార్చి వాడు కుంటున్నామో ఒకసారి చూద్దాం.

మానవ శరీరంలోని ప్రధానాంగం శిరస్సు. దీనినే తల అని, తలకాయ అనీ, నెత్తి అని కూడా అంటాం. ఊళ్ళో అందరికన్నా పెద్దవయస్సు, అనుభవం ఉన్నవారిని పెద్ద తలకాయ, తలపండినవాడని అంటాము. కొద్దిలో తప్పిన ప్రమాదాన్ని వెంట్రుకవాసిలో తప్పిందనటం, మాటవినని మొండి ఘటాలను తలబిరుసువాడని, తల ఎగరేసి మాట్లాడుతున్నాడని అంటూంటాం. బ్రహ్మ వ్రాసిన వ్రాతను తలరాత అని, అందరికీ సహాయకారిగా ఉండేవారిని తలలో నాలుకలాంటి వారనీ, ఎంత బాధైనా పడి సొమ్ము సమకూర్చడాన్ని తలతాకట్టు పెట్టడం అనీ అనటం కద్దు.

కష్టసాధ్యమైన పని చేయబోయేవాడిని తవ్వి తలకెత్తుకున్నాడని, ఏదైనా అర్థం కాకపోతే జుట్టు పీక్కున్నాడనీ, మేలుచేస్తే నెత్తిన పాలు పోశారనీ, సమస్యలెక్కువైతే తలవాచిపోయిందనీ, మోసగాళ్ళని నెత్తిన కుచ్చుటోపీ పెట్టేరకమని - ఇలా తలను ఎన్ని భావాలు ప్రకటించడానికి వాడుతున్నామో చూడండి!

ఇక నుదురు చూద్దాం. బ్రహ్మరాసే రాతను నుదుటిరాత అనీ, లలాట లిఖితమనీ అంటాము. అర్థం కాని విషయం వింటే నొసలు ముడివేశారనీ, రెండు భిన్నమైన ప్రకృతులు కలవాడిని నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరిస్తున్నాడంటాం.

'సర్వేంద్రియాణాం నయనమ్ ప్రధానమ్' అన్నారు. ఎదురుచూపులు చూస్తుండడాన్ని కళ్ళు కాయలు కాచేలాగ, కళ్ళలో వత్తులు వేసుకొని చూడడం అని, అసూయను కళ్ళలో నిప్పులు పోసుకోవడం అని, బాధ్యతతో కాపాడటాన్ని కంటికి రెప్పలాగ కాస్తున్నాడనీ, గర్వపోతును కళ్ళకు పొరలు కమ్మాయని, కళ్ళు నెత్తికెక్కాయనీ; కపటపు సానుభూతిని కంటితుడుపు మాటలని; మాటపాటించేటట్లు చేసుకోవడాన్ని కనుసన్నల్లో ఉంచుకోవటం అని; అంతులేని కోపం రావటాన్ని మూడోకన్ను తెరవటమని ఇలా కళ్ళతో మూగకళ్ళబాసలు ఎన్నెన్నో చెప్పుకుంటున్నాము.

ఇక చెవులు కూడా చక్కని జాతీయాలుగా ఎలా మలచబడ్డాయో చూద్దాం! రహస్యంగా చెప్పుకోవటాన్ని చెవులు కొరుక్కుంటున్నారనీ, ఆసక్తికరంగా ఉంటే చెవికోసుకున్నారని, మధురమైన మాటను, పాటను వీనుల విందు అని, ఏమాత్రం మన మాటను లెక్కచేయని వాడిని చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లే అని, పదే పదే చెప్పటాన్ని చెవిన ఇల్లు కట్టుకొని పోరటం అని, మనల్ని అమాయకులుగా చేసి మాట్లాడితే చెవిలో పువ్వులు పెట్టారనీ, చెవులు పట్టి ఆడించారని అనటం, చిన్నవారికి ప్రాముఖ్యతనిస్తుంటే ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి అనటం; ఎవరైనా వింటారేమో అని అనుమానించేటప్పుడు గోడలకు చెవులుంటాయి సుమీ! అనటం - ఇలాంటి ప్రయోగాలు చెవికున్న ప్రాధాన్యతను వివరిస్తున్నాయి.

ముక్కు కూడా తక్కువ తినలేదండోయ్! ఎక్కువైన కోపం అనటానికి ముక్కుపుటాలు అదిరేలాగ అని; కాబూలీవాడి స్టైల్లో అణాపైసలతో బాకీ వసూలు చేయటాన్ని ముక్కుపిండి వసూలు చేశారనీ, తొందరగా కోపం వచ్చేవాళ్ళని తుమ్మితే ఊడిపోయే ముక్కు అని, ఆశ్చర్యాన్ని ప్రకటించేటప్పుడు ముక్కున వేలేసుకున్నారని; ముఖ్యులైన వాళ్ళు అని చెప్పేటప్పుడు కన్ను, ముక్కు అని; పూర్తిగా కంట్రోల్ చేస్తున్నారనటాన్ని ముకుతాడు వేశారని, ఆసక్తిలేకుండా

ఆచార్య వల్లూరు లీలావతి, ఫోన్ : 9391632096

చదవటాన్ని ముక్కున పట్టి చదవటమని, మొహమాటం లేకుండా మాట్లాడేవారిని ముక్కుసూటిగా మాట్లాడేవారని అంటాం.

ఇక నోరు ప్రాముఖ్యతను చూద్దాం! అమాయకుడ్ని నోట్లో నాలుక లేనివాడని, నోట్లో వేలుపెట్టినా కొరకలేని వాడని; పోట్లాటకు దిగటాన్ని నోట్లో నోరు పెట్టటమని; మోసగాడని చెప్పటానికి నోట్లో మన్ను కొట్టాడనటం; ఎదురు జవాబు చెప్పలేని మెత్తని వారిని నోరూ వాయీ లేనివాడనటం; దాపరికం తెలియనివారికి నోట్లో నువ్వుగింజ నానదనటం; అలకను వర్ణించడాన్ని మూతిబిగించారనటం, తొందరపడి మాట్లాడటాన్ని నోరు జారారని చెప్పటం; ఎంతకూ మాట్లాడని వాళ్ళను నోటి ముత్యాలు రాలవులే! అనటం, మంచివార్త చెబితే నోరు తీపి చేయాలనటం, మన మాటను బట్టే మన ఇరుగుపొరుగులతో సంబంధాలు ఉంటాయనటానికి నోరు మంచిదైతే ఊరుమంచిదవు తుందనటం, హద్దులేకుండా మాట్లాడేవారిని నోరు మూస్తే మూకుడులేదని వ్యాఖ్యానం చేస్తుంటాం కదా!

ఇక నోటిలోని పండ్లు ఎలాంటి భావాల్ని వ్యక్తీకరిస్తాయో చూద్దాము. వెకిలిగా నవ్వటాన్ని పళ్ళికిలించటమనీ, కోపం హద్దు దాటితే పళ్ళు పటపటకొరుకుతున్నారని, కష్టం కలిగించే సమస్యను సృష్టించే సందర్భంలో పంటి కింద రాయిలాగా అని, విషపు పన్ను అంటూ చెడు ఆలోచనలున్న వాడి మాటను; ఎక్కువగా కోపం వస్తే 32 పళ్ళురాలగొడతాను జాగ్రత్త! అని; భరించలేని చలిని పళ్ళు పటపటలాడిస్తున్న చలి అని అంటూ ఉంటాం కదా!

ఇక నాలుకకున్న ప్రాధాన్యత చూడండి! తరచూ మాటమార్చేవారిని వాడిది నరంలేని నాలుక అని, రెండు నాలుకల వాడని; తప్పుడుమాట మాట్లాడిన వాడిని నాలుక చీరేస్తాననీ, అవసరం లేని విషయాన్ని ప్రచార కార్యక్రమంగా పెట్టుకుంటే నాలుక భుజాన వేసుకొని చెపుతున్నారనీ, చెప్పకూడని విషయాన్ని చెప్పి తరువాత పశ్చాత్తాపపడితే నాలుక కొరుక్కున్నారని, ఏమీ చెప్పలేకపోవటాన్ని నీళ్ళు నమిలారనీ అంటుంటాం కదా!

ఇక పెదవుల విషయానికొస్తే కోపం వచ్చిందనటాన్ని పెదవికొరకటమని, లాభం లేదనే అభిప్రాయానికి పెదవి విరవటమని, ఎలాగో మాట్లాడాడు అనటాన్ని పెదవి కదిపాడనీ, పేదవాని కోపం పెదవికి చేటు అని, పెదవి దాటితే పృథివి దాటుతుందని హెచ్చరించడం కూడా మన జాతీయాలలో చోటు చేసుకున్నాయి.

ఇక గడ్డాలు, మీసాలు కూడా మన జాతీయాలలో ఎలా ప్రాధాన్యత వహిస్తాయో చూడండి. మొనగాడివా? అనటాన్ని మీసం మెలేశాడు చూడు! అంటాం. బడాయి మాటలు చెప్పేవాడిని 'మింగమెతుకు లేదు మీసాలకు సంపెంగనూనె' అని వ్యాఖ్యానిస్తుంటాం. ఇంకా చిన్నవాడివేలే అనేటప్పుడు మూతిమీద మీసమైనా మొలవలేదురా అంటాం కదా! పదే పదే అడగటాన్ని కాళ్ళూ గడ్డాలు పట్టుకొని బ్రతిమలాడారనీ, మాటవినని బిడ్డలను అడ్డాలనాడు బిడ్డలు గాని, గడ్డాలనాడు కాదు అనటం, ప్రయోజకులు కాని బిడ్డలను గడ్డం మీసం రాగానే సరిపోదు అని ఛీత్కరించడం – ఇలాంటి ప్రయోగాలు ఎన్నో, ఎన్నెన్నో!

ఇలా ముఖంలోని వివిధ భాగాలను మనం మన జాతీయాలలో ఏవిధంగా చొప్పించామో పరిశీలిస్తే వాటితో మన భాషను ఎంత పరిపుష్ఠం చేశామో తెలుస్తుంది.

**భావవ్యక్తీకరణలో శరీరం తోడ్పాటు :**

ముందుగా గొంతు(క) గురించి చూద్దాం. గుప్పెడంత గుండెలో గంపెడన్ని భావాలు. వాటిని ప్రకటించడానికి ఎంత ప్రయత్నించినా చెప్పలేని స్థితిలో గొంతు మూగబోయిందని అంటాం. నయవంచన చేసేవారిని తడిగుడ్డతో గొంతు కోశాడంటాము. భయం ఎక్కువైనప్పుడు గొంతు తడారిపోయి మాట్లాడలేకపోవటం మనకందరికీ అనుభవమే! దు:ఖం ఎక్కువైతే గొంతుపూడుకుకుపోవటమని, మాటకు ఎదురు మాట జవాబుగా చెప్తుంటే గొంతులేస్తున్నదే అని, హక్కుల కోసం పోరాడినప్పుడు గళం విప్పారనీ అంటాం.

కలిసికట్టుగా అభిప్రాయం చెబితే గొంతులు కలిపారని, తీరని కోరికలు కోరితే గొంతెమ్మ కోరికలు కోరరాదని, జవాబు చెప్పలేని స్థితిని గుటకలు మింగటం అనీ, జీర్ణం చేసుకోలేని విషయాలు విన్నప్పుడు గొంతు మింగుడుపడటం లేదని, బాధలో ఉన్నప్పుడు ఏదీ గొంతుదిగటం లేదని; అంతులేకుండా తింటే పీకలమొయ్య తిన్నారని – ఇలా గొంతును కేంద్రంగా చేసుకొని ఎన్నెన్నో జాతీయాలు వాడుతూ ఉంటాము.

మరి మన భుజాలు కూడా మన సంభాషణలలో ఎలా పాలుపంచుకుంటాయో చూద్దాం! తప్పుచేశామన్న భావన ఉన్నవాడు గుమ్మడికాయల దొంగెవరంటే భుజాలు

తడుముకున్నాడంటాం. బాధ్యతను స్వీకరించడాన్ని భుజాలపై వేసుకున్నాడంటాం. ఎక్కువైన బాధ్యతలు మోసేవాడిని భుజాలు క్రుంగిపోయినాయి అంటాం. స్నేహం కలిపినపుడు భుజాలు భుజాలు రాసు కుంటున్నారని, పరాక్రమం చూపించడానికి భుజబలం చూపాడనీ, నూటికి నూరు పాళ్ళు సహకరించేవాడిని కుడి భుజంగా ఉన్నాడనీ- భుజాలను ఎన్నో రకాలుగా మనం భాషలో ఉపయోగిస్తున్నాం.

చేతులను గురించి చెప్పాలంటే చాటభారతమంత విషయం ఉన్నది. రెక్కాడితేనే డొక్కాడుతుందని కష్టజీవుల జీవనాన్ని వివరించేటప్పుడు చెబుతాం. రెక్కలు ముక్కలు చేసుకొని అంటే అంతులేని శరీర శ్రమచేసి అని అర్థం. తమదారి తాము వెతుక్కొనే బిడ్డలను రెక్కలొచ్చిన పక్షులుగా చెబుతుంటాం. చెయ్యి తిరగటం అంటే నైపుణ్యం సంపాదించినట్లనీ, చేతులు కలపటం అంటే సహకరించు కోవటమనీ, దొంగతనం చేసే అలవాటును చేతివాటమనీ అంటాం.



ఒకరి దయాదాక్షిణ్యాలను ఆశించితే మోచేతినీళ్ళు త్రాగు తున్నారని, అంతులేని దాన గుణాన్ని 'చేతికి ఎముకలేని వాడు' చేసే దానంగానూ, సమర్పణ, సేవాభావంతో చేసే పనిని 'కుడి ఎడమ అనకుండా' అనీ, తెలిసీ తెలియని వైద్యుడి నిర్వాహాన్ని నీ చేతి మాత్ర వైకుంఠయాత్ర అని, పశ్చాత్తాపాన్ని చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమనీ, బ్రతిమలాడేటప్పుడు చేతులు పట్టుకొని ఇవి చేతులు కావనుకో అనటం. ఒట్టు పెట్టుకొనేటప్పుడు చేతిలో చేయివేయమనటం, ఒకరిని అర్థించడం అనే సందర్భాన్ని చెయ్యిచాపటం అని, ఆధిక్యాన్ని చూపించే సందర్భంలో మన చేయిపైన ఉండటమని, మనకు నష్టం, కష్టం లేకుండా చెయ్యటాన్ని మన చేతికి మట్టి అంటకుండా అని చెపుతాం.

ఒక తల్లిబిడ్డలంతా ఒకేలాగ ఉండక పోవచ్చునని చెప్పేటప్పుడు చేతివేళ్ళు ఐదూ ఐదు రకాలు కాదా అన్న ప్రయోగం, పిసినారివాడని చెప్పటానికి ఎంగిలిచేత్తో కాకిని కూడా తోలడన్న వ్యాఖ్యానం, కడుపునిండా భోజనం అన్న అర్థంలో ఐదువేళ్ళూ నోట్లోకి పోవడం అనటం, గుప్తదానాన్ని వివరించేటప్పుడు కుడిచేత్తో దానం ఎడమచేతికి తెలియకుండా చేయటం అని, అసూయను వ్యక్తం చేసేటప్పుడు మెటికలు విరవడం, సహకారం అంటే చేయి అందించడం అనీ, పాణిగ్రహణం అంటే పెండ్లాడటమనీ, సర్వనాశనం చేశాడనటానికి భస్మాసురహస్తమనీ, ఏమీ ఇవ్వడు అనడానికి మొండి చెయ్యి చూపిస్తాడని, శుష్కప్రియాలు, శూన్యహస్తాలు అనీ, వట్టిమాటలు చెప్పి పొద్దుపుచ్చేవాడిని అరచేతిలో వైకుంఠం చూపిస్తాడనీ, ఇతరులను హింసించి సంతోషిస్తే చేతి దురద తీర్చుకున్నాడని, సంపాదనపరుడైన బిడ్డను చేతికి అందిన బిడ్డ అని అంటుంటాం కదా!

అందిన అవకాశం లుప్తమైతే చేయిజారిపోయిందని, మనచేతుల్లో ఏమీలేదనీ, లోభితనాన్ని విమర్శిస్తూ మీ ఇంట్లో తిని మా ఇంట్లో చెయ్యికడగమనే రకం అనీ, విశ్వాసఘాతకుడిని తిన్నింటి వాసాలు లెక్కించే బాపతు అని, క్షణాల్లో పనిపూర్తి చేయటాన్ని చిటికెలో చేయట మనీ, మనదికాని ప్రతిభకు సంబర పడటాన్ని చంకలు గుద్దుకోవటమని, క్రోధాన్ని వ్యక్తీకరించటంలో మొదటిస్థాయిని గుప్పెళ్ళు బిగించటమని, అలవిమాలిన శ్రమచేస్తే చేతులు అరిగిపోయే శ్రమ అని, అందెవేసిన చెయ్యి అంటే ఎంతో నైపుణ్యం కలిగినవారని, అసమర్థతను చెప్పేటప్పుడు చేతులు కట్టేసినట్లు అనటం, ఇక మనకు దక్కదు అనుకున్న విషయాన్ని చేతులు కడిగేసుకున్నాం అని - ఇలా చేతులు ప్రకటించలేని భావాలు మన భాషలో దాదాపులేనే లేవని చెప్పాలి.

ఇక కడుపు విషయానికొస్తే కడుపు చించుకుంటే కాళ్ళమీద పడేటంత సమాచారం ఉన్నది. ఆశ ఎక్కువగా ఉండేవాడిని కడుపుబ్బరం మనిషనీ, అసూయతో అలమటించే వాడిని కడుపుమంటగాడనీ, పుట్టిన సంతానం మంచిని కోరుకుంటూ పెట్టే వస్తువును కడుపుచలవ అని, కన్నతల్లి ప్రేమను కడుపుతీపి అని, పైపై ప్రేమలు చూపేవారి ధోరణిని కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా అని ఎకసెక్కంగా అనటం వింటూ ఉంటాం. సుఖంగా అని చెప్పటానికి కడుపులో చల్లకదలకుండా అని, లోభితనాన్ని కడుపు కట్టుకోవటం అని, మండుతున్న ఆకలిని కడుపులో ఎలుకలు పరుగెత్తడమని, తిండిపోతుతనానికి సూచనగా తోలు కడుపులో పడితే తోచి ఉంటుందని, జీవికకోసం వెదుకులాడటాన్ని పొట్టచేతపట్టుకొని వెళ్ళటం అని, భరించలేని శోకం వలన కలిగే బాధను కడుపులో బడబాగ్నులు

రగలటమని, గూఢచర్య లక్షణాలున్నవాడిని ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేరకమని– ఇలా ఎన్నెన్నో ప్రయోగాలు కడుపు గురించి కడుపారా చెప్పుకోవచ్చు.

గుండె విషయానికొస్తే తీవ్రమైన దుఃఖాన్ని ప్రకటించడానికి గుండెలు బాదుకున్నారని/గుండెలు అవిసిపోయేలా ఏడ్చారని, తట్టుకోలేని వార్త విన్నప్పుడు గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలయ్యాయని, ఎక్కువగా భయపడితే గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయని, శత్రువుకు హెచ్చరికగా గుండెల్లో నిద్రపోవడమనీ, సంతోషం/ప్రేమ ఎక్కువైతే గుండెల్లో గూడుకట్టుకొని ఉంటానని, ఎక్కువైన భక్తి, ఆరాధనలను చూపించేటప్పుడు గుండెలో గుడికట్టి పూజిస్తామనీ అంటూ ఉండటం కద్దు.

వెన్నెముక లేని శరీరానికి నిలకడ, విలువ లేనే లేవు. మరి వెన్ను విషయానికి వస్తే నిత్యం ధైర్యం చెబుతూ అండదండగా ఉండేవాళ్ళను వెన్నుకాపుగా ఉన్నారని, వెన్ను దన్ను అని, వెన్నెముకలాంటి వాడని, మోసం/వంచన చేసేవారిని వెన్నుపోటు పొడిచేవారని, పిరికిపంద అని చెప్పటానికి వెన్ను చూపించే వెధవ అని అంటూ ఉంటాము.

కాళ్ళు శరీరాన్ని నిలబెడతాయి కదా! మరి భాషలో ఎన్నెన్నో ప్రయోగాలకు కూడా కాళ్లు ఆధార భూతాలవుతున్నాయి. ఎలాగో చూద్దామా? అంతులేని గర్వాన్ని ప్రదర్శించే వాడిని కాళ్ళు నేలమీద నిలవటం లేదని అంటాం. తీవ్రంగా ప్రయత్నిస్తూ ఒక పని పూర్తికావటం కోసం తిరిగేవాడిని కాళ్ళరిగేలా తిరుగుతున్నాడని, కాళ్ళకు బుద్ధి చెప్పాడంటాం, పిక్కబలం చూపించాడని అంటాం. అవకాశవాదుల చర్యలను అందితే జుట్టు, అందకపోతే కాళ్ళ బాపతుగాడు అంటాం.

ఆటంకాలను కలిగించేవారిని కంటి నలుసు, కాలిముల్లు లాంటివాడని, ఏమీ తోచని అయోమయస్థితిని కాళ్ళూ చేతులూ ఆడటం లేదని, కాళ్ళక్రింది నేల కదిలిపోతున్నదని, పిల్లనిచ్చి పెళ్ళిచేయడాన్ని కాళ్ళు కడిగి కన్యాదానం చేశాడని, సుకుమారంగా వ్యవహరించేవారిని పాదాలు కందకుండా నడుస్తారని, కొన్నిరకాల వయ్యారపు నడకలను హంస/పెళ్ళి/పిల్లి నడకలని అని, గర్వపోతును శిరస్సు నుండి శ్రీపాదం వరకు (ఆపాదమస్తకం) అహంకారి అని, నా కాలిగోటికి సరిరావని, పూర్తిగా తమ అధీనంలో ఉంచుకోవడాన్ని గీచిన గీటు దాటకుండా చూడటమని, తగాదాకు సిద్ధపడేవారిని కయ్యానికి కాలుదువ్వుతున్నాడని, తప్పుచేసిన స్త్రీని కాలుజారిందని, సందేహంగా ప్రవర్తిస్తే అడుగులు తడబడ్డాయని, ధైర్యంతో వ్యవహరిస్తే అడుగుముందుకేశారనీ, కాకాపట్టేవాళ్ళను అడుగడుగు దండాలు పెడుతున్నారని, అడుగులకు మడుగులొత్తుతున్నారని, బ్రతిమలాడుకునే సందర్భంలో కాళ్ళా వేళ్ళా పడుతున్నారని, ఒకేసారి రెండు లేదా ఎక్కువ పనులు నిర్వహించాలనుకునేవారిని రెండు పడవలలో కాళ్ళుపెట్టి ప్రయాణిస్తున్నాడని, మోసపోయిన వారిని పప్పులో కాలేశాడని, నిస్సహాయస్థితిని కాళ్ళుకట్టేసినట్లు ఉండటమని, వృద్ధులను మూడుకాళ్ళ ముసలి అని, నీకిక వయసైపోయిందనటాన్ని ముంగాళ్ళు ముందుకు వచ్చినాయని, ఏకులా వచ్చి మేకులా మారేవాడిని వీడిది వామనపాదమని అనటం.

సమస్యలు సృష్టించే తరహా మనిషిని వీడు వీరభద్ర పాదాలవాడురా అనటం, వితండవాదం చేసేవారిని కాలికేస్తే వేలికేసే రకం వారని అనటం, కాలకృత్యాలు తీర్చుకోవడాన్ని కాలుమడిచారని, శుభప్రదం అని చెప్పటానికి శ్రీపాదం ఉంచాడని, అవకాశాల్ని అందుకోలేని వారిని సిరిరా మోకాలడ్డు పెడుతున్నారని, గారం చాలు అని చెప్పటానికి గారం గజ్జెల కోసం ఏడిస్తే వీపు దెబ్బలకోసం ఏడుస్తుందని గద్దించటం, తప్పుచేశాక సరిదిద్దుకోవాలని ప్రయత్నిస్తే అడుసుతొక్కనేల కాలుకడగనేల! అనటం ఇలా చెప్పుకుంటూపోతే వెతకబోయిన తీగ కాళ్ళకు చుట్టుకున్నట్లు ఎన్నెన్నో ఆహ్లాదకరమైన ప్రయోగాలు దర్శనమిస్తాయి!

గోరు అంటే ఎంతో చిన్నదిలే అనుకుంటాం! దానిపై కూడా కొన్ని జాతీయాలు పుట్టి గోటి గొప్పతనాన్ని చాటుతున్నాయంటే నమ్మండి! చిన్న విషయాన్ని (సమస్యను) పెద్దదిగా చెప్పినప్పుడు గోటితే పోయేదాన్ని గొడ్డలిదాకా తేవటమెందుకు అంటారు. ఉన్న బాధలకు తోడు మరికొన్ని బాధలు వస్తే గోరుచుట్టుపై రోకటి పోటులా ఉంది అంటారు.

చిన్న ఆశను గోరంతదీపం కొండంత వెలుగుగా పోల్చి చెబుతుంటారు. అతిశయోక్తిగా మాట్లాడితే గోరంతలు కొండంతలుగా చేశారని అంటారు. గర్విష్ఠిని పరోక్షంగా వీడికి గోరోజనం జాస్తిలే అని ఛీత్కరిస్తూ ఉండటం మనకు తెలుసుకదా!

రక్తం గుండెనుండి వివిధ శరీరభాగాలకు, వివిధ శరీరభాగాల నుండి గుండెకు చేరనిదే జీవనప్రక్రియకు

ఆస్కారమేలేదు. మరి రక్తం భాషలో కూడా తన స్థానాన్ని ఎలా నిరూపించుకుంటున్నదో చూద్దామా? హుషారుగా, ఆవేశంగా ఉండే యువజనాన్ని ఉడుకురక్తంగాళ్ళు అంటాం. అదుపు చేయలేని కోపాన్ని రక్తం సలసలా మరుగుతున్నది అంటాం! అవతలివారి మాటలకు మన బండారం బయటపడితే కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. అంటాం. ప్రతీకారం తీర్చుకుంటాను అనటానికి నీరక్తం కళ్ళజూస్తాను, జాగ్రత్త! అంటూ ఉంటారు. ఆవేశం తీవ్రత తగ్గినపుడు రక్తం చల్లబడిందని అనటం కద్దు. కరుడుగట్టిన తీవ్రవాదిని రక్తపిపాసి అని, రక్తపిశాచి అనీ అంటూ ఉంటాం.

ఇక కొన్ని జాతీయాలు అనేక రకాల శరీరభాగాలకు ప్రాతినిథ్యం వహిస్తూ భాషలో చోటు చేసుకుంటున్నాయి. పొగరుబోతు వదరుబోతు వదరుతూ ఉంటే ఒంటికాలిమీద లేస్తున్నాడని, ఎంతో ప్రాముఖ్యతనిస్తుంటే నెత్తిన పెట్టుకున్నాడని/నెత్తిమీది దేవతలా చూస్తున్నాడనీ, గర్వం హద్దుమీరితే కొమ్ములు మొలిచాయనీ, కళ్ళు నెత్తికెక్కాయని, ఎలాగో రక్షణ పొందాడనటానికి తలదాచుకున్నాడని.

ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాకపోతే మట్టిబుర్ర అని లేక బిడ్డపుడితే ఒడినిండిన సంబరమని, ఎక్కడ అదుపులో ఉంచాలో అక్కడ అలా అదుపుచేస్తే ఉంగరాల వేళ్ళతో మొట్టారని, దూరపు బంధువు అనటానికి వేలు విడిచిన మేనమామ తరపువాడని, అర్థం అన్వయం లేని మాటను వోకాలికీ బోడిగుండుకూ ముడిపెట్టినట్టున్నదనీ తెలివితక్కువగా ప్రవర్తిస్తే నీ తెలివి తెల్లారి నట్లుందనీ, అతి సుకుమారులను ఎకసెక్కం చేస్తూ వేలిమీద గోరు మొలిచిందని ఆశ్చర్య పోవడాన్ని దవడలు నొక్కుకున్నారనీ, బహుకాల దర్శనాన్ని నల్లపూసవై పోయావే అని, నోరు మూయించారని చెప్పటాన్ని నోటికి తాళం వేశాడనీ, మనకు సంబంధం లేదని చెప్పటానికి చేతులు దులిపేసుకున్నామని, దుఃఖాన్ని ఆపుకోవటాన్ని గుడ్ల నీళ్ళు కుక్కుకున్నారనీ, ఆత్రంగా/విచిత్రంగా చూడటాన్ని ఒళ్ళంతా కళ్ళు చేసుకొని చూశారనీ, బుద్ధిమాలిన పనివైపేమొగ్గు చూపేవాడిని అదృష్టం అందల మెక్కిస్తే బుద్ధి బురదలోకి లాగినట్లుంది అని, లంచం అడిగితే బల్లకింద చెయ్యి అని, అతిగా ఆలోచిస్తుంటే బుర్ర వేడెక్కిపోతుందని, ఏదైనా పనిని సాధించడానికి పూనుకోవడాన్ని నడుం కట్టారని, బద్ధకస్తుల్ని ఒళ్ళు ఒంగని వాళ్ళు అని అనటం కద్దు. కష్టపడి పనిచేయమని చెప్పటానికి వళ్ళు వంచండి అని అనటం వింటుంటాం. సరైన ఆలోచన తట్టనప్పుడు బుర్రగోక్కోవడం అని, అసంబద్ధపు పనిచేసి బుద్ధిగడ్డి తిని ఇలా చేశాను అనటం, మనకు సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకోవడాన్ని తలదూర్చడం/వేలుపెట్టడం అని వాడుతూ ఉంటాం.

గొంతుచించుకోవడం, కంఠనాళాలు బద్దలవటం, కొప్పుబిగించడం, గూబగుయ్యిమనిపించడం, చెమటోడ్చడం ఎముకలు నుగ్గవటం, ఎముకల్లో సున్నం లేకుండా తన్నడం, ఆవులిస్తే పేగులు లెక్కపెట్టడం, డొక్కచించి డోలుకట్టటం, పేగులు తోడటం, ప్రాణాలు పణంగా పెట్టడం, ఊపిరి తీసుకోవటం, కళ్ళు తెరిపించడం, కళ్ళకు కట్టినట్లు చెప్పటం, కళ్ళముందు నక్షత్రాలు కనపడటం, వీపు విమానం మోత, చెంపల్లో కెంపులు పూయడం, ఏడ్పు మొహం కడుక్కున్నట్లు, చావగొట్టి చెవులు ముయ్యటం, మనసులో వీణలు మోగటం, తాటతియ్యడం, మాడు పెంకు లేపటం, తొడకొట్టడం, శొంఠి పిక్కలు ఇవ్వటం ఇటువంటి చమత్కారభరితమైన ప్రయోగాలు తెలుగులో కోకొల్లలు.

ఇక అనడానికి, వినడానికి కూడా కొంచెం ఎబ్బెట్టుగా అనిపించినా ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో, అదే నిరక్షరాస్యుల నోటివెంట తరచుగా వినిపించే పదజాలం ఎలా ఉంటుందో చూద్దాం– తల్లి ముండమొయ్యడం, చంకనాకటం, పిర్రకు పీటకట్టుకొని తిరగటం, పిర్ర పింగాణీమోత మోగించటం, తొడసంబంధం తొంభై ఏళ్ళు అనటం, నీ జిమ్మడిపోను(జిహ్వపడిపోను), పురుగులు పడిచావటం, కొవ్వెక్కి తన్నుకోవటం, అమ్మకడుపు కాలడం, బొందపెట్టటం, ముడ్డికి చెదలు పట్టడం, మొహం మండటం వంటి పదజాలం మన తెలుగు భాషకే ఒక ప్రత్యేకతను సంతరించి పెడుతుందనడంలో ఆవగింజంతైనా అనుమానం లేదు.

మనం కొంతవరకూ చెప్పుకున్నవన్నీ ప్రతివారికీ నిత్యజీవిత సంభాషణలో ఎప్పుడో ఒకప్పుడు తళుకు తారల్లాగా మెరుస్తూనే ఉంటాయి. మన భాషను, సంభాషణను మరింత చమత్కారభరితంగా చేస్తాయి. భావాలను ప్రకటించే సామర్థ్యం దాన్ని అర్థం చేసుకోగల సత్తా ఉన్నవారి సమక్షంలోనే చక్కగా పండుతుంది అన్నది మనం కాదనలేని సత్యం. (ఎందుకంటే) ఈ ప్రయోగాలకు శబ్దార్థం, వాచ్యార్థం వేరుగా ఉండటమే దీనిలోని అంతరార్థం. చక్కని భాషను మాట్లాడుదాం! భాషల తల్లికి కైమోడ్పుదాం! మి



# సాహిత్యము-శిల్పప్రస్థానము

- ప్రాచార్య శలాక రఘునాథశర్మ

**సం**స్కృతంలో నన్నయ నాటికే యించుమించుగా సర్వాలంకారసిద్ధాంతాలూ సమగ్రంగా రూపుదిద్దు కున్నాయి. అలంకారం, గుణం, వృత్తి, రీతి, ధ్వని, రసం, ఔచిత్యం మొదలైన ప్రస్థానాలన్నీ శిఖరస్థాయికి చేరుకుని సహృదయుల హృదయాలను ఆనందసాంద్రం చేసివేశాయి. వీనికి సమానస్థాయిలో నిలువగల మరియొక సిద్ధాంతం ఒకటి పుట్టే అవకాశం ఇక లేదని సంభావించే అంతగా సాహిత్యశాస్త్రం విశ్వరూపంలో నిలిచింది. ఈ దశలో తెలుగులో ఒక మహాకవి 'శిల్పం' అనే ఒక వినూతనాంశాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నాడు. అంటే సాహిత్యశాస్త్రంలో ఒక కలికితురాయివంటి ప్రస్థానానికి ఆ పదంతో శ్రీకారం చుట్టాడన్నమాట. కవితాశిల్పం విలక్షణంగా ఒక అనుశీలనాంశంగా 'ఉన్నది' అని ఆయన ప్రకటన తాత్పర్యం. అది కొంచెం తరతమభేదాలతో మహాకవుల కావ్యాలలో ఉండవచ్చు కానీ తాను అందులో పారం ముట్టినవాడనని, అలా చెపితేకానీ చాలమంది పట్టించుకోరనే భావంతో, ప్రకటించాడు. ఆయన మహాభారత గ్రంథాన్ని తుదిముట్టా రచించిన తిక్కనార్యుడు. శిల్ప ప్రణయనానికి 'అమలోదాత్తమనీష' కావాలి అని ఆ మహాత్ముని సంభావన.

విషయ నివేదన మాత్రంతో విశ్రాంతి పొందే వ్యవహారాన్ని వార్త అంటారు. అది హృదయంలో పదికాలాల పాటు పదిలంగా నిలిచి మెదలుతూ ఉండవలసిన అవసరం లేదు. ఆ అవసరం ఉన్న కావ్యార్థం సర్వకాలాలలో సర్వ హృదయాలలో సర్వవిధాలా సజీవంగా నిలిచి ఆనంద సాంద్రస్థితిని కల్గించాలంటే మాత్రం కవివాక్కును పొదవుకొని నిలువవలసిన సామగ్రి చాల పెద్దప్రమాణంలోనే ఉన్నదని గుర్తించారు ప్రాచీన ఋషికల్పులయిన అలంకార తత్త్వనిరూపక ఆచార్యవర్యులు. అది త్రివిక్రమ రూపంలో వృద్ధి పొందటం కూడా మనం చూచాం. నిజానికి వాఙ్మయ ప్రపంచం వస్తుప్రపంచంకంటె చాలా పెద్దది. చాలా గొప్పదీ. ఇందులో లాగానే అందులో కూడా అనావిష్కృతాంశాలు అనంతంగానే ఉంటాయి. ఒకానొక మహామేధావిని నిమిత్తంగాచేసుకొని తమ స్వరూప స్వభావాలను ఆవిష్కరింప జేస్తూ ఉంటాయి. అటువంటి ఒకానొక మహావిషయం వాఙ్మయపరంగా 'శిల్పం'.

శిల్పమంటే పనితనమని వాచ్యార్థం. "శీల్యతే అభ్యస్యత ఇతి శిల్పం శీల ఉపధారణే. ఉపధారణ మభ్యాసః" అని లింగాభట్టు వ్యుత్పత్తిని నిరూపించాడు. మొదట ఇది శృంగారకళకు సంబంధించినదిగాను న్నది. తరువాత వ్యాప్తి పొంది సర్వకళలకు అన్వయించేదిగా రూపొందింది. చంద్రుని పదునారవభాగాన్ని 'కళ' అంటారు. చిత్రనిర్మాణాదికంలోని నేర్పును కళ అంటారు. ఈ సంభావనలవలన ఏదైనా ఒక వస్తువును పరమాకర్షకంగా చేయగల సత్తా ఉన్నదానిని శిల్పం అంటారనే తాత్పర్యానికి మనం రావచ్చును.

పై విచారణను బట్టి సాహిత్యాన్ని అత్యంతాస్వాద్యం చేయగల కవి పనితనాన్ని సాహిత్యపరంగా 'శిల్పం' అంటాము. ఇది ఉంటే కవిత్వం చిరస్థాయి అవుతుంది. అంతేకాదు నిరంతరస్వాద్యమానం అవుతుంది. కవి దీనిమీద తప్పనిసరిగా చూపు పెట్టాలి. ఎందువల్లనంటే కావ్యార్థం ఎప్పటికప్పుడు చచ్చిపోకూడదు కనుక.

సాధారణంగా ఏ శిల్పమైనా నన్ను చూడు, నా అందం చూడు అన్నట్లుగా గాడీగా కన్పట్టదు. అది సునిశితమైన చూపునకు మాత్రమే దొరకుతుంది. అలా దొరికించుకున్న వాడు తాను పొందిన అనుభూతిని సమానధర్ములతో పంచుకొనే సందర్భాలలో ఇదయ్యా దీని స్వరూపం అని ప్రకటిస్తాడు. అది ఉద్బోధకంగా పనిచేయగా తరువాతి సహృదయులు ఆ మార్గంలో మరింత పురోగతి సాధించటానికి ప్రయత్నిస్తారు. సాఫల్యం పొందుతారు. అలా దర్శించిన

వారిలో ప్రప్రథముడు, మనకు తెలియవచ్చినంత వరకూ, తిక్కన. కానీ ఒక విషయం మనం తప్పక ఒప్పుకోవాలి. ఈ శిల్పం అనే మాటను ప్రాచీనాలంకారికులు ప్రత్యేకమైన అర్థంలో వాడకపోయినా సూచనామాత్రంగా చెప్పియే యున్నారు. కాబట్టి ఒకానొక పూర్వాచార్యుడు ఉపయోగించిన "అస్ఫుటస్ఫురితమ్" అనే మాటను ఈ సందర్భంలో మనం స్మరించవచ్చు.

శిల్పమార్గాలు ఇన్నే ఉంటాయనీ, ఇలాగే ఉంటాయనీ చెప్పటానికి వీలులేదు. అవి అనంతముఖాలుగా ఉంటాయి. ఒక శిలలో దేవతామూర్తిని రచించిన మహాశిల్పి కాలిగోరులలో రక్తపుజీరను ప్రస్ఫుటంగా చిత్రించాడు. అలాగే కేశపాశం నొక్కులు హస్తంలోని రేఖలు, నడుమునందలి ఒంపులలోని విన్యాసాలూ మొదలైనవి ఒక్కొక్కని చేతిలో ఒక్కొక్కవిధంగా రూపుదిద్దుకుంటాయి. అక్కడ ప్రేక్షకుడు సావధానంగా చూస్తూ ఉంటే శిల్పి అనితరసాధారణప్రజ్ఞ హృదయం తెరమీద చైతన్యాన్ని చిందులు త్రొక్కిస్తూ ఉంటుంది. అయితే 'ఇంతే సంగతులు' అనే స్థితి ఎన్నటికీ రాదు.

ఆదికవి నన్నయరచనలో శిల్పం అనల్పంగా గోచరిస్తుంది. బహుశః దానిని కంఠపూరంగా అనుభవించి యే తిక్కన మహాకవి అతనిని *ఆంధ్రకవిత్వవిశారదుడు* అని ప్రశంసించి ఉంటాడు. ఆ విధానాలనన్నింటినీ అనుశీలించియే కవితాశిల్పం అనే పదబంధాన్ని సహృదయుల దృష్టికి తీసుకొనివచ్చి ఉంటాడు. రేఖామాత్రంగా కొన్నింటిని నిరూపించటానికి ప్రయత్నం చేస్తాను.

కావ్యనిర్మాణం అనేది ఒక ప్రపంచం వంటిది. ప్రపంచంలో వస్తువైవిధ్యం, భావవైవిధ్యం అనంతంగా ఉంటుంది. ఆ వస్తుభావాలను అభివ్యక్తం చేసే విధానాలు కూడా అనంతంగానే ఉంటాయి. దానికి అనుగుణంగానే భగవంతుడు ప్రసాదించిన వాక్సంపద, ఛందస్సంపద కూడా అనంతంగానే ఉన్నది. శిల్పదృష్టిగల మహాభావుకుడు ఆ అన్నింటినీ సముచితంగానే ఎన్నుకొని రచన చేస్తాడు.

*వేదవ్యాసమహాభారతం*లో దీనిని నిరూపించే ఒక అంశాన్ని మనం గమనించాలి. యుధిష్ఠిరుడు ధర్ముని అంశవలన పుట్టినవాడు. ధర్ముడంటే దక్షిణదిక్పాలకుడు, ప్రాణుల కర్మానుసారం ప్రాణాలు తీయటం, ఘోరమైన శిక్షలు విధించటం, తదనుగుణమైన క్రూరాకారాన్ని అవసరమైన సందర్భంలో ప్రదర్శించటం మొదలైనవి అతని విషయంలో కన్పడతాయి. దానిని బట్టియే యముడు, శమనుడు, అంతకుడు అనే నామాంతరాలు కూడా అతనికి ఉన్నాయి. సాధారణంగా ఛందోనిర్బంధంచేతనో, అలంకారప్రియత్వం చేతనో కవులు వీనిని అంతగా వివక్షలేకుండా ప్రయోగిస్తూ ఉంటారు. కానీ వ్యాసులవారు ధర్మరాజు ప్రసంగం వచ్చిన సర్వసందర్భాలలో ఒక్క ధర్మశబ్దాన్ని మాత్రమే ప్రయోగించారు. అటువంటి సందర్భాలు కొన్ని వందలు ఉంటే ఎక్కడా యమనాథతనూజుడు, అంతకతనూజుడు వంటి వానిని ప్రయోగించలేదు. ధర్మశబ్దాన్ని మాత్రమే ప్రయోగించి అతనిలో ధర్ముని ధర్మాంశమాత్రమే ఉన్నది కానీ యమత్వాది లక్షణాలు దర్శనీయాలు కావు అని చెప్పటం వేదవ్యాసులవారి అభిప్రాయం. *సపాదలక్ష గ్రంథం*లో ఇంత నిష్ఠతో శబ్ద ప్రయోగం చేయటం ఎంత గొప్ప విషయమో మనం గుర్తించాలి. అతిసూక్ష్మేక్షికకు కానీ అందని మహాశిల్ప రహస్యాలు ఇలా ఉంటాయి.

నన్నయ తిక్కనలు నన్నావేశించారని ఆత్మ విశ్వాసంతో చెప్పుకున్న మహాకవి, నన్నయ ప్రసన్న కథాకలితార్థయుక్తిని అనితరసాధారణ ప్రజ్ఞతో సందర్శించిన సహృదయుడూ అయిన విశ్వనాథ సత్యనారాయణ గారు ఇటువంటిదే ఒక విషయాన్ని మన దృష్టికి తీసుకునివచ్చారు. *మహాభారతం అరణ్యపర్వం*లో ఇంచుమించు సగభాగం నన్నయది. అందులో *నలోపాఖ్యానం* రస తుందిలమైన రచన. *నలదమయంతులకథ* ప్రధానంగా కరుణ రసాత్మకం. అట్టికథకు ఉద్ధతగమనం గల వృత్తాలు సముచితంగా ఉండవు. ఆ దృష్టితో నన్నయ సుమారు రెండువందలముప్పది గద్యపద్యాలు గల ఆ ఉపాఖ్యానంలో మత్తేభశార్దూలాలను ప్రయోగించకపోవటం గమనార్హం. ఇది ఎంత గంభీరమైన విషయమో, చూపు ఎంత సునిశితమైనదో మనం గుర్తించాలి. వారు చెప్పిన తరువాత మరింతగా పరిశీలించి చూస్తే నన్నయ *అరణ్యపర్వ* కథారచనలో మొత్తం సుమారు 1500 గద్యపద్యాలు ఉంటే ఒక్క శార్దూలమూ, రెండు మత్తేభాలూ మాత్రమే కనిపిస్తున్నాయి. అంటే *అరణ్యపర్వమే* కరుణరసాత్మకం. అందులో ప్రాయశః ఇటువంటి ఉద్ధతగమనం కల వృత్తాలు పనికిరావని ఆయన రచన మనకు ఉపదేశిస్తున్నది. నన్నయ భారతంలో ఛందో వినియోగానికి సంబంధించి శిల్పపరిధిలో మన హృదయాలను ఆకట్టుకొని

ఆనందింపజేసే విషయాలు చాలా ఉన్నాయి. ప్రస్తావన వచ్చింది కనుక ఛందస్సంబంధమైన ఒకటి రెండు అంశాలను ఇక్కడ పేర్కొంటాను. ఔద్ధత్యం ప్రతీయమానం కావలసిన సర్వ ప్రదేశాలలో శార్దూలమత్తేభాలు ప్రయోగార్హాలని మనం స్థూలదృష్టిలో అనుకుంటాం. కానీ అటువంటి కొన్ని సందర్భాలలో మహాకవి ఉద్దేశపూర్వకంగా సుకుమార గతి కలిగిన చంపకమాలవంటి వృత్తాలను ఎన్నుకోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒక ఉదాహరణ. రాజసూయ మహాధ్వరంలో అర్ఘ్యప్రదాన ప్రస్తావన వచ్చింది. వాసుదేవుడే సర్వవిధాలా అర్హుడని భీష్ముడు నిర్ణయించాడు. యుధిష్ఠిరుడు ఆచరించాడు. శిశుపాలుడు అధిక్షేపించాడు. సహదేవునికి అతి తీవ్రమైన కోపం వచ్చింది. ఇలా అన్నాడు.

**ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి మిచ్చిన దీనికిం దొడం**
**బడమని దుర్జనత్వమునఁ బల్కెడు వీరుల మస్తకంబుపై**
**నిడియెద నంచు దాఁజరణ మెత్తె సభన్ సహదేవుఁ డట్టిచో**
**నుడిగి సభాసదుల్ పలుకకుండిరి తద్దయు భీతచిత్తులై.**

*//భార-సభా-2.30//*

నిజానికి ఇక్కడ మత్తేభమో, శార్దూలమో ఉపయోగించాలి. కానీ నన్నయ యీ భావాన్ని చంపకమాలా సుగంధభరితం చేయటం శిల్పవ్యవస్థలో సంభావింపదగిన అంశం. ఎందుకంటే సహదేవుని యీ విజృంభణ ఆత డనుకొన్నట్లుగా సాఫల్యం పొందదు. ఎందుకో నన్నయ పద్యంలోనే సూచించారు. "సభాసదుల్ పలుక కుండిరి తద్దయు భీతచిత్తులై" అనే వాక్యభాగంతో ఈ ఔద్ధత్యం బుసబుసపొంగుతున్న పాలమీద నీళ్ళు చిలకటం వంటిదిగా అయిపోతుంది కనుక వీరరసం విజృంభించే అవకాశం లేదు కనుక ఉద్ధతవృత్తనిబంధ నాన్ని కవి ఉద్దేశపూర్వకంగా అణచివేసుకున్నాడు. దీనిని సహృదయుడు తప్పనిసరిగా గ్రహించాలి అనే తాత్పర్యం లోనే ఇంతకంటె మహోజ్జ్వలమైన భీమసేనుని అతిభయంకర విజృంభణను కూడా చంపకమాలలోనే కవి నిబంధించాడు.

**ప్రకటిత కోపవేగమునఁ బద్మదళాయతనేత్రముల్ భయా**
**నకతరలీలఁ దాల్చె నరుణద్యుతి నుద్యతమై త్రిశాఖమై**
**భ్రుకుటి లలాటదేశమునఁ బొల్చెఁ ద్రికూటతటి త్రిమార్గగా**
**నుకృతిఁ బ్రభంజనప్రియతనూజున కంతకమూర్తి కచ్చుటన్.**

*//భార-సభా-2.51//*

ఇది రౌద్రవర్ణనమే. భీముడు మదించిన ఏనుగు వలెనో, ఆకలితో ఆమిషం మీదికి దూకుతున్న శార్దూలంవలెనో ఉన్నమాట సత్యమే. కానీ ఆ రౌద్రం ఇక్కడ భీష్మాదుల సామవచనాలవలన చల్లబడిపోతున్నది. భీముడనుకొన్న విధంగా ఫలవంతం కావటంలేదు. అందుచేత మత్తేభ శార్దూలాలు ఇక్కడ సముచితాలు కావని శిల్పి అయిన నన్నయ నిష్కర్ష.

వృత్తము రసభావాదులకు నిర్దిష్టంగా, అనుగుణంగా ఉండాలి అనేది ఒకస్థాయిమాట. సన్నివేశ స్థితి గతులనుబట్టి అందులోనూ అనేకవిధములైన ప్రయోగ రహస్యాలు ఉంటాయి అనేది రచనాశిల్పంలో ఆరితేరిన మహాకవి తీర్పు. ఇటువంటివి సునిశితంగా గమనించియే "అమలోదాత్తమనీష నేనుభయ కావ్యప్రౌఢి ఁబాటించు శిల్పమునం బారగుఁడన్" అని ఆత్మవిశ్వాసాన్ని అద్భుతంగా ప్రకటించిన తిక్కన మహాకవి నన్నయభట్టారకుని *ఆంధ్రకవిత్వవిశారదుండు, విద్యాదయితుండు, మహితాత్ముడు* అని ప్రశంసించాడు. ఈ ప్రశంస తిక్కన గుణగ్రాహితలోని లోతులను అభివ్యక్తం చేస్తుంది.

ఔద్ధత్యం, ఔజ్జ్వల్యం, రౌద్రం అనేవి అప్పటికప్పుడు కాకపోయినా కాలాంతరంలో నైనా ఫలిస్తాయనే స్థితి ఉన్నప్పుడు తదనుగుణమైన వృత్తాన్ని ఎన్నుకోవటం, అందులో కూడ విజృంభణలో కార్యసాధన విధానంలోని అలవోకతనాన్ని అభివ్యక్తం చేయటానికి సౌకుమార్యవ్యంజకమైన వృత్తాన్ని గ్రహించటం వంటివి శిల్పసంబంధ మైన విషయాలు.

భీమసేనుడు దుశ్శాసన వధను గూర్చి ప్రతిజ్ఞ చేయటాన్ని నన్నయ మత్తేభవృత్తంలో నిబంధించారు. దుర్యోధనుని తొడలు విరుగగొడతానని ప్రతిజ్ఞచేయటాన్ని ఉత్పలమాలలో ప్రకటించారు. ఆ పద్యాల నిర్మాణంలో ఉన్న శిల్పాన్ని సహృదయులు గమనించాలి.

**కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులనేకుల్ సూచుచుండన్ మదో**
**ద్ధురుఁడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ**
**కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైల రక్తౌఘ ని**
**ర్ఝరముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్.**

*//భార-సభా-2.233//*

ఇది మత్తేభం. దుశ్శాసనుడు ద్రౌపదిని బట్టలూడ దీయటానికి ప్రయత్నించాడు. అంటే ఆమెను స్పృశించాడు. ఆ విధంగా ద్రౌపదీపరంగా అతనిచేష్ట భీమసేనునికి పరమదుర్భరమైపోయింది. ఆతడు నిలువెల్లా పిచ్చియెక్కిన మత్తేభం ఆవేశించిన స్వరూపంతో ఉన్నాడు. తదనుగుణంగానే

వృత్తమూ, అక్షరనిర్మాణమూ రూపుదిద్దుకున్నాయి. ఇంతేకాదు. ఈ పద్యంలో మరొక అత్యద్భుతమైన శిల్పం ఏర్పడి ఉన్నది. ఇందులో దంత్యాక్షరాలు ముప్ఫై ఉన్నాయి. కోపాభివ్యక్తి దంతాలయందు ప్రస్ఫుటంగా భాసిస్తుంది. ప్రాణంలేని హల్లులు ఏడు ఉన్నాయి. అచ్చుతో కూడిన హల్లును ప్రాణి అంటారు. అచ్చులకు ప్రాణములు అనే వ్యవహారం ఉన్నది. తెలుగు అతిసహజంగా అజంతభాష. కాగా ఒక ప్రయోజనాన్నపేక్షించి కేవలహల్లులను శిల్పి అయిన కవి అధికసంఖ్యలో ప్రయోగిస్తాడు. హన్యమానుని ప్రాణాలు గాలిలో తేలిపోవటాన్ని అటువంటి అక్షరవిన్యాసం స్ఫురింపజేస్తుంది. ద్రోణపర్వంలో భీమసేనుడు ఈ ప్రతిజ్ఞను నిర్వహించినఘట్టంలో దుశ్శాసనుడు అక్కడి కక్కడ ప్రాణాలు కోల్పోయాడు. ప్రకృత సన్నివేశంలో ఆ చావును మనస్సులో భావనామయంగా చేస్తున్న భీముని హృదయంనుండి దూసుకొనివస్తున్న కేవలహల్లులు ప్రాణంలేనితనాన్ని విస్పష్టంగా అభివ్యక్తం చేస్తూ వెలువడ్డాయి. ఇటువంటి నిర్మాణం నాన్యతోదర్శనీయమైన శిల్పానికి సంబంధించిన విషయం.

కాగా దుర్యోధనుని విషయంలో కూడా భీముడు ప్రతిజ్ఞ చేశాడు. దుశ్శాసనుని విషయంలో చేసిన దానికీ దీనికీ చాలా తేడా ఉన్నది. దుర్యోధనుడు తన తొడపై కూర్చోమని ద్రౌపదిని సైగ చేశాడు. ఆమెను భౌతికంగా అంటలేదు. భవిష్యత్తులో భీముడు తొడలు విరుగగొట్టిన తరువాత వెనువెంటనే దుర్యోధనుడు చావలేదు. ఇక్కడ ద్రౌపది కోమలితనం భీముని హృదయంలో కదలాడుతున్నది. ఆమె రంభోరువులు మదిలో మెదలుతున్నాయి. అంటే కోపోద్రేకంలో ద్రౌపదీపరమైన జాలి సంకీర్ణమై ఉన్నది. అంతేకాదు. మానసికబాధా తీవ్రత మొదటిదశలో కంటె తరువాతదశలో కొంచెం పలచ బడుతుంది. ఇంత భావశబలత భీమసేనుని వాక్య వైఖరిని మార్చివేసింది. ఫలితంగా ఇక్కడ ఉత్పలమాల రూపు దిద్దుకోవటం సంభవించింది.

**ధారుణి రాజ్యసంపద మదంబునఁ గోమలిఁ గృష్ణఁ జూచి రం**
**భోరు నిజోరుదేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము దు**
**ర్వారమదీయబాహుపరివర్తిత చండగదాభిఘాత భ**
**గ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్.**

*॥భార-సభా-2.249॥*

శిల్పసంభావనలో మనం ఇక్కడ గుర్తించ వలసిన అంశాలు ఇలా ఉంటాయి. 1. దుశ్శాసనవధ ప్రతిజ్ఞ పద్యానికీ, దీనికీ 16 పద్యాల అంతరం ఉన్నది. అది ప్రథమానుభూతిని ఎలా క్రమంగా ప్రమాణశైథిల్యానికి దారితీస్తుందో చెబుతుంది. 2. ఇది ఉత్పలమాల. భీమసేనుని క్రోధోద్వేగాన్ని ద్రౌపదీగతమైన ఆర్ద్రత ఎలా నియంత్రిస్తున్నదో ఈ వృత్తం తెలియజేస్తుంది. 3. వెనుకటి పద్యంలో పొల్లక్షరాలు ఏడు ఉన్నాయి. ఇందులో ఒక్కటి మాత్రమే ఉన్నది. అది కూడా పద్యపరిసమాప్తిలో. ఇది దుశ్శాసన దుర్యోధనుల చావులలోని వ్యత్యాసాన్ని అభివ్యక్తం చేస్తుంది.

4. ఈ పద్యంలో 'ర'కారాలు పదునారు ఉన్నాయి. రకారం అగ్నిబీజం. అది భీమసేనుని హృదయంలో చెలరేగుతున్న కోపజ్వాలలకు సంకేతం. ఇక్కడ మరొక్క విషయం కూడా చెప్పుకోవాలి. సంస్కృతంలో వర్ణాలన్నింటికీ నిర్దేశాది సందర్భంలో 'కార' ప్రత్యయం చేరుతుంది. రవర్ణానికి మాత్రం 'ఇఫ' ప్రత్యయం వస్తుంది. కాగా 'రేఫం' గా ఏర్పడిన ఈ శబ్దానికి "రిఫ్యతే వస్త్రాది విపాటనవదుచ్చార్యతే ఇతి రేఫః" అని వ్యుత్పత్తిని శాస్త్రకారులు చెప్పారు. 'పర్' మని చిరిగింది అంటామే అటువంటిదాన్ని ఇది అభివ్యక్తం చేస్తుంది. కాబట్టి రేఫాక్షరబాహుళ్యం గుండెలు చీలిపోయేంతగా కలిగిన దుఃఖాన్నీ, చీల్చివేయాలన్నంత క్రోధాన్నీ తెలియ జేస్తుంది. నన్నయ ఈ పద్యంలో ఆ దృష్టితో రేఫను పదునారుపర్యాయాలు ప్రయోగించటం సంభవించింది. అతినిశితంగా పరీక్షిస్తే కానీ గోచరించని అద్భుతశిల్పవిన్యాసం ఇది.

ఇలా సన్నివేశాన్ని తీర్చిదిద్దటంలో కవికి నిశ్చితమైన అభిప్రాయం ఉంది అనటానికి మరికొన్ని సంకేతాలు కూడా మనకు సహకరిస్తాయి. దుశ్శాసనుని వధనుగూర్చి ప్రతిజ్ఞ చేసిన దానిని చెప్పిన పద్యానికి వెనుక నన్నయ ఒక వచనాన్ని నిబంధించాడు. అది –

వ. ఇట్లు భీమసేనుండు ద్రుపదరాజనందనకు దుశ్శాసనుండు చేసిన యవమానంబు సూచి కోపరక్తాంత నయనుండగుచు నంతకాకరంబున దంతసందష్టదారుణ ముఖుండయి యెల్లవారును విన నిట్లనియె.

కోపరక్తాంత నయనుండు, అంతకాకారుండు, దంతసందష్టదారుణ ముఖుడు – అన్న పదబంధాలు కురువృద్ధుల్ అనే పద్యంలో ఎలా శిల్పరూపంలో సమన్వయిస్తున్నాయో మనం ఇంతకుమునుపే చూచాం. దంత్యాక్షర బాహుళ్యం దంతసందష్టతను అభివ్యక్తం చేస్తుంది.

అంతకాకారంబున అనే ఉపమ భావి దుశ్శాసన వధను సూటిగా తెలియజేస్తుంది. కోపరక్తాంతనయనత్వం వక్షశ్శైరక్తౌఘనిర్ఝరస్థితిని రూపుకట్టిస్తుంది. ఒకసారి అటుముందుకు వెళ్ళి దుర్యోధనసంబంధ ప్రతిజ్ఞకు ముందున్న పద్యాలను పరిశీలిద్దాం.

**అమ్మదితన్ విభీతహరిణాక్షిఁ గలాపవిభాసికేశభా**
**రమ్మున నొప్పుదానిఁ దనరమ్యపృథూరుతలంబు నెక్కగా**
**రమ్మని సన్నసేసె ధృతరాష్ట్రసుతాగ్రజుఁ డప్పు దాని దూ**
**రమ్మునఁ జూచి కౌరవకురంగమృగేంద్రుఁడు భీముఁ డల్కతోన్.**
**లయ సమయదండధర ని**
**ర్దయుఁడై ధరణీశు లెల్లఁ దనపలుకులు వి**
**స్మయ సంభ్రమ భయసంభృతు**
**లయి వినుచుండంగ నిట్టు లనియెన్ సభలోన్.**

*॥భార.సభా.247.247॥*

భీముడు మొదట కౌరవకురంగమృగేంద్రుడైనాడు. అంటే నూరుగురు సోదరులకు పెద్దవాడైన దుర్యోధనుడు చేసిన పాపకృత్యానికి అతని తమ్ములందరూ ఫలం అనుభవింప వలసినవారే.

**"కర్తా కారయితా చైవ ప్రేరక శ్చానుమోదకః**
**సుకృతే దుష్కృతే చైవ చత్వారః సమభాగినః"**

అని కదా లోకధర్మం. చేసినవాడూ, చేయించినవాడూ, ప్రేరణచేసినవాడూ, ఆమోదించినవాడూ పుణ్య పాపఫలాలను సమానంగా అనుభవిస్తారు. కాబట్టి భీముడు కౌరవులనే కురంగాలకు మృగేంద్రుడు కావటం సముచితమే. వెనుకటి సన్నివేశంలో భీముని దృష్టిలో దుశ్శాసనుడు మాత్రమే దండ్యుడు. కాబట్టి అంతకాకారుడైనాడు. కానీ యిప్పుడు కౌరవకుమారులతోపాటు వారి పక్షాన్ని అవలంబించిన వారందరూ హంతవ్యులే. అందువలన అంతకుడు ఇక్కడ లయసమయదండధరుడైనాడు. అంటే అక్కడ ఒక్కని చావు. ఇక్కడ మంది చావు. ఈ భేదాన్ని సూచించటానికి ఉపమానం సవిశేషంగా నిబంధించాడు మహాకవి.

దుశ్శాసనుని విషయంలో భీముడు ప్రతిజ్ఞావాక్యంలో ఆయుధవిశేషాన్ని పేర్కొనలేదు. "లోకభీకరలీలన్ వధియించి" అని మాత్రమే అన్నాడు. దుర్యోధనవిషయంలో "దుర్వారమదీయ బాహు పరివర్తితచండగదాభిఘాత భగ్నోరుతరోరుఁ జేయుదు" నని పలికాడు. అంటే ఆయుధ ప్రస్తావన వస్తున్నది కనుక ముందుగా తత్పూర్తికోసం "దండధర" శబ్దాన్ని ప్రయోగించాడు. అక్కడ 'అంతక' అన్నది ఇక్కడ 'దండధర' కావటంలో కవిహృదయం ఏమిటో మనకు విస్పష్టంగా తెలియవస్తున్నది. దానివలన శబ్దప్రయోగశిల్పమార్మికత మనకు చక్కగా గోచరిస్తుంది.

ఇటీవల సహృదయులు 'నాటకీయత' అనే మాటను బహుళంగా ప్రయోగిస్తున్నారు. అయితే సంవాదాత్మక, సంభాషణాత్మకశైలి ఉన్నచోటనే అది ఉన్నట్లుగా పలువురు భావిస్తున్నారు. కానీ నిజానికి సన్నివేశాన్ని ప్రత్యక్షకల్పం చేయటం నాటకీయత. దానికి శిల్పవిజ్ఞానం పరమోదాత్తమైన ఆకర్షణ. తెలుగు కవులకు కవితాశిల్పజ్ఞానాన్ని పుష్కలంగా అందించినవాడు నన్నయ. అందుకొన్నవారిలో ప్రముఖ స్థానంలో నిలిచి ప్రయోగించి చూపించిన వారు తిక్కన, విశ్వనాథలు.

కనుక తిక్కన, విశ్వనాథల కవిత్వాలలో రేఖా మాత్రం గానయినా శిల్పదర్శనం చేయకపోతే ఈ వ్యాసం అసమగ్రమవుతుంది. తిక్కన్నమహాకవి తెలిసి తెలియజెప్పి ప్రయోగించాడు కనుక అతని రచనలో మనకు శిల్పం సమృద్ధిగా లభిస్తుంది. ఒక్క మెతుకుపట్టి చూపుతాను. సందర్భం దక్షిణగోగ్రహణం. బృహన్నలకాక తక్కిన నలుగురు పాండవులు విరాటునికి సాయంగా యుద్ధానికి వెళ్ళారు. విరాటుడు సుశర్మకు చిక్కిపోయాడు. ధర్మరాజు భీముణ్ణి తొందరిస్తూ ఇలా అన్నాడు.

**ఇతని యాశ్రయమున మన మెల్ల బ్రదికి**
**యున్నవారము గావున నుగ్రరిపుల**
**పాలుపడకుండ విడిపింప ఁబాడి యితని**
**నెయిదు మెయిదుము రథరయ మెసక**

*మెసగ్గ. ॥విరాట. 3. 204॥*

ఆమాటలు విన్న భీమసేనునికి ఉత్సాహమూ, కసీ ఒక్కపెట్టున విజృంభించాయి. మనస్సులో ఒక నిర్ణయానికి వచ్చాడు. అయినా అన్న అనుమతి లేకుండా ఏ పనీ చేయని సుశిక్షితవ్యక్తిత్వం ఉన్నవాడు కనుక ఇలా అన్నాడు.

**అనవుడు మేను పెంచుచు మహాబలనందనుఁ డప్పు డన్న కి**
**ట్లను నిదె సాలవృక్షము రయంబున దీన నరాతిసేన దొ**
**ల్ల నడిచి యా సుశర్ముని బలంబుఁ జలంబును మాన్పి యవ్విరా**
**టుని విడిపించెదన్ రణపటుత్వము వైరులు పిచ్చలింపగన్.**

*॥విరాట. 3. 205॥*

ఇక్కడ మహాబలనందనుడు పొంగివస్తున్న ఉత్సాహాన్ని

నియంత్రణ చేసికొనవలెనేమో అన్న మనస్తత్వంలో ఉండి ధర్మజునితో మాటాడుతున్నాడు. నేరుగా కార్యరంగంలోనికి దూకే అవకాశం ఉంటే ఇక్కడ గ్రహింపవలసినది శార్దూలమో, మత్తేభమో. కానీ విజృంభణను త్రొక్కిపెట్టవలసిన పరిస్థితి ఉండటంవలన దానిని స్ఫురింప జేస్తూ తిక్కన చంపకమాలను గ్రహించటం శిల్పప్రక్రియలోని నిగూఢాంశంగా మనం సంభావించాలి. విశ్వనాథసత్యనారాయణగారి *కల్పవృక్షం*లో శిల్ప విశ్వరూపాన్ని మనం ఆస్వాదించి ఆనందించాలి. విశ్వనాథ

**"అమృతోత్క్రుంచితముం గథాకథన శిల్పానేక మార్గాభి రా**
**మము నిద్దాని నరణ్యకాండము ప్రభూ మన్నింపవే దైత్య రూ**
**పము పెంపొందిన వేల్పులన్ మనుచుటప్పా యెట్టిదో, మ్లేచ్ఛ భావము**
**పెంపొందిన విప్రులన్ మనుచుటప్పా యిట్టిదే ధూర్జటీ!**

*॥అరణ్యకాండ. ఖండాంతపద్యం॥*

ఇత్యాదిగా శిల్పప్రసక్తిని అనేకసందర్భాలలో తెచ్చారు. ఆయన శ్రీరామచంద్రుణ్ణి 'బహుదూరశిల్పి' అన్నారు. వీనిని బట్టి కవితాశిల్పాన్ని మిన్నులు ముట్టేట్లు చేసిన మహానుభావునిగా విశ్వనాథను సంభావించటం సముచితం. స్థాలీపులాకన్యాయంగా ఒక్క చిన్న ఉదాహరణ.

**అవునయ్యా! అవు నిత్తునంటి మొద లీయంతంబునం దీయ నం**
**టివి పోనీ! రఘువంశయోగ్యమగునో నీచేత నీకు శుభం**
**బవు నీ పుత్రులు నీవునున్ సుఖము పెల్లైయుండు ఁడే ఁబోదు**
**మానవనాథా! సుఖమౌత నీకును ప్రతిజ్ఞాభంగపుణ్యాబ్ధికిన్.**

*॥బాలకాండము॥*

ఇది విశ్వామిత్రుడు దశరథునితో అన్నమాట. తన యజ్ఞరక్షణకోసం రాముణ్ణి పంపమని విశ్వామిత్రుడడిగినపుడు, అంతకు ముందు దశరథుడు

**ఇది యడుగవచ్చుఁ గాదని**
**మది నెంచకు దేదియైన మామకపుణ్యా**
**స్పదము హఠాత్స్ఫురితము నీ**
**వదనంబున నుండి రానె వలయును స్వామీ!**

అని వెనుకా ముందూ చూడకుండా అన్నవాడు రాముణ్ణి అడిగేసరికి గతుక్కుమని పుత్రవ్యామోహంతో 'నేనివ్వను' అనివేశాడు. విశ్వామిత్రునికి కోపం వచ్చింది. అయితే కార్యసాధనను దెబ్బకొట్టే కోపం కాదు. అయినా ఉద్వేగం లోపలనుండి ఉబికి ఉబికి వస్తున్నది. నీకు సుఖం అవుతుందిలే, నీ కొడుకులూ నీవు సుఖంగా ఉంటారులే. ప్రతిజ్ఞాభంగం చేయటమనే పుణ్యానికి సముద్రం అయిన నీకు కూడా సుఖమవుతుందిలే అంటూ రుసరుసలాడాడు. నిజానికి లక్షణదృష్టితో చూస్తే పునరుక్తిదోషం. కానీ సందర్భాన్నిబట్టి శిల్పపరిధిలో గుణంగా మారిపోతున్నది. విశ్వామిత్రుడు 'సుఖం' అన్న ప్రతిపర్యాయం దశరథుని గుండెమీద ఒక సమ్మెటపోటు పడ్డ స్ఫూర్తి యిక్కడ ఉన్నది. మానవనాథా! అనే సంబోధనలో దిమ్మతిరిగిపోయే అధిక్షేపణ ఉన్నది. తన తాతముత్తాతల పరమోదాత్త లక్షణాలను "సత్యాయ మితభాషిణామ్" ఇత్యాదిగా కాళిదాసు సమీక్షించినవానిని స్మరణకు తేవటానికి "రఘువంశ యోగ్యమవునో నీచేత" అన్నవాక్యం ప్రయుక్తమైనది. వాగౌద్ధత్య స్ఫోరకంగా మత్తేభం రూపుదిద్దుకున్నది. 'నీకున్, నీ పుత్రులు, నీవు, నీకును అని చతురావృత్తికమైన యుష్మచ్ఛబ్దం దశరథుని త్రికరణాలనూ క్షోభపెట్టే విధంగా ప్రయుక్తమైనది. ఈ పద్యంలోని శిల్పం రాముని ఆశించివచ్చిన విశ్వామిత్రుని, వ్యామోహంతో ఈయలేనన్న దశరథుని అంతరంగబహిరంగ వ్యాకులస్థితిని పరమమనోజ్ఞంగా తెలియజేస్తున్నది.

మహాకవుల వాక్కులను చూడటం కాదు, చదవటం కాదు, పఠించటంకాదు, అనుశీలించటం దగ్గర కూడా ఆగిపోగూడదు. ఉపాసించాలి. అప్పుడే శిల్పరహస్యాలు మనకు గోచరిస్తాయి.

ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యులవారు ఇటీవలి సహృదయసమాజంలో మహాకవుల వాగుపాసన చేసిన కొద్దిమందిలో గణింపదగిన వ్యక్తి. ప్రధానంగా వారు తెలుగుఛందస్సును గూర్చి చేసిన పరిశోధన నన్ను చాలా చిన్నతనంలోనే ఆకర్షించింది. అందుకనే ఈ వ్యాసంలో ప్రధానంగా ఛందస్సంబంధంగా గోచరించే శిల్పాన్ని నిరూపించటానికి నేను ప్రయత్నం చేశాను.

విశ్వనాథ వారన్నట్లు 'శిల్పానేకమార్గాలు' ఉన్నాయి. సాహిత్యశాస్త్రంలో తెలుగువారి ప్రత్యేకసమర్పణగా మనం శిల్పాన్ని దర్శించాలి. మా గురుదేవులు ఆచార్య పాటిబండ మాధవశర్మగారు ప్రసాదించిన స్ఫూర్తి కూడా ఈ రచనలో గణనీయంగానే ఉన్నది. మహాకవుల, మహాభావుకుల ప్రజ్ఞాప్రాభవాలను మనం మరింతగా ఉపయోగించుకొని రసానందసామ్రాజ్య పట్టాభిషిక్తులం కావాలి. రసమంటే పరమాత్మయే కదా!

హరిః ఓమ్ తత్సత్.



# కూచిపూడి నాట్యసంప్రదాయం:
## నేను చేసిన ప్రయోగాలు

**– వెంపటి చిన్న సత్యం**



పండితులు, ప్రయోగకర్తగా, కల్పనాచతురునిగా, ప్రజలు–కూచిపూడి నాట్యరీతుల పునరుజ్జీవకారునిగా నన్ను ప్రస్తుతించటం చాలాసార్లు విన్నాను. సుదీర్ఘమైన నా జీవనప్రయాణంలో ఇప్పుడు ఒక్కసారి ఆగి, ఈ ప్రశంసలకు నా అర్హతను, నా ప్రయోగాల ఫలితాలను మూల్యాంకనం చేసుకోవాలనుకుంటున్నాను. నా లోగొంతు 'ఈ ప్రయోగాలు కల్పనలు కేవలం ప్రయోగాలకోసమేనా లేక నాలోని సృజనాశక్తి ఒక మార్గాన్వేషణలో కొత్తపుంతలు ఏర్పరచినదా?' అని మెల్లగా అడుగుతూనే ఉంది.

నాకు బాగా గుర్తుంది. చిన్నవానిగా ఉన్నప్పుడు ఎప్పుడూ అశాంతితో అతలాకుతలమై పోతుండేవాడిని. 1950 ప్రాంతంలో, నా ఆలోచనల వ్యక్తీకరణకు ముఖ్యమార్గదర్శకులు వెంపటి పెదసత్యం – నా గురువులైన వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి. అంతేగాక, శ్రీమతి కమలా లక్ష్మణ్ ప్రదర్శనలు చాలా నేను నిద్రాహారాలు మాని వీక్షించాను. నిజానికి ఇవన్నీ నాకు కూచిపూడి నాట్యకళారీతుల్లో (అభినయం–సాంకేతికం) అపారమైన శక్తిసామర్థ్యాలున్నట్లు తెలియజెప్పినది.

అలాగే నా జీవితంలో ఒక మలుపు – 1959లో కావలి, జవహర్‌భారతి కళాశాలవారు ఆహ్వానించి – వారి విద్యార్థులకు బి.ఎన్. రెడ్డి సూచనమేరకు నృత్యరూపకాన్ని నేర్పించమని అడిగినప్పుడు జరిగింది! ఈ అవకాశం నాలోని అశాంతశక్తికి ఒక రూపం ఇవ్వటానికి ఎంతో ఉపయోగపడింది. అంతేకాదు– నా స్వేచ్ఛాలోచనల క్రమబద్ధీకరణకు, ఊహాలోకంలో విహరిస్తున్న కల్పనలను మూర్తిమంతం చేయటానికి దోహదం చేసింది. సరిగ్గా ఈ సమయంలోనే డాక్టరు ఎస్వీ భుజంగరాయ శర్మ, (రచయిత) ద్వారం భావనారాయణ రావు గార్లు (సంగీత దర్శకులు) పరిచయ సహకారాలు అందినాయి. కాలేజీ విద్యార్థులకు ఒక సోలో, ఒక బృంద నృత్యరూపకాన్ని తయారుచేసి, తర్ఫీదు ఇచ్చి – మైసూరు ఇంటర్ కాలేజీ ఫెస్టివల్ (1959) సందర్భంగా ప్రదర్శింప జేశాను. నా ప్రయోగాలకు అదే నాంది!

ఆ తర్వాత *చండాలిక* లాంటి నృత్యరూపకాల పరికల్పనకు దారిచూపింది కూడా ఈ అనుభవమే. ఇప్పటికి నా స్వీయచరిత్ర చెప్పటం నా ఉద్దేశ్యంకాదు. ఒక రకంగా అసంఖ్యాకమైన నా ప్రయత్నాలకు – కూచిపూడి నాట్యరీతులలోని అపారమైన (సాంకేతిక, సంగీతపరమైన, ఆహార్యపరమైన, అలంకరణ తీరుల్లో ఇంకా మేకప్ విధానంలో) అవకాశాలు నాకెంతో ఉపయోగపడినాయి. స్థూలంగా చెప్పాలంటే – ఈ నృత్యరూపకాలన్నింటినీ సామాన్య ప్రేక్షకులకు అందంగా, శాస్త్రపరంగా అందించాలని నాలో రగులుతున్న కోరికకు ఇది గొప్ప అవకాశం.

ఈ విషయంలో–నేను ఎక్కువగా 'ఆంగికానికి', 'సాత్విక అభినయా'నికి మాత్రమే పరిమితమవటానికి నిశ్చయించు కున్నాను. ఈవిధంగా నా నృత్యరూపకాలన్ని 'వచనం' లేకుండా గానరూపానికే పరిమితం చేశాను. ఇతరులకంటే భిన్నంగా ఉండాలనే తపన ఈ నృత్యరూపకాలను ఎన్ని విధాలుగా కొత్తకోణాలలో చూపించగలనో ప్రయత్నించాను.

సంగీతంలో, సంప్రదాయబద్ధమైన కర్ణాటక రాగాలతోపాటు, హిందూస్థానీ, కర్ణాటకలో అరుదైన రాగాలను–భావ, రసస్ఫోరకంగా కంపోజ్ చేయించాను. రంగాలంకరణతో సూచనప్రాయంగా, మేకప్, ఆహార్యంలో (సౌందర్యానికే) రమణీయతకే వీలయినంతవరకూ ప్రయత్నించాను. ఆ విధంగా నానృత్యరూపకాలు 'చండాలిక' తో కొత్త ప్రయోగంగా రూపుదిద్దుకున్నాయి.

*చండాలిక* గురుదేవుడు – రవీంద్రనాథ్‌టాగోర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా – నోబెల్ బహుమతి గ్రహీత స్వయంగా వ్రాసిన కథారూపకమే! అది సమకాలీన సాంఘిక సమస్యను చిత్రించినది కారణంగా అది నాకు సవాలుగా మారింది. ఎందుకంటే, కూచిపూడి సంప్రదాయంలో ఎక్కువగా పురాణసంబంధమైన ఇతివృత్తాలే వుంటాయి. *చండాలిక*తో నేను పెద్ద ప్రయోగమే చేశానని చెప్పాలి! దానికి కారణాలు – మొదటిది ఈ కథలోని సంప్రదాయబద్ధంకాని వైవిధ్యం, రెండోది దాని సమకాలీనత, మూడోది ఇది విద్యార్థులకు, యువతకు ఉద్దేశించినది– అంటే పండితులకోసం ప్రదర్శించడంలేదు– నిర్మలమైన విద్యార్థులు అంటే వారి మీద ఎటువంటి ప్రభావాలులేవు. అదిగో ఈ కారణాలన్నింటివల్లను – *చండాలిక* ఒక ప్రయోగంగా నిలిచిపోయింది.

కథాసందర్భంగా, నా నృత్యరీతులను, జానపద వాతావరణ సృష్టికి, పూలమ్మేవారు, పాలమ్మేవారు, గాజులమ్మేవారు, నాట్యాలతో చేయగలిగాము. ఈ విధానంలో పాలమ్మి అభినయం, గాజులమ్మి కదలికలు కూర్పు చేసినప్పుడు, 'చతురస్ర', 'తీస్ర' గతులను ఉపయోగించాం. అన్నింటి కంటే ముఖ్యమైనది – 'మాయ' కోసం నేను కూర్పుచేసి నృత్యం– ఈమె 'ప్రాకృతి' కి అమ్మ. ప్రాకృతి *చండాలిక*లో ప్రధానపాత్ర! తనయి అభ్యర్థన మేరకు 'బుద్ధభిక్షుని' తీసుకురావటానికి – మాయ క్షుద్రశక్తులను



ఆహ్వానిస్తుంది. ఈ సన్నివేశంలో పాటలేదు. వచనం వాడము కదా – అందుకని వాద్యాల ధ్వనినే ఉపయోగించాము. వాటితోపాటు 'జతుల'ను 'థిమ్' 'తథిమ్' శబ్దాలలో వింత వాతావరణం ఆవిష్కరింపబడింది!

ఇక నృత్యరీతిలో, 'మాయ'తో పాటు ఆరుగురు బాలికలు–వీరు దుష్టశక్తులకు ప్రతీక– వీరి ఆహార్యం అందుకు తగినట్లుగా పెద్దవిగా, జుత్తు వదులుగా వుంచి చూపించాము. వారి కదలికలు కూడా పెద్దఅంగలతో గాలిలోకి ఎగురుతూ – వృత్తాలు సృష్టిస్తూ చూపాము. మెల్లగా మొదలయి–'మాయ' నృత్యం ఆమెతో పాటు ఆరుగురు బాలికల దుష్టశక్తుల కదలికలతో – పదినిమిషాలలో పూర్తి టెంపోలోకి వచ్చేది. ఇది సాధన చేసినపుడు కొంతమంది దానిప్రభావంపై సందేహాలు వెలిబుచ్చినా నా పట్టుదలతో చివరికి సీను బాగా రక్తికట్టింది. ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.

*చండాలిక* విజయం నాకు కొత్త నమ్మకాన్ని, శక్తిని ఇచ్చింది. ఈ అనుభవంతో మరొక ముఖ్యమైన నృత్యరూపకాన్ని సృష్టించాలని నిర్ణయానికి వచ్చాను. అదే *పద్మావతి శ్రీనివాస కళ్యాణం.* ఇది *చండాలిక*కు పూర్తిగా భిన్నమైనది. ఇది పౌరాణికం! ఇందులో నా ప్రయత్నమంతా ఇప్పటివరకు చేసిన ప్రయోగాలను ముందుకు తీసుకొని వెళ్ళడమే. ఈ కథాంశం కూడా పూర్తిగా వైవిధ్యంతో నిండి వుంది. ఇందులో దేవతామూర్తులు మహావిష్ణు, లక్ష్మి, బ్రహ్మ, సరస్వతి, శివుడు, పార్వతి వంటి దేవుళ్ళతోపాటు మానవమాత్రులయిన చోళరాజు, వకుళమాత వంటివారు కూడా వున్నారు. అంతేకాదు ఇంకా అతి సామాన్యులైన గొల్లభామ రూపంలో లక్ష్మి, సోదిచెప్పే స్త్రీ కూడా వున్నారు. ఇవన్నీ నాకు, సంగీతపరంగా, నృత్యరీతిలో, కథా సంవిధానంలో గొప్ప అవకాశం కలిగించాయి– ప్రయోగానికి, ప్రత్యేకతకు!

ఈ కథాంశం ఆలోచన రాగానే – నాతోపాటు, డాక్టరు భుజంగరాయశర్మ (వీరే మాకు రచన అందించేవారు) సంగీత రావు (వీరు సంగీత దర్శకత్వం – మొదట్లో భావనారాయణరావు సహాయం చేసినారు) మేము

ముగ్గురం ఎప్పుడూ చర్చించి- చర్చించి మార్పు చేర్పులు చేస్తూ అభినయానికి అనువుగా సంగీతం-పాటల రచన సాగేది. ఒకరకంగా నా ఆలోచనకు ఆకృతినిచ్చింది వారిద్దరే అని చెప్పాలి. ఎక్కడ ఏ పదం వాడాలో ఏ సందర్భంలో ఏ 'సంగతి' పెట్టాలో- మా ముగ్గురి సమన్వయంతో నా ప్రదర్శనలన్నీ ఎంతో విజయవంతం కావటానికి ముఖ్యకారణమనాలి.

*పద్మావతి శ్రీనివాస కళ్యాణం* లో నేను చేసిన, చెప్పుకోదగిన ప్రయోగాలు కొన్ని చెప్పాలి. వకుళమాత కృష్ణునికోసం తపస్సు చేస్తూ శ్రీనివాసుని అవతారంగా రావాలని (అదీ గొల్లవానిలాగా) ఆశిస్తుంది. ఇంతకుముందు- వకుళ వయసుమళ్ళినది-అంటే నృత్యం చేయటానికి ఆస్కారమేలేదు. ఇక్కడే నేను ఆలోచించి ఈ సందర్భాన్ని మరింత తన్యత కలిగించాలని ఆలోచనలో పడ్డాను. ఆ సమయంలోనే కడపజిల్లాలోని మైలవరంలో ఒక కార్యక్రమానికి వెళ్ళాను. ఆ పగలు - వాక్‌మన్‌లో వకుళమాత పాటవింటూ దగ్గర్లోని పురావస్తు ప్రదేశానికి నడుస్తూ వెళ్తున్నాను. ఏ విధంగా ఈ పాటకు నృత్యరీతిని కూర్చాలా అని ఆలోచిస్తూ. ఆ ప్రదేశంలో ఎన్నో శిథిల శిల్పాలు చెల్లాచెదురుగా పడివున్నాయి. అందులో ఒక అద్భుతమైన తల్లీబిడ్డల శిల్పం వుంది. ఇద్దరి తలలు లేకపోయినా తల్లి తన బిడ్డను పొదివి పట్టుకున్న తీరు, తన హృదయానికి దగ్గరగా హత్తుకున్న పద్ధతి ఎంతో ఆర్ద్రంగా వుండి నన్ను ఎంతగానో ఆకట్టుకుంది! అవును అమ్మకు-బిడ్డ ప్రతిరూపం కదా! అందులోను ఆ బిడ్డడు కృష్ణుడయితే! అంతేనా? తల్లి తనబిడ్డ లేకపోయినా ఆమె ఊహల్లో ఎప్పుడూ వుంటాడు కదా! అదిగో ఆ ఆలోచన వకుళమాతకు చిన్నికృష్ణుని సృష్టించి నృత్యరూపకంలో ప్రవేశపెట్టాను. దీని పర్యవసానమే వకుళమాత పాటలో కృష్ణుని విగ్రహం-కృష్ణుని రూపం ధరించి చిన్ని కృష్ణుని నృత్యంగా రూపొందింది! *గొల్లభామ* నృత్యంలో నాకు మరో సమస్య ఎదురైంది. గోవులను రంగం మీదికి ఎలా తీసుకురావాలి? అదీ ఇద్దరు కళాకారుల్ని- ఒక్కోగోవుగా-ఒకరివెనక ఒకర్ని వుంచి-గోవు తల-తోకపెట్టి-సమస్యను అధిగమించాము. ఇందులో ఒకటి తల్లిగోవు, మరొకటి దూడ. వీరు కూడా గొల్లభామతోపాటు ఆమె కదలికలతో నృత్యం చేస్తూ 'సీను' రక్తికట్టించారు. దానితోపాటు రంగాలంకరణలో చాలా సాధారణమైన సూచన ప్రాయమైన వస్తువులనే ఉపయోగించారు. ఒక హంస, ఒక పద్మం వీటిని ఒక తెరమీద వేయించి వెనుకనే వ్రేలాడదీశాము. ఇది బ్రహ్మలోకమని - ఒక త్రిశూలం, నెలవంకను, కైలాసం అని చెప్పటానికి సూచించాము!

తర్వాతది- *భామాకలాపం*, కలాపం ఎప్పటినుంచో కూచిపూడిలో సాధన చేస్తున్నదే. అదే కూచిపూడి సంప్రదాయంలో. దీనిని మరోవిధంగా ప్రదర్శించటానికి ఎంతో జాగ్రత్త, శ్రద్ధ అవసరం. మళ్ళీ నేను, డాక్టరు భుజంగరాయశర్మ, సంగీతరావు కూర్చున్నాం. *భామాకలాపం* చాలా పొడవైన రూపకం-దానిని ఎంతవరకు తగ్గించవచ్చు- ఇప్పటి అవసరాలకు, సరిపడా మరింత ఉత్సాహభరితంగా హత్తుకొనే విధంగా వుండటానికి, ఆ విధంగా ఎక్కువ మంది వైవిధ్యంగల ప్రేక్షకుల చెంతకు తీసుకువెళ్ళాలనేదే నా ఆలోచన. ముందుగా- సంభాషణలను తగ్గించాలని, వాటిస్థానంలో చరణాలను ప్రవేశపెట్టి- అభినయానికి ఆస్కారం వుండే విధంగా, మౌఖిక ప్రదర్శనలో భావగర్భితంగా తెలియజేసే విధంగా భాష తెలియని వారికి సైతం భావం తెలిసే విధంగా, రూపకల్పన చేశాం.

ఇందులో ప్రతి 'దరువు', సత్యభామ 'జడవృత్తాంతం' దగ్గర్నుంచి, అన్ని తిరగ వ్రాయించాము. నృత్యరీతిని కూర్చాను. ఈ 'దరువు'ల్లో ముఖ్యమైనది 'సిగ్గాయనోయమ్మ' దరువు. ఇది సంప్రదాయంలో సత్యభామ ముఖాన్ని చెంగుచాటున దాచి సిగ్గును అభినయిస్తుంది. కాని నా ఉద్దేశ్యంలో ఇది 'అభినయం' లో చూపాలని. ఆ విధంగా సత్యభామకు ఆమె చెలి, మాధవికి మధ్య సంభాషణలాంటిది ప్రవేశపెట్టాను. ఈ 'దరువు'లో మాధవి సత్యభామను అడుగుతుంది. భర్తపేరు ఎలా



ఉచ్ఛరిస్తావమ్మా అని– కాని సంప్రదాయంగా భార్య భర్తపేరు చెప్పకూడదు కదా! అప్పుడు సత్య 'దరువు' ను అనుసరిస్తూ కృష్ణుని పేరు తెలియజేస్తుంది. వెంటనే మాధవి అభినయంతో ప్రతికూలంగా నటిస్తుంది– హాస్యభరితంగా. సత్యభామ ముందుగా కృష్ణునిపేరు కాళీయమర్దనునిగా తెలియ జేస్తుంది! గోవర్ధన గిరిధారిలాగా కూడా అభినయించి చూపిస్తుంది. ఈ 'దరువు' అభినయానికి ఎంతో అవకాశం కలిగించింది. కొన్ని నవ్వుల జల్లులు కురిపించినది. 'లేఖ' లో కూడా 'అభినయాన్ని' జొప్పించి–కేవలం మాటల్లో చెప్పేది– 'అభినయం' ద్వారా చెప్పాం.

నృత్యరూపకం (నాటకం) ముఖ్య ఉద్దేశ్యం సంపూర్ణ దృశ్య, శ్రవణ అనుభవాన్ని కన్నులపండువుగా, వీనులవిందుగా అందించాలి. దానికోసం నృత్యం–అభినయం సమన్వయ పరచి చూపించగలగాలి. ఇది దృష్టిలో వుంచుకొని లయవిన్యాసమూ, తాళము మేళవించి 'దరువు' చేసేవాడిని. 'ఎందుబోతివి' లో సత్యభామ, కృష్ణుని వెతుకుతూ పోతుంది. ఇందులో లయ ప్రాబల్యం ఈ 'దరువు' మొదటనుంచి చివరివరకూ గమనించవచ్చు–ఇదే చివరిలో సాగిన 'కొనుగోలు'లో చాలా నున్నితమైన లయవిన్యాసం వినపడుతుంది! *భామాకలాపం* లో నేను చేసిన ఎన్నో మార్పు చేర్పులలో ఇవి కొన్ని మాత్రమే!

ఇక ఇటీవలి నృత్యనాటికల విషయంలో, *హరవిలాసం* లో నేను చేసిన ప్రయోగం వివరించాలి. ముఖ్యంగా *సతీదహనం* సందర్భంలో కథప్రకారం దక్షుడు అవమాన పరిచిన తరువాత సతి అగ్నిప్రవేశం చేయటం! ఇది ఏవిధంగా దృశ్యమానం చేయాలి? చాలామంది 'దీపాల ప్రభావం' (Lighting effect) తో చూపించవచ్చు అన్నారు. కాని ఇది నాకు అంతగా నచ్చలేదు. చాలా ఆలోచించిన తర్వాత– దీనిని అభినయం, కదలిక, ఆహార్యం ద్వారానే సాధించాలనే నిర్ణయానికి వచ్చాను. కొంతమంది అమ్మాయిలను ఎరుపురంగు దుస్తులను ధరింపచేసి, 'సతి అగ్నిప్రవేశం' చేయబోయేముందు–రంగస్థలానికి మధ్యలోకి వేగంగా పంపించాను. వారు త్వరగా కదులుతూ చేతులు గాలిలోకి మంటల్లా ఊపుతూ భయానక వాతావరణాన్ని కల్పించాము. మంటల్లోకి 'సతి' ప్రవేశం దరువు, సంగీత నేపథ్యంలో జరిగింది. ఈ నా ప్రయోగం చూసి డాక్టరు కపిల వాత్సాయన ఎంతో ప్రశంసించారు.



సరే! మంచికో చెడుకో నా నృత్యనాటికలన్నీ చాలా ప్రచారం పొంది ప్రేక్షకులను అలరించాయి. ఇవన్నీ నా ప్రయోగాలతో నిండినవే. ఇది నాకెంతో ఆనందాన్నిచ్చిన అంశమే. ప్రయోక్తగా అయినా ఒక నాట్యాచార్యునిగా (కొరియోగ్రాఫర్‌గా) *కూచిపూడి* (సంగీత నృత్యనాటకం) సాంప్రదాయానికి ఎంతో సేవ చేసి సుసంపన్నం చేశానన్న తృప్తితో కొన్ని విషయాలు నాకు తెలిసినవి చెప్పాలి. మొదట్లో–నృత్యనాటికలు కూర్పు చేస్తున్నప్పుడు (1960) ఏకాంక ప్రదర్శనలు చాలా తక్కువ. అవన్ని నృత్యనాటికల్లో భాగంగానే ఉండేవి. నా గురువుగారు వేదాంతం లక్ష్మినారాయణశాస్త్రి కొన్ని ఏకాంకికలు కూర్పు చేశారు.

ఒక ప్రదర్శకునిగా, ప్రయోక్తగా నేను గాఢంగా విశ్వసించేది, ఈ సాంప్రదాయాన్ని కొనసాగించాలని, దానికోసం ఒక అద్భుతమైన ఏకాంకిక అవసరమని! అందుకోసమే *కూచిపూడి* నాట్యాన్ని ఈ పార్శ్వంలో బలోపేతం చేయాలని కృషిచేశాను. ఈప్రయత్నంలో, నా ప్రయోగాలు సంప్రదాయబద్ధం గాను, సరికొత్త పద్ధతిలోను సాగాయి.

సంప్రదాయబద్ధమైన ఏకాంకికలు (సోలో) చాలా వాటిని తిరిగి కూర్పుచేసి పూర్తి సోలోలుగా మలిచాము. (ఇప్పటి వరకు ఇవి నృత్యనాటికల్లో భాగంగానే వున్నాయి) వీటిలో ప్రస్ఫుటమైన విషయం–వీటికి నిబద్ధమైన నిర్మాణక్రమం ఇవ్వడమే. అది 'తరంగం' లకు, పాత్ర ప్రవేశం, నిష్క్రమణ నిర్దుష్టంగా వుంటుంది. ప్రవేశంలో, నృత్యకారుడు రంగం మీదికి 'గతి' ప్రకారం నడిచి రావాలి. అదీ మూడురకాల

వేగంతో–'విలంబ', 'మధ్యమ', 'ధ్రుత' లయలతో. దానివలన ప్రేక్షకులకు నృత్యకారుని ప్రతిభ (తాళ, లయ విషయంలో) తెలియటానికి అవకాశాలు మెండుగా వుంటాయి. నా జీవితం ప్రథమభాగం నుంచీ, *కూచిపూడి* నాట్యం మూలాలు *నాట్యశాస్త్రం*లో ఉన్నాయని నమ్మాను. అందుకనే నాట్యశాస్త్ర వ్యాకరణాన్ని పునః పునః అధ్యయనం చేశాను. ఆ విధంగా నాట్యకళపై సాధికారాన్ని సాధించి నా ప్రయోగాలకు, ప్రయోక్తగా అధ్యాపకునిగా వ్యక్తీకరణకు న్యాయంచేశాను. పర్యవసానంగా 'ఆంగికాభినయం' లోని సాంకేతికతను–'నృత్తహస్త', 'చారి' లాంటి మరికొన్ని సంపూర్ణ నృత్యంలోను, నృత్యభాగాలలోను ప్రవేశపెట్టాను.



ఉదాహరణకు 'ఉష' ప్రవేశ దరువు– *ఉషాపరిణయం యక్షగానం*లో తీసుకొని–దానిని సోలోగా నాట్యకూర్పు చేశాను. అలాగే 'భౌమిచరి'ని 'విచయ', 'స్యాందిత', 'ఉరుద్వృత్త', 'అపస్యందిత', 'మత్తాలి' మరియు 'ఆకాసికి చరి'లు 'విద్యుత్ భ్రాంత' లాంటివి కూడా చేశాను. ఈ విధానంలో, వ్యత్యాస విశేషాలు కూచిపూడి నాట్యంలోకి 'నృత్త', 'నృత్యా'లను సాంకేతికంగా ప్రవేశపెట్టాను.

*అభినయ* నాట్యాలలో, నా లక్ష్యం దానిలోని నాటకీయత తగ్గకుండా వుంచడమే–ఎందుకంటే కూచిపూడి నాట్యంలో ప్రధానాకర్షణ–అది కావటమే. కాని ఇప్పటివరకూ వున్న దారిలో నేను వెళ్ళదలచలేదు. *అభినయ* కొరియోగ్రఫీ కూర్పు చేసే సమయంలో పాటకు అనుగుణంగాను అభినయం చేసే వారు– ఆ పాటకు అర్థం కవిహృదయం, తెలియకుండా–నేను ఈదారిని వదిలి, *క్షీరసాగరశయన* (త్యాగరాజస్వామి) విషయంలో జరిగిన నా అనుభవం చెప్తాను. మొదటిగా దీనిలోకి దిగినప్పుడు నేనాశ్చర్యపోయాను. త్యాగరాజస్వామి విష్ణుమూర్తిని ఆ విధంగా ఎందుకు సంబోధించారు అని! అప్పుడు త్యాగరాజుస్వామి జీవితాన్ని గురించి చదివాను. ఆయన జీవితంలోని ఒక సంఘటనకు, ఈ పాటకు సంబంధం వున్నట్లు గ్రహించాను. అది ఈ విధంగా ఉంది. త్యాగరాజస్వామి పూజించే మందిరం– శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడు కొలువున్న మందిరం మాయమైపోతుంది! అది కానరాక త్యాగరాజస్వామి కావేరీనది ఒడ్డుకు విగ్రహాలను వెతుకుతూ వెళ్తాడు. కావేరి పొంగి ప్రవహిస్తుంటుంది. ఆయన భయపడక అందులో దూకి విగ్రహాలకై వెతుకులాడుతాడు. అప్పుడు నీటి అడుగున పవళించినట్లున్న స్వామి విగ్రహాన్ని చూసి ఆనందంతో– *క్షీరసాగరశయన* అని పాడతాడు త్యాగరాజు.

ఈ విధంగా చేసిన ఈ *క్షీరసాగర శయన* అభినయం పండితులను, పామరులను విశేషంగా ఆకర్షించింది. ఇలాగే, 'ఎన్‌పల్లి కొందీరయ్య శ్రీరంగనాథ' 'కృష్ణ నీ బిగానే బరో' ఇవి కూడా అభినయంలో అర్థవంతంగా చేసినవే. ఈ విధంగా కీర్తనగాని, పాటగాని పూర్తిగా అర్థం చేసుకొని తదనుగుణంగా అభినయం చేయించితే– సంప్రదాయానికి పరిమళాలద్ద వచ్చని నిరూపించాను. కూచిపూడి సంప్రదాయంలో ఉన్నవాటితో పాటు, నేను అన్నమాచార్య పాటలు, ఉత్తుకాడు వెంకటసుబ్బఅయ్యర్, దీక్షితార్, శ్యాం శాస్త్రిగార్ల పాటలు కొన్ని ఇదేవిధంగా సోలో అభినయ విధానంలో అర్థవంతంగా ప్రదర్శించాను.

కూచిపూడి నాట్యసంప్రదాయం, సజీవమైన నృత్యకళ. దీనికి తిరుగులేదు. చరిత్రతోపాటు కూచిపూడి నాట్యం వృద్ధి చెందుతూనే వుంటుంది. ఒకానొక సందర్భంలో కూచిపూడి నాట్యచరిత్రలో, నేను చేసిన ప్రయోగాలు, సాహసాలు, మార్పులు చేర్పులు ఎంతగానో ఉపయోగపడినాయి అనుకుంటున్నాను– కాని ఆ పనిచేస్తున్నప్పుడు అవి ఇంతటి ప్రాచుర్యం పొందుతాయని, ప్రేక్షకుల మన్ననలను చూరగొంటాయని అనుకోలేదు. నా ప్రయత్నం– ప్రయోగాలు చేస్తూపోవటమే. ఇది నిరంతరం సాగే వ్యవహారం. అద్భుతాలు అందుకోవాలనే తపన! నేను తుదిశ్వాస వదిలే వరకూ నా ప్రయోగాలు సాగుతూనే వుంటాయి.

కూచిపూడి నాట్యవైభవాన్ని మరింతగా జనబాహుళ్యం లోకి తీసుకువెళ్ళవలసిన బాధ్యత భావితరాల భుజస్కంధాల పైననే వుంది.



# జాషువా - జాతీయత

– దువ్వాల రాజేశ్

**తా**ను పుట్టిన చోటుతో, పెరిగిన ప్రదేశంతో, కాలు నిలదొక్కుకోవడానికి ఆధారమైన స్థలంతో, కాటిలో లీనమయ్యే ఆ మట్టితో ఏకాత్మస్థితి పొంది, ఆ ప్రదేశాల ఉత్థాన పతనాలు తనతో ముడిపడి ఉన్నాయనే ఎరుకతో వ్యవహరించడమే జాతీయత అవుతుంది. ఈ జాతీయత ఆ మనిషి అడుగడుగునా ప్రతిబింబిస్తుంది. నుడుగునుడుగునా తొణికిసలాడుతుంది. జీర్ణించుకొన్న తత్త్వంతోపాటు మౌలికమైన ఆలోచనలను ప్రకటిస్తుంది. మహర్షిఅయినా, మామూలు మానవుడైనా ఈ తత్త్వానికి అనుగుణంగానే జీవిస్తాడు.

అయితే, నేడు స్వతంత్ర భారతంలో జాతీయ శబ్దం బాగా విస్తరించింది. ఈ జాతి భూమి భరతఖండం అనే స్థిరత్వంతో పాటు, ఈ జాతికి జాతీయ చిహ్నం ధర్మ చక్రమయ్యింది. జాతీయ గ్రంథం మన రాజ్యాంగమయ్యింది. జాతీయ పక్షి నెమలి అయ్యింది. జాతీయ మృగం పులి అయ్యింది. జాతీయ జెండా త్రివర్ణ పతాకమయ్యింది. జాతీయ మాతృగీతంగా వందేమాతరం, జాతీయ పితృగీతంగా జనగణమన ప్రచారంలోకి వచ్చాయి. దేశ భాషలన్నీ జాతీయ భాషలయ్యాయి. కానీ ఈ భాషల మధ్య ఏకాత్మత భావాన్ని నిర్మాణం చేసే సంస్కృతానికి ఆ స్థానం ఇవ్వలేదు. సంస్కృతానికి ఆ స్థానం దక్కకూడదనే ఉద్దేశ్యంతో ఈ దేశంలో తిష్ఠవేసిన కొన్ని విదేశీ శక్తులు పనిగట్టుకొని ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. ఆ శక్తుల ప్రయత్నాలు ఫలించి ముమ్ముందు ఇంగ్లీషు కాని జాతీయ భాష అయితే అంతకన్నా బానిసత్వం మరోటి ఉండదనాలి! "జననీ, జన్మభూమి స్వర్గం కన్నామిన్న" అన్న మాట ఈ దేశంలో తారక మంత్రంగా మ్రోగిపోతున్న ప్రస్తుత కాలంలో "జనని సమస్త భాషలకు సంస్కృత భాష ధరాతలంబునన్" అనే భావం కణకణంలో వ్యాపించాల్సిన అవసరముంది.

ఏది జాతీయత అని ప్రశ్న వేసుకుంటే ఇన్నిటిని పరిశీలించాల్సి వచ్చింది. ఆ జాతీయతను జీర్ణించుకొని ప్రచారం చేసిన సాహిత్యమే జాతీయ సాహిత్యమౌతుంది. ఈ జాతీయ సాహిత్యం జాషువా రచనల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. చాలాచోట్ల జాషువా తన కవిత్వంలో విశ్వనరుణ్ణి అని చెప్పుకొన్నాడు. ఆయన క్రైస్తవం స్వీకరించిన హిందువుల కుటుంబంలో పుట్టారు.

**"పఠియించినాడను పలుమారు చర్చిలో-బైబులు సిద్ధాంత భాష్యములను
ప్రార్థించినాడ సద్భక్తిపై తలవంచి-అస్పృశ్యతా వారణాభిలాష
ధరియించినాడ నందరువోలె తొమ్మున-బిరుదుగా నంది బాప్తిస్మముద్ర
ప్రేమించినాడ నొప్పించు వైరిని గూడ-ననుబోలితోబుట్టువుని విధాన
అన్నమాట దప్పకాచరించతిగాని-అన్న మాటదప్పి యాచరించు
కొంగభక్తి పుంజుకొన్న పోకడ జూచి-చెదరినా మనస్సు చివుకుమనియె."**

*(నా కథ : పుట 20)*

జాషువా క్రీస్తు చరిత్ర వ్రాశారు. "క్రీస్తు చరిత్ర మత పరమైనదే కదా అంటే ! అవును కవిగా నేను కొన్ని బలహీనతలకు లొంగిపోక తప్పలేదు ఒప్పుకుంటాను" అన్నారు. అయితే బైబిల్ మత గ్రంథమవుతుంది గాని క్రీస్తు చరిత్ర మత గ్రంథం కాదు. అది పురాణ ఫక్కీకి చెందిన కావ్యం.

ఇక మహమ్మదీయ మతం గురించి జాషువా దృక్పథాన్ని చూద్దాం. వారి *ఫిరదౌసి, ముంతాజ్ మహల్,* తదితర గ్రంథాల్లో ముస్లింల ఇతివృత్తముంది. వారిని అభిమానించడం గాని, అనుసరించడంగాని చేయలేదు. ఆ మతస్థులు మంచిగా నడిస్తే మంచి అన్నారు. చెడుదారి త్రొక్కితే చెడు అన్నారు.

నా కథలో (పుట-10) వినుకొండలోని మసీదును గురించి ఇలా వ్రాశారు.

**"ఊరికి దూర్పుగా నిలిచియున్న మసీదొకనాడు నిత్య కే
ళీ రతులైన బాలుర కళీక కళా కితవ ప్రజాళికిన్
జారుల కాశ్రయంబయి ప్రశస్తికి నెక్కిన దమ్మ: దాని ప్రా
కారపురాల్ మసీదనిన కాదని చూపు శివాలయాంకముల్."**

హిందూ దేశంలోని ఎన్నో గుళ్లు మసీదులుగా మారాయని జాషువా అభిప్రాయం. *పిరదౌసి* లోని మొదటి పద్యం, మూడో పద్యంలో గీత పద్యం ఇందుకు ఉదాహరణలు.

**"మునుగజనీ మహమ్మదుడభూత పరాక్రమశాలి, వీర వా
హినుల బలంబుతో బదియు నెన్మిది మారులు కత్తిదూసి, చి
క్కని రుధిరంబులో భరత ఖండమునార్ద్రమొనర్చి సోమ నా
థుని బెకలించి కైకొనియె దొమ్మిది వన్నెల రత్నరాసులన్."**

దువ్వాల రాజేశ్, ఫోన్ : 9440460490

**"...భారతక్షోణి గల్గు దేవస్థలములు**
**చెదరి గజనీ పురాన మసీదులయ్యె.**
**నిప్పటి మసీదు లే రూపమెత్తగలవొ**
**కాలమెరుగును, ధారుణీ గర్భమెరుగు..."**

జాషువా చిన్నతనాన మసీదు ప్రాంగణాన కూర్చున్నాడు. ఆటలాడుకొన్నాడన్న సంగతి తప్పిస్తే ఆ మతమూ, ఆ మతానుయాయుల విషయంలో జాషువాచెప్పదలచుకొన్నది సూటిగానే చెప్పాడు. ఆ మతగ్రంథమైన ఖురాను లోతుల్లోకి దిగడంసంగతి అలా పెట్టి ఆ మతానుయాయుల ప్రవర్తనను వాస్తవికంగానే జాషువా చెప్పారన్నది సత్యం.

జాషువా మతం పునాదుల మీద నిలబడాలనుకున్న వ్యక్తి కారు. ఆయా మతాల్లోని మంచి-చెడ్డ లేమిటో వారికి తెలుసు. మానవులకీ భువనం ఒక ముసాఫిరు ఖానా, ఓ మజిలి. కొంతకాలం ఈ శరీరం ఉంటుంది. ఆ కొంత కాలంలోనే మతాల మారణహోమాలు సృష్టిస్తారు.

**"మత పిచ్చి ముదిరి యన్యుల**
**మతమున్నిరసించి, స్వీయమత గౌరవమున్**
**హతమార్చి నిత్యకలహము**
**ప్రతిఫలముగ దెచ్చుకొనెదు వారుందురిటన్."** *(ముసాఫరులు పు. 23)*

ఈ మతాల మారణహోమంలో ఐకమత్యం ఎలా సాధ్యం! అందుకే జాషువా ఇలా అంటారు.

**"ఒకదు రుద్రాక్షమాలికలు నెత్తికి జుట్టి-**
**శివమూర్తియై భూమికవతరించు**
**ఒకదూర్ధ్వ పుండ్రంబులురువుగాదగిలించి-**
**శివ లింగమును జూచి చీరించు**
**ఒకదు రెండును గాని వికట వేషముదాల్చి-**
**పై వారి మీద సవాలు జేయు**
**ఒక గంజాయి దమ్ముకు దాసుదైపోయి -**
**బూడిద గురవదై పుట్టివచ్చు**

**మనుజులార! మాది ఘనమైన మతమని**
**ఒకదు తరిమితరిమి యుగ్గడించు**
**పెక్కు మతములిట్లు పేచీలు సాగింప**
**మార్గమేది యైకమత్యమునకు."** *(గబ్బిలము పు. 63)*

శివాలూగడం, గురు దక్షిణలివ్వడం, మంత్ర తంత్రాలు చేయడం, పిచ్చిగా పూజలు చేయడం దేశాభ్యుదయకారకం కాదు అన్నారు జాషువా. జీవకళలు చెక్కు శిల్పిని నిరసించి, శిల్పానికి పూజచేసే వక్రచరితులున్న చోట కళలకు ప్రేతకళల గతులు పడతాయన్నారు. ఆయన అన్ని మతాలలోని మంచిని విశ్వసించారు. అందరినీ ఆదరిస్తున్న ఈ భారత మాతను మరీ మరీ ప్రేమించారు. ముప్పది మూడు కోట్ల దేవతలెగబడ్డ దేశమైనాసరే భాగ్యవిహీనుల క్షుత్తులారాల్సిందే అని ఆయన ప్రగాఢ వాంఛ. So long as a single dog in my country is without food, my whole religion is to feed it - నా దేశంలో ఒక్క కుక్క పస్తున్నా సరే దానికి అన్నం పెట్టడమే నా మతం అన్నారు స్వామి వివేకానంద "భాగ్యవిహీనుల క్షుత్తులారునే" అని బాధపడ్డ జాషువా వేదన కూడా ఇదే. అదే జాతీయత.

"మమాత్మా సర్వ భూతాత్మా" - అన్నది మత వాదం అయినా, ఆధ్యాత్మిక ప్రవచనం అయినా అది చెప్పింది వేదకాలం నాటి ఋషి అయినా, మనువైనా, మార్క్సు అయినా, వివేకానందుడైనా, అంబేద్కరైనా, జాషువా అయినా అందరూ శిరోధార్యంగా స్వీకరించి అనుష్ఠించదగ్గదే. జాషువా మత దృక్పథాన్ని ఈ దృష్టితో అనుశీలించినప్పుడు ఆయన విశ్వమానవ మతవాదిగా కనిపిస్తారు. మాయ కట్టుబాట్లను నిరసించిన లోతైన ఆధ్యాత్మిక వాదిగా దర్శనమిస్తారు.

జాతీయోద్యమ సందర్భంగా కవులూ - కళాకారులూ మత దృక్పథాన్ని దేశభక్తి వైపు మళ్ళించారు. అది ఆనాడు అందరికీ అనివార్యమైంది. ఈ దృక్పథానికి ప్రేరణ మహర్షి దయానందుదు, స్వామి వివేకానందుదు, స్వామి రామతీర్థ, లోకమాన్య తిలక్, స్వాతంత్ర్య వీర సావర్కర్... ఇలా ఎవరైనా కావచ్చు. తెలుగునాట తుమ్మల వారు చాలా ప్రస్ఫుటంగా ఈ విషయాన్ని తెలియజేశారు.

**"దేవుడన మాతృదేశము,**
**దేవతలన ప్రజల యజ్ఞదీక్షయనంగా**
**సేవావ్రత నిష్ఠయ యివి**
**జీవన సూత్రములుగా ప్రసిద్ధింగనుమా"**

అవును ఆనాటి వారికి దేవుడు తమ మాతృదేశమే: ప్రజలే దేవతలు. సేవ చేయడమే యజ్ఞం : ఇవే జీవన సూత్రాలు. జాషువా విషయంలోనూ ఇదే సత్యం... "మా భారతమాత, మాతలకు మాత, సకల సంపత్సమేత" (ఖం.కా. 1.పుట. 9) అన్నారు. "ఓ హిందూరమా!... చెండింపింపుమస్పృశ్యతన్" (ఖం.కా. 1.పుట. 68) అన్నారు. మతాన్నీ, దైవాన్నీ దేశం వైపుగా, దేశంలోని సమాజం వైపుగా మళ్ళించి మహాకవి అయ్యారు జాషువా.

"Take off religion from human society and what will remain? nothing but a forest of brutes"- ఈ మానవ సమాజం నుండి మతాన్నీ - దైవాన్నీ వేరు చేస్తే

ఇక మిగిలేదేంటి? పశువుల గుంపు మాత్రమే” అంటారు. స్వామి వివేకానంద. *చిన్న నాయకుడు* నవలలో జాషువా ధనిశెట్టి పాత్రలో కనిపిస్తారు. జాషువా మౌత్‌పీస్ ధనిశెట్టి. అందులో “భారతదేశమెవరికి దగిన దైవములను వారికి ప్రసాదించగలదు” అన్నారు. అంతేగాక ఆ దేవుడెక్కడుంటాడో ఇలా చెప్పిస్తారు. “భగవంతుడెక్కడున్నాడని సంశయింప పనిలేదు. పరుల దుర్గతిని గుండె గరిగి వగచు సహృదయుల వీక్షణాంచలమున అతడు కన్నీటి బొట్టుగా సాక్షాత్కరించును...” స్వప్న కథలో ఇదే భావాన్ని వారు పద్యంలో పలికారు.

**“పరుల దుర్గతి గని గుండె గఱగి వగచు**
**సదయ హృదయుల వీక్షణాంచలమునందు**
**పుట్టుచుండును కన్నీటి బొట్టువోలె**
**ఏడి భగవంతుడని సంశయింతువేల!”** *(స్వప్నకథ పుట 36)*

జాషువా దైవం ఆ కన్నీటి చుక్క, జాషువా మతం ఆ కన్నీటి చుక్క, ఆయన దైవీయతం ఆ కన్నీటి చుక్క. దీనికి మూలం గుండె కరగే సదయహృదయత్వం. అయితే, మనిషి యొక్క సహృదయత నుండే జాతీయత వెలువడుతుంది. ఈ సహృదయత జాషువాలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. జాషువా స్వదేశీ వికాసాన్ని స్వావలంబనను కోరుకున్నవాడు. భారతజాతి వికాసం కోసం పరితపించి, కవిగా తనలో కలిగిన భావాలను స్వతంత్రంగా చెప్పి, పరిశుద్ధ జాతీయవాదిగా కనిపిస్తాడు జాషువా. ఆయా సందర్భాలలో జాషువా తమ కవిత్వంలో మతం పదాన్ని, ఆధ్యాత్మిక పదాన్ని ప్రయోగించారు. అదే విధంగా తాత్త్విక పదాన్ని కూడా కొన్ని పద్యాల్లో ప్రయోగించారు. ఉదాహరణకొకటి–

**“ఊరకపోదు బుద్ధుని మృదూక్తి పటుత్వము, క్రీస్తు ప్రేమ వా**
**క్సారము, రామకృష్ణ ముని చంద్రుని తాత్త్విక సౌరభమ్ము, ని**
**స్సారము లీ కటారుల ద్విషజ్జయముల్, తుది లేని తృష్ణకున్**
**కారణభూతముల్, తెరపి గానని చింతలకున్, చిరాయువుల్”**

*(కాందిశీకుడు : పుట. 56)*

కత్తి–గన్ను అది ఏదైనా గానీ దానితోనే జయం సాధిస్తామనడం నిస్సారం. ఆ ఆశకు అంతే లేదు. వాడిక ప్రతిచోట కత్తో–గన్నో–బాంబో పెడతానంటాడు. అది విజయంగా భావిస్తాడు. ఆ భావన నిస్సారం అంటారు జాషువా. మనిషిని జయించడానికి కావల్సింది కత్తికాదు. మృదూక్తి పటుత్వం, ప్రేమవాక్సారం, తాత్త్విక సౌరభం కావాలి. వీటినే తాత్త్విక సిద్ధాంతాలుగా చెప్పుకొంటే బుద్ధుని అహింసా తత్త్వాన్ని, రామకృష్ణ పరమహంస సమాన ధర్మ తత్త్వాన్ని జాషువా హృదయపూర్వకంగా విశ్వసించి ఆచరణలో పెట్టినట్లు తెలుస్తుంది. బాపూజీ గ్రంథంలో పగలకు కాలుదువ్వే స్వభావం కావాలంటారు. కవి జాషువా, ఆ పద్యం చూడండి!

**“యుగముల నుండి మొత్తుకొనుచున్నవి వేద పురాణముల్, జగ**
**స్సృగమును ప్రేమతోడ నెదిరించ : సమత్వము సంఘటించగా :**
**పగలకు కాలుదువ్వెడు స్వభావ మఖావముగా, నహింసచే**
**జగము జయించి జాతిమత శాశ్వత సఖ్యము నుద్ధరింపవే”**

*(బాపూజీ : పుట. 25)*

వేదాల నుండి నేటిదాకా ప్రేమవాదాన్నే బోధిస్తున్నా పగలకు కాలుదువ్వే వారు, కనిపిస్తున్నారు. “అడంగునే పగం పగ .... .... ” తిక్కన్న అన్న మాటనే జాషువా అన్నారు. అహింసతో జగాన్ని జయించ వచ్చునంటారు. జాషువా ఈ తాత్త్విక భావాల వెనుక ఆయన సాహిత్యాధ్యయనమున్నది : సమాజ పరిశీలనమున్నది. వారి ధార్మిక తాత్త్విక సాహిత్యాధ్యయనానికి, దేశభక్తికి, స్వాభిమానానికి ఈ పద్యమేమచ్చుతునక.

**“ఘన వివేకానందముని యమేరిక సీమ**
**సన్నుతింపగ జయస్తంభమెత్తె**
**అరుణాచలము మీద అరుణ తేజశ్శాలి**
**రమణర్షి శత్రు షట్కము నణంచె**
**అరవిందముని నిరంతర సమాధిన్నిల్చి**
**లోక త్రయంబు వశీకరించె**
**మూడుగాళుల దొడ్డ ముసలి కోమటి సెట్టి**
**స్వేచ్ఛా వికుంఠంబు బేరమాడె**

**నాల్గు ఖండములకు నవ నవోజ్జ్వలములౌ**
**ధర్మ మార్గములకు దారిసూపి,**
**ఘనత వాచికొన్న ఖండంబు మనదన్న**
**పౌరుషంబు మనది ప్రజ్ఞ మనది”**

*(కాందిశీకుడు : పుట. 44)*

వివేకానందుడు, రమణమహర్షి, అరవిందయోగి, మహాత్మాగాంధి... వీరంతా అనుష్ఠానవేదాంతులే, వారి జీవితాల్ని సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసినందువల్లనే జాషువా మాటిమాటికి వారిని స్మరించారు.

జాషువా శాశ్వత మూలాల్ని కోరినిలిపే సత్యవాదిగా, అందరిలో ప్రేమను చూచి తమ ప్రేమను పంచెపెట్టే ప్రేమవాదిగా, బుద్ధుణ్ణీ, క్రీస్తునూ ఆదర్శంగా స్వీకరించిన అహింసావాదిగా, జాతి వికాసాన్ని నిరంతరం ఆశించిన జాతీయవాదిగా, వ్యక్తిని తీర్చిదిద్దడానికి సంస్కారాలివ్వాల్సిన, సంస్కారాలను అలవర్చుకోవాల్సిన అవసరముందని గుర్తించిన సంస్కరణవాదిగా, అడుగడుగునా గాంధీ భావాలను విశ్వసించి ప్రచారం చేసిన గాంధేయవాదిగా, ఈ మానవాత్మ అంతా ఒక్కటే అని విశ్వసించిన ఏకాత్మ మానవతావాదిగా జాషువా దర్శనమిస్తారు.

*(జాషువా వర్థంతి సందర్భంగా...)* మి



# సమాజానికో వీలునామా

– సి. ధర్మారావు

మనిషి మనిషిలో మెరుపేదో ఉంటుంది. అందుచేత మనుషులంతా సమానం. పురుషుడికి తేలిగ్గా తేటపడేందుకు దీన్నే మరొక రకంగా చెప్పవచ్చు. పరిచితంగా, పరిశీలనగా చూస్తే – ప్రతి స్త్రీలోను పురుషుడికో మెరుపు, ఒక అందం కనిపిస్తుంది. అది శారీరకం, మానసికం, లేక రెండూనో కావచ్చు. ఇదే నిజం కాకపోతే, సగం స్త్రీ జానాభాకి జంట దొరకదు. పేదరికం, అజ్ఞానం, అసమానతలు ఉన్న చోట ఈ మెరుపులు జ్వలించక పోవచ్చు. దీనికి కావలసిన ఇంధనం అందకపోవటమే కారణం. ఈనాటి భాషలో – సమానావకాశాలు లేక పోవటమన్నా, ఒక వ్యక్తిత్వం వికసించక పోవటమన్నా ఇదే. దురదృష్టవశాత్తు, ఈనాటి సమాజాల్లో, ప్రపంచంలో ఈ మెరుపులు మలిగి పోయేవే అధికాధికం. మరి అలాంటివారిని మనం మరింత సమాదరంగా దరిచేర్చుకోవాలా, అలక్ష్యం చేసి దూరంగా ఉంచాలా?

అట్లాగే – మనిషి మనిషికో తిక్క, ఒక మరక కూడ ఉంటుంది. అందుచేతే మనుషులు మరింత సమానం. అసూయ, ఆగ్రహం, అధిక్యన్యూనతలు, ఇష్టా యిష్టాలు, మోజులు ఇట్లా ఏదైనా కావచ్చు. ఈ సంగతి నరనరానా పట్టించుకోవటమే స్థూలంగా సంస్కారం అనవచ్చు.

ఎదుటి వ్యక్తి ఎలాంటి వాడైనా అతన్ని అర్థం చేసుకోవటానికి మనల్ని సర్వదా ఈ సంస్కారమే సిద్ధపరుస్తుంది. మన వంటి కొన్ని సాంప్రదాయక సమాజాల్లో, దాదాపు అపరిచితులయిన ఇద్దరు స్త్రీపురుషుల్ని పెళ్ళి పేరిట ఒక దరికి చేరుస్తున్నాం. వాళ్ళు చిన్నా, పెద్దా రాజీలుపడి చిరకాలం సంసారం సాగిస్తున్నారు. సంప్రదాయ బలం ఈ సహజీవనాన్ని ప్రోదిచేస్తుంది. ఈ బలంలేని చోట్ల, సంస్కారమే ఆ గంటి పూడుస్తుంది.

మనుషుల్లో మచ్చంటూ లేని పురుషులు, మెరుపంటూ లేని కాపురుషులు, లేక దుర్మార్గులు లేరుగాక లేరు. దీన్నే ఇంగ్లీషులో అందంగా, బహు అర్థవంతంగా చెప్పారు. There is no saint without a past, nor a sinner without a future! సంసారాగ్నిలో పుతం పొంది, పునీతుడై ఒకడు రుషి అవుతున్నాడు. పాపి ఆ క్షణం కోసం ఎదురుచూస్తున్నాడు. అంటే సుఖశాంతులతో జీవనం సాగించే మార్గం నిరంతరంగా ఎవరికీ మూసుకుపోలేదు. ఇంతకూ నా ఆసక్తీ, ఆరాటం అంతా వ్యక్తి పరంగా సంస్కారంపైనా, సంఘపరంగా ఉత్తమ మానవ సంబంధాల పైనాను, అందుకే – పిల్లలూ, పెద్దలూ ఎవరు నా సంతకం అడిగినా – 'అందరూ మనవాళ్ళే – అంతా మనమంచికే' అని రాసి ఇస్తూంటాను.

ఉత్తమ మానవ సంబంధాలకి, సంస్కారానికి బీజాలు పడవలసింది బాల్యం లోనేగదా. అందుకే తల్లీ, తండ్రీ, గురువు ముగ్గుర్నీ మనవాళ్ళు పిల్లలకి దైవ సమానులన్నారు. వాళ్లు మరి ఆ పాత్రలు నిర్వహించాలి. మొదటగా అనుకోవలసింది King can do no wrong లాగానే, పిల్లవాడు తప్పు చెయ్యడు అనేది బండ సూత్రం. తోటి వాడితో వాడు పరుషంగా ప్రవర్తించినా, అబద్ధం చెప్పినా, చిల్లర దొంగతనం చేసినా వాడు తప్పు చేసినట్టు అవదు. ఎందుకంటే ఏది, ఎందుకు తప్పో వాడికి తెలియదు. వాడికి తెలిసిందంతా ఆటపాటల సరదాలే. ఎందుకో తెలియకుండా దండనకు గురవుతున్న ఒక నిస్సహాయ అర్భకుడి చూపులకంటే దయనీయమైన దృశ్యం లోకంలో మరొకటి లేదు.

చలంగారు అందుకే అన్నది – తాను *బిడ్డల శిక్షణ* అని పుస్తకం పేరు అట్లా పెట్టాను గాని, అది తల్లిదండ్రుల శిక్షణే అని. పెళ్ళి చేసుకోను, చేసుకున్నా పిల్లల్ని కనను, కన్నా వాళ్ళనెన్నడూ కొట్టను, తిట్టను అని భీషణ ప్రతిజ్ఞ చేసుకొన్న చలంగారి కంటే పిల్లలతత్వం ఆకళింపు చేసుకొన్న మనస్తత్వ నిపుణులున్నారా అనిపిస్తుంది. ఎక్కడ, ఎప్పుడైనా

సి. ధర్మారావు, ఫోన్ : 040-24041999

హింస గురి తప్పే తీరుతుంది. పిల్లల విషయంలో అది మరీ వికటించి, మనమనుకున్న మానవ సంబంధాల్ని జీవితాంతం మలిన పరచవచ్చు. ఇంక అతగాడి వికాసమెక్కడ? అందుచేత పిల్లవాడితో విసుగు లేకుండా నిరంతరం సంభాషణం నెరపాలి, వివరం చెప్పాలి, ప్రశ్నల్ని రేకెత్తించాలి. మన తెలుగు సినిమాల్లో లాగ మూడు అపోహలు, ఆరు అపార్థాలు వాడి జీవితంలో తప్పించాలంటే, అతగాడు తన ఉద్దేశం స్వేచ్ఛగా, స్పష్టంగా చెప్పగలిగే శక్తికి పదును పెట్టాలి.

**భ్రమల మాలోకం :**

పిల్లల పెంపకం గురించి నేను చెప్పిన ఈ పాఠం స్వీయానుభవం వల్లనే. ఇద్దరు ఆడ, ఇద్దరు మగ – నలుగురు పిల్లల పెంపకం విషయంలో మేం తల్లిదండ్రులం పూర్తిగా విఫలమయ్యాం. ఈ అపరాధ భావం జీవితాంతం ఉండేదే, సలిపేదే. (అయినా వాళ్ళ సంసారాలు తగుమాత్రం తృప్తిగానే సాగుతుండటం మా అందరి అదృష్టం). నలుగురిలో ఒకే ఒక్కరు పట్టభద్ర దశ చేరుకున్నది. నలుగుర్నీ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే వేశాం. 1970–80ల కాలానికే ప్రస్తుతం మనం విలపిస్తున్న దీనదుస్థితికి ప్రభుత్వ పాఠశాలలు చేరుకున్నాయి. తెలుగు మాధ్యమంలోనే పిల్లల్ని పది వరకు చదివించాలి. నేను చదివిందీ, రాణించిందీ వాటిల్లోనే గదా అని ఒక మూర్ఖపు పట్టుదల. సచివాలయ ఉద్యోగ సంఘాల్లో, సాహిత్యాభినివేశంతో శ్రద్ధ పెట్టలేక పోయానని ఒక కుంటి సాకు. 1979లో పిల్లలు వాళ్ల తల్లిని కోల్పోయినప్పుడైనా నేను కళ్లు తెరవాల్సింది. క్షమార్హం కాని అవాస్తవిక దౌర్భాగ్యం ఇది. ఎవరూ దీని పాలపడకూడదు. పిల్లలే కుటుంబ, జాతి సంపద! ప్రజాసేవో, మరో పరమార్థమో – ఏదీ పిల్లల నిర్లక్ష్యానికి మనకు హక్కును ప్రసాదించదు. వాళ్ళు అడక్కుండా వాళ్ళని ప్రపంచంలోకి తెచ్చాంగనుక, వాళ్ళ బాధ్యత పూర్తిగా తల్లిదండ్రులదే.

ఇదే విద్యారంగంలో పిల్లలకంటే ముందు, కళాశాల, విశ్వవిద్యాలయ దశల్లో నాకే జరిగిన ఉత్పాతం గురించి కూడ చెప్పాలి. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో మొదటినుంచీ ఆసక్తి ఉన్న వారు ఏలూరులో ఇంటరులో శ్రీశ్రీ మహాప్రస్థానం కంటబడింది. ఆ తరువాత చలం స్త్రీ, తదితరాలు, నండూరి, కృష్ణశాస్త్రి పాటలు – ఇట్లా ఏవేవో ఎన్నెన్నో. అక్కడ శంకరమంచి సత్యం, ముక్తేవి లక్ష్మణరావు, వెల్చేరు నారాయణరావు, సూరి రాధాకృష్ణమూర్తి సమకాలీనులు. అప్పటివరకు చదువే సమస్తమైన కుర్రాడు పేదల ప్రపంచానికి, స్త్రీ లోకానికి కళ్ళు తెరవటం మొదలైంది. సాహిత్యాభిలాష కమ్ముతుండటంతో ఫైనల్‌కి రెండు నెలల ముందు మాత్రమే కష్టపడి చదివాను. అప్పుడు జరిగింది – నా జీవితంలో మిక్కిలి విషాదానికి దారితీసిన ఘటన. నేను ఇంటరులో మొదటి తరగతిలో నెగ్గటమే కాదు, లెక్కల్లో మంచిశాతం మార్కులు వచ్చాయి. మా నాన్నకు లోకజ్ఞానమైతే పుష్కలంగా ఉన్నది గాని, ఊళ్ళో అయిదో తరగతి వరకే చదివిన వాడికి ఉన్నత విద్యల గురించి ఏమి తెలుస్తుంది గనుక! ఎవరిని సంప్రదించారో ఏమో, నన్ను తీసికెళ్ళి నేరుగా వాల్తేరు విశ్వవిద్యాలయంలో లెక్కల ఆనర్సు 3 సం.ల కోర్సులో చేర్పించారు. అది 4 సం.ల ఎం.ఏ.కి కుదింపు. ఇప్పటిలాగ అప్పట్లో కౌన్సిలింగు, కోచింగు కేంద్రాలు మచ్చుకైనాలేవు. పల్లెటూరి కుర్రాడి ఉన్నత విద్య కేవలం దైవాధీనం!

ఉన్నత గణితానికి, ముందు దశ గణితానికి పోలికే ఉండదు. తొలినుంచీ ధ్యాస పెట్టి, మెట్టు మెట్టూ ఎక్కుతూ పోవాలి. ముందులాగ పరీక్షల ముందు కష్టపడితే అందే ఉట్టిగాదు. ఏమైనా, ఆ పాఠాలు నాకేమాత్రం ఆసక్తి గొలిపేవి కావు, అర్థమయ్యేవి కావు. సగం క్లాసులు ఎగగొట్టేవాడిని. రోజులో ఎక్కువ భాగం నా నివాసం అక్కడి పెద్ద గ్రంథాలయంలోనే. ఇంకేం. ఆంగ్ల, అమెరికను, రష్యను ప్రసిద్ధ రచయితల నవలలు, నాటకాలు, గ్రీకు ట్రాజెడీలు అన్నీ ఔపోశన పట్టాను. రస్సెలు, వైట్‌హెడ్, లాస్కీ, హక్స్‌లీ, ఆర్వెల్ వంటి వారి కొత్త సామాజిక చింతన, ఖగోళశాస్త్ర గ్రంథాలు నాకేవో కొత్త లోకాల్ని ఆవిష్కరించినాయి.



బూదరాజు

మనిషి నాగరికతా ప్రస్థానమంతా కరతలామలకం అయిందన్న (అప) నమ్మకం కలిగింది. అక్కడ కేతవరపు రామకోటిశాస్త్రి, బూదరాజు రాధాకృష్ణ వంటి తెలుగు ఆనర్సు వారితో కలిసి తిరుగుతుండేవాడిని. మా అమ్మ కన్న పదకొండు కాన్పుల్లో – నేను, మా అన్నగారు ఇద్దరమే మిగిలాం.

అందుచేత, నేను మిగతా యువకులకంటే ఏదో భిన్నమని, మేధావినని, ఒక భ్రమ నా మెదడుని తొలుస్తుండేది. ముఖ్యంగా రస్సెల్, చలం వేసిన బాటలో స్త్రీ లోకాన్ని ఇంకా ఉద్ధరించాలని ఆలోచన చేసేవాడిని.

ఈ ఒంటరి లోకంలో ఉండి, మూడో సంవత్సరంలో పాఠ్యపుస్తకాలు తెరిస్తే సర్వం అయోమయం. భయపడిపోయి పరీక్ష కెళ్లటం మానేశాను. మరొక్క పరీక్షకే అవకాశం ఉన్నది. పోనీ ఆ ఏడాదైనా ఏ ట్యూషనో చెప్పించుకొన్నానా అంటే అదీ లేదు. (అప్పటికే నాన్న ఆర్థిక స్థితి పూర్తిగా దిగజారిపోయింది కూడ). పైగా విశాఖలోనే అద్దె ఇంట్లో మకాం, హోటల్ భోజనం, ఖర్చుకు ఖర్చు, ఏడాదికి ఏడాదీ వ్యర్థాతి వ్యర్థం. నాలుగో ఏడాది చివర మాత్రం ఏమిరాస్తాను. ఏదో గిలికి బయటపడ్డాను. నాన్నకి ఊళ్ళో వాళ్ళకి ఉత్కంఠ, ఆందోళన. చివరకు బాంబు పడనే పడింది! ఆనర్సు పరీక్ష కొండెక్కింది. ఇంగ్లీషు, జర్మను పేపర్లు కాస్త బాగా రాశానేమో, 'రికమెండెడ్' బి.ఎ. డిగ్రీ మాత్రం చేతికొచ్చింది.

ఇంత జరిగినా, నాన్న దుఃఖాన్నంతా లోలోన దిగమింగాడుగాని పల్లెత్తు మాట అనలేదు. అదేమి ఔదార్యమో! స్థిర చిత్తమో! నా ఆనర్సు మొదటి సం. నుంచే ఆయనకు వ్యాపారంలో భారీనష్టాలొచ్చి ఆస్తులు అతివేగంగా కరిగిపోతున్నాయి. నాకు రూ. 20/-ల చిన్న చిన్న మని ఆర్డర్లు పంపిస్తూ ఆయన ఎంత కష్టం ఓర్చుకొన్నాడో భగవంతుడికే తెలుసు. మావాడు కలెక్టరు అవుతాడు అని చెప్పుకున్న తండ్రికి ఇంతటి శరాఘాతం! అది 1954, అప్పటికి నాకు 20 ఏళ్లే. ఆ వయస్సులో తగిలిన గాయం పీడకలల రూపంలో నన్ను 30 ఏళ్ల పాటు ఎన్నెన్నో రాత్రులు వేధించింది. 'పీడకల' అంటే ఏమిటో ఎంత మందికి తెలుసోగాని, అనుభవిస్తేనే గాని తెలియని జీమూతం, భూతం అది!

ఆర్జన కోసమనో, ప్రతిష్ఠ కోసమనో ఆసక్తిలేని చదువులకు పిల్లల్ని బలి పెట్టకూడదు. మరో ఆలోచన చెయ్యకుండా ఈనాటి తల్లిదండ్రులు పిల్లల్ని కంప్యూటరు, ఐ.టి. కోర్సుల్లో చేర్చేస్తున్నారు. వందల కొద్దీ విస్తరిల్లిన మన ఇంజనీరింగు కళాశాలల నాణ్యత విషయంలో అట్టడుగు స్థాయిలో ఉండి లక్షల కొద్దీ యువతీ యువకులను వ్యర్థుల్ని చేసి వదులుతున్నాయి. దూరదేశాల్లో జిగేలుమని రాణిస్తున్న అతిస్వల్ప శాతం యువకుల విజయగాథలు చిలవలు పలవలుగా మనకు చేరుతున్నాయిగాని, అంతకు ఎన్నో రెట్లుగా ఉన్న దయనీయుల చీకటి కోణాలు మనకు కనబడవు. హర్యానాలోని *యాస్పైరింగ్ మైండ్స్* అనే ఒక సంస్థ గత ఏడాది చేసిన అధ్యయనం ఈ విషాదాన్ని బయటపెట్టింది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో 600-700 వరకు అత్యధికంగా ఇంజనీరింగు కళాశాలలు ఉండగా, ఉద్యోగాలు అర నుంచి ఒక శాతం మాత్రమే మన యువకులకు వస్తున్నాయి. అదే ఢిల్లీలో ఈ శాతం 11గా ఉన్నది! దారీ తెన్నూ కానరాక ఇక్కడే ఉండిపోయిన యువకులు ఆ వయసులో ఊరికే కూర్చుంటారా? వక్రమార్గాలు తొక్కుతున్నారు. వ్యసనాల బారిన పడుతున్నారు! పైగా ఇదొక క్రూరమైన పోటీ ప్రపంచమని కార్పొరేటు సంస్థలు రాత్రింబవళ్ళు ప్రచారం చేస్తూ వాళ్ళని విపరీతమైన మానసిక అశాంతికి గురిచేస్తున్నాయి.

**సర్కారీ కొలువు :**

1954-55 విద్యాసంవత్సరానికి బడులు తెరిచాక, ఊరికి దగ్గరలోనే ఉన్న ఉన్నత పాఠశాలలో అశిక్షక ఉపాధ్యాయుడిగా ఏమీ గమ్యం తెలియని కాలక్షేపంలా చేరాను. అక్కడ జరిగింది మొదటి యాదృచ్ఛికం. ఒకనాడు వార్తా పత్రికలో ఆంధ్ర పబ్లిక్ సర్వీస్ కమిషనువారి చిన్న ప్రకటనొకటి కంటపడింది. గ్రూప్-2 ఉద్యోగాలకు పోటీ పరీక్షలకు పిలుపది. పోటీ అన్న మాటే నన్ను సవాలు చేసినట్టయింది. దానికి చదివి ఆ పరీక్షలు రాసిన కొద్ది నెలలకే నేను నెగ్గటం, కర్నూలు సచివాలయంలో గుమాస్తాగా చేరమని పిలుపు రావటం జరిగిపోయాయి. జూలై 1955లో అట్లా చేరిన కొలువులో దాదాపు 37 సం.లు పనిచేసి 1992లో రిటైరయ్యాను. మరి ఇంత సుదీర్ఘంగా చేసిన సర్కారు కొలువు నాకు నేర్పిందేమిటి? అర్జీ దారుడికి సాయం జరగకుండానో, తప్పకపోతే జరిగే వరకూనో ఎన్ని మెలికలు వీలైతే అన్నీ పెట్టే సుగుణాల ఖని మన బ్యూరాక్రసి. ఒకటిన్నర శతాబ్దాల నాటి బ్రిటిషు వాడి 'భారత' శిక్షాస్మృతి, నేరస్మృతులు పౌరులందర్నీ ముందు నేరస్తులుగా భావించమని చెప్తాయి. అప్పుడు మనం బానిసలం కదా. పోలీసువాళ్లకి ఇప్పటికీ మన బడుగులు అట్లాగే కనుపిస్తారు. సచివాలయ స్థాయిలో కూడ అదే రకపు జడత్వం అనేక సార్లు నాకు ఆగ్రహం తెప్పించేది. త్వరగానే దాన్ని అదుపులోకి తెచ్చుకోక తప్పలేదు. సహాయ, ఉప, సంయుక్త కార్యదర్శి హోదాల్లో ఉన్నప్పుడు నా గది బయట నా పేరుకు బదులు మదర్ థెరిస్సా సూక్తి ఒకటి సందర్శకులకు దర్శనమిచ్చేది:

"ఎదురైన మనిషిని చిరునవ్వుతో పలకరించలేనంత హడావుడి పడుతున్నామా?" అని.

సహాయ కార్యదర్శిగా నేను శలవుల్లో ఉన్నప్పుడు అధికార భాషా సంఘానికి అధ్యక్షులుగా వచ్చిన ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు గారు నేనే కార్యదర్శిగా ఉండాలని రెండు నెలల పాటు నాకోసం వేచి ఉండటం, ఆ తర్వాత నండూరి కృష్ణమాచార్యులు గారి ఆధ్వర్యంలో నాలుగేళ్లపైన పనిచెయ్యటం నా సర్కారీ కొలువు కాలంలో అత్యంతంగా ఉత్సాహం, ఉత్తేజం నింపిన సమయం. సభ్యులుగా ఉండిన డా. మల్లెమాల వేణుగోపాలరెడ్డి, కొలకలూరి ఇనాక్, నాగభైరవ కోటేశ్వరరావు, మధురాంతకం రాజారాం గార్లు నన్ను అతి గారాబంగా ప్రోత్సహించిన స్ఫూర్తి దాతలు. కాని మేము ప్రభుత్వ యంత్రాంగంలో తెలుగు అమలుకోసం చేసిన అవిశ్రాంత కృషి అంతా 1989 ఎన్నికల్లో ఎన్టీఆర్‌గారు ఓడిపోవటంతో బూడిదలో పోసిన పన్నీరు కావటం మాకే కాదు, యావదాంధ్ర దేశానికే తీరని దురదృష్టం!

**భాషోద్యమం :**

మన సాహిత్యంలో ఒక వంద మంచి తెలుగు పుస్తకాల జాబితా తయారు చేసి ఆంధ్రదేశంలో ప్రచారం కల్పిస్తే, ప్రతి తెలుగు కుటుంబం వాటితో ఒక బుల్లి గ్రంథాలయం ఏర్పరుచుకొంటే, తెలుగు జాతిలో ఆత్మాభిమానం, పునరుత్తేజం మోసులెత్తుతాయని నాదొక స్వప్నం. జస్టిస్ ఆవుల సాంబశివరావు గారు అధ్యక్షులుగా, నేను కార్యదర్శిగా 1990లో ఏర్పాటైన *జనహిత* సంస్థ ద్వారా ప్రవీణుల సాయంతో తయారుచేసిన '103 మంచి తెలుగుపుస్తకాలు' జాబితానొకదాన్ని *స్వాతి* వారపత్రికలో ప్రచురించే సరికి, దానికి పెద్దగా స్పందన వచ్చి నేను 'జనహిత ధర్మారావు'నై పోయాను.

కళాశాల స్థాయిలో తెలుగుకు రెండో, మూడో భాషగా జరుగుతున్న అవమానానికి ఖిన్నులైన ఇద్దరు అధ్యాపకులు 1996లో *మాతృభాషా సమితిని* రాజధానిలో ఏర్పాటు చేసి అప్పటికే రిటైరై ఉన్న నన్ను అధ్యక్షుడిగా ఎన్నిక చేశారు. నిజానికి పాఠశాల స్థాయిలో బోధనా, తెలుగు స్థితీ మరింత దీనస్థితిలో ఉండటంతో, ఇంగ్లీషు మీడియం పాఠశాలలు పుట్ట గొడుగుల్లా విస్తరించటం అప్పటికే మొదలైంది. అదే సమాయానికి విజయవాడ నుంచి డాక్టరు సామల రమేష్ బాబు గారు కేవలం తెలుగు భాషోద్ధరణకు అంకితమైన *నడుస్తున్న చరిత్ర* అన్న మాస పత్రికను వెలువరించటం మొదలుపెట్టారు. ఇంకేం, దాని సాయంతో పాఠశాలలో తెలుగుకు సముచిత, సమున్నత స్థానానికి, ప్రభుత్వ యంత్రాంగంలో తెలుగు అమలుకు పెద్ద ఎత్తున అవిరళ ప్రచారం సాగింది. అందులో నా వాటా కూడ ఉన్నది. ఎంత మంది విద్యావేత్తలు మొత్తు కోనీండి, ఎంత ప్రచారం చెయ్యండి, చలనం రాని జడులు మన రాజకీయ నేతలు. ప్రపంచ బ్యాంకు పారిస్తున్న నిధుల వరదలో మునకలేస్తూ మన పాఠశాల, కళాశాల విద్యారంగాల్ని కార్పోరేటు, ప్రయివేటు సంస్థల వ్యాపార కీచకులకు అప్పగించేస్తున్నారు. తెలుగును వీలైనంత లోతున పాతిపెట్టే దుస్సాహసం చేస్తున్నారు. దీని ఫలితమే – సచివాలయపు కొత్త ముఖ ద్వారం పైన ఇంగ్లీషు తప్పించి తెలుగు, ఉర్దూలు లేవు. అంతకంటే ఘోరంగా – దానికి ఎదురుగా ఉన్న తెలుగుతల్లి విగ్రహపు నల్లరాతి ఫలకం పైన 14 వరుసల ఇంగ్లీసులోనే మాన్యుల నామధేయాలున్నాయి. ఆఖరుకు విగ్రహం పేరు కూడ ఇంగ్లీషే! 2002లో యాదృచ్ఛికంగా ఈ దురంతం నా కంట బడింది.

వెంటనే ఈ పాతకాన్ని డిసెంబరు 21లోగా క్షాళనం చెయ్యకపోతే, మాతృభాషా సమితి కార్యకర్తలు డబ్బాలతో తారుతెచ్చి పూస్తారని 15 రోజుల హెచ్చరికను అటు సచివాలయానికి ఇటు హైద్రాబాద్ నగరపాలక సంస్థకు జారీ చేశాం. ఈ 'ముట్టడి'కి పత్రికల్లో బాగా ప్రచారం కలిగించాం. అయినా ఏలికల్లో డిసెంబరు 20 సాయంత్రం వరకు కదలిక లేదు. మార్నాడు – ఆ చారిత్రక దినం 2002 డిసెంబరు 21న – ఉదయం 10 గం॥ల వేళ ఒక యాభై మంది కార్యకర్తలం విగ్రహం వద్దకు చేరుకున్నాం. అట్లాగే పత్రికల వాళ్ళు వచ్చారు. తారుడబ్బా, కుంచె చేతబట్టుకుని మా ముందుండి ఉరకలు తీసింది 86 ఏళ్ళ 'యువకుడు' గంధం నాగేశ్వరరావు గారు. ఆశ్చర్యం – తెలుగు తల్లి ఫలకాలపై ఇంగ్లీషు మాయమై వాటి స్థానంలో ముత్యాల తెలుగు అక్షరాలు మురిపించాయి.

రెట్టించిన ఉత్సాహంతో బృందం ఇక సచివాలయం గేటువైపు పరుగు పెట్టింది. అప్పుడు పోలీసులు అటకాయించి, అరెస్టులు చేసి వ్యాను ఎక్కించారు. అట్లా తక్కిన వారిలో కాంగ్రెసు శాసన సభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ గారు కూడ ఉన్నారంటే ఏలికల చర్మం ఎంత దళసరో తెలుస్తుంది. తర్వాత త్వరలోనే సచివాలయం నొసట కూడ తెలుగు తిలకం దర్శన మిచ్చింది. ఇది తెలుగు భాషోద్యమపు తొలి విజయం. ఈ

స్ఫూర్తితో 2003 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా లలితకళాతోరణంలో రెండు వేల మంది అభిమానులతో సంరంభంగా జరిగిన బృహత్సభకు అప్పటి విద్యామంత్రి మండవ వెంకటేశ్వరరావు గారు హాజరయ్యారు. కార్పోరేటు, ప్రయివేటు పాఠశాలల్లో కూడ 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగును ఒక పాఠ్యంగా నిర్బంధంగా ప్రవేశపెడతామని సభలో ప్రకటించారు.

అన్న వాగ్దానాన్ని నెలబెట్టుకొంటూ, ఆయన అదే ఏడాదిలో ఉత్తర్వులు జారీ చేయించారు. బృహత్సభలో ఏర్పడ్డ తెలుగు భాషోద్యమ సమాఖ్యకు ఇది రెండో గొప్ప విజయం. వివరంగా ఈ ఘటనల్ని పేర్కొన్న కారణమేమంటే – ఉద్యమంలో ప్రత్యక్ష కార్యాచరణం ప్రాణావసరం. అది లేకుండా ఇప్పటి పరిస్థితుల్లో ఫలితాలు రావటం అసాధ్యం. 2008 తర్వాత వచ్చిన సమాఖ్య కొత్త నాయకత్వం ఈ సంగతి మననం చేసుకోవాలి గదా!

కల్పించుకొన్న భ్రమలు కూడ సత్ఫలితాలు ఇవ్వవచ్చు. ఆనర్సు పోయిన వెంటనే ఆ వేసవి శలవుల్లో ఆ కుంగుబాటులోనే ఒక అద్భుతం జరిగింది. విశ్వవిద్యాలయ కాలంలో ఇంతకు ముందు పేర్కొన్న భ్రమాజనిత ఉత్తేజం వల్ల కావచ్చు – 'అవకాశవాదం' పేరిట దాన్ని సమర్ధిస్తున్నట్టు కన్పించే ఒక వ్యంగ్య పూరితమైన వ్యాసాన్ని రాసి *తెలుగుస్వతంత్ర* వారపత్రికకు పంపాను. అది దాదాపు వెంటనే అచ్చుకావటం ఆ అద్భుతం. ఆ వెంటనే దేశంలో ఉన్న అన్ని ముఖ్యమైన భాషలూ "జాతీయ భాషలే" నని మనకు కావల్సింది కేవలం ఒక అనుసంధాన భాష మాత్రమేనని ఆ పనిని హిందీ కంటే ఇంగ్లీషే సర్వ సమర్థంగా నెరవేరుస్తుందని ఒక వాదన లేవదీసి ఒక ఏడాదికి పైగా ఆ పత్రికలో వివాదం నడిపాను. గత అర్ధ శతాబ్దంగా నిర్విరామంగా రాస్తున్న అసంఖ్యాకమైన వ్యాసాలకి ఆ 20వ ఏటే అట్లా బీజం పడింది.


ఇస్మాయిల్

నేను 1956లోను, గోరాశాస్త్రి గారు 1959లోనూ, హైదరాబాదు చేరుకున్నాం. ఆయన *తెలుగుస్వతంత్ర*లో రాస్తూ వచ్చిన సంపాదకీయాలు– *వినాయకుడి వీణాస్వరాలు, రేడియో నాటికలు,* నన్ను ముగ్ధుణ్ని చేసేవి. 1981 మేదేనాడు ఆయన గతించే వరకు ఆయనతో ఏర్పడ్డ ఆత్మానుబంధం నా మహద్భాగ్యాల్లో ఒకటి. అట్లాగే కాకినాడ "చెట్టుకవి" ఇస్మాయిల్‌తో. అట్లాగే నట, దర్శక, ప్రయోక్త 'పద్మభూషణుడు' అయిన ఏ.ఆర్. కృష్ణతో. దేశభవిత పట్ల గోరాశాస్త్రి గారి ఆవేదనా నిర్వేదాలు కలచివేస్తుంటే, మిగతా ఇద్దరి మిత్రుల ఎడతెగని జీవనోత్సాహం నన్ను పూర్తిగా ఆవరించుకొన్నది. చెప్పవచ్చేదేమంటే – నాజీవితాన్ని ప్రత్యక్షంగా అమితంగా ప్రభావితం చేసింది మా నాన్న తర్వాత ఈ మూర్తిత్రయమే.

ఈ ముగ్గురికి వారి వారి "షష్ఠిపూర్తి" ఉత్సవాలు నిర్వహించి పోగు చేసిన తృణమో, ఫణమో ముట్ట చెప్పగలగటం నాకొక సాఫల్య సిద్ధి. ఈ ముగ్గురి ద్వారా ఎంత పెద్ద నట, కవి, గాయక బృందమో ఆంధ్రదేశం నలుదెసలా నాకు సన్నిహితులై నాలో కలిగించిన, ఇప్పటికీ కలిగిస్తున్న ఉత్సాహాన్ని, పారిస్తున్న స్నేహ సుధావాహినుల్ని లెక్కించటం అసాధ్యం.

**స్నేహసూక్తం :**

ఆదిమకాలం నుంచీ ప్రకృతి భీభత్సాలకి మనిషి భయభ్రాంతుడైనాడు. అట్లాగే వ్యక్తిగత జీవితాల్లో వచ్చే రోగాలకు, అకాలమరణాలకు భయవిహ్వాలుడైనాడు. కాలక్రమేణా ఋతువుల క్రమాన్నీ, గ్రహచలనాల్నీ అర్థం చేసుకొంటూ ఈ శక్తులన్నిటినీ శాసించే సర్వశక్తిమంతుడైన దేవుడు ఉన్నాడని అన్ని జాతులూ నమ్మినాయి. అయినా ఆయన్ని ప్రసన్నం చేసుకోవటానికేమో భిన్న భిన్న మత విశ్వాసాలు ఏర్పడినాయి. వాటి మధ్య ఘర్షణలతో మనిషి చరిత్ర – మిగతా అన్ని కారణాల కంటే ఎక్కువగా – రక్తసిక్తమైంది. ఈ చివరిమాట చెప్పింది – ప్రసిద్ధ అమెరికా చరిత్ర కారుడు విల్‌డ్యురాంట్. మొత్తం మీద మతం మనిషికి మేలు కంటే కీడే ఎక్కువ చేసిందని నేను నమ్ముతాను.

దేవుడు కనపడడు. ఆయన ప్రత్యక్ష జోక్యం గురించి మనకు రుజువులు దొరకవు. పైగా ఈ నమ్మకంతో మనం తోటి మనిషిని నిర్లక్ష్యం చేస్తున్నామని, దూరం చేసుకొంటున్నామని నేను గట్టిగా నమ్ముతాను. భయాల నుంచి నీకు అంతిమ భద్రత తోటి మనిషి నుంచే గాని, మరెటు నుంచీ రాదుగాక రాదు. అలాంటి మనిషినే ఆప్తమిత్రుడు, ప్రాణస్నేహితుడు అంటాం. అతడు సాక్షాత్తు నీ ప్రాణంతో సమానం. అతడు గుర్తురాకుండా నువ్వు ఏ ఆలోచనా చెయ్యలేవు. ఏపనీ తలపెట్టలేవు. సర్వవేళలా అతడు నీ

మనసుల్లా, అంతరాత్మల్లా, నీడలా కష్టంలో, సుఖంలో నిన్ను వెన్నంటి ఉంటాడు. మధ్యలో నిన్ను విడువడు. కడదాకా ఉంటాడు. ఎన్నోసార్లు నీకు ఎటూ పాలుపోని, ఏదారీ, తెన్నూ తోచని విషమ ఘట్టాలు ఎదురు కావచ్చు. అయినా నీకేం భయం? నిన్ను అర్థం చేసుకొని, నీ పక్షాన నిలిచేవాడు ఈ పరుష ప్రపంచంలో ఒక్కడైనా ఉన్నాడు గదా. అతడు చాచిన చేతిలో చెయ్యి వేసి లోకాన్ని సంభాళించుకోవచ్చు. నీ ప్రయాణాన్ని నిశ్చింతగా కొనసాగించుకోవచ్చు. ఇటువంటి నమ్మకం నా నలభయ్యోపడికి ముందే కలిగింది. ఇంకేం, ఏదో వంకపెట్టి పదిమంది మిత్రుల్ని 'మంద' వెయ్యటం ఒక వ్యసనంగా మారింది. నలభై, అరవై, డెబ్బయి జన్మదినాల్ని సందడిగా జరిపాను. ఏభయ్యోది మిత్రుడు, సమవయస్కుడు కాశీతో కలిసి ఉప్పాడ సముద్రతీరంలో అలలగలగలలుగా సాగించాను.

నా పదవీ విరమణను మాత్రం 1992లో మిత్రబృందమే ఊరుకు 25 కి.మీ. దూరంలో ఒక చిట్టడవి మధ్య జామతోటలో ఒక మరువలేని, మధుర ఘటనగా రోజంతా నిర్విరామంగా నిర్వహించారు. మరో ఆరునెలలకు నిష్క్రమించనున్న ఏ.ఆర్. కృష్ణ ఆ సంబరపు సారథి. ఆ సందర్భంగా వెలువరించిన *ధర్మదర్శనం* జ్ఞాపిక సంచికలో ఎనభై ముగ్గురు సుప్రసిద్ధ, అప్రసిద్ధ మిత్రులంతా శుభాశంసలు పలికారు.

ఈ స్నేహ వ్యసనం ముదిరి మరి కొంత దూరం వెళ్ళింది. ఒక్క ఆప్తమిత్రుడూ లేనివాడు అదృష్టహీనుడైతే, ఒక్క విరోధీలేనివాడు నిజమైన సంపన్నుడు, నిండు సంస్కారి, రకరకాల కారణాల వల్ల ఇంచుక దూరదూరంగా జరిగిన వాళ్ళను కూడ స్నేహహస్తం చాచి సత్ఫలితాలు పొందాను. వ్యాజ్యాల్లోని ఆస్తులు దక్కినట్లు సంతసించాను. ఈ సంగతినే మరొక సూక్తిలాగ చెప్పవచ్చు.

'యాక్ట్ బట్ డోంట్ రియాక్ట్' అన్నది ఆ సూత్రం. అవతలివ్యక్తి అపసవ్యంగా నీ ఎడల ప్రవర్తించాడని నువ్వు భావించినా, దానికి ప్రతిగానో, ప్రతిచర్యగానో, నువ్వు అప్పటికప్పుడు స్పందించరాదు.

అతనికున్న కారణం ఏమై ఉంటుందా అని లోతుగా ఆలోచించుకోవాలి. దీనికి సమయం పడుతుంది గనుక, అప్పటికి మౌనమే ఉభయతారకం. ఆపైన ఆ పరిస్థితిలో నీ కర్తవ్యం ఏమిటి అన్న దానిపైనే ధ్యాస ఉంచాలి. ఆ కర్తవ్యాన్ని నీ సంస్కారం నిర్దేశిస్తుంది. దాని ప్రకారం నడుచుకోవాలి గాని, నీ నడత మీద అతనికి అధికారం ఇవ్వకూడదు. ఈ సందర్భంగానే గాంధీజీ దక్షిణాఫ్రికా అనుభవం నా తలపుల్లో తళుక్కుమని మెరుస్తుంది. తనకు సరైన రైలు టిక్కెట్టు ఉన్నా, ఆ అర్ధరాత్రి ఒక దురహంకార శ్వేత జాతీయుడు ఆయన్ని రైలు పెట్టెనుంచి పీటర్ మారిస్‌బర్గ్ స్టేషనులో కిందికి తోసేశాడు. వణికిస్తున్న చలిలో స్టేషను ఒకగదిలో ఆ రాత్రి ఆయన గడప దలిచాడు. ఆ గదిలోకూడ మరొక తెల్లజాతి మనిషి ఉన్నాడు. గాంధీజీ ఆలోచన్లు ఎట్లా పరుగులు పెట్టినవో ఆయన మాటల్లోనే వినండి :

*"నా ప్రాణానికే ముప్పుందని భయమేసింది. చీకటిగా ఉన్న ఆ గదిలో అడుగుపెట్టాను. అక్కడ ఒక తెల్లమనిషి ఉన్నాడు. అతనంటే భయం పట్టుకుంది. నా కర్తవ్యం ఏమిటి అని ప్రశ్నించుకొన్నాను. ఇండియాకు తిరిగి వెళ్ళిపోవటమా, లేక దేవుడే రక్షకుడిగా, ఏమి కానున్నా, ఎదురొడ్డి నిలవటమా? ఏ కష్టాలు రానీ, అక్కడే ఉండి పోవాలని నిర్ణయించుకొన్నాను."*

విన్నారు గదా. ప్రత్యర్థి ప్రవర్తనను పక్కకు నెట్టి తన కర్తవ్యమేమిటీ అని ఆయన తరచి వేసుకున్న ప్రశ్నే చరిత్ర గతిని మార్చింది.

సరే రాష్ట్రంలో తెలుగును గురించి అంతో ఇంతో పట్టించుకునే స్థితికి చేర్చిన తెలుగుభాషోద్యమ ప్రస్థానంలో గాని, చలంగారి శత జయంతి సందర్భాన విజయవాడలో ఆయన గారి చూడ చక్కని కంచు విగ్రహ ప్రతిష్ఠలో గాని, మా నాన్న స్మాకరకంగా పుట్టిన ఊళ్ళో గ్రామ గ్రంథాలయం ఏర్పాటు చెయ్యటంలోగాని, తానావారి ఆహ్వానం మేరకు అమెరికావెళ్ళి గిడుగు భాషా పురస్కారం అందుకోవటంలో గాని, నాతో ఉన్న అశేష మిత్రబృందపు సహకారం లేకుండా సాధ్యమవునా? అసంభవం! విజయవాడ పోలవరపు కోటేశ్వరరావు గారి వంటి ఆప్తుడిని కోల్పోయినా, మూర్తి, శివరావు, వేమూరి వెంకయ్య, చిన్ననాటి నేస్తం గోపాలం మాష్టారు ఇంకా నాతో ఉన్నారు.

నేనీ సుదీర్ఘ జీవితంలో ఆర్జించినదేమీ లేకపోయినా, అశేష హిత, మిత్రవర్గం నా గొప్ప సంపదకాదా?

"సృష్టిలో తీయనిది స్నేహమేనోయీ!"

మి

# భారతీయ సంగీతం
## మౌలిక లక్షణాలు

- నండూరి పార్థసారథి

**శా**ర్ఙ్గదేవుని *సంగీత రత్నాకరం* వరకు - అంటే 13వ శతాబ్ది పూర్వార్ధం వరకు - భారతీయ శాస్త్రీయ సంగీతం అఖండంగా వుందనీ, ఆ తర్వాతనే రెండుగా చీలిపోయిందనీ సంగీత శాస్త్రకారులందరూ అంటున్నారు. ఆ చీలికకు కారకుడు అమీర్ ఖుస్రోనా? *రత్నాకరం* నుంచి దూరంగా జరిగినది హిందూస్థానీ సంగీతమా? కర్ణాటక సంగీతమా?

*సంగీతరత్నాకరమే* తమకు ప్రమాణమని ఉత్తరాది వారూ, దక్షిణాదివారూ కూడా చెబుతున్నారు. అసలది కర్ణాటక సంగీతం కోసమే రాసినదని దక్షిణాది వారూ, ఉత్తర భారతం కోసమే రాసినదని హిందూస్థానీ వారూ అంటున్నారు. *సంగీత రత్నాకరం* మీకు సరిగా అర్థం కాలేదంటే మీకే అర్థం కాలేదని వాదించుకొంటున్నారు కూడా.

భారతీయ సంగీతం రెండుగా విడిపోయిన తర్వాత దాక్షిణాత్య సంగీతం కోసం ప్రత్యేకంగా వెలువడిన మొదటి లక్షణ గ్రంథం విద్యారణ్యుల వారి *సంగీతసార* (14వ శతాబ్ది పూర్వార్ధం). *రత్నాకరం* లో లేని షట్ శ్రుతి రిషభ, ధైవతాల వంటి అదనపు స్వరనామాలు ఆ గ్రంథంలోనే ఉన్నాయి. అప్పటినుంచే శుద్ధస్వరం అనే మాటకు అర్థం మారి పోయింది. (*సంగీతసార* గ్రంథం పూర్తిగా లభించకపోయినా అందులోని కొన్ని భాగాలు వెంకటమఖి రచించిన *చతుర్దండి ప్రకాశిక* లో కనిపిస్తాయి.)

విద్యారణ్యుని గ్రంథం తర్వాత రెండు వందల యేళ్ళకు *స్వరమేళకళానిధి* గ్రంథాన్ని రచించిన రామామాత్యుడు శుద్ధ స్వరం విషయంలో, అదనపు స్వరనామాల విషయంలో విద్యారణ్యుల వారినే అనుసరించాడు. ఆ తర్వాత *సంగీతసుధ* రచించిన గోవింద దీక్షితుడు, *చతుర్దండి ప్రకాశిక* రచించిన వెంకటమఖి కూడా ఆ పద్ధతినే అనుసరించారు. శార్ఙ్గదేవుడు ముఖారిని శుద్ధ స్వరమేళగా పేర్కొన్నాడు. రామామాత్యుడూ దాన్ని శుద్ధస్వరమేళగానే పేర్కొన్నాడు. కాని, శార్ఙ్గదేవుని శుద్ధ స్వరాలు వేరు, రామామాత్యుని శుద్ధ స్వరాలు వేరు. శార్ఙ్గదేవుని పద్ధతిలో కోమల స్వరాలు వికృత స్వరాలు. కర్ణాటక సంగీత లక్షణ కర్తల పద్ధతిలో కోమల స్వరాలే శుద్ధ స్వరాలైనాయి. ఈ మార్పు సరిగా అర్థం కాకపోవడం వల్ల జరిగినదా? ఉద్దేశపూర్వకంగా జరిగినదా? దీని వల్ల జరిగిన మేలు ఏమిటి?

ఒక స్థాయిలో ఇరవైరెండు శ్రుతులుంటాయన్నది అందరూ అంగీకరించిన విషయమే. సప్తస్వరాల మధ్య ఇరవైరెండు శ్రుతుల పంపిణీలో స,మ,ప స్వరాలకు నాలుగేసి శ్రుతులు, రి,ద స్వరాలకు మూడేసి శ్రుతులు, గ,ని స్వరాలకు రెండేసి శ్రుతులు (3×4+2×3+2×2=22) ఉంటాయినీ, ప్రతి స్వరం దాని చివరి శ్రుతి మీద నిలుస్తుందనీ *రత్నాకరం* పేర్కొన్నది. ఆ సూత్రం ప్రకారం చివరి శ్రుతి స్వరం కావాలి. హిందూస్థానీ సంగీత పద్ధతిలో అలాగే ఉన్నది. కాని, కర్ణాటక సంగీత పద్ధతిలో మొదటి శ్రుతిని శుద్ధ స్వరంగా పేర్కొంటున్నారు. ఇది *రత్నాకర* పద్ధతికి విరుద్ధం.

స 4, రి 3, గ 2, మ 4, ప 4, ద 3, ని 2 = 22. ఈ పంపిణీ ఉత్తరభారతంలో, దక్షిణభారతంలో కూడా అందరూ అంగీకరించినదే. కాని, మధ్యలో-18వ శతాబ్దిలో-గోవిందాచార్యుడు తన *సంగ్రహచూడామణి* గ్రంథంలో షడ్జ, పంచమాలు అచల స్వరాలు కనుక వీటికి ఒక్కొక్క శ్రుతేననీ, మిగిలిన ఐదుస్వరాలకు నాలుగేసి చొప్పున ఇరవై శ్రుతులనీ, అన్నీ కలిపి మొత్తం 1+1+5×4=22 శ్రుతులనీ ఎందుకు ప్రతిపాదించినట్లు? అలా చేస్తే అది పాశ్చాత్య సంగీతంలో లాగా ఈక్వల్ టెంపరమెంటల్ స్కేల్ అవుతుంది కదా! ఈ అయోమయ ప్రతిపాదన చేసినది హిందూస్థానీ వారు కదా! ఆ పని అమీర్ ఖుస్రో చేయలేదు కదా!

నండూరి పార్థసారథి, ఫోన్ : 9959734534

అఖండ భారతీయ సంగీతంలో ఉండిన రాగసమయాలకు, రాగఋతువులకు, రాగరసాలకు దాక్షిణాత్యులు స్వస్తి చెప్పారు. ఇవి యిప్పటికీ కర్ణాటక సంగీత పాఠ్యగ్రంథాలలో కనిపిస్తాయి; కాని వాడుకలో లేవు. హిందుస్థానీ సంగీతంలో యిప్పటికీ పాటిస్తున్నారు. పగటి రాగాలను రాత్రివేళ గానం చేయరు; రాత్రి రాగాలను పగటివేళ గానం చేయరు. వర్షఋతు రాగాలను గ్రీష్మ ఋతువులో గానం చేయరు. కర్ణాటక సంగీతంలో ఈ నియమాలన్నీ పోయాయి. రాగాలాపనలో మంద్ర, మధ్య, తారస్థాయిలలో క్రమంగా విలంబలయలో, మధ్యలయలో, ద్రుతలయలో గానం చేసే పద్ధతి కర్ణాటక సంగీతంలో పోయింది; హిందూ స్థానీలో యిప్పటికీ వుంది. ఇలా ఎన్నో ప్రాచీన లక్షణాలు కర్ణాటక సంగీతంలో మరుగైపోయి హిందుస్థానీ సంగీతంలో మిగిలాయి.

*రత్నాకరం* తర్వాత ఉత్తరాదిని, దక్షిణాదిని కూడా ఎన్నో కొత్త రాగాలు అవతరించాయి. త్యాగరాజే ఎన్నో కొత్త రాగాలలో కృతులు రచించాడు. ఇప్పటికీ ఎందరో కొత్త రాగాలను సృష్టిస్తున్నారు. పాత రాగాలెన్నో క్రమంగా మరుగున పడిపోతున్నాయి. కొత్త పేర్లతో వస్తున్న రాగాలలో కొత్తదన మెంత? పాత రాగాలు ఎందుకు చెరిగిపోతున్నాయి? కర్ణాటక రాగాలు కొన్ని హిందుస్థానీ సంగీతంలోకి పోయి, హిందుస్థానీ గమకాలతో కొత్త అందాలు సంతరించు కొంటున్నాయి. అలాగే కొన్ని హిందుస్థానీ రాగాలు కర్ణాటక సంగీతంలోకి వచ్చి కర్ణాటక గమకాలతో కొత్తరూపులు సంతరించుకొంటున్నాయి. ఉత్తరాన, దక్షిణాన కూడా రెండేసి, మూడేసి రాగాలు కలగలిసి సంకీర్ణరాగాలుగా కొత్త అవతారాలెత్తుతున్నాయి. రాగానికి కనీసం ఐదు స్వరాలుండాలని శాస్త్రం చెబుతుండగా అక్కర్లేదని కొందరు నాలుగుస్వరాలతో, మూడు స్వరాలతో కొత్త రాగాలు సృష్టిస్తున్నారు.

పాత పుస్తకాలలో కొన్ని వేల మూర్ఛనలుండగా, వాటికి రాగనామాలు కూడా వుండగా రవిశంకర్‌లాంటి వాళ్ళు, బాలమురళిలాంటి వాళ్ళు కొత్త రాగాలు ఎందుకు సృష్టిస్తున్నారు? అవి తమ సొంతమని ఎందుకు చెప్పుకొంటున్నారు? ఎందుకంటే అవి వాళ్ళ మనసుల్లోంచి పుట్టినవి– పుస్తకాల పేజీల్లోంచి పుట్టినవి కావు. పాత పుస్తకాల్లో పేజీలు తిరగేసి చూస్తే వీళ్ళ రాగాల మూర్ఛనలు కనిపించవచ్చుగాక; తప్పకుండా కనిపిస్తాయి. కాని, రాగం అంటే మూర్ఛన మాత్రమే కాదు. వీళ్ళు తమ కొత్త రాగాలకు స్పష్టమైన కొత్త రూపాలు యిస్తున్నారు. అవి పూర్వ ప్రసిద్ధమైన రూపాలు కావు.

తాళాలు కూడా అంతే. గాత్ర విద్వాంసులు, వాద్య విద్వాంసులు కొత్త రాగాలు కనిపెడితే లయ వాద్య విద్వాంసులు కొత్త కొత్త తాళాలు – కొత్త పేర్లతో, భిన్నమైన మాత్రా సంఖ్యలతో – సృష్టిస్తారు. శ్యామాశాస్త్రి 79 అక్షరాలుండే శరభనందన తాళం సృష్టించాడట. రామస్వామి దీక్షితులు అష్టోత్తర శత రాగ తాళ మాలికను రచించాడట. ఉత్తరాదిని కొందరు గొప్ప తబ్లా విద్వాంసులు కూడా కొత్త తాళాలు సృష్టించారు.

దేశంలో ఎక్కడికక్కడే ఎన్నో రకాల ఫణితులున్నాయి. వాటి సౌందర్యానికి వశులై పండితులు వాటిని రాగలక్షణాల చట్రంలో యిమిడ్చి వాటికి శాస్త్రీయ గౌరవం కల్పించారు. మతంగముని *బృహద్దేశి*లో చెప్పిన దేశీరాగాలు అలాంటివే. శాస్త్రీయ సంగీత సముద్రంలో కలిసిపోయాక ప్రాంతీయ ఫణితులన్నీ శాస్త్రీయ రాగాలై దేశమంతటా ప్రయోగంలోకి వచ్చాయి. సింధుభైరవి, సైంధవి, సింధీ కాఫీ, సింధు రామక్రియ, గూర్జరి, గుజరీ తోడి, మాళవ, మాళవగౌళ, రీతిగౌళ, గౌడ మల్లారు, బంగాళ, కన్నడ, ముల్తానీ, జానుపురీ, భోపాలీ, భోపాల్ తోడి, మాండ్, పహాడి వగైరా ఎన్నో రాగాలు ప్రాంతీయ మూలాలు కలిగినవే. ఉత్తర భారత ప్రాంతాల పేర్లు గల రాగాలు కర్ణాటక సంగీతంలో స్థిరంగా వుండిపోయాయి. రాగనామాలు ఒకటే అయినా స్వరాలు వేరుగా ఉండేవి, స్వరాలు ఒకటే అయినా రాగనామాలు వేరుగా ఉండేవి– అలా ఎన్నో రకాలు.

కన్యాకుమారి నుంచి కాశ్మీర్ దాకా, బెంగాల్ నుంచి పంజాబ్ దాకా దేశంలో ఎన్నో భాషలు; మనుషుల్లో ఎన్నో రంగులు; పోలికల్లో ఎన్నో తేడాలు. అయినా అందరం భారతీయులమే అనే భావం అందరిలో బలంగా ఉంది. దేవుళ్ళు, పుణ్యక్షేత్రాలు, పూజావిధానాలు, వ్రతాలు, పండుగలు, వివాహాది శుభకార్యాలు, కర్మకాండలు, మంత్రాలు, పురాణాలు, కళలు ఇలాంటివి భారతీయతకు సంబంధించిన మౌలికాంశాలు.

భారతీయ శాస్త్రీయ సంగీతంలో కూడా యిలాంటి మౌలిక లక్షణాలున్నాయి. రాగం వంటి ప్రక్రియ ప్రపంచలోని

మరే సంగీతంలోనూ లేదు. రాగమే భారతీయ సంగీతం. రాగావిష్కరణం పూర్తిగా మనోధర్మగానం. అనగా Extemporisation; అదే అనిబద్ధగానం. *రచన* – Composition అనేది లేకుండా కేవలం రాగంతో సంగీత విద్వాంసుడు ఎంతసేపైనా రంజకంగా గానం చేయగలడు. పక్కవాద్యాలేవీ లేకుండానే స్వేచ్ఛగా గానం చేయగలడు. ప్రపంచంలో యిటువంటి అద్భుత వ్యవస్థ, పద్ధతి మరెక్కడా లేదు. దీని కిటుకు అంతా రాగంలోనే, దాని నిర్మాణంలోనే ఉంది.

*రాగం* అనేది ఎప్పుడు ఏ మహాకళా తపస్వి మేధ నుంచి జనించిందో తెలియదు. ఒక ఆధార స్వరం; ఏడుగాని, ఆరుగాని, ఐదుగాని స్వరాల అమరికతో ఆరోహణ–అవరోహణ; క్రమసంచారంతోనో, వక్రసంచారంతోనో స్వరవిన్యాసాలు; వాది, సంవాది; ఆవిర్భావ, తిరోభావాలు; సముచిత గమక ప్రయోగాలు, రసోచిత భావ చిత్రణ– ఇవి రాగ ఆవిష్కరణ క్రమంలోని ముఖ్యాంగాలు, ముఖ్యాంశాలు. హిందూస్థానీ అయినా, కర్ణాటక సంగీతమైనా యివన్నీ ఉంటాయి. అయితే, రెండింటికీ తేడా ఎక్కడ వస్తోందీ అంటే మనోధర్మంలో, గమకాల వినియోగ శైలిలో, కళ పట్ల అప్రోచ్‌లో తేడా ఉంది. అంతకు మించి కచ్చితంగా వర్ణించి చెప్పడం సాధ్యంకాదు. రెండు మిఠాయిల రుచిలో తేడా తింటేనే తెలుస్తుంది వర్ణిస్తే తెలియదు.



రాగాల లాగానే తాళాలు కూడా. ఎన్నెన్ని కొత్త కొత్త చిత్ర విచిత్ర తాళాలు యిదివరకు వచ్చినా, యిక ముందు వచ్చినా అన్నీ భారతీయ సంగీత శాస్త్ర పరిధిలో ఒదిగి ఉండేవే. వాటి ఆవిష్కారాలన్నీ మనోధర్మానికి సంబంధిచినవే.

రాగాలలాగానే అవీ Extemporisation కు అనంతమైన అవకాశం కల్పించేవే. తాళ వాద్య కచేరీలో– అంటే సోలో కచేరీలో–కళాకారుడు మరొక వాద్య సహకారం లేకుండా, అనుసరణ లేకుండా ఎంతసేపైనా రంజకంగా వాయించ గలడు–ప్రతిభా ప్రావీణ్యాలువుంటే. తబ్లా, మృదంగం కళాకారులు తమ వాద్యాలను 'శ్రుతి' చేసుకుంటారు. కొన్ని స్వరాలను కూడా పలికించగలరు. అలాగే సితార్, వీణ కళాకారులు లయ విన్యాసాలు ప్రదర్శించగలరు. *తానం* లో వీణ, జోడ్–ఝూలాలో సితార్ లయవిన్యాసాలను ప్రదర్శించగలవు. కర్ణాటక–హిందుస్థానీ జుగల్బందీ కచేరీలలో ప్రధాన వాద్యాలతో పాటు మృదంగం–తబ్లా కళాకారులు కూడా తమ రెండు పద్ధతుల లోని సామాన్య లక్షణాల ఆధారంగా కలిసి వాయించి శ్రోతలను రంజింప చేస్తున్నారు.

ఈ కారణాలను బట్టి కర్ణాటక, హిందూస్థానీ పద్ధతులు రెండూ ఒకే శాస్త్రానికి సంబంధించినవనడంలో అనౌచిత్యం ఏమైనా వుంటుందా? ఇది భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం లాంటిది.

* * *

భారతీయ శాస్త్రీయ సంగీతం ఒక నదీ ప్రవాహం లాంటిది. నది అంటే ఏమిటి? రెండు గట్ల మధ్య ప్రవహించేది నది. నాలుగు గట్ల మధ్య నిలకడగా ఉండేది చెఱువు.

నదిలో నీరు నిరంతరంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఆ ప్రవాహానికి అటూ యిటూ ఉండే గట్టులే ఆలంబనం. గట్ల మధ్య నీరు క్షణ క్షణం మారుతూ ఉంటుంది. గట్టుమీద నిలబడి చూస్తూ ఉంటే క్షణం క్రితం ఉన్న నీరు ఈ క్షణం ఉండదు. అయినా నది పేరు మారదు. ఇది క్రిందటి క్షణం ఉన్న నది కాదు అని అనం. వేసవిలో నీరు పూర్తిగా ఎండిపోయినా నది పేరు మారదు – ఎందుకంటే వర్షాలు పడితే మళ్ళీ నీళ్ళు వస్తాయి. మళ్ళీ అదే పేరు.

నది ఎన్నో ప్రాంతాల మీదుగా ప్రవహించ వచ్చు. ఏ ప్రాంతంలో నైనా ఆ నదిపేరు అదే. కొన్ని ప్రాంతాలలో, కొన్ని కాలాలలో నదిలో కాలుష్యం విపరీతంగా పెరిగి పోవచ్చు. అయినా నది పేరు అదే. కాలుష్యానికి బాధ్యత మనదే. కాలుష్యాన్ని తొలగించుకోవలసిన బాధ్యత కూడా మనదే. శవాలు కొట్టుకు వచ్చే చోట గంగాజలాన్నైనా నోట్లో పోసుకోలేము.

మన శాస్త్రీయ సంగీతమూ అంతే. ఒక్కొక్కప్పుడు ప్రమాణాలు ఉచ్చస్థాయిలో ఉంటాయి; ఒక్కొక్కప్పుడు నీచ స్థాయిలో ఉంటాయి. సంగీత రంగంలో అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకున్నప్పుడు వాటిని తొలగించి సువ్యవస్థను నెలకొల్పడానికి సంస్కర్తలు అవతరిస్తూ ఉంటారు.

# కైశికీ నిషాదం

## ఆకెళ్ళవారి సోదాహరణ ప్రసంగం:

ఏ రాగంలోగాని ఏస్వరమైనా తన నియతస్థానం నుంచి తనకు పైనున్న స్వరగత స్థానంపైకిగాని, క్రిందనున్న స్వరగత స్థానానికిగాని కదలివెళ్ళడం, లేదా ఆయా స్వరగత స్థానాల మధ్య ఊగిసలాడడం గమకం అనబడుతుంది. ఈ కదలికలలో, ఊగిసలాటలలో–అంటే గమకాలలో ఎన్నో రకాలున్నాయి. 'అధోస్వరగతస్థాన ప్రాధాన్య ఊర్ధ్వ కంపితము'– అంటే క్రింది స్వరగతస్థానం ఆధారంగా కదిలేది. 'ఊర్ధ్వ స్వరగతస్థాన ప్రాధాన్య అధోకంపితము'– అంటే పై స్వరగతస్థానం ఆధారంగా క్రిందికి కదిలేది.



'స్వీయ స్వరగతస్థాన ప్రాధాన్య అధోకంపితము– అంటే స్వస్థానములోనే ఉండి క్రిందికి కదిలేది. 'స్వీయ స్వరగతస్థాన ప్రాధాన్య ఊర్ధ్వ కంపితము'– అంటే స్వస్థానములోనే ఉండి పైకి కదిలేది. ఇవి కంపితాలు. ఒక స్వరగత స్థానం తనకు పైనగల రెండవ లేక దాని తరువాత గల స్వరగత స్థానము నుండి 'దిగుజారు' తో ప్రారంభించి స్వీయస్థానమువరకు గాని లేక దాని దిగువన గల స్వరగత స్థానము వరకు గాని ఊగుచూ కదిలేది గమకముగా వర్గీకరింపబడింది.

ఈ విషయాలన్నింటినీ విద్వాన్ ఆకెళ్ళ మల్లికార్జున శర్మ గారు జూలై 22వ తేదీ ఆదివారం నాడు కైశికీ నిషాదంపై తన సోదాహరణ ప్రసంగ కార్యక్రమంలో పాడుతూ వివరించారు. ***మిసిమి*** మాసపత్రిక, నండూరి ఆర్ట్స్ సంయుక్త నిర్వహణలో హైదరాబాద్ స్టడీసర్కిల్ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటల నుంచి సుమారు రెండున్నర గంటలసేపు ఈ కార్యక్రమం జరిగింది. ఆకెళ్ళవారు ఆయా గమక భేదాలన్నింటికీ తాను రూపొందించిన సంజ్ఞలను (గుర్తులను) బోర్డుపై రాసి చూపిస్తూ, పాడుతూ వివరించారు. తర్వాత ఆయన కర్ణాటక సంగీతంలో ఒక్క కైశికీ నిషాదమే వివిధ గమక భేదాలలో 27 రకాలుగా ప్రయోగింపబడుతున్నదని చెబుతూ వాటినన్నింటినీ పాడి వినిపించారు. కర్ణాటక సంగీతంలోని కైశికీ నిషాదానికి వున్నన్ని గమక ఛాయలు ప్రపంచంలోని మరే సంగీత పద్ధతిలోనూ లేవని ఆయన చెప్పారు. సంగీతంలో చేసిన, చేస్తున్న కృషి అంతా విద్యార్థులకు వీలైనంత సులభంగా బోధించ డానికేనని కూడా ఆయన చెప్పారు...

ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో ఎక్కువ మంది సంగీత బోధకులు, విద్యార్థులు వున్నారు. ఆకెళ్ళ వారి ప్రసంగానంతరం జరిగిన చర్చలో వైణికులు శ్రీముదిగొండ వీరభద్రయ్య గారు, శ్రీ దొడ్డ సీతారామయ్య గారు, శ్రీ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం గారు, శ్రీ ఈశ్వర ప్రసాదరావుగారు, శ్రీ జితేంద్రబాబు గారు పాల్గొన్నారు. ***మిసిమి*** ప్రధాన సంపాదకులు శ్రీ చెన్నూరు ఆంజనేయరెడ్డి గారు, సంపాదకులు శ్రీ అశ్వినికుమార్, సహాయ సంపాదకులు శ్రీ కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రానికి చెందిన శ్రీ వోలేటి పార్వతీశం ఈ కార్యక్రమానికి హాజరైనవారిలో వున్నారు.

శాస్త్రీయ సంగీతానికి సంబంధించిన ఒక ప్రత్యేక విషయంపై ఇటువంటి కార్యక్రమం జరగడం ఇదే మొదటిసారి అనీ, వీలైనంత తరచుగా ఇటువంటివి జరిగితే బాగుంటుందనీ హాజరైనవారంతా అన్నారు.

**– నండూరి పార్థసారథి**

# స్వామినీన ముద్దు నరసింహనాయుడు



కొంతమంది కుఱ్ఱవాళ్ళు పుట్టుకతో వృద్ధులు. మరికొందరు సరికొత్త సామాజిక సమానత్వం గుర్తించి ముందుగానే శంఖారావం పూరిస్తారు. కొందరు మంచికో, చెడుకో ముందుగా జన్మిస్తారు, సామాజిక రుగ్మతలను, అసమానతలను ముందుగానే గుర్తిస్తారు, ముందుగానే గళమెత్తుతారు. స్త్రీ, పురుష అసమానతలను, వర్ణాశ్రమ ధర్మాలను గుడ్డిగా నమ్ముతూ అదే ఒక గొప్ప ధర్మమని తమని చూసి తామే మురిసిపోతున్న దశలో ఒక కోకిల ముందే కూసింది. ఆ కోకిల పేరే స్వామినీన.

మారుతున్న కాలంతో పాటు మారుతున్న విలువల దృష్ట్యా సంప్రదాయాలను పరిశీలించి, విశ్లేషించి, పరిశుభ్రపరచాలని ఆయన పూనుకున్నారు.ఆయనొక వైతాళికుడు, ఒక వేగుచుక్క, తన తరువాత ఒక రెండువందల సంవత్సరాలకు రాబోయే నవలోకాన్ని ఆయన అప్పుడే స్వప్నించాడు.

స్వామినీన ముద్దు నరసింహ 1792వ సంవత్సరంలో జన్మించారు. ఆయన జన్మించేనాటికి భారతీయ రాజకీయ, ఆర్థిక, సామాజిక చిత్రపటం అస్తవ్యస్తంగా ఉంది. ప్రజలు ఏ ఆధునిక భావజాలాన్నీ స్వీకరించే స్థాయిలోనే కాదు, కనీసం ఆలోచించే స్థాయిలో కూడా లేరు. సంప్రదాయం పేరుతో మూర్ఖపు భావాలను నెత్తికెక్కించుకున్న రోజులవి.

1848 నుంచి 1856 సంవత్సరాల వరకూ ఆయన రాజమండ్రిలో ఉన్నత న్యాయాధికారిగా పనిచేశారు. అధికారిగా కాక ఒక సామాజిక బాధ్యత కలిగిన మానవతా మూర్తిగా ప్రజలలో అభ్యుదయ భావాలను ప్రచారం చేశారు. వితంతు వివాహాలపై నిషేధం తొలగించబడాలని స్త్రీ పునర్వివాహాన్ని చట్టబద్ధం చేయటం గురించినది మొదటిదైతే వ్యవహారిక భాషలో రచన సాగించటమన్నది రెండవది. దీనిని దృష్టిలో పెట్టుకుని 1838 లోనే ఆయన *హితసూచని* అనే గ్రంథాన్ని వ్రాశారు.

"ఆయన *హితసూచని* వెలువడే నాటికి సంస్కరణకు సంబంధించిగానీ, భాషకు సంబంధించినవి గానీ ఉద్యమాలేమీ లేవు. దీనిని వ్యవహారిక భాషలో వ్రాసిన మొదటి సంస్కరణ గ్రంథంగా చెప్పాలి." అంటూ ఉస్మానియా విశ్వవిద్యాలయపు తెలుగు యం.ఎ నోట్సులో పేర్కొన్నారు.

ఆయన *హితసూచని* రచన ప్రారంభించే నాటికి వ్యవహారిక భాషావాదం కోసం ఉక్కుపిడికిలి బిగించిన గిడుగు పిడుగు వారు అప్పటికింకా పుట్టలేదు. దక్షిణాది రాష్ట్రాలలో మొదటి వితంతు వివాహం (1881లో) జరిపించిన కందుకూరి వీరేశలింగం పంతులు, 1863లో *హితసూచని* అచ్చయ్యేనాటికి ఐదు సంవత్సరాల బాలుడు.

*హితసూచని* గ్రంథరచన 1838లో మొదలుపెట్టబడినా ఆయన మరణించిన తరువాత 1863లోనే అది అచ్చువేయబడింది. ఈ గ్రంథాన్ని బందరు క్రైస్తవ పత్రిక *హితవాది* ధారావాహికంగా ప్రచురించి ప్రచారంలో పెట్టింది.

*హితసూచని* గ్రంథంలో ఆయన మూఢనమ్మకాలను నిర్ద్వందంగా తిరస్కరించారు *హితసూచని*లో వెల్లబుచ్చిన అభిప్రాయాలలో కొన్ని-

1. గ్రంథాలను వ్యవహార భాషలో, వచనంలోనే వ్రాయాలి. కల్పనా సాహిత్యంలో అభూతకల్పనలుండరాదు. సాహిత్యంలో వాస్తవికత మూర్తీభవించాలి.
2. పురాణాలు, ధర్మశాస్త్రాలు అవాస్తవికతలతో, ప్రక్షిప్తాలతో, పరస్పర వైరుధ్యాలతో నిండి ఉండటము వలన సత్యాసత్య నిర్ణయం కష్టతరం అవుతుంది. కాబట్టి అవి అనుసరణీయం కాదు.

3. రచయితలు సామాజిక బాధ్యతను విస్మరించి, నీతినియమాలకు నీళ్లువదిలి పాఠకులను తప్పుదారి పట్టించ కూడదు. అశ్లీల సాహిత్యం సృష్టించకూడదు.

4. పశు పక్ష్యాదుల భాషలు మాట్లాడటం, వాటిని మనుషులు అర్థంచేసుకోవటం కల్ల. దయ్యాలు, భూతాలు, పిశాచాలు లేవు. అవి మనుషులపై పూనటం అబద్ధం. కొంతమంది స్వార్థపరులు కల్పించిన విషయాలివి.

5. బంగారం చేయటం, పరుశవేది మోసం చేయటానికి కల్పింపబడిన పదాలు.

6. చేతబడులు, పరకాయప్రవేశ కథలు అసత్యం.

7. బాల్యవివాహాలు కూడవు, వివాహాల్లో వధూవరుల పరస్పరేచ్ఛ ముఖ్యం. కన్యాశుల్కం నరమాంస విక్రయం లాంటిది.

8. స్త్రీ జాతికి ఎవరెవరి మర్యాదస్థితికిన్ని అనుకూలమని తోచిన మట్టుకు విద్య చెప్పించ వచ్చును. సాధ్యమైనంత మట్టుకు గ్రంథములు స్త్రీలు చదువుటకు వీలుగా ఉండేలా రచించవలసి వున్నది.

9. రోగనివారణకు మంత్ర తంత్రాలు పనికిరావు.

దిగవల్లి వెంకట శివరావు గారి వీరేశలింగం *వెలుగునీడలు* గ్రంథంలో *హితసూచని* నుండి *హితకారిణికి* అన్న శీర్షికతో శ్రీ త్రిపురనేని వెంకటేశ్వరరావు *(వేమన వికాస కేంద్రం, విజయవాడ)* 30-11-1984లో వ్రాసిన పరిచయ వాక్యాలల్లో స్వామినేని గురించి కొన్ని విశేషాలు ఉదహరించారు.

ఆయన వర్ణాంతర వివాహ ప్రతిపాదకుడు కూడాను. హిందూ సంఘం కుల వ్యవస్థ నుంచి బైటపడాలని, సర్వకుల సమానత్వమని గాకుండా కుల విభాగ రాహిత్యం కావాలన్నారు. ఆనాటి అఖిల భారతంలో అలాపలికిన గొంతు అదొక్కటేనేమో.

స్త్రీ వితంతు వివాహ విషయంలో ఆలోచనరీత్యా ఆయన చాలా ముందంజలోనుండేవారు. అప్పటికి స్త్రీ వితంతు వివాహానికి చట్టబద్ధత లేదు. నిర్బంధ వైధవ్యం తొలగించబడాలి అన్న మాట వారిదే అయినప్పటికీ ఆయనలో హితసూచనే కాదు, హితాచరణకూడా ఉంది.

ఒక బాలవితంతవును వివాహానికి సిద్ధపరిచి ఆమెను పెండ్లాడితే జీవయాత్రకు కావలసిన ఆస్తి, ధనం యిస్తానని ప్రకటించి, ప్రయత్నించారు. అయినా ఎవరూ ముందుకు రాలేదు. అందుకని ఆయన తొలి వితంతు వివాహకర్త కాలేకపోయారు. ఆయన 1856వ సం॥లో మరణించారు. ఆమరుసటి సంవత్సరమే ఆయన కన్న కల ఫలించింది. వితంతు వివాహం చట్టసమ్మతమైనది. ఇది జరిగిన 24 సంవత్సరాలకుగాని మొదటి వితంతు వివాహం దక్షిణ భారతదేశంలో జరగలేదు.

1881లో మొదటి వితంతు వివాహం కందుకూరి వారు జరిపారు. స్వామినీన ముద్దు నరసింహనాయుడు హేతువాదే తప్ప పూర్తి నిరీశ్వర వాదిగా పేర్కొనలేము. వారి వేషం, భాషా, మతం వారిని ఆంగ్లమానస పుత్రులనడానికి వీలు లేకుండా చేశాయి. తెంగల శాఖ పంగనామాలు, పంచెకట్టు, తలపాగా, అంగరఖా ఆయన వైష్ణవం ఆయనకు హేతువాదానికి అడ్డంకాలేదు. *హితసూచని* ఆయన ముందుకు తెచ్చిన మరొక ముఖ్యాంశం. అస్పృశ్యత నిర్మూలనా ప్రచారం.

1833వ సం॥లో మెకాలే ఇంగ్లీషు భాషను ముఖ్యపాఠ్యాంశంగా పాఠశాలలో ప్రవేశపెట్టాడు. ఆంగ్లేయ వాఙ్మయ ప్రభావంతోనే ఆధునిక అభిప్రాయాలు మొలకెత్తాయని భావిస్తారు చాలామంది. స్వామినేని అంతకు ముందే ఆంగ్లభాషతో పరిచయ మేర్పరుచు కున్నట్లు తెలుస్తుంది.

స్వామినీన ముద్దు నరసింహ హిందూ మతంలో మూఢాచారాలను ఖండించి ఆర్యమతస్థాపకుడయిన దయానంద సరస్వతికంటే పూర్వీకుడు. ఆయనకంటె 32 సం॥లు వయసులో పెద్దవాడు. ఇంతటి ప్రాగ్దర్శకుడికి తెలుగు వారి చరిత్రలో సముచిత స్థానం లభించలేదు.

ఆయనేమిచేసినా పేరుకోసం, కీర్తికోసం, డబ్బుకోసం చేయలేదు. తన గుర్తింపు గురించి తాను ప్రాకులాడలేదు. కందుకూరి, గురజాడ, గిడుగు వార్లపై ఆయన ప్రభావమెంతో ఉంది. కానీ వారెవ్వరూ తమ స్వీయ చరిత్రలోగాని, ఇతరత్రాగాని, ఆయన గురించి ఒక్క మాటయినా మాట్లాడకుండా ఉండటానికి కారణం తెలీదు. ఈ విషయం మనల్ని ఆశ్చర్య చకితులను చేస్తుంది. ఆయన వ్రాసిన *హితసూచని* మొదలుగా కొన్ని వ్యాసాలు మాత్రమే ఇప్పటికి

మిగిలిన ఆధారాలు. అవిచరిత్ర గర్భంలో కలవక పూర్వమే ఆయన కార్యాచరణను మనం గుర్తించి చరిత్రలో ఆయనకు సముచిత స్థానం కల్పింప వలసిన అవసరం ఎంతయినా ఉంది. *జ్వాల పత్రిక* నడిపి, పద్యగేయ సంకలనమైన *వైతాళికులు* ప్రచురించిన ముద్దు కృష్ణ స్వామిసీన మనవడు.

పాశ్చాత్యుల, ముఖ్యంగా వారి సంస్కృతి, జ్ఞాన సంపదల, సంపర్కంతో ప్రభావితులైన మధ్యతరగతి తెలుగువారు ఆనాటి సమాజంలోని మూఢాచారాలు, విశ్వాసాలు, బాల్యవివాహాలు, అవిద్య మున్నగువాటి నిర్మూలనకు, తద్వారా మానవసమాజ నిర్మాణానికి 19వ శతాబ్దంలో శ్రీకారం చుట్టారు. కాకపోతే ఈ భావనా పరంపరలో అంత స్పష్టత కానరాదు. అయితే అప్పుడప్పుడే మొగ్గతొడుగుతున్న ఆలోచనలతో కొంత స్పష్టత లోపించటం సహజమేమోకూడా.

> **పా**శ్చాత్యుల, ముఖ్యంగా వారి సంస్కృతి, జ్ఞానసంపదల, సంపర్కంతో ప్రభావితులైన మధ్యతరగతి తెలుగువారు ఆనాటి సమాజంలోని మూఢాచారాలు, విశ్వాసాలు, బాల్యవివాహాలు, అవిద్య మున్నగువాటి నిర్మూలనకు, తద్వారా మానవ సమాజ నిర్మాణానికి 19వ శతాబ్దంలోనే శ్రీకారం చుట్టారు.

సమాజంలో రావలసిన మార్పుల గురించి వీరు సాగించిన చర్చలలో భాష, విద్య, వైద్యం, వివాహం, హేతువాదం మున్నగు భావాలు చోటుచేసుకున్నా విద్య, వివాహం ఎక్కువ ప్రాధాన్యతను పొందాయి.

ఆనాటి తెలుగువారిని పట్టిపీడిస్తున్న మూఢ విశ్వాసాలను, ఆచారాలను, నమ్మకాలను నిర్మూలించుటకుగాను హేతువును పనిముట్టుగా ఉపయోగించు కుంటూ, భావోద్వేగాలకు తావివ్వక, తాను చెప్పదలచు కున్నదానిని తార్కిక వాదనతో హేతుబద్ధంగా మనసుకు నప్పేలా వివరించినవాడు స్వామిసీన.

విద్య గురించి సహేతుకంగా సాగించిన వీరి చర్చ ఈనాటి చదువరులను కూడా అబ్బురపరచగలదు. చదువుకునే వారికి ఉపయోగించే గ్రంథాలు ఎలా ఉండాలి? భాషా నైపుణ్యాలు అలవరచే బోధనలు ఏరీతిలో సాగాలి? గ్రంథ రచనలో ఎటువంటి స్వదేశీభాష వాడాలి? భాషేతర విషయాలు ఏ క్రమంలో బోధించాలి? విద్యావ్యాప్తి ఎలా జరగాలి? ఇత్యాది ప్రశ్నలతో విద్యయొక్క ఆవశ్యకతను, విద్యను నేర్పించవలసిన విధివిధానాన్ని సహేతుకంగా సూచిస్తారు.

వీరి దృష్టిలో ఆనాటి (ఈనాడుకూడానేమో!) వివాహమర్యాదలలో మూడు ముఖ్య అన్యాయపు ఆచారాలు చోటుచేసుకున్నాయి. ఒకటి వధూవరులు పరస్పరేచ్ఛను గౌరవించక పోవటం, రెండు, ఆసత్యకులైనవారు కూడా వధూవరులు కావడానికి చిన్నదానికి, చిన్నవానికి ఉండే ఇచ్ఛను రూఢిపరచకపోవటం, మూడు, విస్తారమైన వ్యయంతో వివాహం చేయటం. వివాహ వ్యవస్థ పదికాలాల పాటు శాశ్వతంగా నిలవాలంటే మంత్రతంత్రాలకంటే ఈ మూడులోపాల నిర్మూలనే ముఖ్యమని వీరు గట్టిగా వాదిస్తారు. అంతేకాదు వివాహవ్యవస్థలో రావలిసన మార్పులు వాటి ఆవశ్యకతను సంప్రదాయ గ్రంథాలనుంచి తగు ఆధారాలతో నిరూపిస్తారు.

"పితా రక్షితః కౌమారే" అన్న శాస్త్రం స్త్రీలు వివిధ దశలలో పురుషులపై ఆధారపడి ఉంటారని చెప్తుండేవాడు. ఆమె ఇచ్ఛ లేకుండా వివాహం జరుపవచ్చునని సూచించటం లేదంటారు. అలాగే "భర్తా రక్షతి యౌవనే'' అన్న శాస్త్రం యౌవనారంభంలోనే భర్త చనిపోతే పునర్వివాహం చేసుకోవలసిన అవసరాన్ని, అవశ్యకతను, సూచిస్తుందే కాని చిన్నతనంలోనే వైధవ్యాన్ని అంటగట్టమని చెప్పటంలేదని విశదీకరిస్తాడు.

సమకాలీన సమాజం గురించి స్పష్టమైన అవగాహన, దానిలో రావలసిన మార్పులను వాటి సాధనకు తగు ప్రణాళికలను, తన హితసూచన ల మాధ్యమంగా పదిమందికి స్పష్టంగా చెప్పి, కార్యసాధనకు ప్రేరేపించిన స్వామిసీన ముద్దు నరసింహనాయుడుగారు.

ఎప్పుడు ఎక్కడ ఏ చదువులు చదివారన్నది కూడా మనకు సరిగా తెలియదు. ఈనాటికీ ఆచరణయోగ్యమైన వీరి ప్రతిపాదిత సంస్కరణలు ఏ ప్రేరణతో మొలకెత్తాయో సరిగా తెలియదు. కనీసం తెలిసినంతవరకైనా వీరిని గురించి యింకా పరిశోధన జరగవలసిన అవసరం ఉంది. వీరి భావజాలాన్ని ఆచరణలో పెట్టవలసిన అవసరం ఎంతో ఉంది.

– ***మిసిమి*** పరిశోధన



# తిరగబడ్డ తెలుగు గెడ్డ

- సి. యస్. రావు

*(తెరలేచేసరికి వెనక కర్టెన్‌కి స్వతంత్ర భారతానికి షష్టిపూర్తి అని నూటయాభైయ్యవ ప్రథమ స్వాతంత్ర్య పోరాట ఉత్సవాలు అని బ్యానర్ కనపడుతూ ఉంటుంది. ఒక తలనెరిసిన స్వాతంత్ర్య సమరయోధుడు స్టేజి మీదకు వచ్చి ప్రేక్షకులకు నమస్కరిస్తాడు.)*

స్వా॥ స : బోలో భారత్ మాతాకీ...

జనం : జై...

స్వా॥ స : బోలో స్వతంత్ర్య భారత్ కీ

జనం : జై...

స్వా॥ స : బోలో ప్రథమ స్వాతంత్ర్య అమరవీరులకు

జనం : జై...

స్వా॥ స : ఈ నినాదాలు వింటూ ఉంటే నా తనువు పులకరించిపోతుంది. ఈ రోజు అరవయ్యవ స్వాతంత్ర్య దినోత్సవం. భారత దేశానికి స్వాతంత్ర్యము వచ్చి అరవై సంవత్సరాలు నిండాయి. అంటే భారత ప్రజలు బానిసత్వము నుంచి బయటపడి గత అరవైయేళ్ళుగా స్వతంత్ర్య భారత పౌరులుగా తలయెత్తుకుని బతుకుతున్నారు. తాముపుట్టిన మట్టిపై నిలబడి స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారు. తమ జన్మభూమిని చూసి ఎంతో గర్వపడుతున్నారు. కాని ఈ నాడు మనందరం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వెనుక, గత అరవైయేళ్ళుగా గగన తలంలో ఎగురుతున్న మన జాతీయ పతాకం వెనుక ఎన్నో కష్టాలున్నాయి, ఎన్నో కన్నీళ్ళున్నాయి, ఎంతో రక్తపాతం ఉంది. చరిత్రపుటలకెక్కని ఎన్నో వాస్తవాలు ఉన్నాయి. ఆ చరిత్రను, వాస్తవాలను ఈ తరానికి తెలియజెప్పటం కోసమే ఈ సమావేశం.

జనం : (చప్పట్లు కొడతారు)

స్వా॥ స : బోలో స్వతంత్ర్య భారత్ కీ

జనం : జై...

స్వా॥ స : మహాత్మాగాంధీకి

జనం : జై...

స్వా॥ స : జవహర్‌లాల్ నెహ్రూకు

జనం : జై...

స్వా॥ స : సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు

జనం : జై...

స్వా॥ స : సుభాష్ చంద్రబోస్‌కు

జనం : జై...

స్వా॥ స : ఈ నినాదాలు మనందరకి తెలుసు మహాత్మునికంటె ముందు కూడా భారతజాతి తిరగబడింది. గర్జించింది, పోరాడింది. ఆ పోరాటాల్లో 1857 మే 10వ తేదీన ప్రథమ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమయ్యిందని

చరిత్రపుటల్లో ఉంది కానీ ఆనాటి కుంపినీవారు, ఆనాటి చరిత్రకారులు ఆ పోరాటాన్ని "సిపాయి పితూరీ" అన్నారు. "సిపాయిల తిరుగుబాటు" అన్నారు. ప్రథమ స్వాతంత్ర్య పోరాటమని వారు అనలేదు. వారి చరిత్రలో రాయలేదు. అది సిపాయిల తిరుగుబాటు కాదు, ప్రథమ స్వాతంత్ర్య పోరాటమని నామకరణం చేసింది ప్రముఖ తత్త్వవేత్త, ఆర్థిక శాస్త్రవేత్త కార్ల్‌మార్క్స్.

జనం : (చప్పట్లు కొట్టారు)

స్వా ॥ స : కానీ ఈ తరం తెలుసుకోవాల్సిన మరోనగ్న సత్యం ఉంది. ఏచెట్టూ పుట్టకతోనే చెట్టుగా పుట్టదు. గింజ మొలకెత్తుతుంది. మొలక మొక్కవుతుంది. మొక్క చెట్టవుతుంది. చెట్టు మహావృక్షమవుతుంది. ఇది ప్రకృతిసహజం. అలాగే విప్లవవాస్తవాలు కూడానూ. 1857 మే 10వ తారీకు కంటే ముందే 1857 మార్చి 29వ తేదీన మంగళ్ పాండే అనే 26యేళ్ళ యువకుడు, కుంపినీ ఆర్మీ జవానుపై మొదట తిరగబడ్డాడు. తెల్లదొరలను వణికించాడు. మేజర్ జేమ్స్ హ్యూసన్‌పై కాల్పులు జరిపాడు. ఉరికంబం ఎక్కాడు.

జనం : మంగళ్ పాండే అమర్‌రహే...

జనం : అమర్ రహేగా ... అమర్ రహేగా ...

జనం : ప్రథమస్వాతంత్ర్య పోరాట యోధుడు మంగళ్ పాండే...

జనం : జిందాబాద్... జిందాబాద్...

స్వా ॥ స : ఎందుకు తిరగబడ్డాడని అడగరే. మంగళ్ పాండే తిరగబడటానికి కారణం ఏమిటో ఈ తరం వారికి చాలా మందికి తెలీదు. మంగళ్ పాండే కూడా కుంపినీ సైన్యంలో యూనిఫాం వేసుకుని తుపాకీ చేతపట్టి కుంపినీ తరఫున యుద్ధం చేయటానికి శిక్షణ పొందిన ఒక సైనికుడే. మరి ఎందుకు తిరగబడ్డాడు.

జనం : అంతా నిశ్శబ్దం.

స్వా ॥ స : అంతవరకు కుంపినీ సేనలు వాడుతున్న తుపాకులు మారి కొత్త తుపాకులు వచ్చాయి. కొత్త తుపాకులకు కొత్త తూటాలు వచ్చాయి. ఆ రోజుల్లో ఆ తూటాలు పంటితో కొరికి తుపాకి గొట్టంలోకి దట్టించాలి. ఆ తరువాత తుపాకీ పేల్చాలి. ఆ తూటాలోని మందు రాలిపోకుండా పైన ఒక మూతపెట్టి కొవ్వు పూస్తారు. ఆ కొవ్వు ఏ తేనెపట్టునుండో తీసిన మైనం అయితే పరవాలేదు. అలాకాకుండా ఆవు కొవ్వునుంచీ, పంది కొవ్వునుంచి తయారైన కొవ్వును ఆ తూటాకి పూతగాపూసారు. ఈ వాస్తవాన్ని ఆ తూటాల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న హిందువు ద్వారానే పాండేకి తెలిసింది. పాండేకి తెలిసింది. పాండే హిందువు. ఆవు పూజనీయమైన జంతువు. గోవును గోమాత అని పూజిస్తారు. అటువంటి ఆవు కొవ్వును తూటాకు పూస్తే నోటకొరకటానికి ఏ హిందువు ఒప్పుకుంటాడు. ఏ హిందువు మనసు అంగీకరిస్తుంది. ఆ నాడు కుంపిని సైన్యంలో హిందువులతోపాటు ముసల్మానులు కూడా ఉండేవారు. పంది కొవ్వుతో పూయబడిన తూటాలు కొరకటానికి ఏ మహ్మదీయుడు అంగీకరిస్తాడు. వారి దృష్టిలో పంది హేయమైన జంతువు కదా. ఆనాడు పాండే కుంపిని సైన్యాధికారిపై తిరగబడటానికి కారణం. తన ధర్మం, తన మతం తన ఆచారం. తన సాంప్రదాయం.

జనం : (చప్పట్లు కొడతారు)

స్వా ॥ స : తన ధర్మం కోసం, తన మతంకోసం ప్రాణాలనే బలిపెట్టిన అమరవీరుడు పాండే. అలా రగలడం ప్రారంభమైన చిరుచిచ్చు, రగులుతూ పెరిగిందే తప్ప ఆరిపోలేదు. కొత్త తూటాలకు ఆవుకొవ్వూ, పందికొవ్వూ, పూత పూస్తున్నారన్న విషయం ఆ నోటా, ఈ నోటా, మిగిలిన కుంపినీ పటాలాలకు చేరింది. ఇక్కడ మీరందరూ ఓ సత్యాన్ని గ్రహించాలి. సైన్యంలో రెండు వర్గాలు ఉన్నాయి. బ్రిటిష్ రాణి సైన్యంగా కుంపినీకి అండగా వుండటానికై వచ్చిన తెల్లదొరల సేన, స్థానిక భారతీయుల సేనలు, స్థానిక భారతీయ సేనల్లో అన్ని వర్గాలకు చెందిన హిందువులు, ముస్లిములు, సిక్కులు ఉండేవారు. తెల్లవారి సైన్యంలో పూర్తిగా తెల్లదొరలు ఉండేవారు. వారికి ఏ కొవ్వు తూటాలనైనా కొరకటానికి పట్టింపు ఉండదు. తెల్ల సైనికులందరూ కుంపినీ తెల్ల అధికారులకు కన్న బిడ్డలయితే, స్థానికసైనికుల మతం మార్చి తమ క్రైస్తవ మతం లోనికి చేర్చాలనే ప్రయత్నం కుంపెనీలోని

చాలా మంది సైన్యాధికారుల యొక్క కోరిక, ప్రయత్నం. కానీ ఏ హిందువూ, మహ్మదీయుడు వీరి ప్రయత్నాలకు తల యొగ్గేవారు కాదు. అలా ప్రయత్నం చేస్తూ తమ మతాల గురించి చులకనగా మాట్లాడే దొరల మీద కోపం పెంచుకునేవారు. ఇటువంటి పరిస్థితులలో బరంపురంలోని 19వ స్థానిక పటాలం ఆ అశుద్ధపు తూటాలను నోటకొరకమని మొరాయించింది. తెల్లదొరల గుండెలు మండాయి. అధికారధిక్కారాన్ని సహించలేకపోయారు. నామ మాత్రపు విచారణ జరిపించారు. శిక్ష ఏమిటో వివరించలేదు. మొత్తం వారు వెయ్యి మంది సిపాయిలు. సీమ రాణీవారి 84వ రెజిమెంట్ యూరోపియన్ శతఘ్నదళం బారక్‌పూర్ చేరుకుంది. ఆ దళాన్ని చుట్టూ కాపలా పెట్టి తమ ఆజ్ఞలను ధిక్కరించిన వెయ్యి మంది సిపాయిలను బారక్‌పూర్ పేరేడ్‌గ్రౌండ్‌లో నిలబెట్టి గవర్నర్ జనరల్ విధించిన శిక్షా ఉత్తర్వులను వివరించాడు. వారు అవిధేయతకు పాల్పడినందుకు మొత్తం 19 పటాలంలోని వెయ్యిమంది సైనికులను ఉద్యోగం నుండి బర్తరఫ్ చేసినట్లు చెప్పారు. ఆయుధాలు ఒక చోట పేర్పించి, మెడల్సు, బెల్టులు విప్పించి, యూనిఫామ్ మాత్రం మిగిల్చి ఇళ్ళకు పొమ్మని ఆదేశించారు. వారి ప్రయాణం ఖర్చు కింద కొద్ది మొత్తం కూడా ఇచ్చి ఇళ్ళకు పొమ్మన్నారు. చేయగలింది లేక కళ్ళనీళ్ళు కుక్కుకుంటూ 19వ బెటాలియన్ మొత్తం వెయ్యిమంది మార్చి 31, 1857న ఇంటి ముఖం పట్టారు. అదే పరిస్థితి గవర్నర్ జనరల్ కాలిక్ ప్రభువు 34వ బెటాలియన్ 500 మంది సిపాయిలను తూటాలను కొరకటానికి తిరస్కరించారనే నేరం మీద బర్తరఫ్ చేశారు. అంతా బ్రిటిషు సైన్యాల  బందోబస్తు మధ్య జరిగింది. ఈ సారి ఆయుధాలతో పాటు యూనిఫామ్‌ను కూడా గుంజుకుని ప్రయాణపు ఖర్చులు కూడా ఇవ్వకుండా ఎవరిదారిన వారిని పొమ్మన్నారు. మొత్తం పదిహేను వందల మంది స్థానిక సైనికలు అంతవరకు యూనిఫామ్, మెడల్సులతో ఆయుధాలతో రొమ్ములు విరుచుకొని తిరిగినవారు. కుంపినీ వారి తరఫున ఎన్నో యుద్ధాలు చేసి, ఎంతో సహకరించిన వాళ్ళు అవమానంతో రోడ్డున పడ్డారు.

ఆ తర్వాత వంతు మీరట్ కంటోన్మెంట్‌లోని 90 మంది స్థానిక రౌతులకు ఎదురైన అవమానం. మీరట్ కుంపినీ బలాలకు కేంద్రం. బ్రిటిషువారికి దేశంలో గల పెద్ద సైనిక స్థావరాల్లో మీరట్ ఒకటి. స్థానికులతో కూడిన పదాతి దళరెజిమెంట్స్ రెండు, అశ్విక దళ రెజిమెంటు ఒకటి. అదీగాక పూర్తిగా బ్రిటిష్ వారితో నిండిన రెజిమెంట్స్, రైఫిల్స్ బెటాలియన్లు, అశ్వికబలాలు దండిగా ఉన్నాయి. అక్కడ పూర్తిగా బ్రిటిష్ వారితో నిండిన రెజిమెంట్స్, రైఫిల్స్ బెటాలియన్లు, అశ్వికబలాలు దండిగా ఉన్నాయి. అక్కడ స్థానికులు తిరగబడటం అనేది కలలోనిమాట.

1857 ఏప్రియల్ 24న బ్రిటిష్ సైన్యాలు చుట్టూ మోహరించి ఉండగా స్థానిక సైన్యంలోని 90 మంది సైనికులకు కల్నల్ స్మిత్ డిమాన్‌స్ట్రేషన్ ఏర్పాటు చేసి తూటాలు ఇచ్చి కొరికి తుపాకీల్లోకి దట్టించమన్నారు. 90 మందిలో ఐదుగురు మాత్రం భయంతో స్మిత్ ఆజ్ఞ అంగీకరించారు. మిగిలినవాళ్ళు తూటాలను తీసుకోమని మొరాయించారు. తూటాలు నోట పెట్టుకొని కొరకమని నిరాకరించడం మహానేరంగా పరిగణించి వారిని ఉద్యోగంలోంచి బర్తరఫ్ చేయడమే కాకుండా ఆ 85 మందికి  10 యేళ్ళ కారాగార శిక్ష విధించాడు.

అటు పాండే, 19వ బెటాలియన్, 34వ పటాలం, మీరట్ సిపాయిలు 85 మంది 1857 మే 9 కంటే ముందే బ్రిటిష్ అధికారాన్ని ధిక్కరించిన వీరులు. ఈ సంఘటనలన్నీ ముఖ్యంగా 85 మందికి కారాగార శిక్ష సిపాయిల్లో అసంతృప్తి  రేపింది. సిపాయిల్లోని యువరక్తం ఉప్పొంగింది. పౌరుల్లో కూడా ఈ వార్త బ్రిటిషు వారిపట్ల వ్యతిరేకత రేపింది. తిరగబడిన సైనికులపట్ల, తమ ధర్మం కోసం నిలబడిన త్యాగధనుల పట్ల గౌరవం పెంచింది.

జనం : (చప్పట్లు కొట్టారు)

స్వా॥ స : ఈ తర్వాత ప్రథమ స్వాతంత్ర్య పోరాటంగా చరిత్రకెక్కిన పోరాటం మే 10, 1857లో చరిత్రలో ఓ మరపురానిరోజు. ఇది మీరట్‌లో ప్రారంభమయ్యింది.

జనం : ప్రథమస్వాతంత్ర్య పోరాటవీరులకు జై...జై

జనం : మంగళ్ పాండే... జిందాబాద్... జిందాబాద్

*(అప్పటికే ఒక ర్యాంప్ మీదుగా ఇద్దరు వ్యక్తులు స్టేజిమీదకు వచ్చి,*
*ఆ ఉపన్యాసాన్ని, జనం జేజేలు వింటూ నిలబడ్డారు.*
*కాసేపటికి మూడో వ్యక్తి వచ్చి వారిని చేరాడు.*
*వారు కాశీపురం వీరభద్రరాజు. నారయ అప్పారావు, విజయనగరం రాజాలు)*



నారయ అప్పారావు

కాశీపురం : ఈ సభ ఏమిటి? ఆ కోలాహలం ఏమిటి?

నారయ : ప్రథమస్వాతంత్ర్య పోరాటం జరిగి నూటయాభై సంవత్సరాలైన సందర్భముగా స్వాతంత్ర్య భారతం జరుపుకుంటున్న సంస్మరణ సభ.

విజయ : మంచిదే గతాన్ని స్మరించుకోవడం, గతంలో దేశంకోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు కృతజ్ఞతలు తెలుపుకోవడం మంచిదే.

*(ఇంతసేపు మైమ్‌లో ఉపన్యాసిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు మళ్ళీ అందరికీ వినపడేలా మాట్లాడతాడు.)*

స్వా॥ స : మీరట్‌లోని స్థానిక సిపాయిలందరూ కూడబలుకున్నారు. ఆదివారం రోజున తెల్ల సిపాయిలందరూ తమ ఆయుధాలను ప్రక్కన పెట్టి చర్చి గంట మోగగానే ప్రతి ఆదివారంలాగే చర్చిలోకి ప్రార్థన కోసం వెళ్ళారు. అదే అదనుగా తీసుకొని స్థానికసిపాయిలు వారి ఆయుధాలను స్వాధీనం చేసుకొని తెల్ల సిపాయిలను బంధించారు. జైలు పగల కొట్టి శిక్షలకు గురైన తమ సోదర సిపాయిలను జైలు నుండి విడిపించుకున్నారు. అక్కడికి నలభైమైళ్ళ దూరంలో ఉన్న ఢిల్లీ వైపు బయలుదేరారు సిపాయిలు. ఢిల్లీలోని పాదుషాను కలిసి బ్రిటిష్ వారి మీద తిరగబడడానికి తాము సిద్ధమని చెప్పటం కోసం ఢిల్లీ చేరిన సిపాయిలు ఢిల్లీ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ పేల్చేస్తారు. ఈ గందర గోళంలో, సిపాయిల తిరుగుబాటుతో ఎంతో రక్తపాతం జరిగింది. కుంపిని వారి గెండెలదిరాయి. ఇదీ తొలి భారత స్వాతంత్ర్య పోరాట సంక్షిప్తగాథ. ఇదే భారత వీర సైనికుల ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ వీరగాథ.

జనం : ప్రథమ స్వాతంత్ర్య పోరాట అమరవీరులకు ... జై...

జనం : స్వతంత్ర్య భారత్‌కు జై... జై

స్వా॥ స : ఈ ప్రథమ స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న మహావీరులు ఎందరో ఉన్నారు. మంగళపాండే తరువాత ఝాన్సీలక్ష్మీబాయి, తాంతియాతోపి, నానాసాహెబ్ లాంటి ఎందరో వీరులు ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు.

జనం : మంగళ్ పాండే... జిందాబాద్

జనం : వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి... జిందాబాద్

జనం : తాంతియాతోపి... జిందాబాద్

జనం : నానాసాహెబ్... జిందాబాద్

జనం : వీరసావార్కర్ ... జిందాబాద్

*(ఈ మీటింగ్ మీద లైట్స్ ఆఫ్ ర్యాంప్ మీద లైట్స్ ఆన్ అవుతాయి*
*అప్పటికి గతంలో ఉన్న ముగ్గురుతోపాటు మరో ఐదుగురు చేరుతారు)*

విజయ : ప్రథమ స్వాతంత్ర్యపోరాటం మే 10, 1857లోనే ప్రారంభమయ్యిందా?

కాశీపురం : సిపాయిల కంటే ముందు ఎవరూ కుంపినీ వారిపై తిరగబడలేదా?



ఝాన్సీరాణీ

విజయ : అది సరే! ఈ జనం జేజేలు కొడుతున్నది, ఈ సభలో స్మరించుకుంటున్నది ఉత్తరాది వాళ్ళ పేర్లులాగా ఉన్నాయి. దక్షిణాదిన ముఖ్యంగా మనతెలుగువారి పేర్లు ఎక్కడా వినిపించడం లేదే, మనవాళ్ళు ఎవరూ కుంపినీ వారి మీద తిరగబడలేదా? మన వాళ్ళకు స్వతంత్ర్య పిపాస లేదా?

నారాయ : (ఆవేశంగా) ఎందుకు లేదు. ఈ సిపాయిల తిరుగుబాటు మే 10, 1857లో ప్రారంభమయ్యింది. ఈ తిరుగుబాటు ఆదిలో స్థానిక సిపాయిలకు కుంపినీ దొరల మధ్యన తలయెత్తిన తిరుగుబాటు. నా రాజ్యంలో తెలుగు సైన్యం అన్ని వర్ణాలకు, అన్ని వర్గాలకు, అన్ని మతాలకు చెందిన తెలుగు ప్రజలు కుంపినీ సైన్యాలపై తిరగబడ్డాయి. తిరగబడటమే కాకుండా ఓడించి ఇద్దరు తెల్ల దొరలను హతమార్చారు కూడా.

విజయ : ఇంతకీ తమరెవరు?

నారయ : నాపేరు నారయ అప్పారావు. నూజివీడు సంస్థానాధీశులం. ప్రథమస్వాతంత్ర్య పోరాటంగా చెప్పబడుతున్న 1857 సిపాయిల తిరుగుబాటు కంటే ఎనభైయేళ్ళ ముందే తెలుగు గెడ్డ మీద తిరగబడ్డ తెలుగు బిడ్డను నేను. నూజివీడు సంస్థానం. నిజాం నవాబు యేలుబడిలో స్వతంత్ర్య సంస్థానం. కుంపినీ వారు వ్యాపారం చేసుకునేందుకు అనుమతి కోసం నా దగ్గరకి వచ్చారు. సహృదయంతో అనుమతినిచ్చాను. కుతంత్రంతో నన్ను మోసంగించారు. నేను తిరగబడ్డాను. వాళ్ళు మచిలీపట్నం నుంచి, మద్రాసు నుంచి పటాలాలతో నా రాజ్యం మీదకి దండయాత్రకి వచ్చారు. రకరకాల గెరిల్లా యుద్ధ రీతుల్లో బ్రిటిషు సైన్యాన్ని మట్టికరిపించాము. ఆనాడు నాకు అండగా నిలచి నాతో భుజం భుజం కలిపి పోరాడిన అమర వీరులు, నా సేనాధిపతి, బావమరిది అయిన చెలికాని వెంకయ్య, ఆప్తమిత్రుడు సర్దార్ జీతుమల్లారెడ్డి, అమీర్‌ఖాన్‌ల ప్రభుభక్తి, దేశభక్తిని నేను జన్మజన్మలకి మరువలేను. ఆ యుద్ధంలో విదేశీ కుట్రకీ, స్వదేశీ భక్తికీ జరిగిన పోరాటంలో లెఫ్టినెంట్ షెపెర్డ్ నేలకొరగటం కుంపినీ వారిపై తెలుగు వాడి తొలివిజయం. లెఫ్టినెంట్ కోల్ట్సు, కెప్టెన్ మాంట్స్‌గోమరీలు బందీలుగావటం నూజివీడు సంస్థానం రెండో విజయం. వాళ్ళు శరణు కోరితే క్షమించి వదిలిపెట్టడం భారతీయ ఔదార్యానికి నిదర్శనం. నేనేకాదు, నా కాలంలో దక్షిణాదిలో మరో ప్రాంతంలో స్థిరపడిన మరో తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్టబొమ్మన.

వీరపాండ్య : (ఒక ర్యాంపు మీదకు వచ్చాడు) నన్ను బాగా గుర్తుపెట్టుకున్నావు సోదరా! అప్పటికి తెలుగువారికి ఓ ప్రత్యేక రాష్ట్రంలేక దక్షిణాదిన మనవాళ్ళు అంతటా వ్యాపించి ఉండేవారు. నారయ అప్పారాయా నిన్ను చూస్తే నాకు గర్వం. నువ్వు అంటే నాకు ఆరాధన, ప్రేమ, భక్తి.

నారయ : ఎందుకు సోదరా...

వీరపాండ్య : కుంపినీ వారిని నేనూ ఎదిరించాను. సింహంలా పోరాడాను, గర్జించాను, తిరగబడ్డాను, వాడి కుట్రకుబలై బందీనై మరణించాను. నువ్వు వాడి కుట్రను త్రిప్పికొట్టావు. జనాన్ని ఉత్తేజపరిచావు. లెఫ్టినెంట్ షెపర్డ్‌ని మట్టుపెట్టావు. క్షమాభిక్ష అందించి లెఫ్టినెంట్ కోల్ట్సు, కెప్టెన్ గోమరీలకు ప్రాణదానం చేసి, తెలుగు ఔదార్యాన్ని చవిచూపించావు. మన సంస్కృతీ కేతనాన్ని ఎగరవేశావు. అందుకే నువ్వంటే నాకు గర్వం. అందుకే నువ్వంటే ఆరాధన.

నారయ : మనమిద్దరమే కాదు సోదరా. ఆ నాటి తెలుగునాట ఇంకా ఎందరో కుంపినీ తెల్లదొరల మీద రకరకాలుగా తిరుగుబాటు ప్రకటించారని, పోరాడారని విన్నాను.

విజయ : వాస్తవమే... వాస్తవమే... నేను విజయనగరం రాజును; కుంపినీ దొరలు నా కోటను 1793 ఆగష్టు 2వ తేదీన ముట్టడించారు. ఆనాటి కుంపినీ సైన్యాల లక్ష్యం స్వతంత్ర్య రాజ్యాలేనని, స్వతంత్ర్యరాజులను నిర్వీర్యం చేసి అధికారం చెలాయించడం, దేశ సంపదను కొల్లగొట్టడమే. కాని నా కోటలో సైన్యమే కాకుండా నారాజ్య ప్రజలుకూడా తెల్లవారి మీద కసితోపుట్టిన గెడ్డ మీద మమకారంతో నాకు అండగా నిలిచారు. ఆ యుద్ధంలో నాకు అండగా నిలచిన ప్రజల్లో మెరికల్లాంటి 300మంది యువకులు మరణించారు. వారిత్యాగం నేను

మరువలేను. పదినెలల పోరాటం తరువాత కాని నా కోటను ఆక్రమించలేకపోయారు. నన్ను ఓడించలేకపోయారు. నాకథ పోరాటకథేకాని విజయగాథ కాదు. ఓడి వాళ్ళకు తలవంచాను. బందీనయ్యాను. పేరునాది... పాలన వాళ్ళది.

కాశీపురం : నా పేరు కాశీపురం వీరభద్రరాజు. కాశీపురం ఓ చిన్న రాజ్యం. ఏ చీకూ చింతా లేకుండా నేను, నా ప్రజలు తల్లీ బిడ్డలలాగా న్యాయంగా బ్రతుకుతున్నాము. నా పూర్వీకుల నుంచి సంక్రమించిన నిధినిక్షేపాలు నా రాజ్యంలో ఉన్నాయని కుంపినీ వారికి తెలిసింది. రాయబారాలు పంపి నన్ను వారికి సామంతుడ్ని కమ్మనీ, కప్పం కట్టమనీ తాకీదులుపంపారు. నేను ధిక్కరించాను. నా ప్రజలకి ఈ విషయం చెబితే ముక్తకంఠంతో వారూ ధిక్కారాన్ని తెలియజేశారు. ప్రభువే ప్రజలు, ప్రజలే ప్రభువుగా ఒక్కటై నిలబడ్డాం. వారి తాకీదును తిరస్కరిస్తూ జవాబు పంపాను. పటాలంతో దండయాత్రకు వచ్చారు. నేను నా ప్రజలు ఒక పక్కా, ఫిరంగులు తుపాకులు మరోప్రక్క నా ప్రజల ఆయుధాలు విల్లంబులు, కర్రలు, మనోధైర్యం తెల్లవారి ప్రక్కనున్నది ఫిరంగులు, తుపాకులు, మందుగుండు సామగ్రి, కుట్ర, కుతంత్రం. భీకరమైన పోరు జరిగింది. నా ప్రజలు వారిని నా రాజ్యంలోకి అడుగుపెట్టనీయక పోయేసరికి వారికి ఉన్న మందుగుండు సామాగ్రితో నా మొత్తం రాజ్యాన్నే తగులబెట్టారు. నా ప్రజావీరులను మట్టుబెట్టారు. నాకూ యావజ్జీవ కారాగార శిక్ష విధించి, అండమాన్ దీవులకు తరలించారు. సోదరులారా! ఓ నగ్నసత్యం మీకు చెప్పాలి. అండమాన్ దీవుల్లో యావజ్జీవ దీపాంతర శిక్ష అనుభవిస్తున్న 800 మంది ఖైదీలలో 250 మంది దక్షిణ భారతీయులే. వారిలో సగం మంది తెలుగుమాట్లాడేవారే. అదీ ప్రథమ స్వాతంత్ర్య పోరాటానికి ముందు నుంచే కుంపినీ వారి మీద తిరగబడ్డ తెలుగుగెడ్డ వీరచరిత...

పాలకొండ : నేనుపాలకొండ జమీందారుని. కాశీపురాన్ని మట్టుపెట్టిన ఓ ఏడాది తరువాత 1833లో నా పాలకొండ జమీ మీద తెల్లవాళ్ల కన్ను పడింది. నా రాజ్యం మీదకు వచ్చిన తెల్లవాడి సైన్యాల మీద నేనూ, నా ప్రజలు తిరగబడ్డాము. విప్లవ వీరులలాగా తిరగబడ్డాము. పోరాడాము. దొరికన వారిని దొరికినట్లుగా నా ప్రజలను ఉరికంబం ఎక్కించారు. నన్ను ఉరితీశారు. అప్పటి నుంచీ తెల్లవారి పద్ధతిలో మార్పు వచ్చింది. దొరికిన శత్రువును ప్రజలమధ్య బహిరంగంగా ఉరితీస్తే ప్రజల్లో భయం పెరిగి బ్రిటిష్ ప్రభుత్వానికి, వారి ఆజ్ఞలకు ఎదురు చెప్పకుండా ఉంటారని, తలవంచుకుని పడి ఉంటారని నమ్మారు. అప్పటి నుంచి ఎదురు తిరిగిన వారిని బహిరంగంగా ఉరితీయడం కుంపినీ దొరల పరిపాలనా విధానమయ్యింది.

అనకాపల్లి : మిత్రులారా! నేను అనకాపల్లి జమిందారు జగన్నాథరాజుని. నాదీ పాలకొండ జమిందారు కథలాంటిదే మా సమస్య కుంపిని దొరలకు కప్పంకట్టి తలవంచుకు బతకటమా? తిరగబడి, పోరాడి మరణించడమా అన్నదే. నేనూ తిరగబడి పోరాడాను. బంధించారు. ఉరితీశారు. సరిగ్గా పాలకొండ జమిందారుని ఉరితీసిన ఒక్క సంవత్సరం తరువాత అంటే 1834 అన్నమాట. మేము బ్రిటిష్ వారి మీద తిరగబడినందుకు, ఉరికంబం ఎక్కినందుకు ఆనాడు చింతించలేదు. ఈ లోకంలోనూ చింతించడం లేదు. బానిసగా వెయ్యేళ్ళు బతకటం కంటే స్వతంత్రుడుగా ఒక్కరోజు బతకటంలో ఎంతో ఆనందం ఉంది. బతికినంతకాలం స్వతంత్రులుగా బతికి బానిసబ్రతుకు కాదని స్వతంత్రుడుగానే మరణించిన తృప్తి నాకు ఎంతో సంతృప్తి.

*(మరో వ్యక్తి కాస్త దూరం నుండి చప్పట్లు కొడుతూ వేదిక మీదకు వస్తాడు)*

ఉయ్యాల : మీలాంటి మహానుభావులు, పెద్దల యొక్క ధైర్య సాహసాలు, ఆత్మార్పణలు, స్వాతంత్ర్య పోరాట దీక్ష, తిరుగుబాటు ధోరణులు నాలాంటి వారికి స్ఫూర్తి అయ్యాయి. ఆనాడు నాలాంటి వారికి ప్రేరణయ్యాయి.

విజయ : ఇంతకీ తమరెవరు?

ఉయ్యాల : నేనా?

*(బ్యాక్‌రౌండ్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరుమీద తంగిరాల వెంకటసుబ్బారావుగారు రేనాటి సూర్యచంద్రులు పుస్తకంలో ఉటంకించిన జనపదులు పాడుకునే పాట వస్తుంది.)*

**అడిగో వచ్చె ఇదుగో వచ్చె నారసింహారెడ్డి**
**పళ పళ పళ కేకలెసెరా నారసింహారెడ్డి**
**చంద్రాయుధము చేతబట్టినే నారసింహారెడ్డి**
**కొబలీ రణబలీయన్నదే నారసింహారెడ్డి**
**పళ పళ పళ కేకలెసెనే నారసింహారెడ్డి**
**రాజారావు రాజ బహదూరు నారసింహారెడ్డి**
**కోయిలకుంట్లజిలేదారు నోరెట్టబట్టియెగ్గి**
**టవును బయటికి ఎత్తి కొట్టెరా నారసింహారెడ్డి**
**నక్కనోటి జమదండము బాకు పైకి ఎత్తినాడు**
**పర్రుపర్రునా బొజ్జను కోసి పగల జీల్చినాడు**
**సన్నపేగునూ జంజమేసెరా నారసింహారెడ్డి**
**వాని రకతము సుక్కబొట్టుగా తాను బెట్టినాడు.**

విజయ : ఓహో... ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగారా! (అందరూ అతని వైపే చూస్తారు)

ఉయ్యాల : అవును మిత్రమా తమరందరూ హేమాహేమీలు పెద్దలు, నాకు మార్గదర్శకులు

నారయ : కుంపినీ వారికి మీకు తగాదా ఏమిటి?

ఉయ్యాల : స్వతంత్రకాముకులైన ఏ రాజుతోనయినా, ఏ జమిందారుతోనయినా, ఏ జాగీర్దారుతోనయినా తెల్లవాడికి తగాదాయేకదా!

విజయ : ఆ తెల్లదొరల తత్త్వమే అంతకదా

ఉయ్యాల : ఆ తెల్లవ్యాపారులను దొరలని పిలవడం నా కిష్టం ఉండదు. తెల్లవాడనే అంటాను. అదేవాడికి కడుపుమంట.

కాశీపురం : నీ జాగీరు మీదకు తెల్లవాడు దండయాత్ర చేశాడా?

ఉయ్యాల : లేదు. వాళ్ళ తాసిల్దారు మీదకు నేను దండయాత్ర చేశాను. నా తండ్రి చెయ్యలేని పని నేను చేశాను.

కాశీపురం : అంటే

ఉయ్యాల : నా తండ్రి ఉయ్యాలవాడ జాగిర్దారు పెద్ద మల్లారెడ్డి. ప్రజలంటే ఆయనకు ప్రాణం. అప్పటికి ఏడాదికి ముప్పైవేల రూపాయల ఆదాయం వస్తున్న జాగీరది. తెల్లవాళ్ళు కుట్రచేసి, నా తండ్రిని బొమ్మను చేసి నెలకు 70 రూపాయలు భరణమేర్పాటు చేశారు. అటువంటి భరణాన్ని తవర్జీ అనేవారు. నా తండ్రి గతించిన తరువాత అన్నదమ్ముల వాటాలలో నా వరకు వచ్చే సరికి 11 రూపాయల పది అణాలకు తగ్గించారు కుంపినీ వారు. ఆ భరణం కోసం కోవెలకుంట్ల తాసిల్దారు దగ్గరకి నేను మనిషిని పంపించాను. వళ్ళు కొవ్విన ఆ తెల్లతాసిల్దారు ఈ నరసింహారెడ్డి సంగతి తెలియక "ఆ దాసరి కింద ఇంకో దాసరా? ఆ నరసింహా దాసరినే రమ్మను పో" అని చిరాకు పడ్డాడు నా మనిషి మీద. ఆ మనిషి తిరిగి వచ్చి ఆ తాసిల్దారు అన్న మాటలు చెప్పలేక చెప్పలేక నాకు చెప్పాడు. నా రక్తం మసిలిపోయింది. నా జాగీరు స్వాధీనం చేసుకొని అనుభవిస్తూ తెల్లవాడు కట్టే కవులు డబ్బులవి. వాడు నాకింద బతికేవాడు. నన్ను భిక్షగాడు అంటాడా? నేను పంపిన మనిషిని భిక్షగాడు అంటాడా? తెల్లవాడి మాటలకి వళ్ళు మండిపోయింది. గుండెలు రగిలాయి. రక్తం సల సల మరిగింది. 500 మంది బోయసైన్యాన్ని వెంటబెట్టుకొని కోవెలకుంట్ల వైపు కదిలాను. తాసిల్దారును చుట్టుముట్టాను. కుర్చీలో కూర్చున్న తాసిల్దారు చొక్కా పట్టుకుని లేపాను. "నేను దాసరి నటరా" అని గర్జిస్తే తాసిల్దారు గడ గడ

వణికాడు. అడ్డొచ్చిన సిపాయిలను నరికాను. తాసిల్దారు తల నరికి, అలా నరికిన తలను నయనాలప్పకొండమీద శివాలయం గుహలో దాచిపెట్టాను.

నారయ : శహబాష్ రెడ్డీ, శహబాష్,

ఉయ్యాల : అక్కడితో అది ఆగిపోలేదు. తెల్ల పటాలాలు వచ్చాయి. తెల్ల తాసిల్దారు తలను వెతక్కుంటూ. తుపాకులు వచ్చాయి, నరసింహారెడ్డిని వెతుక్కుంటూ. 1846 జూలై 10వ తేదీన ప్రారంభమయిన పోరాటం, 1947 ఫిబ్రవరి 2 వరకు జరిగింది. ఫిరంగులు వచ్చాయి. భీకర పోరాటం జరిగింది. చాలా మంది నేలకొరిగారు. గెరిల్లా పోరులో వాళ్ళూ చచ్చారు. చివరకు నన్ను బంధించారు. కోవెలకుంట్లలోని జుర్రేటి నది ఒడ్డుకు తీసుకెళ్ళి, ఉరికంబం ఎక్కించారు. నా కళ్ళలో భయం వాడికి కనపడలేదు. నా కళ్ళలో ధైర్యమే వాడికి కనబడింది. నా కళ్ళలో విప్లవ జ్వాలలే వాడికి కనపడ్డాయి. నా కళ్ళలోని స్వాతంత్ర్యకాంక్ష వాడిని భయపెట్టింది. తెల్ల తాసిల్దారు తల ఎక్కడంటే... నేను పైకి చూశాను. వాడికి వళ్ళు మండింది. నా ప్రాంత ప్రజలు రెండు వేల మంది చూస్తుండగా నన్ను ఉరితీశారు. నా తల నరికి కోవెలకుంట్లలో ఉరికొయ్యకు వేలాడదీశాడు. జనం ఆ దృశ్యాన్ని చూసి బయపడతారని ఆశ. తెల్లవాడి దురాలోచన. అలా వేలాడ దీసిన నా శిరస్సును 30 ఏళ్ళపాటు, అంటే 1877 వరకు ఆ ఉరి కొయ్యకే ఉంచారట. ఈ ఘనకార్యాన్ని తనపై అధికారులకు గర్వంగా రాసుకున్నాడట తెల్లవాడు. మీరే చెప్పండి పెద్దలారా గెలుపు నాదా? తెల్లవాడిదా?

నారయ : గెలుపు నీదే నరసింహారెడ్డి. దానికి సాక్ష్యం నేటి స్వాతంత్ర్య భారతమే...

ఉయ్యాల : లేదు. నేను 1847లో ఉరికంబమెక్కాను. 1947లో దేశానికి స్వాతంత్ర్యమొచ్చింది. ఈ వందేళ్ళలో దేశంలో ఎన్ని ఉద్యమాలు జరిగాయో? ఎందరు నేలకొరిగారో? ఎందరు స్వాతంత్ర్య సమరయోధులు మాతృభూమి ఒడిలో మణిగిపోయారో?

షేక్ పీర్ షా : నిజం నర్సింహారెడ్డి బాయి. నా పేరు షేక్ పీర్ షా అప్పటికి కడపలో తెల్లవాళ్ళు రెజిమెంటు పెట్టారు.

ఉయ్యాల : అందులో నువ్వూ ఒక సైనికుడివా...

షేక్ పీర్ షా : కాదు రెడ్డీ భాయి. కడపలో నేను ఒక దర్గా పెట్టాను. ఎందుకంటే కడప రెజిమెంటులో సైనికులందరూ తెల్లవాళ్ళు కాదు. తెల్లసైనికుడుతోపాటు మన స్థానిక సైనికులూ ఉన్నారు. అంటే ముసల్మానులు, హిందువులు. హిందువులు ముసల్మానులు అనే భేదం లేకుండా, ఇద్దరూ దర్గాకి వచ్చేవారు. అలా వచ్చిన హిందూ, ముస్లిం సైనికులకు వారిలో దేశభక్తి పెంపొందించి మెల్ల.. మ్లెలగా..., మెల్ల.. మెల్లగా... వారిలో తిరుగుబాటును ప్రేరేపించడమే నా దర్గాలో చేసే ప్రార్థనల సారాంశం. ఇలా చాలా రోజులు కొనసాగింది. నా మీద తెల్లగూఢచారులు కన్నువేసి, అనుమానించి బంధించారు. పదేళ్ళు జైలు శిక్షవేశారు. అలా నా ప్రయత్నం కడపలో ముగిసింది. కానీ హైదరాబాదు రెసిడెన్సీ ముట్టడికి నాంది పలికింది. ఉత్తరాది నుంచి పారిపోయి వచ్చిన స్థానిక కుంపినీ సైనికులు ఉద్యోగాలు పోగొట్టుకుని పారిపోయి వచ్చి హైదరాబాదు చేరుకున్నారు.

తుర్రే అబ్బా : అసలు సంగతి నేను చెబుతాను షేక్ పీర్ షా భాయి. నా పేరు తుర్రే అబ్బాజ్ఖాన్. రెసిడెన్సీ ముట్టడి వెనుక కొంత కథ ఉంది బ్రిటిష్ వారిపై తిరగబడి పారిపోయి వచ్చిన పదిహేనుమంది సైనికులు, హైదరాబాదు నిజాం నవాబు ఆశ్రయం ఇస్తాడన్న ఆశతో సరిహద్దుదాకా వచ్చాము. నిజాం ఆశ్రయం ఇవ్వకపోగా ఆ పదిహేను మందికి నాయకుడైన జుమేదార్ చీదాఖాన్తో సహా అందరిని బంధించి, విచారణకు రెసిడెన్సీకి తరలించారు. అంటే స్వాతంత్ర్యకాంక్షతో తిరగబడ్డ సిపాయిలను మళ్ళీ తెల్లవాడే విచారణ చేస్తాడన్న మాట. అప్పటికే హైదరాబాద్లోని ప్రజానీకానికి నిజాం నవాబు మీద రెసిడెన్సీలో ఉన్న తెల్లవారి పెత్తనం నచ్చడం లేదు. ఇప్పుడు స్వాతంత్ర్యకాంక్షతో తిరగబడ్డ సిపాయిలను ఆ తెల్లవాడు విచారించడం స్థానిక ప్రజలకు నచ్చలేదు. తీవ్ర అసంతృప్తి రేపింది. బందీలైన ఆ స్వాంతంత్ర్య పోరాట వీరులపై గౌరవం పెరిగింది. అప్పుడు 1857 జూలై 17న మక్కామసీదులో ప్రార్థన అయిన తరువాత అసమ్మతి అగ్నిపర్వతం బద్దలయ్యింది. ఆ

రోజు శుక్రవారం. మధ్యాహ్న ప్రార్థనలకు మామూలుగా వచ్చే వారికంటే ఎక్కువ జనం వచ్చారు. మక్కా మసీదు ఇసుక వేస్తే రాలనంత జనంతో కిటకిటలాడింది. ఆ రోజే ఆ పోరాట యోధుల విడుదల గురించి నిర్ణయం తీసుకోదలిచారు. ఎలాగైనా వారిని విడిపించాలనే నిర్ణయానికి వచ్చారు. ముందుగా నలుగురు మౌల్వీలు నిజాం నవాబు దగ్గరికి రాయబారం వెళ్ళి, జిహాదీలను కాపాడటం మహ్మదీయ ప్రభువుల బాధ్యత అన్న సంగతి గుర్తుచేసి, ఖైదీలను విడిచిపెట్టేటట్లు చెయ్యాలని, ఆ ప్రయత్నం విఫలమయితే రెసిడెన్సీపై దాడి చేయాలనీ అనుకున్నారు. ఈ సంగతి ఆ తెల్లదొరలు పసిగట్టి నిజాంకు రక్షణగా మరింత సైనిక బలగాలను పంపించాడు. నిజాంకు నచ్చచెప్పే ప్రయత్నం విఫలమయ్యింది. మతం కంటే తన స్వార్థం ముఖ్యమని తలచాడు నిజాం నవాబు. రాయబారంతో పూర్తికాని పనిని యుద్ధంతోనైనా పూర్తి చేయాలని తిరుగుబాటు దారులు నిశ్చయించారు. 200 మంది సాయుధులైన యువకులను తీసుకొని నేను రెసిడెన్సీ వైపు కదిలాను. మక్కామసిదు నుండి రెసిడెన్సీ దరిదాపులకు చేరేసరికి దారి పొడుగునా హిందూ, ముస్లింలు – జాతి, మత, కుల విచక్షణ లేకుండా ఎందరో కలిశారు. అది ఆవేశంతో ఉప్పొంగిన జనవాహిని. అందరూ సాయుధులే. చేతికి దొరికిన వస్తువే వారి ఆయుధం. వారందరి లక్ష్యం ఒక్కటే. రెసిడెన్సీని ముట్టడించి బందీలై ఉన్న తిరుగుబాటు వీరులను రక్షించడమే. రెసిడెన్సీ దాకా చేరుకుని, రెసిడెన్సీ ఎదురుగా ఉన్న రెండు పెద్ద భవనాల్లో తిరుగుబాటు వీరులందరూ బసచేశారు. ఒక భవనంలో హిందువులది. ఒక భవనం ముసల్మానులది. అక్కడి నుండి పోరాటం సాగించారు. హోరాహోరిపోరు జరిగింది. కంటోన్మెంట్ నుంచి కూడా బ్రిటిష్ సైనికులు వచ్చి నిజాం సైన్యాలకు కలిసాయి. రెసిడెన్సీ రక్షణకోసం. మేము ఉంటున్న రెండు భవనాలను రాత్రి అయ్యేసరికి ముట్టడించారు. కొందరు మరణించారు. తెల్లవారేసరికి రెండు భవనాల్లో ఉన్న విప్లవవీరులు, కుంపినీ సైనికుల కంటికి కనబడలేదు. అందరం తప్పించుకున్నాం. ఎంతటి ప్రజాసహకారం, ఎంతటి కుంపినీ సేనలలోని స్థానిక సైనికుల సహకారం లేకపోతే అలా తప్పించుకోగలిగే వాళ్లమా? అక్కడ జాతి, మత, కుల వివక్షత లేదు. అందరిని ఒక్కటి చేసింది. స్వాతంత్ర్యకాంక్షే. ధనిక, పేద వివక్షత లేదు. అందరినీ ఒక్కటిగా నడిపించింది. దేశభక్తే అందరినీ తిరగబడేలా చేసింది. తెల్లదొరల ధిక్కారమే. తెల్లదొరల అణచివేత ధోరణిపై తిరుగుబాటే. ఇది ప్రథమ స్వాతంత్ర్యపోరాట చరిత్రలోకి రాదా భయ్యా?

ఉయ్యాల : ఎందుకు రాదు. అబ్బాజ్‌ఖాన్ భాయీ. కాకపోతే తెల్లవాడు తను నెగ్గిన సంఘటనలను, గెలుపుల్ని చరిత్రలో గొప్పగా రాసుకున్నాడు. తన ఓటమిని చరిత్ర కెక్కించలేదు. దేశం నలుమూలల నుంచీ ఆనాడు తెల్లవాడి మీద, కుంపినీ అధికారం మీద, వాడి అణిచివేత సిద్ధాంతం మీద అసంతృప్తి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. తిరుగుబాటు ఉద్యమాలు ప్రజ్వరిల్లుతూనే ఉన్నాయి.

జెండా : వాస్తవమే నరసింహారెడ్డి. మచిలీపట్నంలో జరిగిన ఒక విచిత్రమైన సంఘటన మీకు చెబుతాను. కుంపినీ రెజిమెంటుకు నిద్రలేకుండా జరిగిని ఒక నిశ్శబ్ద విప్లవం గురించి మీకు వివరిస్తాను.

నారయ : ఇంతకీ మీరెవరు?

జెండా : నాపేరు జెండా వీరుడు

ఉయ్యాల : మీరు జెండా వీరుడే కావచ్చు. పేరంటూ ఒకటి ఉండాలి కదా!

జెండా : నేను మచిలీపట్నం బ్రిటిష్ రెజిమెంట్‌కి ఎదురుగా ఉన్న పేరెడ్ మైదానంలో జెండా ఎగురవేసిన తరువాత, నన్ను తెల్లవాళ్ళు వెదకటం మొదలుపెట్టారు. నేనెవరో తెలియనప్పుడు నా పేరెలా తెలుస్తుంది. అందుకు కుంపినీ తెల్ల అధికారులే నాకు జెండా వీరుడని నామకరణం చేశారు. ఆ పేరుతోనే నా కోసం గాలించారు. ఆ పేరుతోనే చుట్టుపక్కల జనాన్ని నా గూర్చి వాకబు చేశారు. నిర్బంధించారు. నేను ఎవరో తెలియక సరిపోయింది కానీ తెలిసివుంటే నా కుటింబీకులను, సన్నిహితులను చిత్రహింసలు పెట్టేవారే. నా కోసం వెతికి, వెతికి విసిగిపోయారు. గాలించి, గాలించి అలసిపోయారు. నా ఆచూకీ చెప్పిన వాళ్ళకి గొప్ప బహుమానం



ప్రకటించారు. ఆ రోజుల్లో జెండా ఎగురవేసిన వారు ఎవరో చెప్పిన వారికి, అంటే నా ఆచూకీ చెప్పిన వారికి 500 రూపాయలు బహుమానం ప్రకటించారు. ఓ రాత్రి వేళ కొద్దిపాటి సహకారంతో, కొందరు చూస్తుండగానే నేను జెండా ఎగురవేశారు. నా దృష్టిలో అది నా దేశపు జెండా. నా దేశం జెండా కుంపినీ సైన్యాల పేరెడ్ మైదానంలో ఎగరటం చూసి నేను ఉప్పొంగిపోయాను. భారతమాతకు (రంగస్థలం మీద అందరూ జై అన్నారు. జెండా వీరుడు పులకించిపోతూ మరో రెండు సార్లు భారతమాతకూ అన్నాడు. అందరూ మళ్ళీ జై... జై అన్నారు.) ఇలాగే... ఇలాగే... నా చుట్టూ ఉన్న మిత్రులు ముక్తకంఠంతో జై అన్నారు. ఇంతలో ఏదో అలికిడి అయ్యింది. చీకటి మాటున ఎవరిదారిన వారు సర్దుకున్నాం. తెల్లవారేసరికి మైదానంలో రెపరెపలాడుతూ ఎగురుతున్న జెండాను చూసి కుంపినీ అధికారులు పళ్ళు కొరుకున్నారు, జుట్టుపీక్కున్నారు, అరుచుకున్నారు, రంకెలు వేశారు కాని జెండా వీరుని పేరు తెలియలేదు, ఊరు తెలియలేదు, ఆ చూకీ తెలియలేదు. జెండా వీరుడు మీద కోపాన్ని జెండా మీద చూపించి ఎగిరే జెండాని కిందకు దించారు. రగిలే ఉద్యమాన్ని ఆర్పేశక్తి ఆ తెల్లవాళ్ళకి లేకపోయింది. ఆ వేళ నా చుట్టూ ఉన్న జనాన్ని తెల్లసిపాయిలు, పోలీసులు నా ఆచూకీ గురించి అడిగితే పెదవి విప్పని నాతోటి జనాన్ని తలచుకుంటే నా మనస్సు ఉప్పొంగి పోతుంది. నివురు గప్పిన నిప్పులా ప్రతి భారతీయ హృదయం స్వాతంత్ర్యకాంక్షతో రగులుతూనే ఉందన్నది నిజం. 500 రూపాయలకు ఆశపడితే ఆనాడు ఎవరో ఒకరు నా ఆచూకి తెల్లవాడికి తెలియజేసేవాడే కదా. అలా చెయ్యకుండా నన్ను గుండెల్లో పెట్టుకొని ఆ జనం దాచుకున్నారంటే, వారు నేను చేసిన పనిని ఎంతగా అభిమానించారో, ఎంతగా మెచ్చుకున్నారో మీరు అర్థం చేసుకోవచ్చు. అందుకే అప్పటి నుంచే నా పేరు నేను కూడా మరచిపోయి జెండా వీరుడుగానే మిగిలిపోయాను. నన్ను మీరంతా జెండా వీరుడు అని పిలిస్తేనే నాకు ఆనందం. తలచుకుంటే ఆనాడు కుంపినీ వాళ్ళు మన స్థానికప్రజలను ముఖ్యంగా పల్లెప్రజలని ఎన్ని కష్టాలకు గురిచేశారో, ఎన్ని ఇబ్బందులు పెట్టారో, వారి స్వేచ్ఛని ఎంత హరించారో తలచుకుంటే గుండెలు రగిలిపోతున్నాయి.

ఉయ్యాల : నాలాంటి వాడికే నెలకు పదకొండు రూపాయలు భరణం ఇవ్వడానికి అవమానించిన కుంపినీ వాళ్ళు, పల్లె ప్రజలను ఇబ్బంది పెట్టడంలో ఆశ్చర్యమేముంది. దోచుకోవడంలో అసత్యమేముంది జెండా వీరా.

సుబ్బారెడ్డి : నిజం చెప్పారు (అంటూ కొర్ల సుబ్బారెడ్డి, కొరకొండ సుబ్బారెడ్డి వేదిక మీదకు వచ్చారు) నా పేరు కొర్ల సుబ్బారెడ్డి, అతను కొరకొండ సుబ్బారెడ్డి. మేమిద్దరం ఇరుగు పొరుగు గ్రామస్తులం. కొండ ప్రాంతాలలో గ్రామ పెద్దను కొండదొర అనే పిలుస్తారు. ఆ విధంగా మేమిద్దరం కొండదొరలమే. మా గ్రామ ప్రజలకు భూమి మీద ఉండే హక్కు, భూమిని పండించేహక్కు, వారసత్వహక్కును, తెల్లవాడు ఒక్క చట్టంతో తుడిచిపెట్టాడు. ఈ భూమి మీద పుట్టిన రైతాంగం తరతరాలుగా అనుభవిస్తున్న భూమిని పండించుకునే హక్కును తుడిచిపెట్టే హక్కు ఈ తెల్లవాడికి ఎవడిచ్చాడు? అడవితల్లి ఒడిలో, అడవి సంపదను హాయిగా అనుభవిస్తూ, ప్రశాంత

వాతావరణంలో బతికే కొండప్రాంత పల్లె ప్రజల్లోనూ, వారి బతుకుల్లో అలజడిరేపాడు. అశాంతిని సృష్టించాడు. అందుకే కొండ ప్రాంత ప్రజలు తిరగబడ్డారు. తెల్లవాడితో వీరోచితంగా పోరాడి తెల్లవాళ్ళని గడగడ వణికించారు. పోరు చాలా కాలం సాగింది. నేలకొరిగిన వారు నేలకొరిగారు. పట్టుబడ్డ మమ్ములను రాజమహేంద్రి కోర్టులో విచారణ తంతుగా నడిపి మళ్ళీ ఎవరూ తిరగబడకుండా ఉండడం కోసం, మమ్మల్ని కొర్ల సీతారామయ్యను ఉరికంబం ఎక్కించారు. ఎంతో మందికి కారాగార శిక్షలు విధించి, జైళ్ళలో తోశారు. మా మన్యప్రాంత ప్రజల ధైర్యం చెక్కు చెదరలేదు. మన్యప్రాంత విప్లవచరిత్రలో మా పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయాయి. కాని తెల్లవాడు చిరస్థాయిగా నిలవ లేకపోయారు. ప్రజలు మాకు కృతజ్ఞతగా స్మారక స్థూపాలు నిలిపారు. కవులు, కళాకారులు మా పోరాటచరితను పాటలు పాడారు. పద్యాలు చెప్పారు.

ఉయ్యాల : శహభాష్ వీర మన్య సోదరులారా, ప్రజల గుండెల్లోనూ కవుల అక్షరాల్లోనూ, కళాకారుల ఆలాపనల్లోనూ చిరస్థాయిగా మిగిలిపోవడం కంటే ఏ విప్లవకారుడైనా కోరుకునేది ఏముంటుంది.

చలమయ్య : నిజం నిజం వీరులారా మీ మీ చరిత్రలు వింటూ ఉంటే నా గురించి నాలుగు మాటలు చెప్పుకోవాలనిపిస్తోంది. నా పేరు చలమయ్య. నా స్వస్థలం పెన్నానదీతీరంలోని సింహపురి. తెల్లవాడు మన దేశానికి వర్తకానికి వచ్చినట్టే, నేను తెల్లవాళ్ళ దేశానికి వర్తకానికి వెళ్ళి అక్కడ వర్తకం చేశాను. తెల్లవాడు మన దేశాన్ని ఆక్రమించుకున్నాడు. కాని నేను తెల్లవాడి దేశాన్ని ఆక్రమించుకోవటానికి వెళ్ళిన వాడిని కాదు. ఆ దృష్టే నాకు లేదు. ధనాన్ని బాగా ఆర్జించాను. నేను పుట్టిన గెడ్డమీద నా తెలుగు వాళ్ళు, తెల్లవాడి మీద తిరగబడుతున్న సంఘటనలు తెల్లవాళ్ళు చెప్పుకోగా విన్నాను. ఎందుకో నా మనస్సు చివుక్కుమంది. నేను పుట్టిన గెడ్డకు నేను ఏం చెయ్యగలిగాను? తల్లిని ఆదుకోలేని బిడ్డకు, మట్టిబెడ్డకు తేడా ఏముంది? మాతృభూమిని కాపాడుకోలేని బతుకు దేనికి అనిపించి, నాకున్న ధనంలో అక్కడ అందుబాటులో ఉన్న ఆయుధ సామాగ్రిని ఖరీదు చేశాను. ఓడమీద నా దేశానికి ప్రయాణమయ్యాను. తీరానికి చేరువవుతున్న కొద్దీ, నాలో ఆనందం, ఉత్సాహం ఉరకలు వేయసాగింది. నా గెడ్డమీద తెల్లవాడి మీద తిరగబడుతున్న విప్లవ వీరులకు నాకు చేతనైన సహాయం అందచేయటానికి, ఆయుధసామాగ్రి అందివ్వటానికి నా మనస్సు తహతహలాడింది. ఈ వార్త తెల్లవాడి గూఢచారుల ద్వారా కుంపినీ అధికారులకు తెలిసింది. తీరం చేరకుండానే నేను తెచ్చిన ఆయుధసామాగ్రిని వారు స్వాధీన పరుచుకున్నారు. నన్ను బందీని చేసి ఉరితీశారు. నేను తెచ్చిన ఆయుధసామాగ్రి నా దేశానికి ఉపయోగపడకపోయినా, నా దేశం కోసం నా ప్రాణాలు అర్పించిన తృప్తి నాకుంది.

నారయ : శహభాష్ చలమయ్య నీవు అభినందనీయుడవు.

ఉయ్యాల : అలా ఆనాడు తెలుగుగెడ్డ మీద ఎందరో వీరులు కుంపినీ వాడిమీద ఎదురుతిరిగారు. చరిత్రకెక్కిన వాళ్ళు కొందరైతే ఎక్కనివారు ఎందరో... ఎందరెందరో...

నారయ : ఇంతవైభవోపేతంగా మన దేశ ప్రజలు, మన ప్రాంత ప్రజలు ప్రథమ స్వాతంత్ర్యపోరాట ఉద్యమానికి 150 సంవత్సరాలు నిండాయని, స్వాతంత్ర్య అమర వీరులను స్మరించుకుంటూ జరుపుకుంటున్న ఈ ఉత్సవాలు చూస్తుంటే, మన వారిలో దేశభక్తి ఎంత నెలకొని ఉందో స్పష్టమవుతోంది. తిరగబడ్డ తెలుగుగెడ్డ మీద తెలుగుబిడ్డల విప్లవగాథలు వింటూ ఉంటే కడుపు నిండిపోతుంది. నా మాతృభూమిని చూసుకొని నా మనసు గర్విస్తోంది. నా స్వతంత్ర్యభారతాన్ని చూసి మరోసారి ఆ తల్లి ఒడిలో పుట్టి, పెరగాలనిపిస్తోంది. స్వంతత్ర్యభారతపౌరునిగా స్వేచ్ఛావాయువులు పీల్చాలనిపిస్తుంది. రెపరెపలాడుతున్న ఆ జాతీయ జెండాకు నమస్కరించాలనిపిస్తోంది.

అందరూ : బోలో స్వతంత్ర్య భారత్ కు జై... జై

*(నినాదాలు వినిపిస్తుండగా వెనుక నుంచి సారే జహాసే అచ్ఛా పాటతో తెరపడుతుంది)* మి



**సి.యస్.రావు**

# చరిత్ర అంటే లాభనష్టాలా?

– వై. హెచ్.కె. మోహన్‌రావు

**లా**భ నష్టాల బేరీజుతోనే చారిత్రక నిజాలను వెలికి తీయాలని చెప్పడం అత్యంత శోచనీయం. శతాబ్దాల తరబడి కల్పనానుభూతితో ఉన్న పౌరసమాజం వర్తమాన, భవిష్యత్ కాలాలలోనూ అదే విధంగా కొనసాగాలనుకోవడం ఒక దుష్టాచారాన్ని సమర్థించడమే అవుతుంది. ఒక నేరస్థుణ్ణి మహోన్నత మానవతా మూర్తిగా కీర్తించడం, మరో నిర్దోషిని కపటిగా, ధూర్తగా దూషించడం ఏ సభ్యసమాజానికి ఆనవాలో మనం ప్రశ్నించుకోవాలి. నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా నమ్ముతూ పోవడం ఇదేమి ఆనందమో అర్థంకాని విషయం. అదే విధంగా వాస్తవాలు మరుగుననే ఉండాలనే ఆకాంక్ష ఏ మేరకు సమ్మతం అవుతుంది.

జూలై *మిసిమి* సంచికలో ఆర్. చంద్రశేఖరరావు నా రచన *తొలిమహా మంత్రిణి నాయకురాలు నాగమ్మ* పుస్తకం మీద వెలిబుచ్చిన అభిప్రాయం బ్రహ్మనాయుడిపట్ల ఆయనకున్న అచంచల భక్తి విశ్వాసాన్ని, నాయకురాలి యడల గల అపసవ్య భావనను స్పష్టం చేసింది. బ్రహ్మనాయుడిని కుటిలునిగా, మోసగానిగా, స్వార్థపరునిగా నాయకత్వం కోసం ఎంతటి నీచానికైనా ఒడిగట్టే వానిగా చెప్పటానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ఆయన మనస్తాపం వ్యక్తం చేస్తూ, మరోవైపు మానవీయ విలువలకు ప్రతినిధికాని, కాపట్యం, కుటిలనీతి గలిగిన మహిళ అంటూ నాయకురాలిపై తీవ్రంగా నిర్హేతుకమైన దాడి చేశారు. రుజువులు, సాక్ష్యాలు లేని, నిర్ధారణకురాని ఆరోపణలనే ఆమె నేరాలుగా నమ్ముతూ చంద్రశేఖరరావు ఆమెపై ఈ వ్యాఖ్యలు చేశారని నేను భావిస్తున్నాను.

హేతుబద్ధత లేని రచనలు, పరిశీలన కొరవడిన అవగాహనలు నాయకురాలిని దుర్మార్గురాలిగా నిలబెట్టాయి. దున్న ఈనిందంటే గాట కట్టమన్నట్లు దివ్యత్వం, దైవత్వం, మంత్రాలు, తంత్రాలు, మహిమలు, మాయలు తమ రచనల్లో గుప్పించిన రచయితలు నాయకురాలికి కుటిలత్వాన్ని అంటగట్టారు. అదే క్రమంలో ఎక్కడ బ్రహ్మనాయుడి వ్యక్తిత్వం దిగజారి పోతుందోనని మరోప్రక్క తెగ ఆందోళన చెందిన వారే, లేనిపోని గొప్పలన్నీ ఆయనకు ఆపాదించారు. చాపకూడు, కులరహిత సమతావాది అంటూ బ్రహ్మనాయుడిని శిరస్సున పెట్టుకుని ఊరేగారు. అయితే ఆయనకు అనుకూల ప్రచారం తప్పుపట్టలేము. ఆ పూర్వ రంగంలో నాయకురాలిపై లేనిపోని నిందలతో విషం చిమ్మడమే అభ్యంతరకరమైన విషయం. బ్రహ్మనాయుడిని ఉత్తమోత్తముడుగా చిత్రికరించే క్రియలో భాగంగా నాయకురాలిని దుమ్మెత్తి పోయడమే సబబు కాని విషయం. తొలితరం రచయితలైన శ్రీనాథుడు, కొండయ్య, మల్లయ్య, మలితరం వారైన ముదిగొండ వీరభద్ర కవి, పింగళి లక్ష్మీకాంతం, వినుకొండ వల్లభరాయుడు చెప్పని చాపకూడు అనంతర కవుల, రచయితల రచనలతో ప్రవేశించడం వారి రచనా చాతుర్యానికి, పక్షపాతానికి నిదర్శనం.

దళితుడైన కన్నమదాసుని సైన్యాధ్యక్షునిగా చేశాడని, పుత్రునిగా భావించాడని బ్రహ్మనాయునిపై పొగడ్తలు కురిపిస్తున్న ఆధునిక అపర బ్రహ్మనాయులారా! పల్నాడు ఏకరాజ్యంగా ఉన్నపుడు కన్నమదాసుకు సైన్యాధ్యక్షపదవి ఎందుకు అప్పగించలేదో! చెప్పగలరా? పల్నాడు విభజన జరిగి మాచర్ల రాజ్యం ఏర్పడిన తరువాతనే కన్నమదాసును సైన్యాధ్యక్షునిగా చేయడంలో మతలబు ఏమిటో వివరించ గలరా? అవసరానికి హత్తుకునే నాటకీయతను కూడా త్యాగంగా, విశాలవాదంగా, మానవీయంగా ప్రచారం చేసుకు పోతున్న బ్రహ్మో వాదులారా! కన్నమను బ్రహ్మనాయుడు పుత్రునిగా భావించాడనటంలోని రహస్యాన్ని ముదిగొండ వీరభద్ర కవి *వీరభాగవతం* లో గమనించినపుడు ఆయన సమతా వాదం, దళితప్రేమ ఏపాటిదో తెలుసుకుని విస్మయానికి లోనౌతాము.

కన్నమదాసుకు సైన్యాధ్యక్షపదవి ఎవరో ఇచ్చే భిక్ష కాదని మరోకోణం స్పష్టం చేస్తుంది. కన్నమదాసు తండ్రి తెప్పలనీడు అనుగు రాజు సైన్యాధ్యక్షుడు. ఆయన ఆరణ గండ్ల యుద్ధంలో మరణించాడు. ఆ క్రమంలో అనుగురాజు నుండి నలగామరాజుకు రాజపీఠం, దొడ్డనాయుని నుండి బ్రహ్మనాయుడికి మంత్రి పదవి పంరపరగా లభించిన విధంగా కన్నమదాసుకు తన తండ్రి సైన్యాధ్యక్ష పదవి ఎందుకు లభించలేదో? విజ్ఞులైన వారు ఆలోచించగలరు. కన్నమదాసు శౌర్యవంతుడు కాకపోతే అది వేరే సంగతి. దాపరికం లేకుండా ధర్మంగా చెప్పుకోవాలంటే అనుగురాజే సమతావాది, దళితవాది అని స్పష్టపరచాలి. ఒక దళితుని పుత్రునిగా ప్రేమించిన మహా మానవతావాది శివనందుల కోటముట్టడిలో ఆత్మహత్య

చేసుకున్న శివసింగు, నాగులాదేవి సంతానం లోకం తెలియని బిడ్డలిద్దరినీ తీసుకువచ్చి మగపిల్లవాడు లంకన్నను పశువుల కాపరిగా, ఆడపిల్ల మాదచిని అంతఃపుర స్త్రీల పరిచారికగా ఎందుకు మార్చాడో చెప్పగలరా? వీరిద్దరి పెంపకంలో బ్రహ్మనాయుడి మానవవిలువలు ఎక్కడ నక్కాయో? చాపకూడు, దళిత వాదమేకదా బ్రహ్మనాయుడిని ఆకాశానికి ఎత్తడానికి చూపుతున్న కారణాలు. కేవలం చంద్రశేఖరరావునే గాకుండా ఇలాంటి భ్రమలున్న వారందరినీ సమాధాన పరచడానికి మాత్రమే ఈ సందర్భాలను వివరించాను. అన్యధాభావించరని ఆశిస్తున్నాను. సరే దాన్ని అలా వుంచితే....నాయకురాలు ఎక్కడ కుటిలంగా ప్రవర్తించింది? కాపట్యం ఎక్కడ ప్రదర్శించింది? హేతుబద్ధంగా ఆలోచించకపోతే ఇలాంటి తీర్పులే యిస్తారు. అమానవీయంగా ఎప్పుడు, ఏ సంఘటనలో తన తీరును కనపరిచిందో రుజువులు, సాక్ష్యాలతో చెప్పగలరా? చలన చిత్ర ప్రమాణాలతో సాగే ప్రచారం చర్చకు నిలబడుతుందా? వాటినే నిజాలుగా, చారిత్రక సత్యాలుగా నమ్ముతూ కాలం గడిపే వారు నాయకురాలు శీలవంతురాలు అనే విషయాన్ని అంగీకరించక పోవడం అసాధారణమేమీ కాదు.

నాయకురాలి మీద అనేక అపవాదులున్నాయి. వాటిని పరిష్కరించే క్రమంలో ఆ సంఘటనలకు బాధ్యులెవరోకూడా చెప్పవలసిన అవసరం రచయిత ధర్మమని నేను భావిస్తున్నాను. ఆ నేపథ్యంలో మాత్రమే ఆయా సంఘటనలకు బాధ్యులను వెలికి తీసి చెప్పడం జరిగింది. దానిని ఆక్షేపిస్తే నేనుగా చేయుగలిగింది ఏమీలేదు. నాయకురాలు మానవీయ విలువలకు ప్రతినిధి కాదని చంద్రశేఖరరావు తేల్చి చెప్పేశారు.

అమానవీయ విలువలే నిండి ఉంటే యుద్ధాన్ని నివారించ డానికి, రక్తపాతాన్ని నిలువరించడానికి, వనితల ఐదోతనం కాపాడటానికి ఆమె సంధి చేసుకుంటుందా? కారంపూడి రణభూమికి చేరిన తరువాత కూడా బ్రహ్మనాయుడి వర్గీయులు గొంతెమ్మకోర్కెలన్నింటినీ మన్నింస్తుందా? ఈ సంధి సంఘటనను ఎరిగిన తరువాతకూడా ఆమెను అమానవీయ స్త్రీగా తమ నమ్మకాన్ని మరింత పదిల పరుచుకోవడం విజ్ఞత అనిపించు కోదేమో! దాయాదుల మీద యుద్ధం చేయడానికి వచ్చారని చెపుతున్న మలిదేవాదులు (మాచర్ల రాజులు) నరసింగ రాజు (వారి సవతి సోదరుడు) ఖండిత శిరస్సును చూసి దుఃఖించి ఆ బాధను తట్టుకోలేక బలవన్మరణం పొందిన సంగతిని నెమరు వేసుకుంటే యుద్ధకాంక్ష, రక్తదాహం ఎవరిదో? అమానవీయ విలువలు ఎవరివో? యుద్ధం ఎవరు చేశారో? ఇట్టే మనకు బోధపడతాయి. ఏ మాత్రం హక్కులేని మలిదేవాదులకు రాజ్యభాగాన్ని కోరిన బ్రహ్మనాయుడు అన్నదమ్ముల మధ్య శాంతికోసం ప్రయత్నించాడా? లేని హక్కును, రాని రాజ్యాభాగాన్ని ఆమోదించిన నాయకురాలు శాంతికోసం, సఖ్యతకోసం ప్రయత్నించిందో? మనం ఇప్పటికైనా ఆలోచించాలి. రుజుమార్గ దృష్టితో సత్యాన్వేషణ చేయాలి.

బ్రహ్మనాయుడు దళితుల దేవాలయ ప్రవేశం కల్పించి సంఘ సంస్కరణకు జరిపిన పోరాటాన్ని నాయకురాలు సనాతన వాదులతో కలసి వ్యతిరేకించిందని మరో తీవ్రమైన ఆరోపణ. ఎంత అభూతకల్పన. బ్రహ్మనాయుడు వైష్ణవుడు. నాయకురాలు శైవురాలు. 11-12 శతాబ్దికాలంలో ఉచ్ఛస్థితిలో ఉన్న శైవం దేవుడికీ జీవుడికీ అభేదం పాటించింది. శైవాన్ని స్వీకరించిన వారందరూ కుల, వర్గ, వర్ణ రహితంగా జంగాలుగా పిలువబడినారు. లింగరూపాన్ని స్వయంగా భక్తుడే తాకి ఆరాధించుకునే ఆచారం శైవంలో నెలకొని ఉంది. ఆ సదాచారం వారణాసి (కాశీ) లాంటి పుణ్యక్షేత్రాలలో నేటికీ కొనసాగుతుంది. ఇటీవలి కాలం వరకు శ్రీశైలంలో కూడా ఉండేది. ఇన్ని సద్గుణాలున్న శైవాన్ని నమ్ముకున్న నాయకురాలు బ్రహ్మనాయుని సంస్కరణలను దళితవాదం పేరుతో వ్యతిరేకించిందని, అడ్డుకున్నదని చెప్పడం వివేక వంతమైన వాదనగా అనిపిస్తుందా? ఇలాంటి ఆరోపణలన్నీ సినిమాత్రిక్కులుగానే నిలిచిపోతాయి. పుస్తకంలోని నా అభిప్రాయాలన్నింటినీ ఒక వైపు అంగీకరిస్తూనే చంద్రశేఖరరావు మరోవైపు నాయకురాలిని దోషిగా ప్రకటించడం న్యాయ సమ్మతంకాదు. నిరాధారమైన ఆరోపణలతో నాయకురాలిని నేరస్తురాలిగా మలిస్తే ప్రపంచానికి వొరిగే మేలేమిటో ఆయనే చెప్పాలి. ప్రజలందరూ నాయకురాలిని దోషిగా నమ్మితే ఏ విలువలకు, ఎట్లా మేలు సమకూరుతుందో? సభ్య సమాజం సమాధానం చెప్పుకోవాలి.

తొలిమహామంత్రిణి, శాంతిదూత, ఆమెకు పూర్వం కాని, ఆమె సమకాలంలో కాని, ఆమె అనంతరం కానీ ఆమెకు మాత్రమే దక్కిన *నాయకురాలు* అనే గౌరవంతో మధ్య యుగాల మహిళా ధిక్కార స్వరంగా చెప్పుకోవాల్సిన మహిళా రాజకీయ మార్గదర్శిని బలిపీఠంపై కాకుండా, ధర్మపీఠంపై నిలుచుని దర్శించాలి. అకారణంగా ఒక మహిళా నాయకురాలిపై జరిగిన నిందా ప్రచారాన్ని తిప్పికొట్టిన రచనను, రచయితను స్వాగతించాలో, తిరస్కరించాలో అనే నిర్ణయాన్ని తీసుకునే హక్కు సహృదయులైన పాఠకులకే ఉంది.

మి

# స్వేచ్ఛాగీతం

సీ॥ చలన చిత్రాదిక సందర్శన వ్యాప్తి
పడుచు టెడందలు గిడస బారె,
బొబ్బట్టు సామెత నబ్బించు కొనిరేమో
రాజకీయుల బుద్ధి రాటు వారె,
అయ్య ఎస్ అనుట ఆర్జిత సేవకై
ముఖ్యాధికారము ముదుక వారె,
ధర్మ దేవత గాంధారి గంతలు పొన్ను
సిబ్బిని గమనింప చిరుగు వారె,

తే॥ అరచి గీపెట్టు కొనుమాత్మ నాహుతింపు
మామరణ నిరాహార దీక్షందుకొనుము
సగటు ప్రజకెల్ల నియ్యవి సహజమనును
మొద్దువారెను దేశము మొత్తమన్నా!

– *బేతవోలు రామబ్రహ్మం*




## మిసిమి
మాసపత్రిక

చందాదారులుగా చేర్పించండి

## బహుమతి
పొందండి!

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు ***మిసిమి*** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹240** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

**(మీరు అయిదు సంవత్సరాల చందా కట్టి *మిసిమి* 12 నెలల (2010 జూన్ - 2011 మే) అందమైన బైండు ఒకటి, 6 నెలల (2011 జూలై - 2011 డిసెంబరు) బైండు ఒకటి ఉచితంగా పొందండి)**



ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 3. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 4. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 5. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 6. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 7. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 8. | సిద్ధార్థ " " | 50.00 |

మీ చందా ***మిసిమి*** పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

**మిసిమి** మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi

# అట్టమీద బొమ్మలు

**ముఖచిత్రం – శక్తి గణపతి:** ఒకప్పుడు భారతదేశంలోనే కాదు, ప్రపంచ దేశాలన్ని చోట్ల కళలకు మతమే ముఖ్య ప్రోత్సాహకారిగా, కేంద్ర బిందువుగా ఉండేది. భారతదేశపు ఉత్తర, పశ్చిమ దిక్కులవైపు నున్న రాజస్థాన్ లో 11వ శతాబ్దం ప్రారంభంలో పెక్కు రాజ్యాలలో వైష్ణవం ప్రధాన మతమయింది. ఆ శతాబ్దం నుంచే ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెందాయి. రాజాశ్రయం పొందిన పండిత ప్రకాండులకు మాత్రమే పరిమితమైన సంస్కృతం, ఒక భాషగా కనుమరుగవుతూ కావ్యాలకు మాత్రమే పరిమితమయింది. రాజులు, ప్రజల మధ్య ప్రాంతీయ భాష వాడుక భాషగా, అనుసంధాన భాషగా ముందుకడుగులేసింది. ఈ రెండు చారిత్రక మలుపులతో అప్పటివరకు జానపదులకు మాత్రమే పరిమితమైన కుడ్య చిత్రకళకు రాజాశ్రయపు గౌరవం దక్కింది. బందీలుగా పట్టుబడ్డ చైనా సైనికుల నుంచి కాగితం తయారీ నేర్చుకున్న భారతీయులు, కుడ్య చిత్రకళలోని భారతీయ శైలికి, మొఘల్‌ల చేత రూపుదిద్దబడ్డ ఇస్లామిక్ చిత్రకళలోని సునిశిత భావవైచిత్రిని అందిపుచ్చుకుని తమ చిత్రకళను మెరుగు పర్చుకున్నారు. మధ్య యుగాల నాటికి మీనియేచర్ రాజస్థానీ చిత్రకళ ఔన్నత్య శిఖరాలను చేరుకుంది. బట్టపై, కాగితంపై వేయబడ్డ ఈ చిత్రాలలో కృష్ణలీలలలోని ఘట్టాలే ఎక్కువగా చిత్రించ బడ్డాయి. ఒకటీ అర చిత్రాలలో మాత్రమే శివుడు, శివలీలలు కాన వస్తాయి. విష్ణువు తరువాత అంత ప్రసిద్ధి పొందిన మరొక దేవుడు గణపతి.

గణపతికి సంబంధించి వివిధ ప్రాంతాలలో, వివిధ రకాలయిన పౌరాణిక గాథలున్నాయి. గణనాథునికి వివాహం కాలేదని కొందరంటే, అతనికి సిద్ధీ, బుద్ధీ అనే ఇద్దరు భార్యలున్నట్లు మరొక కథనం.

ఈ రాజస్థాన్ మినియేచర్ చిత్రకళలో గణపతి తన అంకంపై కూర్చుండ బెట్టుకున్న ఆమె శక్తి. ఈ చిత్రం పేరు శక్తిగణపతి. రాజస్థాన్ చిత్రకళ స్వల్ప భేదాలతో అనేక విధాలుగా రూపు దిద్దుకుంది. అవి కాంగ్రా, పహాడీ, బిషోలీ ఇలా మరికొన్ని వీటి మధ్య మౌలికమైన తేడాలు అతి స్వల్పం. చూడడానికి అన్నీ ఒక రకంగానే ఉంటాయి. రాజస్థాన్ ఉత్తర ప్రాంతంలోని నూపూర్, గులేరీ మైదాన ప్రాంతాలు. వీరి చిత్రకళలో పాత్రలకు ఆధునిక నాగరికత లక్షణాలు కనిపిస్తాయి. రాముడు, బలరాముడు, కృష్ణుడు లాంటి పౌరాణిక అవతారాలు, చుక్కలతో (పఖ్తు ముస్లిం స్టైయిల్‌లో) కనిపిస్తారు. తమ రాజుకు ఉన్న అన్ని సదుపాయాలను, దేవుళ్ళకు కూడా వర్తింపజేస్తారు. ఈ చిత్రంలో వినాయకుడు ఒక రాజులా కమలంపై ఆసీనుడై వెనుక దిండు వేసుకుని కూర్చుని ఉంటాడు. క్రింద ఒక వైపు పాన పాత్ర మరొక వైపు పండ్లు కాన వస్తాయి. అంతేగాక శివునికి ఫాలభాగంలో ఉండే మూడవ నేత్రం ఇక్కడ గణపతి నుదిటిపై నిలువుగా చిత్రించ బడింది. గణపతికి, శివునికీ అభేద్యం తెలుపుతున్న ఒక వినూత్న భావమిది – బహుశ అందుకనే కావచ్చు వీరు ఈ చిత్రాన్ని శక్తిగణపతి అనిపిలుస్తారు. చిత్రకళను దైవ ప్రసాదంగా భావించి, దేవుని లీలలు మాత్రమే చిత్రిస్తూ చిత్రకారుడు అజ్ఞాతంలోనే ఉండిపోయాడు. ఆ అజ్ఞాత చిత్రకారునికి జే జేలు!



**రెండవ అట్ట – వసంతాగమనం:** *చిత్రకారుడు* – జాన్ కోలియర్. (John Collier) 19వ శతాబ్దపు ఇంగ్లండు వాస్తవ్యుడు. ఆనాటి చిత్రకళలో ప్రబలంగా వచ్చిన ప్రీరాఫలిజానికి చెందిన శైలికి చెందినవాడు. చిత్రకారుడే కాదు, మంచి కవికూడా. 25 సంవత్సరాల వయస్సులో మ్యూనిక్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చిత్రకళ అభ్యసించాడు.

రాజవంశస్తులయిన 5వ చార్లెస్, డ్యూక్ ఆఫ్ విండర్స్, ప్రిన్స్ ఆఫ్ వేల్సుల రూప చిత్రాలను గీసి రాజశ్రయం పొందినవాడు. మతాన్ని దైవ భావాన్ని నమ్మని హేతువాది. కోలియర్ వేసిన ఒక చిత్రం మనదేశంలో రాజస్థాన్ రాష్ట్రంలో జోద్‌పూర్ రాజమహల్ లోని దర్బారు హాలులో ఉంది. 1850లో జన్మించిన కోలియర్ 1934లో కళాభినిష్క్రమణ చేశారు.



**మూడవ అట్ట – ప్రశాంత గమనం:** *చిత్రకారుడు* – ఎడ్వర్డు మానే. (Edouard Manet) ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 38మంది వైతాళిక చిత్రకారులలో ఇతను ఒకడు. ఫ్రెంచి దేశస్తుడు. సహజత్వపు చిత్రీకరణ నుంచి ఇంప్రెషనిజం అనే ప్రక్రియలో ఆయన వేసిన చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఖరీదయిన, ప్రజామోదం పొందిన చిత్రాలుగా పేరు తెచ్చుకున్నాయి.



**నాలుగవ అట్ట – పాలవెల్లి:** *చిత్రకారుడు* – మహేష్ కుమార్. ఇంప్రెషనిస్ట్ శైలిలో నీటివర్ణ చిత్రాన్ని ప్రతిభావంతంగా వేయగలగటం సంక్లిష్టతతో కూడిన ప్రక్రియ. ఇందులో మహేష్ కుమార్ విజయం సాధించాడనడానికి ఈ చిత్రమే ఒక నిదర్శనం.

# చదవండి...

– ఎన్నార్కె




❖ **మంత్రాల్లో ఏముంది :** రచయిత వేదాంతం లక్ష్మీప్రసాదరావు. ఈ విశ్వమంతా ధ్వనుల పరంపర యొక్క సహ సమ్మేళనమే. ఉచ్చారణ ప్రాముఖ్యం కల్గిన మౌఖికమైన మాటకే శక్తి ఉంటుందని, పవిత్రత ఉంటుందనే విశ్వాసం భారతీయులది. ఋషులు వేద ద్రష్టలేగాని, వేద రచయితలు కారు. ఏ వేద మంత్రాలను ఏ క్రతువుల్లో ఉపయోగించాలో తెలియచేస్తూ మంత్రానికి, యజ్ఞ యాగాది క్రతువులకు గల సంబంధాన్ని బ్రాహ్మణ్యాలు వివరిస్తాయి. ఈ ప్రాచీన భారతీయ సంస్కారాలను తెలిపే మంత్రాలు, వాటి వైశిష్ట్యాన్ని రచయిత 30 చిన్న వ్యాసాలలో అందరికీ అర్థమయ్యే రీతిలో వివరణ ఇచ్చారు. ఇందులో బీజ మంత్రాలు, సోహం, ఆయుర్వేద మంత్రాలు, తాంత్రిక ఆగమాలు– మంత్రం అంటే ఏమిటి? లాంటి 30 చిన్న వ్యాస పరంపరలున్నాయి. శరీరం కురుక్షేత్రమేకాదు ధర్మక్షేత్రం కూడాను. మోక్షసాధన దిశగా ప్రయత్నం చేయడానికి, మన శరీరంలో నిద్రాణంగావున్న కుండలినీ శక్తిని మేలు కొల్పాలి. భగవంతుడు మానవుని వద్దకు రాగలగడానికి అన్ని ఏర్పాట్లు మనం సిద్ధం చేయాలి అంటారు రచయిత. సాత్విక్ బుక్స్, విజయనగర కాలనీ, హైదరాబాదు ప్రచురణ.

*పేజీలు 130, వెల : ₹ 75/–, ప్రతులు కావలసినవారు ఫోన్: 23343782 లో సంప్రదించండి.*




❖ **ఓనమాలు :** కవిత్వం రాయడం సృజనాత్మక జీవనసరళిలో ఒక భాగం. ఎలనాగ పేరుతో నాగరాజు రామస్వామి గారి కవిత్వం పాఠకులకు సుపరిచితం. వారు సాంద్రత, తాత్త్వికత మిళితమైన భావనలను కవిత్వంలో వినిపించారు. ఇందులోనున్న 51 కవితలలో వస్తు వైవిధ్యం ఉంది. పాలపిట్ట బుక్స్ ప్రచురణ.

*పేజీలు 90, వెల : ₹ 50/–.*




❖ **బాలల గేయాలు, పద్యపారిజాతాలు :** విద్యార్థులకు చిన్నపుడే మాతృభాషపై మక్కువ కలగాలంటే తేలిక పదాలతో వినసొంపుగా నుండే శ్రావ్యత గేయాలు రావలసి ఉంది. తెలుగులో ఉన్న ఈ ప్రక్రియలో లేని లోటును ఈ గేయసంపుటి తీరుస్తుంది. ఈ రెండు పుస్తకాలను ప్రచురించిన వారు దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ తెన్నేరు 52/260, కంకిపాడు మండలం కృష్ణాజిల్లా.

*పేజీలు 20, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848039108 లో సంప్రదించండి.*




❖ **హరిత :** సామాజిక సమస్యలను చర్చిస్తూ, సామాజిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, కళాత్మక విలువలకు ఏమాత్రం భంగం కలగకుండా సాగిన హరిత, ట్రీట్‌మెంట్ అన్న రెండు నాటికలు గల పుస్తక సంపుటి ఇది. రచయిత యస్సేరావ్ నాటక రంగంలో ఎన్నో శాఖలలో అనుభవం గడించిన వారు. సంఘానికి ఉపయోగపడే విషయాలు, ఏం చెప్పాలో ఎట్లా చెప్పాలో తెలిసిన వారు. సంఘంలో జరుగుతున్న కొన్ని అన్యాయాలను, ఎండగట్టడానికి, ఆయన ఆర్ద్రతతో చేసిన రచనలు ప్రయోగార్హమైనవి. సాంఘిక ప్రయోజనం కలవి. ట్రెండ్స్ కమ్యూనికేషన్స్ అండ్ గ్రాఫిక్స్, హైదరాబాద్ వారి ప్రచురణ.

*పేజీలు 80, వెల : ₹ 40/–, ప్రతులు కావలసినవారు ఫోన్: 040–24571654 లో సంప్రదించండి.*

❖ **అనుధ్వని అనువాద కవితలు :** నాగరాజు రామస్వామి గారి తొలి అనువాద కవితల సంకలనం ఇది. ఇందులో రవీంద్రనాథ ఠాగోర్ లాంటి ఆనాటి కవుల నుంచి సమకాలీన భారతీయ భాషలలో రచించబడ్డ వివిధ కవుల కవిత్వమేగాక, సౌదీ అరేబియన్ కవి, ఓమాన్ కవి, డా॥ అశోక చక్రవర్తి ఆంగ్ల కవితలున్నాయి. అనువాదాలు గగనమవుతున్న ఈ రోజుల్లో నిండైన హృదయంతో అనుసృజన చేసిన రచయిత అభినందనీయులు. పాలపిట్ట బుక్స్ ప్రచురణ.

*పేజీలు 124, వెల : ₹ 60/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848039108 లో సంప్రదించండి.*




❖ **గెలుపు :** రచయిత యస్సేరావ్. ఇంతకు ముందు పేర్కొన్నట్లే రచయిత తన రచనల ద్వారా సంఘానికి ఉత్తమ సందేశాల నందజేసే దృష్టితో సాగించిన రచనలు. నిత్యం ఒడుదుడుకులతో, మధ్యతరగతి వ్యక్తుల మధ్య సాగే కథాసంవిధానాలివి. కొన్ని కథలలో సైకిలు ముఖ్యపాత్ర వహించింది. ప్రేమకథలు, కాంట్రవర్సీ సబ్జెక్స్ లేకుండా హాయిగా సాగిపోయే రచనలివి.

*పేజీలు 130, వెల : ₹ 50/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 040-24751654 లో సంప్రదించండి.*




❖ **జీవన సందర్భాలు :** నానీలు రచయిత రమణ వెలమకన్ని- నలభై సంవత్సరాల క్రితం వచన కవితలు వ్రాశారు. సాయంత్రం రాలిన పూలన్నీ ఏవి? రేపటి మొగ్గల్లో కనిపిస్తాయి చూడు అని రచయిత అన్నట్లుగా ఒక విరామం అనంతరం ఆయనలోని కవి తిరిగి నానీల రూపంలో బయటకు రాగా వచ్చిన పుస్తక రూప మిది. "జీవన సందర్భాల్లో అనుభూతులెన్నో, అభివ్యక్తికి నోచుకున్నవి కొన్నే" అంటున్న ఆయన నానీలు చదివి ఆనందించ దగ్గవి. అందమైన అట్టమీద బొమ్మ శీలా వీర్రాజుది.

*పేజీలు 56, వెల : ₹ 30/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9866015040 లో సంప్రదించండి.*




❖ **ఆకాశ దేవర :** ఇది నగ్నముని విలోమకథ. ప్రజల్లోని అమాయకత్వాన్ని, మూఢనమ్మకాలను సొమ్ము చేసుకుంటున్న అవకాశవాదుల కథ. ఈ రచనలో నిప్పులాంటి ఎన్నో నిజాలు రచయిత కలం నుంచి వచ్చాయి. 'మానవుడే ప్రకృతికి ఓ ప్రతీక, ప్రతీక అర్థమైతే ప్రకృతి అర్థమవుతుంది'. 'ఎవరుపడితేవారు ఎన్నికల్లో నిలబడవచ్చు. అరాచకం యిక్కణ్నుంచే ప్రారంభమవుతుంది'. 'డబ్బుతో కొన్న ప్రతి ఓటు ఒక పౌర హత్యతో సమానం, రక్తం కనబడదు మనిషిలోని నీతి హత్య చేయబడుతుంది'. 'నా వ్యాపారానికి ముడి సరుకు అబద్ధం. పెట్టుబడి అబద్ధం. నేను అబద్ధాలు అమ్ముతాను' ఇలా ఒక గొప్ప కథగా ఇది చదివిన వెంటనే మరోసారి చదవాలనిపించే ఆలోచన స్రవంతిని నిక్షిప్తం చేసుకున్న రచనిది. *దేవినేని సీతారామయ్య ఫౌండేషన్* వారి *ప్రచురణ.*

*పేజీలు 40, వెల : ₹ 30/-, ప్రతులు కావలసినవారు నగ్నముని ఫోన్: 9441081922 లో సంప్రదించండి.*




❖ **ఓడిపోతానని తెలిసి కూడా :** రచయిత మానేపల్లి. 2004-2012 మధ్యకాలంలో వివిధ పత్రికలలో ప్రచురితమైన కవితల సంపుటిది. రొటీన్‌గా స్తబ్దతతో కూడిన నిర్లిప్త జీవన విధానంపై రచయిత సంధించిన బాణాలు ఈ కవితలు. కొన్ని చక్కటి పద చిత్రాలు మనల్ని ఆకర్షిస్తాయి.

*పేజీలు 147, వెల : ₹ 65/-, ప్రతులు కావలసినవారు* బుక్స్ అండ్ బుక్స్, ఎలమంచిలి, విశాఖజిల్లా *ఫోన్ : 08931-231834 లో సంప్రదించండి.*









తెలుగు వారి సభ

- తలిశెట్టి రామారావు

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు** ₹

| | | |
|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు *– ఎ.వి.రెడ్డి* | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 " | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–3 " | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | 150.00 |
| 8. | దూర తీరాలలో... *– వి. అశ్వినికుమార్* | 60.00 |
| 9. | అమాహ " | 60.00 |
| 10. | అంతర్వీక్షణం " | 50.00 |
| 11. | సిద్ధార్థ " | 50.00 |
| 12. | నాలో నేను " | 30.00 |
| 13. | అగాధం " | 75.00 |
| 14. | కథాంజలి–1 ***– ఎస్సారె*** | 80.00 |
| 15. | కథాంజలి–2 " | 110.00 |
| 16. | THE THUNDERCLOUD " | 120.00 |
| 17. | మిసిమి వ్యాసాలు *– నరిసెట్టి ఇన్నయ్య* | 125.00 |
| | **ఇతరములు** | |
| 18. | భట్టిప్రోలు కథలు | 150.00 |
| 19. | రెండు దశాబ్దాలు – కథ 1990–2009 | 150.00 |
| 20. | IN QUEST OF UTOPIA *– డి.పురందరేశ్వరి* | 250.00 |
| 21. | గురవాయణం *– డాక్టర్ గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన *– ఎమ్. కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన *– ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన *– నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన *– గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ.హరిమోహన్ ఝా, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన *– రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం *–ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం *– బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు *– శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ : ఉపమలు *– బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు *– అన్నపరెడ్డి బుద్ధఘోషుడు* | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం – బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు *– డాక్టరు ఈమని శివనాగిరెడ్డి* | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 50.00 |
| 12. | మిళింద ప్రశ్నలు *– బోధచైతన్య* | 150.00 |
| 13. | బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 14. | ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 60.00 |
| 15. | శీలం–ధ్యానం *– బోధ చైతన్య* | 150.00 |
| 16. | లోకక్షేమగాథలు *– బోధ చైతన్య* | 75.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 2. | యతిగీతం– స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |

మిసిమి మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1.** **పేరు :** ....................................................

**2.** **చిరునామా :**

ఇం.నెం. ....................................................

వీధి ....................................................

పేట ....................................................

ఊరు ....................................................

పిన్ ....................................................

సెల్ ....................................................

**3.** **సంతకం :** ....................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

**మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్ధార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

మిసిమి
మాసపత్రిక


**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



విశ్రాంతగమనం

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



పాలవెల్లి